




మనసులో
# మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 220: బుధవారం 8 ఏప్రిల్ 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు32:- వెలరూ/ 9-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్


"ప్రభుత్వ పథకాల అమలులో జాప్యాన్ని ఇకపై సహించేది లేదని, నిర్దేశించుకున్న లక్ష్యాలను యుద్ధ ప్రాతిపదికన చేరుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్టీజీఎస్ వేదికగా వివిధ శాఖల పనితీరుపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రజల సంతృప్తియే పరమావధిగా పాలన సాగాలని స్పష్టం చేశారు."

"రాష్ట్రవ్యాప్తంగా మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ఈ ఏడాదిలోనే సామూహిక గృహ ప్రవేశాల పండుగను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించారు. ఇళ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్న 2 లక్షల మంది లబ్ధిదారులకు తక్షణమే పట్టాల పంపిణీ చేపట్టాలని, విద్యా రంగంలో సమూల మార్పుల కోసం కాలేజీ కరిక్యులమ్‌ను రీ-స్ట్రక్చర్ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు."



# పథకాల అమలులో జాప్యం వద్దు

## నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాల్సిందే

*ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి*

*ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం*

*కాలేజీ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం*

*'అవేర్ 2.0' యాప్ విడుదల*

**అమరావతి, ఏప్రిల్ 7 (మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని, ప్రజలకు అందించే సేవలలో ఎలాంటి జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) వేదికగా వివిధ శాఖల పనితీరుపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సంతృప్తిని కలిగించే రీతిలో చేరినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది ఇళ్ల

మిగతా 2 లో

# జల సంరక్షణ మనందరి బాధ్యత

భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకుందాం

100 రోజుల స్పెషల్ డ్రైవ్ ప్రారంభం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2





# అగ్నిమాపక శాఖ ఆధునీకరణ

- రూ. 253 కోట్లతో సరికొత్త వాహనాలు ప్రారంభించిన చంద్రబాబు
- అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఊపి వాహనాల ప్రారంభం

2

# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

- ఇది ఫ్యాక్షన్ రాజకీయాలకు పరాకాష్ట
- ఖండించిన చంద్రబాబు, లోకేశ్



2

# బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్

రెచ్చగొట్టే ప్రకటనలైె మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్

2



# 104 వాహనాల్లో ఇక ఆన్‌లైన్ నిఘా

## మందుల సరఫరా వ్యవస్థ మరింత పటిష్టం

'ఇ-ఔషధి'లో వివరాల నమోదు తప్పనిసరి.. సిబ్బందికి శిక్షణ పూర్తి

ఆన్‌లైన్ నిఘాతో రోగులకు మెరుగైన సేవలు






# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

4

# ఇరాన్ అంతం ఖాయం

ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు

హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు

మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్



3



## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ

కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

4



దేవాదాయ శాఖ కమిషనర్

# అరెస్ట్

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ చర్యలు

.. వివరాలు 2లో

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

2

- పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం
- ఉత్తరాంధ్ర, కోస్తాలో ఎడతెరిపిలేని వర్షాలు
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




# 104 వాహనాల్లో ఇక ఆన్‌లైన్ నిఘా

**మందుల సరఫరా వ్యవస్థ మరింత పటిష్టం.. 'ఇ-ఔషధి'లో వివరాల నమోదు తప్పనిసరి**

**మంగళగిరి, ఏప్రిల్ 7 (మనసులో మాట):** రాష్ట్రంలోని 104 సంచార వైద్య వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంత రోగులకు అందే మందులు, సర్జికల్స్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టపర్చేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ వాహనాల్లో గ్రామాలకు వెళ్లి రోగులకు పంపిణీ చేసే మందుల వివరాలను ఇకపై తప్పనిసరిగా 'ఇ-ఔషధి' పోర్టల్‌లో నమోదు చేయాలని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి అందే స్టాకు వివరాలను ఆన్‌లైన్ చేయడంతో సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నూతన విధానంపై అవగాహన కల్పించేందుకు మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్‌లో రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఐటీ విభాగం పర్యవేక్షించింది. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు జిల్లాల్లోని 104 వాహనాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తారని సి-డాక్ సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్ పసుపులేటి అశ్విని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా 104 సంచార వైద్య వాహనాల విభాగంలో పనిచేసే జిల్లా మరియు రీజినల్ మేనేజర్లు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి మొత్తం 55 మందికి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో స్టాకు వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండటం వల్ల మందులు మరియు సర్జికల్స్ నిల్వలను తనిఖీ చేయడం సులభతరమవుతుందని అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల ఏ ప్రాంతంలో ఏ మందుల అవసరముందో గుర్తించి, సకాలంలో సరఫరా చేసేందుకు వీలు కలుగుతుంది. ఇప్పటికే హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఈ ఆన్‌లైన్ విధానం విజయవంతంగా అమలు జరుగుతుండగా, ఇప్పుడు 104 వాహనాల్లో కూడా దీనిని ప్రవేశపెట్టడం ద్వారా మందుల కొరతను పూర్తిగా నివారించవచ్చని ప్రభుత్వం ఆశిస్తోంది.

# దేవాదాయ శాఖ కమిషనర్ శాంతి అరెస్ట్

**ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఎసిబి చర్యలు**



**విజయవాడ, ఏప్రిల్ 7:** ఏపీ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి అరెస్టయ్యారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు.. తాడేపల్లి, ఉండవల్లి సహా 4 ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఎ÷-లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో జీ ప్లస్ 2 భవనంతోపాటు 770 గ్రాముల బంగారు నగలు, 3 కిలోల వెండి గుర్తించారు. అంతేకాకుండా రూ. 1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ. 3 లక్షలు ఉన్నట్లు తేల్చారు. వీటితోపాటు ఓ కారు, ద్విచక్ర వాహనం గుర్తించారు. అక్రమాల ఆరోపణలతో 2024 జులై నుంచి 2026 మార్చి వరకు శాంతి సస్పెన్షన్‌లో ఉన్నారు.

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

**పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం**

**హైదరాబాద్, ఏప్రిల్ 7:** తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.

# పథకాల అమలులో జాప్యం వద్దు

మొదటి పేజీ తరువాయి

స్థలాల కోసం ఎదురుచూస్తున్నట్లు సర్వేలో తేలిందని, వీరికి స్థలాల పంపిణీ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఏడాదిలోనే మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామని, టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. అలాగే వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ద్వారా వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్న నేపథ్యంలో, రీచుల వద్ద రవాణా పేరుతో అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. విద్యా రంగంలో కీలక మార్పులకు శ్రీకారం చుడుతూ, కాలేజీ విద్యను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా 'రీ-ఓరియెంటేషన్' చేయాలని సీఎం ఆదేశించారు. సంప్రదాయ కోర్సులతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కొత్త పాఠ్యాంశాలను ప్రవేశపెట్టేలా కరికులమ్‌ను రీ-స్ట్రక్చర్ చేయాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో సహా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు జాతీయ స్థాయిలో తమ ర్యాంకింగ్‌లను మెరుగుపరుచుకోవాలని, ఇందులో ఉన్నత విద్యామండలి




క్రియాశీలక పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎక్కడా ఫిర్యాదులకు తావుండకూడదని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజా భద్రతకు సంబంధించి పలు కీలక ఆదేశాలు జారీ చేస్తూ.. విద్యుత్ మరియు కేబుల్ తీగలు కిందకు వేలాడటం వల్ల జరిగే అగ్ని ప్రమాదాలను పూర్తిగా అరికట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజలను ఎడ్యుకేట్ చేయాలని, ముఖ్యంగా హెల్మెట్ ధరించడం మరియు ట్రిపుల్ రైడింగ్ నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. పిడుగుపాట్లపై అప్రమత్తత అవసరమని, టవర్ లొకేషన్ ఆధారంగా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందేలా టెక్నాలజీని సమర్థంగా వాడాలని ఆదేశించారు. సమీక్షా అనంతరం ఆర్టీజీఎస్ రూపొందించిన 'అవేర్ 2.0' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# అగ్నిమాపక శాఖ ఆధునికీకరణ

**రూ. 253 కోట్లతో సరికొత్త వాహనాలు ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఊపి వాహనాల ప్రారంభం**

**అమరావతి, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నిమాపక శాఖను దేశంలోనే ఆదర్శవంతమైన విభాగంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా మంగళవారం అమరావతి పరేడ్ గ్రౌండ్ వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అగ్నిమాపక శాఖకు చెందిన నూతన వాహనాలు, అత్యధునిక పరికరాలను జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం రూ. 252.93 కోట్ల వ్యయంతో అగ్నిమాపక శాఖను ఆధునీకరిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీనిలో భాగంగా తొలి విడతలో రూ. 33.25 కోట్ల విలువైన పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. రూ. 18 కోట్ల వ్యయంతో 25 ఫైర్ ఫైటింగ్ వాహనాలు, రూ. 10 కోట్ల వ్యయంతో హై ప్రెషర్ పంప్‌లు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ. 2.49 కోట్లతో 50 ఇన్‌ఫ్లేటబుల్ రబ్బర్ బోట్లు, రూ. 2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. వాహనాలను పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. రాజధాని అమరావతితో పాటు ప్రధాన నగరాల్లో ఆకాశహర్మ్యాలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా అగ్నిమాపక శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. "ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక విభాగం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేది. పొరుగు రాష్ట్రాలకు కూడా సాయం చేసిన చరిత్ర మనది. ఇప్పుడు మళ్లీ ఆ స్థాయికి చేరుకోవాలి" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కేంద్ర నిధులను, రాష్ట్ర నిధులను సమర్థంగా వినియోగించుకుని విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అధికారులు వాహనాల పనితీరును మరియు సాంకేతిక అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు.



# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

**ఇది ఫ్యాక్షన్ రాజకీయాలకు పరాకాష్ట**

**తీవ్రంగా ఖండించిన చంద్రబాబు, లోకేశ్**

**అమరావతి, ఏప్రిల్ 7(మనసులో మాట):** హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడి యత్నాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేతలు, రౌడీలు దాడికి దిగడం మీడియా స్వేచ్ఛపై దాడిగా సీఎం అభివర్ణించారు. సొంతంగా మీడియా సంస్థలను నడుపుతూ.. మీడియాను అడ్డుపెట్టుకుని అనైతిక చర్యలకు పాల్పడుతోన్న వైసీపీ.. తమను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతిపై ఆరోపణలు, దూషణలు చేయడం అసంబద్ధం అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మీడియా సంస్థలపై, ఆంధ్రజ్యోతిపై అనేక వేధింపులకు, కుట్రలకు పాల్పడినా నిబ్బరంగా నిలిచాయి తప్ప భయపడలేదని చంద్రబాబు గుర్తుచేశారు. రౌడీ మూకలను వెంటేసుకుని స్వయంగా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మీడియా కార్యాలయంపైకి వెళ్లడం వైసీపీ రౌడీ సంస్కృతికి నిదర్శనమని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. వేమూరి రాధాకృష్ణ దశాబ్దాలుగా కేసులు, దాడులు, ఒత్తిళ్లకు భయపడ కుండా పత్రికను, ఛానల్‌ను నడుపుతున్నారన్నారు. దాడులు, నిరసనలు, బెదిరింపులతో మీడియాను భయపెట్టాలనే వైసీపీ రాజకీయాలకు కాలం చెల్లిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అధికారంలో ఉండగా మహిళల పట్ల, సొంత కుటుంబ సభ్యుల పట్ల వైసీపీ నాయకులు, ఆ పార్టీ అధ్యక్షుడు వ్యవహరించిన తీరును మహిళా సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు. రాజధానిపై వైసీపీ కుట్రలను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి సంపాదకీయానికి సమాధానం చెప్పలేక.. దాడులు నిరసనలతో వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. ఈ దాడులను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ఫ్యాక్షన్ బెదిరింపులకు రాధాకృష్ణ భయపడే వ్యక్తి కాదని లోకేశ్ అన్నారు. 'జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసం వైసీపీ రౌడీ మూకలు ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడికి ప్రయత్నించడం ఆ పార్టీ విష సంస్కృతిని మరోసారి బయటపెట్టింది. నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే దమ్మున్న ఛానల్ ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై వైసీపీ దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. సాక్షి హైదరాబాద్ ఆఫీస్‌కు ఆంధ్రజ్యోతి ఎంత దూరమో.. ఆంధ్రజ్యోతికి సాక్షి కూడా అంతే దూరంలో ఉంది అన్న సంగతి మర్చిపోవద్దు జగన్. మీడియా కథనాల పట్ల నిరసనలు తెలియజేసే పద్ధతి ఇది కాదు' అని లోకేశ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం అయిన మీడియా ప్రశ్నిస్తే జవాబు చెప్పాలి. కథనం ప్రచురిస్తే ఆధారాలతో ఖండించాలి. కథనం ప్రసారం చేస్తే తప్పయితే తప్పని చెప్పగలగాలి. ఇవేవీ మీ దగ్గర లేనప్పుడు ఇలాంటి దుర్మార్గపు దాడులకు తెగబడటం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు..

# జల సంరక్షణ మనందరి బాధ్యత

**భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకుందాం**

**100 రోజుల స్పెషల్ డ్రైవ్ ప్రారంభం**

**జల్ జీవన్ మిషన్ 2.0లో జలవనరుల స్థిరత్వానికి ప్రాధాన్యం**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

**విజయవాడ/కానూరు, ఏప్రిల్ 7 (మనసులో మాట):** 'జలమే జీవం.. జీవమే జల సంరక్షణకు మూలం' అనే స్పృహ ప్రతి ఒక్కరిలో కలగాలని, నీటిని సంరక్షించుకోవడం ద్వారానే భవిష్యత్తు తరాలకు మనం భరోసా ఇవ్వగలమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం కానూరులోని ఏపీఎస్‌ఐఆర్డీ భవన్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వం' వర్క్ షాపును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారమని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ఉపరితల జలాలను కాపాడుకోవడంతో పాటు వేగంగా పడిపోతున్న భూగర్భ జల మట్టాలను పెంచడం మన ముందున్న అతిపెద్ద సవాల్ అని అన్నారు. ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపడం నుంచి, వృథాగా సముద్రంలో కలుస్తున్న నదీ జలాలను ఒడిసి పట్టడం వరకు ప్రతి అంశంలోనూ ప్రజల్లో చైతన్యం రావాలని ఆకాంక్షించారు. జల సంరక్షణను ఒక ఉద్యమంలా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు "100 రోజుల నీటి వినియోగ డ్రైవ్" కు శ్రీకారం చుట్టిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కాలంలో భూగర్భ జలాల పెంపుదల, వర్షపు నీటిని నిల్వ చేయడం, నీటి వృథాను అరికట్టడం వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. ప్రకృతిని మనం కాపాడుకుంటేనే, ప్రకృతి మనల్ని కాపాడుతుందని ఆయన గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికి తాగునీరు అందించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో జల్ జీవన్ మిషన్ 2.0ను సమర్థంగా అమలు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరి శిఖర గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడిని నివారించేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నీటి సంరక్షణ చర్యల్లో ఆధునిక సాంకేతికతను జోడించి, క్షేత్రస్థాయిలో ప్రజలను భాగస్వాములను




చేస్తామని స్పష్టం చేశారు. ఈ వర్క్ షాపులో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య, ఏపీఎస్‌ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఆంధ్రజ్యోతి కథనాలు సరికాదు

**నేడు వాటి కార్యాలయాల ముందు నిరసనలు**

**ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స**

**విశాఖపట్నం, ఏప్రిల్ 7(మనసులో మాట):** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ వార్తా వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఎవరైనా విమర్శ చేస్తే విధాన పరంగా ఉండాలన్నారు. ఇందుకు నిరసనగా బుధవారం ఏపీలోని అన్ని జిల్లాల్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని వైసీపీ కార్యాలయంలో బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కలిపి మావిగాన్ అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారని అన్నారు. రాజధాని పరిధిలో వీటిని తీసుకురమ్మని తాము అంటున్నామని.. ఇందులో తప్పు ఏం ఉందని చెప్పారు. తమ నాయకుడు అభిప్రాయాన్ని తాము గౌరవిస్తున్నామన్నారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని...అక్కడ దోపిడీకి మాత్రమే తాము వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. కూటమి కృషితోనే భోగాపురం వచ్చిందని ఒప్పు కొంటున్నానని అన్నారు. తాము ఈ ఎయిర్‌పోర్టుకి అన్ని అనుమతులు తెచ్చామని..కానీ ఇప్పుడు ఎయిర్‌పోర్ట్‌కి దారి లేదని ప్రస్తావించారు. అందుకే తాము భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కి దారేదని అడుగుతున్నామన్నారు. రుషికొండ భవనాలు తమ కోసం ఉంచుతున్నారేమోనని అన్నారు. ఏపీలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని చెప్పారు. మహిళలు రోజుకోకరు హత్యకు గురవుతున్నారని, వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయని బొత్స సత్యనారాయణ ఆరోపించారు.

# ఆంధ్రజ్యోతిపై దాడి దుర్మార్గం

**తీవ్రంగా ఖండించిన మీడియా సంఘాలు**

**అమరావతి, ఏప్రిల్ 7(మనసులో మాట):** హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడికి ప్రయత్నించడంపై మీడియా సంఘాలు స్పందించాయి. ఈ దాడిని ఐకేయూ, ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్, ఆర్ఎన్ఏ న్యూఏజెన్సీలు తీవ్రంగా ఖండించాయి. ఒక మీడియా సంస్థను నిర్వహిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇలాంటి చర్యలకు సొంత పార్టీలోని వారిని ఉసిగొల్పటం మీడియా స్వేచ్ఛపై దాడిగా భావించక తప్పదని జర్నలిస్టు సంఘాల నేతలు డి.సోమసుందర్, ఐ.వి.సుబ్బారావు, ఏచూరి శివ (ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్), ఆర్ఎన్ఏ చీఫ్ ఎడిటర్ అవ్వారు రఘు స్పష్టం చేశారు. ఏపీ రాజధానిగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ కొత్త రాజధానిని ఏర్పాటు చేయాలని.. దానికి మావిగన్ అనే పేరు పెట్టాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రతిపాదించారు. అది కూడా రాజధాని అమరావతి బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందే క్రమంలో వైఎస్ జగన్ ఈ ప్రతిపాదన చేయడం విమర్శలకు తావిచ్చింది. నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ తన కొత్త పలుకులో ప్రత్యేక కథనాన్ని రాశారు. దీనిపై వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున మండిపడ్డాయి. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో ఆ పార్టీలోని కీలక నేతలు వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి.. స్పందించారు. అందులోభాగంగా మంగళవారం హైదరాబాద్ ఫిలింనగర్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.

# రూ.39,436 కోట్లతో విలువైన 31 ప్రాజెక్టులు

**చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ ఆమోదం**

**అమరావతి, ఏప్రిల్ 7(మనసులో మాట):** సీఎం చంద్రబాబు అధ్యక్షతన 16వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహక బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు. సాగు వ్యర్థాల సద్వినియోగం కోసం యూనిట్ల ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఆధునిక భద్రతా ప్రమాణాలతో పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాయలసీమను సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రానున్న రోజుల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సౌరవిద్యుత్ సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడులు ఆకర్షించాలని సీఎం సూచించారు.

# ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఆస్పత్రుల సమ్మె విరమణ



**అమరావతి, ఏప్రిల్ 7(మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలోని స్పెషాలిటీ ఆసుపత్రుల్లో జరుగుతున్న సమ్మెను విరమించినట్లు స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటించింది. ప్రభుత్వం కొద్దిసేపటి క్రితం ఇచ్చిన హామీల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ తెలిపింది. 10 రోజుల్లో వెయ్యి కోట్ల రూపాయలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఆమోదించి సమ్మెను విరమించినట్లు ఆసుపత్రుల యాజమాన్య సంఘం ప్రకటించింది. 10 రోజుల్లో బకాయిలు చెల్లించని పక్షంలో మళ్లీ వైద్య సేవలను పూర్తిగా నిలిపివేస్తామని అసోసియేషన్ హెచ్చరించింది. ప్రభుత్వంతో జరిపిన చర్చల సమావేశం మినిట్స్‌ను కూడా కొద్ది సేపటి క్రితం అసోసియేషన్‌కు అధికారులు పంపించారు. ఈ మినిట్స్‌లో ఇచ్చిన హామీలు, చర్చల వివరాలు స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సమ్మె విరమణతో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింది అన్ని సేవలు పునఃప్రారంభం కానున్నాయి.

# నీటి సంరక్షణకు 'జలధార' ఉద్యమం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- రాష్ట్ర వ్యాప్తంగా వంద రోజుల కార్యాచరణ
- కాలువలు, చెరువుల్లో పూడికతీతలు, మరమ్మతులు
- అమరావతిపై విషం కక్కుతున్న జగన్
- ఇది తప్పు అన్నందుకు పెట్రేగిపోతున్న జగన్ బ్యాచ్
- మీడియా సంస్థలు, ప్రజలపై వైసీపీ -దాడులు గర్హనీయం
- చూస్తూ ఊరుకునేది లేదు
- మంత్రి సవిత హెచ్చరిక




**అనంతపురం, ఏప్రిల్ 7 (మనసులో మాట):** నీటితోనే సంపద సృష్టించొచ్చాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమని, అందుకనే ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో జలధార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీత, మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను ఈ కార్యక్రమంలో చేపట్టనున్నారు. రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలకు రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో కలిసి వంద రోజుల ప్రణాళికలను రూపొందించారన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామం సమీపంలోని చెరువులో సోమవారం ఏర్పాటు చేసిన జలధార కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో నీటి సంరక్షణకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంరక్షణకు 100 రోజుల పాటు జలధార ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యాచరణ ద్వారా రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలతో ప్రతి ఎకరాకూ సాగునీరందించాలన్నది ప్రధాన ఉద్దేశమన్నారు. వంద రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీతలతో పాటు మరమ్మతులు, ఇంకుడు గుంతలు తవ్వుతామన్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంచడం, తక్కువ నీటితో ఎక్కువ పంట పండించే విధానాన్ని (డ్రిప్ ఇరిగేషన్) ప్రోత్సహించడం, చెరువుల్లోని మట్టిని పొలాలకు తరలించడం, పంట కుంటల నిర్మించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నీటి సంరక్షణను ఉద్యమం చేపట్టామని, రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ ఉద్యమం చేపట్టామన్నారు. రాష్ట్రాన్ని కరవు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించడం, ఆ వెంటనే రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో జగన్, ఆయన పార్టీ నేతలుసహించలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. మావిగన్ అంటూ అమరావతిపై జగన్ మరోసారి విషం కక్కారన్నారు. రాజధానిపై పూటకో మాట, గంటకో మాట ఆడుతుండడంతో ప్రజలు జగన్ పై తీవ్రంగా విరుచుకుపడుతున్నారన్నారు. అమరావతిపై కుట్రలు పన్నడం తప్పు అని చెప్పడంతో, వైసీపీ బ్యాచ్ సహించలేకపోతోందన్నారు. మీడియా సంస్థలపైనా, ప్రజలపైనా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రజాభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిందేపోయి, జగన్, ఆయన అనుచరులు చేస్తున్న దౌర్జన్యాలను, దాడులను చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు. జలధార కార్యక్రమం అనంతరం చెరువు పక్కనే ఉన్న వేరు శనగ పంట భూములను మంత్రి సవిత పరిశీలించారు. ఎంతమేర సాగు చేశారు... పంట దిగుబడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకొంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ నిధులతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేస్తున్నారన్నారు. రూ.30 వేల కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నారని, రాయసీమలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు వెచ్చిస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వ పాలనపై రైతులు సంతృప్తి వక్తంచేయడంతో మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ బకాయిలు తక్షణం చెల్లించాలి

- 'ఆశ' ప్రతినిధులను చర్చలకు పిలవాలి
- ఇన్సూరెన్స్ మోడల్ వెనుక కమీషన్ల కుట్ర
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం, ఏప్రిల్ 7 (మనసులో మాట): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి పేద రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా కూటమి ప్రభుత్వంలో చలనం లేదని వైయస్సార్సీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. మంగళవారం శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశ) ప్రతినిధులను చర్చలకు పిలిచి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రెండుసార్లు ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడం దురదృష్టకరమని అప్పలరాజు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం 45 రోజుల్లో చెల్లించాల్సిన బిల్లులు.. 450 రోజులు దాటినా చెల్లించకపోవడంతో బకాయిలు రూ. 3,200 కోట్లకు చేరాయని విమర్శించారు. అత్యవసర సేవలు అందక ప్రజలు అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవేవీ పట్టించుకోకుండా 'అమరావతి భజన'లో మునిగిపోయారని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీని ప్రస్తుతం ఉన్న ట్రస్ట్ మోడల్ నుంచి ఇన్సూరెన్స్ మోడల్‌లోకి మార్చాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది కేవలం బినామీ కంపెనీలకు కమీషన్లు కట్టబెట్టేందుకేనని ఆరోపించారు. ఇన్సూరెన్స్ కంపెనీలు క్లెయిమ్‌లను రిజెక్ట్ చేస్తే రోగులు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. వైయస్సార్సీపీ హయాంలో ప్రొసీజర్లను 2 వేల నుండి 3,257కి పెంచామని, ఇన్సూరెన్స్ మోడల్‌లో ఇవన్నీ సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు చెప్పే అమరావతి మోడల్ ఆచరణ సాధ్యం కాదని, అది పూర్తవ్వడానికి వందేళ్లు పడుతుందని విమర్శించారు. లక్షల కోట్ల అప్పులతో రాజధాని కడతాననడం అవివేకమని, దానికి ప్రత్యామ్నాయంగా వైయస్ జగన్ గారు సూచించిన 'మావిగన్' (మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు) కారిడార్ రాష్ట్రానికి నిజమైన గ్రోత్ ఇంజిన్ అవుతుందని పేర్కొన్నారు. వంశధార ట్రిబ్యునల్ విషయంలో టీడీపీ నేతలు అనవసర సంబరాలు చేసుకుంటున్నారని అప్పలరాజు ఎద్దేవా చేశారు. ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన ఎస్ఎల్‌పీలపై కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయలేదని, నేరడి బ్యారేజీ సాధనలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. తక్షణమే ఆరోగ్యశ్రీ సమస్యలను పరిష్కరించి పేదలకు వైద్యం అందేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సీమ నడిబొడ్డున టిప్పు సుల్తాన్ పేరా?

**బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ధ్వజమెత్తం**

**కడపలో సర్కిల్ పేరు ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం**

**ప్రొద్దుటూరు తరహాలోనే అడ్డుకుంటామని హెచ్చరిక**

**కడప, ఏప్రిల్ 7 (మనసులో మాట):** కడప నగరంలోని ఒక ప్రధాన సర్కిల్‌కు టిప్పు సుల్తాన్ పేరు పెట్టాలనే ప్రయత్నాలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనను తాము గట్టిగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం మరియు మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడ్డారు. భారత చరిత్రలో టిప్పు సుల్తాన్ ఒక వివాదాస్పద వ్యక్తి అని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా హిందూ సమాజంపై దాడులు, బలవంతపు మత మార్పిడులకు పాల్పడిన చరిత్ర కలిగిన వ్యక్తి పేరును బహిరంగ ప్రదేశాలకు పెట్టడం ఏమాత్రం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రంలో, కావాలనే మతపరమైన విబేధాలు సృష్టించేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని, దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. గతంలో ప్రొద్దుటూరులో కూడా ఇలాంటి ప్రయత్నమే జరిగిందని, అప్పట్లో స్థానిక హిందూ సమాజంతో కలిసి బీజేపీ ఆ కుట్రను అడ్డుకుందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కడపలో కూడా అదే తరహా పోరాటం చేస్తామని హెచ్చరించారు. "సీమ నడిబొడ్డున టిప్పు సుల్తాన్ పేరు పెట్టడం అంటే స్థానిక ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే" అని ఆయన వ్యాఖ్యానించారు. కడప మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ ఈ ప్రతిపాదనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు పక్షపాతంతో వ్యవహరించి అనుమతులు ఇస్తే, బీజేపీ క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేపట్టి తీరుతుందని స్పష్టం చేశారు. మతసామరస్యాన్ని దెబ్బతీసే ఇటువంటి చర్యలను అడ్డుకోవడంలో తాము వెనకడుగు వేయబోమని ఆయన హెచ్చరించారు.

# ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 7:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.




## సంపాదకీయం

# అభివృద్ధికి 'రాజకీయ' గ్రహణం

### తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న వింత పోకడలు

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి. కానీ, అధికార పీఠం కోసం రాష్ట్ర ప్రయోజనాలను, అభివృద్ధి ప్రాజెక్టులను పణంగా పెట్టడం పాలకులకు పరిపాటిగా మారింది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన నుంచి ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నిర్మాణం వరకు.. అన్నీ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతుండటం ఆందోళనకరం. రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరు. ఈ రెండింటినీ వేర్వేరు ధ్రువాలుగా చూడనంత కాలం వ్యవస్థలో మార్పు రాదు. ఈ రెండింటిని కలగలిపి చూడటం వల్లనే అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అభివృద్ధి పథంలో దూసుకుపోవాల్సిన రాష్ట్రాలు, రాజకీయ కక్షలు మరియు సంకుచిత ప్రయోజనాల వల్ల వెనక్కి నెట్టబడుతున్నాయి.

**మూసీ ప్రక్షాళన: పట్టుదల - ప్రతిఘటన**

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా ఉండాల్సిన మూసీ నది నేడు మురుగు కూపంగా మారింది. దీనిని ప్రక్షాళన చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే, ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశం 'నిర్వాసితుల సంక్షేమం'. ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు, స్థలం కోల్పోయిన వారికి స్థలం ఇచ్చి, వారు ఆనందపడేలా ఉత్తమ ప్యాకేజీని అమలు చేయాలి. ప్రభుత్వం చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళ్లడం మంచిదే, కానీ క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను గౌరవించాలి. మరోవైపు, నగర మురుగునీటిని మళ్ళించే ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఇంతకాలం హైదరాబాద్ మురుగునంతా మూసీలోనే పారబోశారు, దానికి శాశ్వత పరిష్కారం చూపకుండా కేవలం సౌందర్యీకరణ చేస్తే ఫలితం ఉండదు. అయితే, ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయి తప్ప, 'ఇలా చేస్తే బాగుంటుంది' అని ఎందుకు సలహాలు ఇవ్వడం లేదు? పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేశారనే విమర్శలు ఎదుర్కొంటున్న పాత పాలకులు, ఇప్పుడైనా నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. అభివృద్ధిని రాజకీయంతో ముడిపెట్టడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలే దెబ్బతింటాయి.

**అమరావతి: అయోమయ రాజకీయం**

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి పరిస్థితి మరీ దారుణం. ఒక రాష్ట్రానికి రాజధాని అనేది కేవలం కార్యాలయాల సముదాయం కాదు, అది ఆ రాష్ట్ర గౌరవం మరియు ఆదాయ వనరు. 2019లో భారీ మెజారిటీతో 151 సీట్లు కట్టబెట్టిన ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన బహుమతి ఏంటి? ఐదేళ్ల పాటు 'మూడు రాజధానుల' పేరుతో కాలయాపన చేయడం, అభివృద్ధిని పడకేయించడం. అప్పుడు రాని 'మావిగన్' ఆలోచనలు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రావడం చూస్తుంటే, అది కేవలం అమరావతిపై ఉన్న ద్వేషమే తప్ప రాష్ట్రంపై ఉన్న ప్రేమ కాదని స్పష్టమవుతోంది. రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని చెప్పడం ద్వారా ఆయన తన రాజకీయ అజ్ఞానాన్ని లేదా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రజలు చైతన్యం వచ్చి గత ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారు. ఇప్పటికైనా వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకోకపోవడం ఆ పార్టీ నేతల దౌర్భాగ్యం. కేవలం అధికార దాహం తప్ప అభివృద్ధిపై వారికి అవగాహన లేదని వారి మాటలే స్పష్టం చేస్తున్నాయి.

**పాలకులు మేల్కోవాలి - ఆరోపణలు వీడాలి**

ప్రస్తుత పాలకులు కూడా గతాన్ని గుర్తుంచుకోవాలి. కేవలం రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు ప్రయాణాలు మాత్రమే అభివృద్ధి అని భ్రమపడకూడదు. ఇవి తాత్కాలిక ఊరటనిచ్చే సంక్షేమ పథకాలు మాత్రమే. శాశ్వత అభివృద్ధి అంటే మౌలిక వసతుల కల్పన, పారదర్శక పాలన. ముఖ్యంగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై వస్తున్న భూకబ్జా ఆరోపణల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మౌనం వీడాలి. ఈ ఆరోపణలను వెంటనే ఖండించడమో లేదా విచారణ జరిపించడమో చేయకపోతే, ప్రజల్లో అనుమానాలు బలపడతాయి. నిర్మాణాత్మక పనులు మొదలుపెట్టకుండా కేవలం ప్రచారానికే పరిమితమైతే, రేవంత్ రెడ్డి కూడా రాజకీయ మూసీలో కొట్టుకుపోవడం ఖాయం. రేవంత్ రెడ్డి 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారు, కానీ నగరాలు వాటంతట అవే రావాలి తప్ప ఫోర్స్ చేస్తే రావు. అభివృద్ధి అనేది ఒక సహజ ప్రక్రియ అని గుర్తించాలి.

**హైదరాబాద్ నగరం ఈ స్థాయికి చేరడానికి మూడు దశాబ్దాల నిరంతర కృషి ఉంది. అభివృద్ధి అనేది ఆగిపోయే ప్రక్రియ కాదు. ఆంధ్రప్రదేశ్‌కు విశాఖ నుంచి ఆదాయం వస్తున్నా, అమరావతి అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో మౌలిక వసతులు కల్పించడం సరైన మార్గం. పాలకులకు వందేళ్ల ముందుచూపు ఉండాలి. సంకుచిత ఆలోచనలు పక్కన పెట్టి, అభివృద్ధికి బాటలు వేసినప్పుడే రాష్ట్రాల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. భజనపరుల మాటలు నమ్మి వాస్తవాలను విస్మరిస్తే పతనం తప్పదని గత పాలకులు ఇప్పటికే నిరూపించారు.**

**డాక్టర్ కంచర్ల అచ్యుత రావు**
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

- 9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ
- ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే
- ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అహ్సానుద్దీన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. అయితే ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జుడిషియల్ పరిధిలోకి ఇది రాదని ప్రభుత్వం చెప్పింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

# వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

### ఇక నుంచి 5 కేజీల రెండు సిలిండర్ల సరఫరా

### రాష్ట్రాలకు సూచించిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజీల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీస్)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

# కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

### కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

**టెహ్రాన్, ఏప్రిల్ 7:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా- ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు.

# ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

### 9వ తేదీ నుంచి 29 వరకు అమలు

### కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూ ఓడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5 గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
అమరావతి
ఎన్టీఆర్ | కృష్ణా | గుంటూరు
పల్నాడు | బాపట్ల | ప్రకాశం
బుధవారం 8 ఏప్రిల్ 2026




# గతి తప్పుతోన్న పోలీస్..!!




- అప్ టూ బాటం ప్రక్షాళన అవసరం
- ఫ్రెండ్లీ పోలీస్‌కు అర్థం మారుస్తోన్న కొందరు
- ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం
- సంఘటన జరిగి నష్టపోతే అప్పుడు చర్యలు
- దాచేపల్లి సిఐపై ఎకైరీ, మాచర్ల సిఐ సస్పెన్షన్
- అధికార పక్షం నేతలతో కుమ్మక్కై చట్టానికే తూట్లు
- చర్యలతో పురుగుమందు తాగుతోన్న బాధితులు
- చట్ట నిబంధనలు పాటించని కొందరు అధికారులు
- ప్రైవేట్ కేసులు ఎదుర్కొంటున్న అధికారులు
- ఎవరు అధికారంలో ఉంటే వారికే సలాం.. గులాం
- రాష్ట్ర వ్యాప్తంగా వెల్లు వెతుతోన్న విమర్శలు
- ఫ్రెండ్లీ పోలీస్ కావాలంటోన్న ప్రజలు



**అమరావతి, పొలిటికల్ బ్యూరో (మనసులో మాట)**

శాంతి భద్రతలే లక్ష్యంగా పనిచేయాల్సిన పోలీస్ వ్యవస్థ గతి తప్పుతోంది. క్రింది స్థాయి అధికారులు తప్పు చేస్తే చర్చలు తీసుకోవాల్సిన అధికారులే తప్పుమీద తప్పు చేస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి. కొందరు అధికారులు చట్టాన్ని దాటి వ్యవవహరిస్తున్నారు. సిఐ స్థాయి అధికారులు కొందరు మగువ,డబ్బుకు ఆశపడుతున్నారు. ఫలితంగా అనేక విమర్శలకు గురవుతున్నారు. ఇలాంటి జుగుత్సాకర పరిణామాలు ఆ వ్యవస్థ పట్ల ప్రజలకు సమ్మకం లేకుండా పోతోంది. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎప్పటికప్పుడు డేగ కన్ను వేయాల్సిన అధికారులు ఆ కన్ను బాధితులపైనే వేయడంతో చేసేది లేక బాధితులు ఆత్మహత్యా యత్నానికి కారణమవుతున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ వ్యవస్థలో జరుగుతోన్న పరిణామాలు ఆ వ్యవస్థకే మచ్చుతెస్తున్నాయి. ముఖ్యంగా రాయలసీమ, పల్నాడు లాంటి శాంతి బద్రలకు విఘాతం కలిగే పాంతాలలో కొందరు పోలీసులు చేస్తున్న వికృత చేష్టలు ప్రజలను కంగారు పెట్టిస్తున్నాయి.. ఇదిలావుండగా, శాంతి భద్రతల విషయంలో పక్షపాతం లేకుండా చూడాల్సిన కొందరు పోలీస్ అధికారులు అధికార పార్టీ నేతలు చెప్పిన విధంగా చేస్తున్నారని వైసిపి విమర్శిస్తోంది. ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో చోటు చేసుకుంటోన్న పరిణామాలు కొందరు పోలీస్ అధికారుల చర్యలు విస్తుగొలుపేయిగా ఉన్నాయి. ఇక్కడ పోలీస్ వ్యవస్థ ఎలా ఉందంటే ఎవరు అధికారంలో ఉంటే వారికే సపోర్టు చేస్తుంటాయన్న భావన ప్రజల్లో ఉంది. వైసిపి పభ్రుత్వం అధికారంలో ఉన్నప్పుడు అనేక మంది టిడిపి కార్యకర్తలు, నేతలపై అక్రమ కేసులు బనాయించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం కూటమి అధికారంలోఉన్న నేపథ్యంలో వైసిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. ముఖ్యంగా ఇటీవల ఆరోపణలు ఎదుర్కొంటూ వీఆర్‌కు వెళ్ళిన దాచేపల్లి సిఐ భాస్కరరావుపై మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి తీవ్ర విమర్శలు చేస్తున్నారు. గతంలో తంగెడలో ఓ వైసిపి కార్యకర్తను విచక్షణా రహితంగా కొట్టడంతో అది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనాయాంశమైంది. అదే విధంగా గ్రామాలలో జరుగుతోన్న చిన్నచిన్న ఘర్షణకు సంబంధించి బాధితులపైనే కేసులు బనాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా వైసిపి నేతలు ఎవరు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని బహిరంగగానే చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా, ఆ మధ్య మాచవరం మండలంలో జరిగిన సాల్మన్ హత్మకు సంబంధించి జరిగిన పరిణామాలు పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కోల్పోయే విధంగా చేసిందనడంలో ఏ మాత్రం సందేహంలేదు. చనిపోయిన సాల్మన్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకొస్తున్న తరుణంలో మధ్యలోనే అడ్డగించి కుటంబ సభ్యులు మినహా ఎవరు గ్రామంలోకి వెళ్ళవద్దని చేయడంతో వైసిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోకి వెళ్ళాలంటే ఆధార్‌కార్డు చూపించాల్సిన పరిస్థితులు దాపురించాయి.ఇదిలావుండగా, దాచేపల్లి మండలం రామాపురం ఎంపిటీసీ భర్త వెంకటరెడ్డిపై టిడిపి శ్రేణులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అయితే దీనిని రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణగా చెప్పుకొచ్చారు. ఒక్క పల్నాడులో కాకుండా రాష్ట్రంలో అనేక ప్రదేశాల్లో ఈ ఘర్షణలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.అనేక కుటుంబాలు గ్రామాన్ని విడిచి వెళ్ళిపోయాయి.

**ఆటవికంపై పోలీస్ చర్యలు ఎక్కడా..?**

పల్నాడులో ఆటవికం రాజ్యమేలుతోంది. మనిషిని మనిషి చంపుకునే విషసంస్కృతి మళ్ళీ పురి విప్పుతోంది. కారణం ఏదైనా ఆధిపత్య పోకడలో కుంటుంబాలు సమిధలుగా మారుతున్నాయి. నాలుగు దశాబ్దాల నుంచి ఈ విష సంస్కృతికి కొనసాగుతోంది. పల్నాడులో పీపుల్స్‌వార్ రాకతో దశాబ్ధ కాలం పాటు సద్దు మనిగిన ఫాక్ష్యన్ రక్కసి మళ్ళీ పురివిప్పుతోంది. రాజకీయ కోణంలో పోలీసులు సకమ్రంగా చర్యలు తీసుకోక పోవడంతోనే దాడులు యదేచ్చగా కొనసాగుతున్నాయన్న భావన వ్యక్తమవుతోంది. ఒక్క పల్నాడులో కాకుండా రాష్ట్రంలో అనేక ప్రదేశాల్లో ఈ ఘర్షణలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అనేక కుటుంబాలు గ్రామాన్ని విడిచి వెళ్ళిపోయాయి.వారు పోతే వీరు..వీరుపోతే వారు అన్న చందంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నరమేధం కొనసాగుతూనే ఉంటోంది.ఈ వికృత చేష్టలకు కొందరు పోలీస్ అధికారులు నర్మగర్భంగా కొమ్ముకాస్తున్న తరుణంలో అధికారపార్టీ నేతలు చెలరేగి పోతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇటీవల పిడుగురాళ్ళలో ఒక మహిళలను నిబంధనలుకు విరుద్దంగా పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్ళడంతో మహిళ తీవ్ర ఆవేదనకు లోనై ఆత్మహత్మ యత్నంకు పాల్పడిన విషయం విధితమే. ఆ వివాదం అది అలా కొనసాగుతోన్న తరుణంలోనే పిన్నెల్లి ఘటన చోటు చేసుకుంది. మళ్ళీ రెండు రోజుల క్రితం తన కోడలు,వారి బందువులు ఆస్తి కోసం తనపై దాడిచేశారని పోటీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చింది. 20 రోజులు పాటు తిప్పుకుని తర్వాత సిఐ భాస్కరరావు తన పిర్యాదును తీసుకోకపోగా, అసభ్య పదజాలంతో దూషిస్తు గెంటి వేశారని ఆరోపించింది. పోలీసుత్తులు చేస్తున్న చర్యలు ,అసబ్య పదజాలం కారణంగా మహిళలు ఆత్మహత్యాయత్నంకు పాల్పడుతోన్న సంఘటనలు పోలీస్ వ్యవస్థ పట్ల గౌరవం సన్నగిల్లు తోంది. పల్నాడు జిల్లాలోనే అత్యంత సమస్యాత్మక గ్రామాలలో గురజాల నియోజకవర్గంకు మాచవరం మండలం పిన్నెల్లి గ్రామం ఇక్కడ ఎవరు అధికారంలో ఉంటే వారే రారాజులు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు టిడిపి నేతలపై దాడులు చేశారు. సుమారు రెండు వందల కుటుంబాలు గ్రామం విడిచి వెళ్ళారు. అప్పట్లో ఆ కుటుంబాల కోసం టిడిపి పార్టీ ఈఫీసుల్లోనే ఆశ్రయం కల్పించారు. తదనంతరం అందరు గ్రామానికి చేరుకున్నారు. 2024లో అధికార మార్పిడి జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడిపి శ్రేణులు వైసిపి నేతలపై దాడులకు పాల్పడ్డారు. ఎవరైతే వైసిపి లీడర్లుగా ఉన్నారో వారిపై దాడులు చేశారు..చేస్తున్నారు. అధికారం వచ్చి సుమారు రెండేళ్ళు కావస్తున్నా నేటికి దాడులు కొనసాగిస్తూనే ఉన్నారు. గతంలో వైసిపి మండల కన్వీనర్ చైదరి సిగరయ్య, వైసిపి ఎంపిపి దారం లచ్చిరెడ్డిపై దాడులు చేశారు. ఆ తరువాత జూలకల్లు గ్రామానికి చెందిన వైసిపి నేతలపై దాడులు చేసి తీవ్రంగా గాయ పరిచారు.ఇలా దాడులుకొనసాగుతోన్న నేపద్యంలో పోలీసులు వారిపై కఠిన చర్యలు తీసుకోక పోవడమేకాకుండా బాధితులనుంచి కేసులు కూడా తీసుకుకోవడంలేదని ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా పల్నాడు దాచేపల్లి సిఐ భాస్కరరావు అండతో టిడిపి నేతలు అరాచకాలకు పాల్పడున్నారని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. టిడిపి నేతల దాడిలో తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్న తమ కార్యకర్తపైనే కేసు నమోదు సిఐపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని 'కాసు' వెళ్ళడించారు. ఇది దేశ వ్యాప్తంగా చర్చ జరుగతోన్న నేపథ్యంలో జాతీయ ఎస్సీ,ఎస్టి కమీషన్ గ్రోమామానికి వచ్చి విచారించింది.

**దాచేపల్లి సిఐపై విచారణ, మాచర్ల సిఐ సస్పెండ్:**

రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థపై వస్తోన్న ఆరోపణళ నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భగాంగా దాచేపల్లి సిఐ భాస్కరరావును వారం రోజులు క్రితం విఆర్‌కు పంపించారు. ఆయనపై ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇది జరిఇ రెండు రోజులు కాకముందే మాచర్ల లో హత్యకుఉ సంబంధించి మాచర్ల సిఐ వెంకట రమణను స్పఎండ్ చేశారు. ఆ ప్రాంతానికి చెందిన చాముండేశ్వరీ ఏమ్ర వివాహం చేసుకున్నారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని పోలీసులను ఆశ్రయించింది. అయితే ఆమెకు రక్షణ కల్పించకపోగా,యువతి తల్లిదంధ్రులతో రహ్యాస్య ఒప్పందం చేసుకుని యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు. చివరకు ఆ యువతిని కడ తేర్చారు. విధి నిర్వాభణలో అలక్ష్యం వహించారన్న కారణంలో ఆయనును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

**రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ ఎక్కడా..?**

రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు సర్వత్రా చర్చనాయాంశమవుతున్నాయి. బాధితులపట్ల వారు వ్యవహరిస్తున్న తీరులో పెండ్లీ పోలీస్ కానరాకపోగా, పక్షపాత వైఖరి కనిపిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఒక్కఒక్క వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తుంది. ముఖ్యంగా రెవిన్యూ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అనేక పరిణామాలకు కాయకల్ప చికిత్స చేస్తుంది. ఇందులో భాగంగా సమాజంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థను ఎందుకు ప్రక్షాళన చేయడంలో లేదో అర్థం కావడం లేదన్న భావనను మేధావులు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యస్థను ఏర్పాటు చేయాల్సిప నేపథ్యంలో కొందరు పోలీసులు వ్యవహరిస్తోన్న తీరు ఆ వ్యవస్థకే మాయని మచ్చ తీసుకొస్తోంది. ఇప్పటికైనా సమాజ హితంతో పోలీసులు, అధికారులు ఆలోచించి పక్షపాతం లేకుండా శాంతి బధ్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన అవసరం ఉంది.



## పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ అగ్నిమాపక విపత్తు నిర్వహణ శాఖ

**అధునాతన ఫైర్ టెండర్ వాహనాలు, పరికరాలు ప్రారంభించిన సీఎం చంద్రబాబు**



**అమరావతి, ఏప్రిల్ 7 ( మనసులో మాట)..** దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా అగ్నిమాపక విపత్తు నిర్వహణ శాఖను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సహాయం చేసిన చరిత్ర ఏపీకి ఉందని గుర్తు చేశారు. అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో అగ్నిమాపక శాఖ నూతన వాహనాలు, పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. రూ.252.93 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునీకరణలో భాగంగా రూ.33.25 కోట్ల విలువైన వాహనాలు, వివిధ పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రూ.18 కోట్ల వ్యయంతో తొలిదశలో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంప్‌లు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 ఇన్ ఫ్లేటబుల్ రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను కొనుగోలు చేసింది. వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం.. వాటి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం కేంద్ర నిధులను సమర్థంగా వినియోగించుకున్నందుకు అధికారులను అభినందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ....ప్రజల ప్రాణాలు కాపాడడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అమరావతి రాజధానితో పాటు ఇప్పుడు ప్రధాన నగరాల్లో హై రైజ్డ్ బిల్డింగ్‌లు నిర్మాణం అవుతున్నాయని..వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ అన్ని విధాలా ఆధునిక పరికరాలు సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. అన్ని సవాళ్ళను అధిగమించి... కేంద్ర పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని శాఖను బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.







మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీల్లో న్యూట్రి గార్డెన్ లు అభివృద్ధి చేయండి

**- పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**

**పల్నాడు, ఏప్రిల్ 7, (మనసులో మాట):** జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీల్లో న్యూట్రీ గార్డెన్ లు అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. మండలానికి ఒకటి చొప్పున కమ్యూనిటీ గార్డెన్ ను అభివృద్ధి చేయాలన్నారు. కమ్యూనిటీ గార్డెన్ ఏర్పాటు కోసం క్షేత్రాన్ని ఎంపిక చేయాలని డీపీవోను ఆదేశించారు. డ్వామా శాఖ కమ్యూనిటీ గార్డెన్ అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్నారు. డ్వాక్రా మహిళలకు కిచెన్ గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై శిక్షణ ఇవ్వాలన్నారు. న్యూట్రి గార్డెన్ ల కార్యక్రమం కోసం మండల స్థాయి అధికారులకు ఈ వారంలోగా శిక్షణ పూర్తి చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలునుంచి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జలధార - జల హారతి, గ్రామ ఆరోగ్య దర్శిని, న్యూట్రి గార్డెన్ కార్యక్రమాలపై వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

## రానున్న 5 రోజుల్లో అధిక ఉష్ణోగ్రతల హెచ్చరిక దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

**- జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**

**- వడదెబ్బపై అప్రమత్తత అవసరం..**

**- వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి**

**పల్నాడు, ఏప్రిల్ 7, (మనసులో మాట):** ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సూచించారు. జిల్లాలోని రానున్న 5 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నెలకొంటాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపధ్యంలో ప్రజలు వేసవి ఎండలు, వడగాడ్పుల నుండి రక్షణకు అవసమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలను కోరారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయం నుండి వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన పరచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వేడి గాలుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. వడదెబ్బ నుండి రక్షణ పొందేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాడ్పుల వల్ల డిహైడ్రేషన్ కు గురికాకుండా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. రోజూ తగినన్ని నీళు తాగడం, నేరుగా ఎండ వేడిమి తాకకుండా జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని చెప్పారు. ముఖ్యమైన పనుల మినహా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకూడదని, ఈ సమయంలో శారీరక శ్రమ అవసరమైన పనులను నిర్వహించకూడదని సూచించారు. పిల్లలు, గర్భిణీలు మరియు వృద్ధులు ఎండాకాలం మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలు, అధికారులు, సిబ్బంది బయటకు వెళ్లే సమయంలో తల కప్పుకునే విధంగా టోపీలు, గుడ్డ మఫ్లర్లు వాడాలని సూచించారు. లేత రంగుల నూలు దుస్తులు ధరించాలన్నారు. ఆరోగ్యన్నీ దృష్టిలో ఉంచుకుని ఆల్కహాల్, మత్తు పదార్థాలు తీసుకోవడం మానుకోవడం అవసరమని పేర్కొన్నారు. అధిక మసాలా ఉన్న ఆహారం తినకుండా, పోషకతత్వంతో కూడిన తేలికపాటి ఆహారం తీసుకోవాలన్నారు. శుభ్రమైన తాగునీటినే ఉపయోగించాలని, కూల్‌డ్రింక్స్, అధిక చక్కెర ఉన్న పానియాలు, కాఫీ, టీ వంటి పానీయాలను తగ్గించాలని సూచించారు. వడదెబ్బతగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని, వీలయినంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు. చెమట పట్టక పోవడం, వణుకు పుట్టడం మగత నిద్ర లేదా కలవరింతలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బ లక్షణాలని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో, గ్రామాల్లో ఆశా వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ అందుబాటులో ఉన్నందున, అవసరమైన వారు దీన్ని ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. తీవ్రమైన వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, సంబంధిత వ్యక్తిని వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు.

# క్రికెట్ బెట్టింగ్ రాకెట్ గుట్టురట్టు - 6 గురు అరెస్ట్



**పల్నాడు, ఏప్రిల్ 7, (మనసులో మాట):** నరసరావుపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ రాకెట్ గుట్టు రట్టు చేసి 6 గురిని అరెస్టు చేసినట్లు ఇంచార్జ్ డిఎస్పి ఎం హనుమంతరావు తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు ఆదేశాల మేరకు జూదం క్రికెట్ బెట్టింగ్ వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాల నిర్మూలనలో భాగంగా కీలక చర్యలు చేపట్టి నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆరుగురు నిందితులను ప్రత్యేక విభాగం పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగులు జూదం పేకాట వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్పీ బీ కృష్ణారావు హెచ్చరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ ఖాసింసా, షేక్ మస్తాన్ వలి అను వారు కలిసి క్రికెట్ మ్యాచ్ లపై అక్రమంగా డబ్బులు సంపాదించేందుకు పథకం రచించి క్రికెట్ పై ఆసక్తి ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని వారిని ప్రోలోబ పెట్టి బెట్టింగ్లో పాల్గొనేటట్లు ప్రోత్సహించారని, ఈ క్రమంలో పఠాన్ ఫాజర్ షేక్ జానీ వద్ద నుండి ఆన్లైన్ బెట్టింగ్ లింకులు పొంది వీరు భవనం కృష్ణారెడ్డి పులి బాబుల్ రెడ్డి, గుజ్జుల ప్రభాకర్ రెడ్డి వద్ద నుండి లింకులు కొనుగోలు చేసి నెట్వర్క్ ను విస్తరింపజేసినట్లు. విశ్వసినీయ సమాచారం మేరకు ఈనెల 6 వ తారీఖు రాత్రి సుమారు 8 గంటల సమయంలో నరసరావుపేటలోని ఐలా బజార్లో ఉన్న షేక్ ఖాసింసా నివాసంలో పోలీసులు దాడి నిర్వహించారు ఈ దాడిలో రూ 4,58,000/- నగదు ఆర్ మొబైల్ ఫోన్లు ఒక ల్యాబ్ టాప్ స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసారు. పరారీలో ఉన్న వారిని కూడా త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు..ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బెట్టింగ్ నిర్వహించే వారితో పాటు సహకరించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని, బెట్టింగ్ నిర్వహణకు ఇల్లు గదులు హోటల్లు అందించిన వారిపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. యువత క్రికెట్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి తమ సమయాన్ని విద్య ఉద్యోగం వ్యక్తిగత అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని సూచించారు. క్రికెట్ బెట్టింగ్ ఆన్లైన్ గ్యాంబ్లింగ్ చట్ట విరుద్ధమైనవని ఇందులో పాల్గొంటే జైలు శిక్ష నిర్మాణాలు విధించబడతాయన్నారు. ఇటువంటి కార్యకలాపాల వలన ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అనుమానాస్పదంగా బెట్టింగ్ కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని, యువత సోషల్ మీడియా టెలిగ్రామ్ వాట్సాప్ ద్వారా వచ్చే బెట్టింగ్ లింకులు యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమంగా సంపాదించిన డబ్బు ఎప్పటికీ నిలవదని గుర్తుంచుకోవాలన్నారు. కేసుని విజయవంతంగా చేదించిన నరసరావుపేట టూ టౌన్ సిఐ సిహెచ్ ప్రభాకర్ ,డబ్ల్యూ ఎస్ఐ బి ఆర్ బిఆర్ యాష్ణ , సిబ్బందిని నరసరావుపేట సబ్ డివిజన్ ఇన్చార్జి డిఎస్పి హనుమంతరావు అభినందించి నగదు బహుమతిని అందించారు.

## ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తెరచి...

# 2400 మద్దతు ధరగా ప్రకటించాలి

**పల్నాడు, ఏప్రిల్ 7, (మనసులో మాట):** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిచి, ప్రభుత్వం ప్రకటించిన 2400 మద్దతు ధరకు, రైతు పండించిన మొత్తం పంటను కొనుగోలు చేయాలని రైతు సంఘం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోటప్పకొండ రోడ్ లోని సంఘ కార్యాలయంలో గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ పలనాడు జిల్లాలో దాదాపు లక్ష ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని, రైతులందరూ సన్నా చిన్నకారు రైతులు కావడంతో అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారుల నుండి అప్పులు తీసుకొచ్చి పంట పండించడం జరిగింది. అదేవిధంగా మిగతా పంటలు దిగుబడి తగ్గడం గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల మొక్కజొన్న సాగుకు రైతులు అధిక ప్రాధాన్యతనిచ్చి సాగు చేయడం జరిగిందన్నారు. తీరా పంట చేతికి వస్తున్న తరుణంలో ప్రభుత్వం మొక్కజొన్న కేంద్రాలు తెరవకపోవడం వల్ల, రైతులు తమ కుటుంబ అవసరాల కోసం ప్రైవేటు దళారులకు 1500--1700 మధ్య అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. ఈ రకంగా దాదాపుగా క్వింటాకు 700 రూపాయలు నష్టపోతున్నారు. దీనివల్ల రైతులు మరింత అప్పుల భారాలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరచి మద్దతు ధరకు పంటను కొని రైతులను ఆదుకొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. లేకుంటే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురి కావలసి ఉంటుందని అన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాల రావు మాట్లాడుతూ ఆల్ ఇండియా కిసాన్ సభ వ్యవస్థాపక దినోత్సవం అయిన ఏప్రిల్ 11న అన్ని గ్రామాల్లో రైతు సంఘం జెండాల ఆవిష్కరించాలని మరియు మే 14, 15 తేదీల్లో వినుకొండలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఈ లోగా ప్రతి గ్రామంలో రైతు సంఘం-- ప్రతి రైతు రైతుసంఘం లో అనే నినాదంతో రైతులు అందరినీ సభ్యులుగా చేర్చి గ్రామ, మండల స్థాయిలో రైతు సంఘాన్ని బలోపేతం చేసే దానికోసం గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది అని తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గేరా జాలయ్య, బండారుపల్లి నాగేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, సత్యనారాయణ, రామిరెడ్డి, పెద్దిరెడ్డి, మస్తానావు, కోటేశ్వరరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు



## ఆరోగ్యం కోసం కలిసికట్టుగా విజ్ఞానానికి అండగా నిలబడదాం

# ఆరోగ్యమే మహా భాగ్యము

**తాడేపల్లి,ఏప్రిల్ 7,(మనసులో మాట ):** గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు లో భాగంగా మంగళవారం తాడేపల్లి మండలం ప్రాతూరు గ్రామంలో ఉన్న కిశోర బాలికల గ్రూప్ సభ్యులకు వరల్డ్ హెల్త్ డే గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది,ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ తాడేపల్లి మండల కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇతర సంబంధిత అనుబంధ సంస్థల ప్రాయోజకత్వంలో జరుపుకునే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం అని ఇది మొదట 1948లో,మొదటి ప్రపంచ ఆరోగ్య సభను ఏర్పాటు చేసిందని , అప్పటి నుండి 1950 వ సంవత్సరం నుండి ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7 ను జరుపుకోవాలని అసెంబ్లీ నిర్ణయించిందని ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్యానికి ప్రధాన ప్రాముఖ్యత ఉన్న అంశంపై ప్రపంచవ్యాప్త దృష్టిని ఆకర్షించేటట్లు ఈ సంస్థ చూస్తుందని ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని వివిధ ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రజా ఆరోగ్య సమస్యలపై ఆసక్తితో వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తారని గ్లోబల్ హెల్త్ కౌన్సిల్ వంటి మీడియా నివేదికలలో వారి మద్దతును ప్రముఖంగా ప్రకటిస్తూన్నారని ఎనిమిది అధికారిక ప్రపంచ ఆరోగ్య ప్రచారాలలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం, ప్రపంచ రోగనిరోధక వారోత్సవం, ప్రపంచ మలేరియా దినోత్సవం, ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం, ప్రపంచ రక్తదాత దినోత్సవం, ప్రపంచ హెపటైటిస్ దినోత్సవంతో పాటు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని కూడా చేర్చారు అని ప్రపంచ ఆరోగ్య దినోత్సవం 2026 సంవత్సరం ఒక థీమ్ ప్రకటించిందని, ప్రజలు, జంతువులు, మొక్కలు, భూగోళం యొక్క ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి శాస్త్రీయ సహకారం యొక్క శక్తిని చాటిచెప్పే ఆరోగ్యం కోసం కలిసికట్టుగా విజ్ఞానానికి అండగా నిలబడదాం అనే ఇతివృత్తంతో ప్రపంచాన్ని ఏకం చేసిందని తెలిపారు. పెద్దిపాగ అనీల్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యకరమైన జీవనశైలిని కలిగి ఉండటానికి గల ప్రధానమైన విషయాలు ఏమనగా ఆరోగ్యకరమైన మంచి ఆహారం అంటే పండ్లు మరియు కూరగాయలు, తృణధాన్యాలు, మరియు పాల ఉత్పత్తులతో సహా కొవ్వు తక్కువగా ఉండే ప్రోటీన్ పదార్థాలను తినడం,కొవ్వు,చక్కెర మరియు ఫాస్ట్ ఫుడ్ ను ఎక్కువగా తినకపోవడం, సమతుల్యమైన, విభిన్నమైన ఆహారం ఈ రోజులలో చాలా అవసరం అని ఆరోగ్యకరమైన ఆహారం నుండి గరిష్ట ప్రయోజనం పొందడానికి, పిల్లలు రోజుకు 6-8 గ్లాసుల నీరు త్రాగాలి, రోజుకు కనీసం 60 నిమిషాల వ్యాయామం చేయాలని, తగినంత నిద్రపోవాలని, అప్పుడే ఆరోగ్యం గా ఉంటారు అని తెలిపారు. నేలటూరి నాగమణి మాట్లాడుతూ కిశోర బాలికలలో 10-19 సంవత్సరాల వయస్సు ఆడపిల్లలు రక్తహీనత అనేది భారతదేశంలో, ముఖ్యంగా గ్రామీణ మరియు తక్కువ ఆదాయ వర్గాలలో ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా ఉందని ఈ దశలో శారీరక మార్పులు, రుతుస్రావం, పోషకాహార లోపం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పడిపోతుందని కిశోర బాలికల లో రక్తహీనత లోపానికి ముఖ్య కారణం ఏమనగా భారతదేశంలో దాదాపు 50-60% పైగా కౌమార బాలికలు ఏదో ఒక రకమైన రక్తహీనతతో బాధపడుతున్నారు, దీనికి ప్రధాన కారణం: ఐరన్ లోపం, అసమతుల్య ఆహారం మరియు రుతుస్రావం వల్ల అధిక రక్త నష్టం జరిగి ప్రాణాపాయ స్థితి ఏర్పడవచ్చు కాబట్టి ఆడపిల్లలు మంచి ఆహారం తీసుకోవడం అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల పార్లమెంట్ చెందిన పిల్లలు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.






## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**పల్నాడు, ఏప్రిల్ 7, (మనసులో మాట):** నందిరాజు పాలెం గ్రామానికి చెందిన గాంధ్ల వెంకటసుబ్బయ్య ధనలక్ష్మీ దంపతుల కుమారుడు గాంధ్ల వెంకటేశ్వర రావు,చామంతి లను రాజుపాలెం మండలంలోని న్యూ బోధనం ఆర్ అండ్ ఆర్ సెంటర్ నందు వారి నివాసంలో మంగళవారం నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట నర్సయ్య, టీడీపీ నాయకుడు సాగి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పగడాల శ్రీనివాసరావు,బైసు వెంకటరావు,సుభాని,మందలనేని వెంకటేశ్వర్లు , పగడాల నరసింహ రావు, టీడీపీ నాయకులు అంకాల్ల ప్రభుదాసు, పగడాల శ్రీనివాసరావు,ముల్లా బిక్షం,రెంటాల్ల సాంబయ్య, చౌటపాపాయపాలెం మాజీ సర్పంచ్ పేతురు, తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ కుడికాల్వలో బాలుడు గల్లంతు

**- శోకసముద్రంలో కుటుంబంలి**

**కారంపూడి ఏప్రిల్ 7( మనసులో మాట)..** ఈత కోసమని నాగార్జునసాగర్ లో దిగి బాలుడు గల్లంతమైన విషాద సంఘటన పల్నాడు జిల్లా కారంపూడి మండలం లో మంగళవారం జరిగింది పట్టణంలోని వినుకొండ రోడ్ లో గల కొమెర రాజారావు 13 సంవత్సరాలు, అనే యువకుడు తన స్నేహితులతో తన ఇంటి సమీపంలో ఉన్న నాగార్జునసాగర్ కుడికాల్వలోకి ఈత కొట్టడానికి వెళ్లి గల్లంతయాడు. విషయం తెలుసుకున్న అక్కడ కాలనీ వాసులు గ్రామ ప్రజలు ఎంత వెతికినా యువకుడు ఆచూకీ తెలియలేదు,

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం



**పల్నాడు, ఏప్రిల్ 7, (మనసులో మాట):** నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామ పాఠశాలలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ దీపికా మంజూష, సిహెచ్ఓ చరిష్మా హాజరై పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, చేతుల పరిశుభ్రత మొదలగు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామ నాయకుడు బూత్ కన్వీనర్ దూపాటి కిరణ్ పాల్గొని పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న గుడ్డు, చిక్కి, రాగిజావ లను విద్యార్థులు సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం పోషకాలతో కూడిన సన్నబియ్యం అందిస్తున్నారు. పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు అందరికీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దీపికా మంజూషను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దూపాటి రత్తమ్మ సురేష్, ఎఎన్ఎమ్ కోటేశ్వరి, ఆశావర్కర్ వెంకటరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు కొండలరావు, ఖాజా మునీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన నర్సింగ్ విద్యార్థిని సుప్రియ, ఆమె తల్లిదండ్రులు



**తాడేపల్లి, ఏప్రిల్ 7, (మనసులో మాట):** తన తండ్రిపై నేరం మోపినందుకు ప్రశ్నించిన తనను పామర్రు సీఐ శుభాకర్, ఎస్సై భాస్కర్ స్టేషన్‌కు పిలిపించి దారుణంగా కొట్టడమే కాకుండా తనకు, తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ గ్రీవియెన్స్ మీ కోసంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీకి ఫిర్యాదు చేసిన వివరాలు వైయస్ జగన్‌కు చెప్పిన సుప్రియ, కలెక్టర్ బాలాజీ తన అర్జీని తిరిగి పోలీసులకు అప్పగిస్తే అదే పోలీసులు తనపై సెక్షన్ 307 కింద కేసు పెట్టి రిమాండ్‌కు పంపారని, తర్వాత బెయిల్ పై విడుదలయినట్లు తన ఆవేదన చెప్పుకున్న సుప్రియ. స్థానిక టీడీపీ నాయకుడు గణేష్ కోసం పోలీసులు తన కుటుంబంపై ఇంత దారుణంగా వ్యవహరించారని జగన్ వద్ద వాపోయిన సుప్రియ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్నామనే కారణంతో తన బాబాయి యాకోబు ఇంటిని టీడీపీ నేత గణేష్ తగలబెట్టించాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన కుటుంబంపై కక్షకట్టి వేధింపులకు గురిచేస్తున్నారని కన్నీటిపర్యంతమైన సుప్రియ బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న దళితురాలుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం దారుణమని మండిపడ్డ వైయస్ జగన్, సుప్రియకు అవసరమైన న్యాయసహాయం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అందిస్తుందని, సుప్రియ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళాలని పామర్రు వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్ కైలే అనిల్ కుమార్‌కు సూచించిన వైయస్ జగన్. పామర్రు సీఐ శుభాకర్, ఎస్సై భాస్కర్‌లపై హైకోర్ట్‌లో ప్రైవేట్ కేసు వేసి న్యాయం జరిగేలా చూద్దామని భరోసా, సుప్రియ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఈ సందర్భంగా వైయస్ జగన్‌ను కలిసిన సుప్రియ తల్లిదండ్రులు ఆరోగ్యం, జుజ్జువరపు చిన్ని, బాబాయి యాకోబు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం


# 20న సింహాచలం చందనోత్సవం

- అన్ని ఏర్పాట్లు ఏప్రిల్ 17 నాటికి పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు
- సమస్యలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలి
- కీలక శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష
- ఎస్.వో.పి.నిబంధనలకు లోబడి ఏర్పాట్లు,నిర్ణయాలు తీసుకోవాలని సూచన



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఈనెల 20న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి చందనోత్సవ వేడుకను విజయవంతంగా నిర్వహించాలని, ఈనెల 17 తేదీ నాటికి అన్ని ప్రక్రియలు ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రభుత్వ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో కీలక శాఖల అధికారులతో సమావేశమైన ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. చందనోత్సవ క్రతువును శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. గతంలో జరిగిన పొరపాట్లు మరలా జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందజేసిన ఎస్.వో.పి.స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ కు లోబడి అధికారులంతా ఏర్పాట్లు చేయాలని, నిర్ణయాలు తీసుకోవాలని, అంకితభావంతో పని చేయాలని పేర్కొన్నారు. సమీక్షలో భాగంగా ముందుగా గత సమావేశాల్లో చర్చించిన అంశాలు, చందనోత్సవ వేడుకలో నిర్వహించే సంప్రదాయ ఘట్టాలపై దేవస్థానం ఈవో జె. వెంకటరావు, ఆలయ పండితులు కలెక్టర్ కు వివరించారు.అన్ని అంశాలను కూలంకషంగా విన్న కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవ నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను అత్యంత బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లను పోలీస్ శాఖ పర్యవేక్షించాలని, బస్సు సర్వీసుల విషయంలో ఏపీఎస్ ఆర్టీసీ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్.వో.పి. మేరకు టిక్కెట్లను ముద్రించాలని, రూ.1500, 1000 టిక్కెట్లపై పికప్, డ్రాపింగ్ పాయింట్ వివరాలను తెలిపాలని సూచించారు. పరిమిత సంఖ్యలో వెహికల్ పాసులు జారీ చేయాలన్నారు. తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, మరుగుదొడ్ల ఏర్పాటు, మెడికల్ క్యాంపుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఆధునిక సదుపాయాలు కలిగిన అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం దుకాణాలను తాత్కాలింగా మూసివేసే విషయంలో గత నియమాలను పాటించాలని చెప్పారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ఆయా శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రక్రియలను ఏప్రిల్ 17 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. దాతలు పెట్టే ఫుడ్ కౌంటర్లను ఫుడ్ సేఫ్టీ అధికారుల సాయంతో తనిఖీ చేయాలని, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, జీవీఎంసీ సీఎం నరేశ్, ఆర్టీసీఆర్ ఎం అప్పల నాయుడు, ఈపీడీసీఎల్ ఎస్.ఈ. శ్యాం బాబు, డీఎంహెచ్వో పి. జగదీశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# క్రీడలతోనే యువతకు సత్ప్రవర్తన : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- బలిఘట్టంలో రూ.9.30 లక్షలతో వాలీబాల్ క్రీడా ప్రాంగణం ప్రారంభం
- ఆగస్టు 15 నాటికి మరిన్ని క్రీడా మైదానాల ఏర్పాటు



**నర్సీపట్నం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ మున్సిపల్ వాలీబాల్ క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు లాంఛనంగా ప్రారంభించారు. మున్సిపల్ నిధులు రూ.4,80,000, అనకాపల్లి జిల్లా ప్రాధికారి సంస్థ నిధులు రూ. 4, 50,000.. వెరసి మొత్తం రూ.9,30,000ల వ్యయంతో ఈ క్రీడా ప్రాంగణాన్ని క్రీడాకారులకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా మైదానంలోకి దిగి మొదటి బంతిని ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చదువుకునే రోజుల్లో వాలీబాల్ క్రీడాకారుడినని తన పాత జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. క్రీడలను విస్తృతంగా ప్రోత్సహించడం ద్వారా యువతను చెడు అలవాట్లకు, చెడు సావాసాలకు దూరంగా ఉంచవచ్చని ఆయన ఉద్ఘాటించారు. నర్సీపట్నాన్ని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే బొడ్డేపల్లి, శారద నగర్, శివపురం ప్రాంతాలలో వాలీబాల్, షటిల్, క్రికెట్ క్రీడా ప్రాంగణాలను ఆగస్టు 15వ తేదీ నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు త్వరలోనే నర్సీపట్నంలో రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలను సైతం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ జంప సురేంద్ర, పట్టణ ఎస్సై ఉమా మహేశ్వర రావు, పలువురు సంబంధిత అధికారులు, పట్టణ నాయకులు ,క్రీడాభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# షిలానగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి పనులు పరిశీలించిన ఎంపి భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

- 90 శాతం నిర్మాణం పూర్తి, త్వరలో సేవలు ప్రారంభం



**గాజువాక , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** గాజువాక నియోజకవర్గ పరిధిలోని షిలానగర్‌లో నిర్మాణంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి పనులను గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు శ్రీ ఎం. శ్రీభరత్‌తో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, సుమారు 6.45 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్ల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో ఈ ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని తెలిపారు.ప్రస్తుతం నిర్మాణపనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. పనుల నాణ్యత, పురోగతి, సమయపాలనపై అధికారులతో సమగ్రంగా చర్చించిన వారు, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే రెండో నెలలోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. అలాగే, ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి అవసరమైన వసతులను త్వరి తగతిన అందుబాటులోకి తీసుకు వచ్చి, మరికొద్ది రోజుల్లోనే వైద్య సేవలు ప్రారంభించే దిశగా చర్య లు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

ఈ ఈఎస్ఐ ఆసుపత్రి ప్రారంభమైతే గాజువాకతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా కార్మిక వర్గాలకు అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

ఈ సందర్భం గా నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేస్తూ, నాణ్యతా ప్రమాణా లను పాటిస్తూ సమయానికి పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు.



# నేడు విశాఖకు కేంద్ర కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్ రాక

**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** భారత ప్రభుత్వ కేంద్ర గణాంక, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి డా. సౌరభ్ గార్గ్ బుధవారం విశాఖపట్టణం రానున్నట్లు జాతీయ గణాంక కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. సతీష్ తెలిపారు. పర్యటనలో భాగంగా కేంద్ర కార్యదర్శి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. జాతీయ గణాంక ఉప ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శిస్తారని, దేశవ్యాప్తంగా 2026 ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న నేషనల్ హౌస్‌హోల్డ్ ఇన్‌కమ్ సర్వే ఫీల్డ్ వర్క్ ఏర్పాట్లను సమీక్షించి, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. ఆయనతో పాటు పర్యటనలో జాయింట్ డైరెక్టర్ రజత్, అసిస్టెంట్ డైరెక్టర్ పి. రాజశేఖర్ ఇతర అధికారులు భాగస్వామ్యం అవుతారని మంగళవారం ఓ ప్రకటనలో ఆ శాఖ డీడీజీ పేర్కొన్నారు.

# విశాఖ వాణిజ్య పన్నుల శాఖ డివిజన్-1 లో 1845.39 కోట్లు ఆదాయం

- వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమీషనర్ పి.బి.వల్లి వెల్లడి



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** విశాఖపట్నం వాణిజ్య పన్నుల శాఖ డివిజన్-1 లో ఈ ఏడాది మార్చిలో అన్ని రకాల పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో అత్యధిక వసూళ్లను సాధించిందని,ఈ ఆర్థిక సంవత్సరము 2025-26లో 1845.39 కోట్లు ఆదాయం వచ్చిందని ఆ శాఖ సంయుక్త కమీషనర్ పి.బి.వల్లి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్టణం-1 డివిజన్ పరిధిలో మొత్తం ఎనిమిది సర్కిళ్ల అనగా భీమిలి, చిన్నవాల్తేరు. డాబాగార్డెన్, ద్వారకానగర్, కురుపాం మార్కెట్, సిరిపురము, సూర్యాభాగ్ సర్కిల్స్ స్పెషల్ సర్కిల్ డివిజన్లో వున్నాయని, జీఎస్టీ, నెలవారి రిటర్న్ ఫైలింగ్, ఎన్ఫోర్స్మెంట్, పాత బకాయిలు వసూళ్ల ద్వారా అత్యధిక ఆదాయం సాధించడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం మార్చి 2025 న 150.71 కోట్ల రూపాయలు ఆదాయం వస్తే ఈ సంవత్సరం మార్చి 2026న 158.59 కోట్లు రూపాయలు ఆదాయం రాగా ఆర్థిక సంవత్సరము 2024-25 లో రూపాయలు 1733.59 కోట్లు ఆదాయం రాగా ఈ ఆర్థిక సంవత్సరము 2025-26లో 1845.39 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరము సుమారుగా 111.80 కోట్లు అదనపు ఆదాయం సాధించడం జరిగిందన్నారు. ఇది విశాఖపట్టణం-1 డివిజన్లో వున్న ఉద్యోగులందరి సమిష్టి కృషితో ఇది సాధ్యమైందన్నారు.

# అమరావతికి చట్టబద్ధమైన రక్షణ..ఆంధ్రుల ఆత్మగౌరవానికి దక్కిన విజయం : ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



**శృంగవరపుకోట, ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతికి చట్టపరమైన గుర్తింపు లభించడం చారిత్రాత్మకమని, ఇది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ విజయమని శృంగవరపుకోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టం-2026'కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "2024 జూన్ 2 నుంచి అమరావతిని రాష్ట్ర రాజధానిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా ఇకపై అమరావతిని ఏ శక్తీ కదల్చలేనంతగా చట్టబద్ధమైన రక్షణ లభించింది. ఏపీ శాసనసభ చేసిన తీర్మానాన్ని గౌరవించి, పార్లమెంటు ఉభయసభల్లో బిల్లును ఆమోదింపజేసి, చట్టరూపం కల్పించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను'' అని అన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం రాష్ట్రానికి మూడు రాజధానులు పెడతామని చెప్పి ఏ ఒక్క ప్రాంతాన్నికూడా అభివృద్ధి చేయకుండా ప్రజలను అయోమయంలో పడేసిందని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని... ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒకే ఒక రాజధాని అమరావతి అని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా అమరావతి విషయంలో ఎన్నో అడ్డంకులు, కుట్రలు ఎదురైనా వెనకడుగు వేయకుండా, రైతుల పక్షాన నిలబడి పోరాడిన మన ముఖ్యమంత్రి నా రా చంద్రబాబు నాయుడు పట్టుదలకు దక్కిన ఫలితం ఇదని కొనియాడారు. రాజధాని నిర్మాణంలో అండగా నిలుస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, అమరావతి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఐటీ మరియు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. అమరావతి చట్టబద్ధం కావడంతో రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువెత్తుతాయని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి రాష్ట్రం మళ్లీ ప్రగతి పథంలో పయనిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



## బుధవారం13 గ్రామాలకు కరెంటు అంతరాయం

**ఎలమంచిలి టౌన్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** మండలంలో పురుషోత్తపురం సబ్ స్టేషన్ పరిధిలోఆర్ డిఎస్ఎస్ పనులకు గాను లైన్ క్లియరెన్స్ గాను ఈ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కరెంటు కోత ఉంటుందని ఏఈ రాజశేఖర్ తెలుగు చేశారు. సబ్ స్టేషన్ పరిధిలో గల బయ్యవరం, పులపర్తి, కృష్ణాపురం, లక్కవరం, పురుషోత్తపురం, పోతిరెడ్డి పాలెం, రుక్మిణి పురం, నాయనమ్మ పాలెం, రేగుపాలెం, లైను కొత్తూరు గ్రామాలకు 8వ తేదీ బుధవారం నాడు 9 నుంచి 4 వరకు కరెంటు ఉండదని తెలియజేశారు. వినియోగదారులు ముందుగానే గమనించి మీ పనులకు అంతరాయం కలగకుండా చూసుకుంటారని కోరారు.

# రూ.490 కోట్లతో సాలూరు నియోజకవర్గ అభివృద్ధి

**చెత్త నుండి సంపద' సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి**



**పార్వతీపురం / సాలూరు , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07 :** సాలూరు నియోజకవర్గాన్ని రూ. 490 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బడ్జెట్ లో నిధులు కేటాయించారని ఆమె గుర్తుచేశారు. ఆ నిధులతో నియోజక వర్గంలోని మొత్తం అన్ని పనులను చేసుకుంటూ ముందుకు వెళతామని పేర్కొన్నారు. సాలూరు నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసే దిశలో అందరూ కలిసి ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాదిద్దామని, ఇందుకోసం ఇతర పార్టీలను కూడా ఆహ్వానిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అత్యాధునిక మిషనరీ ద్వారా తడి, పొడి చెత్తను వేరుచేసే యంత్రాన్ని స్విచ్ ఆన్ చేసి మంత్రి జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డితో కలిసి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. సాలూరు మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న చెత్త వేరుచేసే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేరుకుపోయిన టన్నుల కొద్దీ చెత్తను శాస్త్రీయంగా నిర్మూలించి, మున్సిపాలిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రస్తుత ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతుందని మంత్రివర్యులు స్పష్టం చేశారు.శాస్త్రీయంగా చెత్త సేకరణ - విభజన: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు చెత్త నుండి సంపద సృష్టించే ప్రక్రియకు శ్రీకారం చుట్టామని అన్నారు. గత ఐదేళ్లలో పక్కన పడేసిన టన్నుల కొద్దీ చెత్తను ఇప్పుడు అత్యాధునిక మిషనరీ ద్వారా తడి, పొడి చెత్తగా విడదీస్తున్నామని, ఇందులో నుంచి ప్లాస్టిక్‌ను వైజాగ్ తరలిస్తున్నామని, మట్టిని ల్యాండ్ ఫిలింగ్ కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. సాలూరు మున్సిపాలిటీ పూర్వవైభవం :?ఒకప్పుడు సాలూరు మున్సిపాలిటీ చెత్త నిర్వహణలో ఆదర్శంగా ఉండేదని, గతంలో ఇక్కడి డంపింగ్ యార్డ్‌లోనే మున్సిపల్ కమిషనర్ తన కుమార్తెల వివాహం జరిపించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారని గుర్తు చేశారు. అంతేకాకుండా సాలూరు మునిసిపాలిటీ గతంలో ఎన్నో అవార్డులను సొంతం చేసుకుందని అన్నారు. గత ఐదేళ్లుగా ఈ వ్యవస్థను అస్సలు పట్టించుకోకుండా శిథిలావస్థకు చేర్చారని, ఇప్పుడు మంత్రి నారాయణ గారి సహకారంతో మళ్లీ గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి మున్సిపాలిటీకి అత్యాధునిక యంత్రాలు : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో చెత్తను ఎప్పటికప్పుడు క్లియర్ చేసేందుకు భారీ యంత్రాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని, ఈ యంత్రాలు అందుబాటులోకి వస్తే ఉదయం సేకరించిన చెత్త మధ్యాహ్నానికల్లా వేరు చేయబడి, ఊరంతా పరిశుభ్రంగా గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. దీని వలన పారిశుధ్య కార్మికులకు కొంత శ్రమ తగ్గుతుందని అన్నారు. అనంతరం చెత్తను సేకరించే డబ్బాలను మంత్రి పంపిణీ చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షం విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం చేస్తున్న పనులను ఆర్భాటం అని, స్టంట్ అని అనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. గత 18 ఏళ్లుగా ఏమీ చేయని వారు, ఇప్పుడు మేము చేస్తుంటే భరించలేక మాట్లాడు తున్నారని, రేపు సాలూరు నియోజకవర్గం లోని సాగునీటి ప్రాజెక్టులను కూడా తావే కట్టామని చెప్పుకున్నా ఆశ్చర్యం లేదని ప్రతిపక్షాన్ని విమర్శించారు. ఎన్ని అవంతరాలు వచ్చినా మున్సిపల్ కమిషనర్, కలెక్టర్, మరియు ఇతర ప్రజాప్రతినిధుల సమన్వయంతో సాలూరును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని, ప్రజల ఆరోగ్యానికి, పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, జాయింట్ కలెక్టర్ మరియు మునిసిపల్ ప్రత్యేక అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కమిషనర్, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

## మే 1 నుండి హౌసింగ్ సెన్సస్

**- జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07 :** వచ్చే నెల 1 నుండి మే 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా హౌసింగ్ సెన్సస్ (గృహ గణన) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. జనగణనలో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు ప్రభుత్వం స్వీయ గణన సదుపాయాన్ని ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రజలు తమ ఇంటి వివరాలను స్వయంగా ఆన్ లైన్ లో ౦వ.ఎవఅంబం.గ్రశీజ.ఱఅ అనే పోర్టల్ లో తన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్ 15 రోజుల పాటు అందుబాటులో ఉంటుందని, ఈ కాలంలో ప్రతి కుటుంబం తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి అవసరమైన సమాచారాన్ని సులభంగా నమోదు చేయవచ్చని, పోర్టల్ లో ఇంగ్లీష్, హిందీతో పాటు అనేక ప్రాంతీయ భాషలు అందుబాటులో ఉంటాయన్నారు. అందువల్ల ప్రజలు తమకు సౌకర్యమైన భాషలో వివరాలు నమోదు చేసుకోవచ్చని వివరించారు. స్వయంగా వివరాలు నమోదు చేయడం వల్ల సమాచారం మరింత ఖచ్చితంగా ఉండటమే కాకుండా సమయం ఆదా అవుతుందని అన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసిన తర్వాత ఒక రిఫరెన్స్ ఐడి ఇవ్వబడుతుందని, దీనిని భవిష్యత్తులో అవసరమైనప్పుడు ఎన్యూమరేటర్ కి చూపించవచ్చని చెప్పారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేయని కుటుంబాలను ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి నమోదు చేస్తారని చెప్పారు. కావున ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్ నందు సరైన వివరాలు నమోదు చేసి జనగణన కార్యక్రమానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. జనగణన దేశాభివృద్ధికి ముఖ్యమైన ఆధారమని, అందుకే ప్రతి పౌరుడు బాధ్యతగా పాల్గొనాలని అయన పిలుపునిచ్చారు.

## స్వామి గ్యాస్ ఏజెన్సీలో ఆకస్మిక తనిఖీ

**- వినియోగదారులకు గ్యాస్ నిరంతర సరఫరాకు ఆదేశించిన జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్**



**విజయనగరం టౌన్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ మంగళవారం స్వామి గ్యాస్ ఏజెన్సీని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఇటీవల ఏజెన్సీ మూత పడటం తో గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే పరిస్థితుల నేపథ్యంలో, జెసి ఆకస్మిక తనిఖీ చేసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, అందుబాటులో ఉన్న సిలిండర్లను భౌతికంగా సరి చూసారు. గత నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కొన్ని కారణాల వల్ల డీలర్ షాపు తెరవకపోవడం వలన సరఫరా వ్యవస్థలో అంతరాయం ఏర్పడినట్లు జేసీ గుర్తించారు. దీనిపై సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ, సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) అధికారులతో సంప్రదించి, అదనపు గ్యాస్ సిలిండర్లు తక్షణం అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన నిధులను చెల్లించాలని డీలర్‌ను ఆదేశించారు. గ్యాస్ కొరకు వినియోగ దారులు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, ప్రతి వినియోగదారుడి ఇంటికే డోర్ డెలివరీ వ్యవస్థను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వినియోగదారుల సౌకర్యం మరియు నిరంతర సరఫరా ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్న జేసీ, ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో జేసీతో పాటు సీఎస్‌డీటీ ఏ. రామారావు పాల్గొన్నారు.

## నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమానికి శ్రీకారం

**- పెందుర్తి మండలం సరిపల్లిలో చెరువు అభివృద్ధి పనులకు అంకురార్పణ**
**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు**



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** "నీరు.. ప్రగతి.. జల హారతి" నినాదంతో సాగునీటి సంఘాల బలోపేతం, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమాన్ని పెందుర్తి నియోజకవర్గం సరిపల్లి గ్రామంలో సోమవారం శ్రీకారం చుట్టారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ సంప్రదాయ పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా సరిపల్లి గ్రామంలోని పిన చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సాగునీటి సంఘం సభ్యులు, స్థానిక రైతులతో మాట్లాడి పంటల సాగు, నీటి అవసరాలపై వివరాలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం శాస్త్రీయ విధానాలతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో సుమారు 125 చెరువుల్లో నీటి నిల్వలు మెరుగ్గా ఉన్నాయన్నారు. వర్షాకాలనికి ముందు నీటి మట్టం కనీసం 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్లకు తగ్గకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. చెరువుల వద్ద జంగిల్ క్లియరెన్స్, బండ్ బలోపేతం, డీసిల్టింగ్ వంటి పనుల ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచు తామని వివరించారు. సరిపల్లి చెరువు వీఎం ఆర్డీఏ పరిధిలో ఉన్నందున చెరువు సుందరీ కరణతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, గ్రామస్థులు తమ సూచనలు అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రథమంగా సరిపల్లి వచ్చానని, ఈ ఊరు ఎప్పటికీ నాకు గుర్తుండిపో తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చేపట్టిన ఈ జలధార కార్యక్రమాన్ని అందరూ సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**జలవనరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి**

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశంలో జలవనరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మొదటి ఐదు రోజులు సర్వే చేసి, తరువాత 80 రోజుల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. పెందుర్తి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలు అధికంగా ఉన్నందున, చెరువుల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. అలాగే సరిపల్లి గ్రామ రైతులు రైల్వే ట్రాక్ అవతల ఉన్న సుమారు 250 ఎకరాల సాగుభూములకు రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేయగా, అండర్ బ్రిడ్జి ఏర్పాటు కోసం అనకాపల్లి ఎంపీతో చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకువస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాసరావు, డ్వామా పీడీ నిర్మలా దేవి, ఇరిగేషన్ ఎస్.ఈ. అప్పలనాయుడు, ఎంపీడీవో అప్పలరాజు, తహశీల్దార్ వెంకట అప్పారావు, ఇరిగేషన్ జేఈ మాలతి, ఎంపీపీ మాలతి నగేష్, పీఏసీఎస్ చైర్మన్ సింహాచలం, స్థానిక ఎంపీటీసీ, మాజీ సర్పంచ్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు



**అనకాపల్లి టౌన్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అనకాపల్లి పూడిమడక రోడ్ లో వున్న సూర్య తేజ హెల్త్ కేర్ అధినేత భీమరశెట్టి మాణిక్య రత్నం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యూరో సర్జన్ డాక్టర్ ఎం.జగదీష్, హెడ్ నెక్ సర్జరీ , అంకలజిస్ట్ డాక్టర్ కే.ధీరజ్,రేడియేషన్ అంకాలజీ డాక్టర్ ఎం.వెంకట రమణ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ప్రాథమిక దశలో కేన్సర్ ను గుర్తిస్తే నివారణ సులభం...అదేవిధంగా 3,4స్టేజ్ లో కూడా ఇప్పటి వైద్య శాస్త్ర అభివృద్ధి వలన అసాధ్యం కాదు అన్నారు. కేన్సర్ వ్యక్తికి మానసిక ధైర్యం కల్పించండి.. భయపెట్టకండి అన్నారు. గ్రామీణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ కేన్సర్ పై చక్కటి అవగాహన కల్పించిన వైద్యులకు కృతజ్ఞతలు, హోస్ట్ మాణిక్య రత్నం కు అభినందనలు తెలిపారు. తమ సంస్థ తరుపున సహకారం వుంటుంది అన్నారు. సూర్య తేజ అధినేత మాణిక్య రత్నం మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ తమ సంస్థ అభివృద్ధికి సహకారం అందించ మని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు తిరుమల రావు, చిరంజీవి, ప్రకాష్, అలక రాజు, వీరభద్రరావు, రమేష్, రమణారావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

## కోరుప్రోలు లో అసంఘటిత రంగ కార్మికులు కు ఈ - శ్రమ కార్డు లు పంపిణీ



**ఎస్. రాయవరం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** వ్యవసాయ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, వీధివ్యాపారులు, గృహాకార్మికులు వంటి అసంఘటిత రంగ కార్మికులుకు ఈ-శ్రమకార్డులు ఒక వరమని ఎస్. రాయవరం ఎంపిపి కె. వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం మండలం లోని కోరుప్రోలు గ్రామంలో కార్మిక శాఖ అధ్వర్యంలో ఈ-శ్రమకార్డులు పంపిణీ కార్యక్రమం లో ఎంపిపి పాల్గొన్నారు. అసంఘటిత రంగకార్మి కులైన వారు 16నుండి 59 సంవత్సరాలు వయస్సుశకల్గి ఉంటే అధికారిక వెబ్సైట్లో ఆధారకార్డ్డు, ఆధారలింక్ చేయబడిన మోబైల్ నెంబరు, బ్యాంకుఖాతావివరాలు తో నమోదు చేసుకోవాలని ఎ ఎల్ ఓ తెలిపారు. ఈపథకం క్రింద కార్డుపొందినవారు రెండులక్షల ఉచిత ప్రమాద భీమా, 60ఏళ్లు నిండిన తరువాత నెలకు మూడువేల పెన్సన్, కార్మికులుకు అవసరమైన ఉచిత పనిముట్లు, కుమార్తె వివాహానికి అర్ధిక సహాయంవంటి ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. ఈసందర్భంగా లబ్ధిదారులుకార్డులు పంపిణీచేసారు. ఈకార్యక్రమంలో మాజీసర్పంచ్ పుట్టాసుధాకర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోరుప్రోలు పంచాయితీ పాలకవర్గం కు ఘన వీడ్కోలు



**ఎస్. రాయవరం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఎస్. రాయవరం మండలం కోరుప్రోలు పంచాయితీ పాలకవర్గం పదవీకాలం ఈనెల 2 వ తేదీతో ముగియటంతో మంగళవారం పాలకవర్గం సభ్యులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పంచాయితీ సర్పంచ్ తోపాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులును శాలువాలుతో సత్కరించి జ్ఞాపికలను అందచేసారు. ఈ సందర్భం గా గడిచిన అయిదేళ్ళలో గ్రామం లోచేపట్టిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమం లో పిఎసి ఎస్ మాజీ అధ్యక్షుడు పత్తిపాటి సత్యనారాయణ, కోరా రామారావు. పిఎసి ఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ, చేకూరి శ్రీరామచంద్రరాజు,కొరపాటి గోపాలం తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అపోహలు, మూఢ నమ్మకాలు విడనాడాలి : డిఎంహెచ్ఓ డా. భాస్కరరావు




**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07 :** శాస్త్రీయ , వైద్య విజ్ఞానాన్ని నమ్మడం ద్వారా ప్రజారోగ్యం సాధ్యమని , ఆరోగ్యం కోసం అందరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా ఆరోగ్య కార్యాలయం నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిఎంహెచ్ఓ, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొని వరల్డ్ హెల్త్ డే స్లొగన్స్ తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. భాస్కరరావు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన మీదే ఆధారపడి ఉందని,మారుతున్న జీవనశైలి, కలుషిత వాతావరణం వల్ల కొన్ని వ్యాధులు ప్రభలుతాయని, పర్యావరణానికి హానికరం కాని, ఆరోగ్యకరమైన జీవశైలి , ఆహార నియమావళి అవలంబించాలని పేర్కొన్నారు. ఆరోగ్య అంశాలకు సంబంధించి అపోహలు, మూఢ నమ్మకాలు విడనాడి శాస్త్రీయ వైద్య విజ్ఞానం ద్వారా అందించే ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఆహారం, వ్యాయామం, యోగా, మానసిక ప్రశాంతత, పరిశుభ్రత మొదలగు సూత్రాలను పాటించి ఆరోగ్యం తద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డా వై. విజయ మోహన్, డా టి. జగన్ మోహనరావు, డా ఎమ్. వినోద్ కుమార్, డా. సూర్య కౌశిక్ , అఫ్థాల్మిక్ ఆఫీసర్ నగేష్ రెడ్డి, డిపిఓ లీలారాణి , డెమో లు ప్రసాద్, గిరి బాబు, సూపర్వైజర్స్ విజయలక్ష్మి, పుష్ప, వైద్యారోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లంకెలపాలెం యు.పి.హెచ్.సిలో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



**గాజువాక , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** లంకెలపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అగనంపూడి,ఫార్మాసిటీ కాలనీ, లంకెలపాలెం ఏరియాలో స్వర్ణ వార్డు పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్ సమక్షంలో విశాఖ పార్లమెంటరీ టిఎన్టియుసి అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ, స్థానిక యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేవు దివ్యలతా ని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో మానవ అవసరాలకు వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ కీలకమని కరోనా టైం లో ఏఎన్ఎంలు ఆశా వర్కర్స్ తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టి కరోనా సోకిన పేషెంట్లకు విశిష్ట సేవలు అందించారని అన్నారు. డాక్టర్ రేవు దివ్యలత మాట్లాడుతూ 1950 సంవత్సరం ఏప్రిల్ 7 వ తేదీన ఐక్యరాజ్యసమితి వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలను ఇంప్లిమెంట్ చేసిన తేదీని ప్రపంచ ఆరోగ్య దినోత్సవం గా ప్రకటించడం జరిగినది. నేడు పి ఎం రాష్ట్ర సీఎం ఆరోగ్యం ప్రధాన ప్రాధాన్యతగా ఎన్నో స్కీములు పెట్టి ప్రజలకు సేవ చేస్తున్నారని అన్నారు. స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు శనివాడ చిన్నారావు, విశాఖ పార్లమెంటరీ టిడిపి నాయకులు పూడి సత్యారావు, ఏఎన్ఎం లు రమాదేవి, రత్నం, ఇందిరా, సుహాసిని, ఆశ వర్కర్స్ తోకాడ ఈశ్వరమ్మ,సరిత, జ్యోతి లక్ష్మి పాల్గొన్నారు అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

## గురజాడ గ్రంథాలయంలో మరుగుదొడ్లకు విముక్తి!

**- సొంత నిధులతో మరమ్మతులు చేయించిన : ఆప్ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్**




**విజయనగరం టౌన్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** నిత్యం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వందలాది మంది విద్యార్థులతో పాటు అనేకమంది పాఠకులు సందర్శించే గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మరుగుదొడ్లను తన సొంత నిధులతో మరమ్మతులు చేసినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ స్టూడెంట్స్ వింగ్ అయిన ఏఎస్ఏపి ద్వారా మరుగుదొడ్ల సమస్యను తెలుసుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ రమేష్ సుమారు 65 వేల రూపాయలు తన సొంత నిధులను వెచ్చించి మరుగుదొడ్లను మరమ్మత్తు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం ఉపయోగపడే గ్రంథాలయంలో మరుగుదొడ్ల సమస్య ఉన్నప్పటికీ గ్రంథాలయ సంస్థ మరమ్మతులు చేయక పోవడంతో ఆమ్ ఆద్మీ పార్టీ స్టూడెంట్స్ వింగ్ ఏఎస్ఏపి ద్వారా సమాచారం తెలుసుకొని మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ డాక్టర్ పైల రమేష్ రాజు,శనపతి ఈశ్వర్, ఏఎస్ఏపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాత బస్టాండ్ వద్ద మెరుగుపడిన వసతులు

**- ఎంపీడీవో చొరవతో ప్రజా మరుగుదొడ్లకు మరమ్మతులు**




**చింతపల్లి , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** చింతపల్లి మేజర్ పంచాయతీ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రజా మరుగుదొడ్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గత కొంతకాలంగా నీటి సరఫరా లేక, నిర్వహణ లోపంతో ఇబ్బందికరంగా మారిన ఈ మరుగుదొడ్లను ఎంపీడీవో సీతామహాలక్ష్మి ప్రత్యేక చొరవతో బాగు చేయించారు. ప్రయాణికులు, స్థానిక చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఎంపీడీవో ఆదేశాల మేరకు యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేశారు. ఇందులో భాగంగా పాడైపోయిన పాత మోటార్ స్థానంలో కొత్త మోటార్‌ను, విద్యుత్ సరఫరా క్రమబద్ధీకరించేందుకు ఆధునిక ప్యానెల్ బోర్డును ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లలో నీటి సౌకర్యం పునరుద్ధరించడంతో పాటు, పరిసరాలను శుభ్రం చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ ఆస్తులను వినియోగించుకోవడమే కాకుండా, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు కూడా సహకరించాలని అధికారులు కోరారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి స్వయంగా పర్యవేక్షించి ఈ సమస్యను పరిష్కరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జడ్జిగా ఎంపికైన కె.కోటపాడు అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని కొట్యాడ శ్యామలాదేవి



**కె.కోటపాడు,ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఆంధ్ర ప్రదేశ్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయిన మండలంలోని ఎ.కోడూరు గ్రామా నికి చెందిన కొట్యాడ శివ కుమార్తె కొట్యాడ శ్యామలా దేవి కి అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం అభినందనలు తెలిపారు. ఉత్తమ విద్యా బుద్దులు నేర్చుకున్న అయ్యన్న విద్యా సంస్థలను తనతండ్రి శివతోకలిసి శ్యామలదేవి మంగళ వారం సందర్శించారు. ఘన విజయం సాధించిన ఆమెకు పుష్ప గుచ్ఛం అందచేసి అభిన దించారు. అలాగే తండ్రి శివను సత్కరించారు. శ్యామలా దేవి జడ్జిగా ఎంపికయ్యి మన ప్రాంతానికి అయ్యన్న విద్యాసంస్థలకు ఎంతో గర్వకారణంగా నిలిచారని డాక్టర్ ఖాశీం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## విశాఖ జిల్లాప్రత్యేకతను చాటిచెప్పేలా అభివృద్ధి కార్యాచరణ ఉండాలి

- ప్రభుత్వ ప్రాధాన్యతే... మనందరి ప్రాధాన్యతగా ప్రతి అధికారీ పని చేయాలి
- 60 శాతం సమయం సాధారణ పనులకు, 40 శాతం వినూత్న లక్ష్యాల కోసం వెచ్చించాలి
- జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచనలు



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** విశాఖపట్టణం జిల్లాకు ప్రపంచ వ్యాప్తంగా కీర్తి, ప్రతిష్టలు ఉన్నాయని.. ఆ ఖ్యాతి, పేరుకు తగ్గట్టుగానే వినూత్న రీతిలో అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని, ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ జిల్లా అధికారులను ఉద్దేశించి పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల, విభాగాల సమన్వయంపై కలెక్టరేట్ మీటింగు హాలులో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆయన కీలక సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఎఫ్వో రవీందర్ ధామతో కలిసి ఆయన వివిధ అంశాలపై కూలంకషంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు, ప్రతి విభాగం తన పరిధిలోని సమాచారం, సమస్యలు, పురోగతిని అధికారులు నేరుగా తనకు తెలియజేయాలని, మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా కమ్యూనికేషన్ కొనసాగించాలని, అవసరమైతే ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో 100కు పైగా పథకాలు అమలవుతున్న నేపథ్యంలో, ప్రతి అధికారి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అధికారుల పని సమయాన్ని 40% సాధారణ ప్రాజెక్టులకు, పనులకు 60 శాతం జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, వినూత్న ప్రాజెక్టులు చేపట్టేందుకు కేటాయించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతే మనందరి ప్రాధాన్యత కావాలని, దానికనుగుణంగా పని చేయాలని హితవు పలికారు. ప్రభుత్వం ఆశించే ఫలితాలను ముందుగానే అంచనా వేసి సిద్ధంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను నిరంతరం గమనిస్తూ వేగంగా స్పందించాలన్నారు. విశాఖపట్నం జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైద్య రంగంలో డి.ఎం.హెచ్.ఓ, ఎన్టీఆర్ వైద్య సేవా కోఆర్డినేటర్, డ్రగ్ ఇన్స్పెక్టర్, డ్రగ్ కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ విభాగాల మధ్య సమన్వయం పెంపొందించాలని ఆదేశించారు. ప్రజల్లో విశాఖపట్నంపై సానుకూల అభిప్రాయాన్ని పెంచే విధంగా అధికారులు పనిచేయాలని హితవు పలికారు. కేపీఐ పనితీరు సూచికలను మెరుగుపరచడానికి సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలను అమలు చేయాలని, ప్రతి అధికారి తమ విభాగ పనితీరుపై వ్యక్తిగతంగా బాధ్యత వహించాలని కలెక్టర్ చెప్పారు. ప్రజల నుంచి ప్రతికూల స్పందన రాకుండా ప్రతి ఫిర్యాదును సమయానికి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే తానే స్వయంగా సమస్యల పరిష్కారానికి రంగంలోకి దిగుతానని ఈ క్రమంలో హెచ్చరించారు. లబ్ధిదారుల ఆధారిత పథకాల అమలులో బ్యాంక్ లింకేజీని పెంచేందుకు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ తో సమన్వయం చేసుకోవాలన్నారు. పరిశ్రమలు, వ్యవస్థాపకతకు ప్రోత్సాహం కల్పించే పథకాల గురించి, ప్రభుత్వం కల్పించే రాయితీల గురించి అవగాహన కల్పించాలన్నారు.

పర్యాటక, రెవెన్యూ, సివిల్ సప్లైస్, డిజిటల్ సేవలు, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం వంటి అన్ని రంగాల్లో సమన్వయంతో పనిచేస్తూ, పారదర్శకత, సమర్థతతో ప్రజలకు సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సచివాలయాల ప్రాధాన్యతను గుర్తించి సేవలను విస్తృతం చేయాలన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు చేరుకునే విధంగా హైదరాబాద్, బెంగళూరులలో మాదిరిగా విశాఖ నుంచి కనెక్టవిటీ ఏసీ బస్సు సర్వీసులను నడపాలని, దానికి అవసరమైన అధ్యయనం చేసి నివేదించాలని ఆర్టీసీ ఆర్.ఎం.ను ఆదేశించారు. దక్షిణ నియోజకవర్గంలో ప్రతిపాదించిన రైతు బజారు ఏర్పాటు విషయంలో సంబంధిత అధికారులు చొరవ చూపాలని సూచించారు. అధికారులందరూ ఒక బృందంగా కలిసి ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పనిచేసి విశాఖపట్నం జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, అన్ని విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమాలు : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి ప్రతినిధి , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్' ( ఎన్ జెడ్ హెచ్ సి) అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని, అందులో భాగంగా జిల్లాలో 20 కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలలో ( కెజిబివి ఎస్) ఈ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించినట్లుగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపాల్స్, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం మరియు 'జీరో వేస్ట్' (వ్యర్థాలు లేకుండా చేయడం) లక్ష్యంగా పెట్టుకోవాలని కెజిబివి ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ఇప్పటికే కొన్ని చోట్ల కంపోస్ట్ పిట్లు, సోక్ పిట్లు, కిచెన్ గార్డెన్స్ వంటి పనులు ప్రారంభమయ్యాయని, జూన్ 2026 నుండి జూలై 2027 మధ్యలో ఈ పనులన్నీ పూర్తి చేసి, క్యాంపస్‌లను 'నెట్ జీరో'గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ శాఖ, జిల్లా అధికారులు మరియు కెజిబివి పాఠశాలల ప్రిన్సిపాళ్లు కీలక పాత్ర పోషించాలన్నారు. కిచెన్ వ్యర్థాల నుండి ఎరువును తయారు చేసేలా డీకంపోజింగ్ యూనిట్లు మరియు చెత్త సేకరణకు టూ-బిన్ విధానాన్ని అమలు చేయడం, వర్షపు నీటి సంరక్షణ ( ఆర్ డబ్ల్యూహెచ్) ద్వారా భూగర్భ జలాలను రీఛార్జ్ చేయడం మరియు మురుగు నీటి నిర్వహణకు సోక్ పిట్స్ ఏర్పాటు చేయడం, విద్యార్థులకు సురక్షితమైన ఆర్ ఓ తాగునీరు, పరిశుభ్రమైన వంటశాలలు మరియు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడం అంటే అంశాలపై సమీక్షించారు. సౌరశక్తి వినియోగం మరియు నీటి సంరక్షణ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉండనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష జిసిడిఓ, ఎవిస్ డి జమీమా, డిహెచ్ఓ ఏ రాజశేఖరమ్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ ఓ సోమ సుందరన్, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపాల్స్, సమగ్ర శిక్ష డిఈ లు సుబ్బలక్ష్మి, గణేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నాగవంశ పరిణయ పరిచయ వేదిక కరపత్రాలను ఆవిష్కరించిన నాగవంశ సంఘ అధ్యక్షులు, జనసేన నాయకులు అవనాపు విక్రమ్



**విజయనగరం టౌన్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** చదువు, సంస్కారం విలువలు కలిగిన కుటుంబం నుంచి ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలో నాగవంశ పరిణయ పరిచయ వేదిక ఉపయోగపడుతుందని విజయనగరం నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షులు అవనాపు విక్రమ్ అన్నారు. ఈ అవకాశాన్ని నాగవంశీయులంతా సద్వినియోగం చేసుకోవాలని అయన పిలుపునిచ్చారు. మంగళవారం విజయనగరం నాగవంశ సంక్షేమ సంఘ భవనంలో జరిగిన సమావేశంలో సంఘ సభ్యులు, కార్పొరేషన్ డైరెక్టర్స్, పాల్గొని నాగవంశ యువతీ, యువకుల వివాహం కోసం ఏర్పాటుచేసిన పరిణయ పరిచయ వేదిక కరపాత్రలను, అప్లికేషన్లను రిలీజ్ చేశారు. అనంతరం విజయనగరం నాగవంశ సంక్షేమ సంఘ అధ్యక్షులు అవనాపు విక్రమ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నాగవంశ కుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని ఇప్పుడు మంచి జీవిత భాగస్వామిని అందించాలన్న ఆలోచనతో పరిణయ పరిచయ వేదిక పేరిట 03.05.2026 (ఆదివారం) నాడు విజయనగరం నాగవంశ సంక్షేమ సంఘ భవనము నందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నాగవంశీయులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాలలో ఉన్న నాగవంశీయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరంనాగవంశ సంక్షేమసంఘంసభ్యులు, కార్పొరేషన్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

## 6 వేల మంది విద్యార్థులతో భారీ సాంస్కృతిక ప్రదర్శన

- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సే లక్ష్యం : జిల్లా కలెక్టర్



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07 :** ఈ నెల 22వ తేదీన పట్టణంలోని ప్రధాన రహదారిపై సుమారు 6 వేల మంది విద్యార్థులతో నిర్వహించబోయే భారీ సాంస్కృతిక ప్రదర్శనతో పార్వతీపురం పట్టణం ఒక అరుదైన రికార్డుకు వేదిక కావాలని జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. దీని సన్నాహక ఏర్పాట్లకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడమే లక్ష్యంగా ఈ ఈవెంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నామని అన్నారు. పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి టౌన్ పోలీస్ స్టేషన్ వరకు సుమారు 1 కిలోమీటర్ మేర ఈ కార్యక్రమం జరగనుందని, సుమారు 6 వేల మంది విద్యార్థులు ఈ భారీ ప్రదర్శనలో భాగస్వాములు కానున్నట్లు తెలిపారు.ఎంపిక చేసిన నాలుగు పాటలకు విద్యార్థులు సుమారు 16 నుండి 18 నిమిషాల పాటు ఏకధాటిగా నృత్యం చేయనున్నట్లు వివరించారు. ఈవెంట్ మొత్తాన్ని డ్రోన్, వీడియో మరియు ఫోటోగ్రఫీ చేసి, సాక్ష్యంగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపనున్నట్లు వివరించారు. ?ఈ కార్యక్రమం కోసం విద్యార్థులను 120 గ్రూపులుగా విభజించామని, ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక ఇన్‌స్ట్రక్టర్ మరియు ఒక టీచర్ ఇన్‌ఛార్జ్ బాధ్యత వహించాలని అన్నారు. గత నెల 23వ తేదీ నుంచే పాఠశాలల్లో ప్రాక్టీస్ సెషన్లు ప్రారంభమయ్యాయని చెప్పారు. ?ఒక వైపు రోడ్డును మాత్రమే బ్లాక్ చేసి, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా మిగిలిన మూడు వైపుల నుండి వాహనాలను మళ్లించేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. అత్యవసర సేవల కోసం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంబులెన్స్ సౌకర్యాలు మరియు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంటాయని, తాగునీరు, నీడ కోసం షెడ్లు, బారికేడ్ల ఏర్పాటుతో పాటు విద్యార్థులందరికీ పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమం ఉదయం 7 గం.లకు విద్యార్థుల రాకతో ప్రారంభమై, 9 గం.లకు తొలిపలుకులు,10 గం.లకు ప్రధాన నృత్య ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్, పోలీస్ అధికారులు, సబ్ కలెక్టర్ మరియు తహశీల్దార్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో మార్గాన్ని పరిశీలించి, సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పట్టణ ప్రజలు మరియు గ్రామస్తులు కూడా భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున, మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, పోలీస్ అధికారులు, మునిసిపల్ కమిషనర్ డి.పావని, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెనూ పాటించకపోతే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి



**పార్వతీపురం / సాలూరు , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07 :** విద్యార్థులకు అందించే ఆహారం రుచిగా, పోషకవిలువలు కలిగి నాణ్యతగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అక్షరాలా అమలు చేయాలని,ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా లేదా నాణ్యత లోపించినా సంబంధిత అధికారులపై, ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం సాలూరు పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్‌ను జాయింట్ కలెక్టర్ మరియు మునిసిపల్ ప్రత్యేక అధికారి సి. యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు మరియు 'ముస్తాబు' కార్యక్రమ పురోగతిని ఆయన స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును స్వయంగా పర్యవేక్షించిన ఆయన వంటశాలలను సందర్శించి, భోజనం తయారీలో వాడుతున్న వస్తువుల నాణ్యతను, పరిశుభ్రతను తనిఖీ చేశారు.

## అన్న క్యాంటీన్ ను పరిశీలించిన ప్రగడ



**ఎలమంచిలి టౌన్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఎలమంచిలి పట్టణంలో అన్నా క్యాంటీన్ ను రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మంగళవారం నాడు పరిశీలించి అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతూ అన్నా క్యాంటీన్లో భోజనం వసతి సౌకర్యాలపై ఆరా తీయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలకు కడుపునిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరుతో అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి పేద ప్రజలకు 5 రూపాయల తో కడుపునింపుతున్నారని, త్వరలోనే ఎలమంచిలి నియోజకవర్గంలో మరో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అందించాలన్న ఉద్దేశంతో ఈ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గొర్లి శివన్నారాయణ మూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు కొటారు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇన్చార్జిలు బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, పందూరి శ్రీనివాసరావు, గొర్లి బాబురావు, బొద్దపు నాగేశ్వరావు, దంట్ల వెంకటస్వామి, కర్రేడ్ల మల్లికార్జునరావు, పిల్ల గంగాధర్, కర్రీ వెంకటస్వామి, బొద్ధపు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎంపీ కార్యాలయంలో బిజెపి క్రియాశీల సభ్యుల సమావేశం

- ముఖ్య అతిథులుగా ఎంపీ సీఎం రమేష్, సురేంద్రమోహన్
- క్రియాశీల సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలి
- అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



**అనకాపల్లి రూరల్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ క్రియాశీల సభ్యుల కీలక సమావేశం స్థానిక ఎంపీ సీఎం రమేష్ క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పరమేశ్వరరావు ఒక ప్రకటనలో మాట్లాడుతూ బుధవారం ఉదయం పది గంటలకు అనకాపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యులు(యాక్టివ్ మెంబర్షిప్ సభ్యులు) లతో ఒక ముఖ్య సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, సభ్యత్వ విస్తరణ, బూత్ స్థాయి కార్యాచరణ, గ్రామ స్థాయి బాధ్యతలు, రాబోయే పార్టీ కార్యక్రమాలపై సమగ్ర చర్చ జరుగుతుందన్నారు. అదేవిధంగా క్రియాశీల సభ్యులతో పాటు (స్పెషల్ ఇంటెన్స్ రివిజన్) ప్రకారం ఓట్ల లిస్టులో దొంగ ఓట్లు, మృతి చెందిన, వారివి అర్హత లేని వాటిని తొలగించడం నిజమేనా వాటర్ ను చేర్పించడం వంటి అంశాలపై ప్రత్యేక సమావేశం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశం ద్వారా ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇన్టెన్సి రివిజన్) పై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంపీ సీఎం రమేష్ అలాగే బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్ పాల్గొంటారని పరమేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి సభ్యుడు తమ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదు, పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై నివేదికలతో హాజరు కావలసిందిగా ఆయన కోరారు. సంబంధిత సభ్యులు, నాయకులు, క్రియాశీల కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఈ సమావేశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని తప్పనిసరిగా సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతశీచేయవలసిందిగా పరమేశ్వర రావు పిలుపునిచ్చారు.

సభ్యుల హాజరు పార్టీ బలోపేతానికి మరింత శక్తినిస్తుందని, పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని ద్వారపురెడ్డి పరమేశ్వర రావు అన్నారు.

## క్యూబాపై అమెరికా ఆర్థిక దిగ్బంధనం అమానుషం : సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు



**అచ్చుతాపురం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అచ్యుతాపురంలో క్యూబా కీ మద్దత్తు గా మంగళ వారం విరాళాలు సేకరణ. అమెరికా విధిస్తున్న అక్రమ ఆర్థిక దిగ్బంధనం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్యూబా దేశాన్ని ఆదుకోవాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అచ్యుతాపురం మండలంలో భారీ విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా క్యూబాపై అమెరికా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలు ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. అంతర్జాతీయ సమాజం మరియు ఐక్యరాజ్యసమితి హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, సామ్రాజ్యవాద ధోరణితో అమెరికా వ్యవహరించడం అమానుషమని అన్నారు. ఆహారం, మందులు వంటి కనీస అవసరాలను కూడా క్యూబా పొందకుండా అడ్డుకోవడం ప్రపంచ శాంతికి విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు.

**క్యూబా స్ఫూర్తి - అండగా భారత్:**

ప్రపంచానికే వైద్య సహాయం అందించడంలో ముందుండే క్యూబాకు నేడు కష్టకాలం వచ్చిందని, ఆ దేశానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం ప్రజలు స్పందించి క్యూబా ప్రజల కోసం విరాళాలు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

**పాల్గొన్న ముఖ్య నాయకులు:**

ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో సిపిఎం కన్వీనర్ ఆర్ రాము, మండల కమిటీ సభ్యులు కూండ్రపు సోమునాయుడు, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, చేపల తాతయ్యలు, కడారి అప్పారావు, రొంగలి లక్ష్మి, కాసులమ్మ, సదాశివ తదితరులు పాల్గొని వీధివీధినా తిరుగుతూ విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ వంతు సహాయాన్ని అందించారు.

## స్వామి గ్యాస్ ఏజెన్సీ ఆకస్మిక తనిఖీ..నిర్లక్ష్యాన్ని సహించం

- వినియోగదారులకు గ్యాస్ నిరంతర సరఫరాకు ఆదేశం : జెసి సేధు మాధవన్



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07 :** వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ మంగళవారం స్వామి గ్యాస్ ఏజెన్సీని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఇటీవల ఏజెన్సీ మూతపడటంతో గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారనే పరిస్థితుల నేపథ్యంలో, జెసి ఆకస్మిక తనిఖీ చేసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, అందుబాటులో ఉన్న సిలిండర్లను భౌతికంగా సరి చూసారు. గత నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కొన్ని కారణాల వల్ల డీలర్ షాపు తెరవకపోవడం వలన సరఫరా వ్యవస్థలో అంతరాయం ఏర్పడినట్లు జేసీ గుర్తించారు. దీనిపై సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ, సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) అధికారులతో సంప్రదించి, అదనపు గ్యాస్ సిలిండర్లు తక్షణం అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన నిధులను చెల్లించాలని డీలర్‌ను ఆదేశించారు. గ్యాస్ కొరకు వినియోగదారులు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, ప్రతి వినియోగదారుడి ఇంటికే డోర్ డెలివరీ వ్యవస్థను ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.వినియోగదారుల సౌకర్యం మరియు నిరంతర సరఫరా ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్న జేసీ, ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో జేసీతో పాటు సీఎస్‌డీటీ ఏ. రామారావు పాల్గొన్నారు.

# యుద్ధమా...? యుద్ధోన్మాదమా...?

- పశ్చిమ ఆసియాలో యుద్ధ తీవ్రత..
- యుద్ధం వ్యక్తిగతంగా మారుతున్న వేళ..
- 24 గంటలు సమయం ఇచ్చిన ట్రంప్.
- దూకుడు తగ్గని ఇరాన్...
- ప్రపంచ దేశాలు సంక్షోభంలోకి..
- క్రూడ్ ఆయిల్ ధరలను పెంచిన సౌదీ అరేబియా...
ఖర్గ్ ద్వీపం వైపు అమెరికా మిలటరీ సైన్యం..
- ఇరాన్ వద్ద (సీఎం) సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్స్...



**మల్కాపురం ( కే ఉదయ్ కుమార్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** పశ్చిమ ఆసియాలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధ పరిస్థితి చూస్తుంటే ఇది యుద్ధం కాదు... యుద్ధోన్మాదం అని తలపిస్తుంది. ఎందుకంటే ఒకపక్క ఈ యుద్ధం ఆపడానికి సతవిధాల అన్ని దేశాలు తోపాటు ఐక్యరాజ్యసమితి కూడా సంప్రదింపు లు జరుగుతున్న వేళ అగ్రరాజ్య అధ్యక్షుడు అయినటువంటి డోనాల్డ్ ట్రంప్ మాత్రం తన పంతాన్ని వీడకుండా ఇజ్రాయిల్ దేశంతో కలసి సంయుక్తంగా ఇరాన్ పై దాడులు చేస్తుంటే దానికి బదులుగా ఇరాన్ దేశం కూడా ప్రతి దాడులు చేస్తూ యుద్ధం కొనసాగించడంపై పలు దేశాలు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ యుద్ధం కేవలం వ్యక్తిగత యుద్ధంగా పరిణగించవలసిన అగత్యం ఏర్పడిందని దేశాధినేతలు అభిప్రాయపడుతున్నారు. కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఇప్పటివరకు వాయుసేనలతో ఇరాన్ దేశం పై దాడులు కొనసాగించాం. ఇప్పుడు భూతల దాడులు ప్రారంభిస్తామని ట్రంప్ చెప్పడం యుద్ధ తీవ్రతను మరింత అధికమయ్యే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి. తాజా ఈ విషయంపై ప్రపంచ దేశాలు చర్చించుకుంటున్నాయి

**వంతం వీడని ఇరాన్ దేశం.....**

అమెరికా ఇజ్రాయిల్ సంయుక్త దాడులను ఇరాన్ దేశం ఓ పక్క ఎదుర్కొంటూనే మరోపక్క ఎక్కడ తగ్గేది లేదంటూ ఇరాన్ దేశం ప్రతిదాడులను మరింత ఉధృతం చేస్తూ భూతల దాడులకు కూడా మేము సిద్ధమేనంటూ లక్షల మంది సైనికులనుహూ సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది. ఈ యుద్ధ పరిస్థితి చూస్తుంటే ఉన్మాదంగానే ఎవరికివారు పోటీపడుతున్నట్లు అనిపిస్తుంది. ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల స్నేహభావం మరింత క్షీణిస్తుందని చెప్పవచ్చు.

**హార్మోజ్ జల సంధి వద్ద పరిస్థితి......**

ప్రస్తుతం హార్మోజ్ జలసందిని ఇరాన్ దేశం కట్టడి చేస్తూ శత్రుదేశాల ఇజ్రాయిల్, అమెరికా, క్రూడ్ ఆయిల్ నౌకలపై దాడులు చేస్తూ వాటిని కూల్చి వేయడం జరుగుతుంది. పూర్తిగా ఈ జలసందిని ఇరాన్ స్వాధీనం చేసుకొని కట్టడి చేస్తూ ఇరాన్ కు మిత్ర దేశాలైనటువంటి భారత్, రష్యా, చైనా, దేశాల కార్గో నౌకలను అనుమతి ఇవ్వడంపై ట్రంప్ మరింత గుర్రుగా ఉన్నారు. తాజా విషయం ఏమిటంటే చైనా సహాయంతో " సీఎం 302 సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్స్ "ఇరాన్ దేశం దగ్గర ఉన్నట్లు తెలుస్తుంది. ఈ మిస్సైల్ సముద్ర కింది భాగం నుంచి ప్రయోగించి శత్రు దేశాల నౌకలతో పాటు గగనతనంలో ఎయిర్ క్రాఫ్ట్ ను కూడా కూల్చివేయగల సత్తా ఉన్న, రాడార్ సిస్టంకు దొరకకుండా ఉండే ఈ క్రూయిజ్ సూపర్ సోనిక్ మిస్సైల్, ఇరాన్ దేశానికి ఎలా వచ్చిందన్న ప్రశ్నలు ఇప్పుడు ఉత్పన్నమవుతుంది.

**గల్ఫ్ దేశాల్లో మౌలిక నదుపాయాలకు తీవ్ర అంతరాయం.......**

జరుగుతున్న ఈ యుద్ధోన్మాదంతో గల్ఫ్ దేశాలలో ప్రజలకు అందవలసిన మౌలిక సదుపాయాలు కు తీవ్ర అంతరాయం



ఏర్పడుతుంది. ఇప్పటికే మినరల్ వాటర్ ప్లాంట్ లో తోపాటు, (మంచినీటి సరఫరా) ఆహార నిల్వలలో కూడా కొరత ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది.

**క్రూడ్ ఆయిల్ ధరలు మరింత ప్రియం.....**

గల్ఫ్ దేశాల్లో అతి పెద్దదిగా చెప్పబడే సౌదీ అరేబియా ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ బారెల్ ధరలను మరింత పెంచి వేయడంతో, ముడి పదార్థాల ఉత్పత్తి మరింత ఆకాశాన్ని అంటడంతో ఈ కొరత మరింత అధికమవుతుంది. ఇప్పటికే కొన్ని దేశాలలో చమురు ధరలు పెంచి వేయడం జరిగింది. దీంతోపాటు ఎల్పీజీ వంటగ్యాస్ కూడా భారతదేశంలో ఎక్కువగా వినియోగంలో ఉండటంతో ఈ కొరత మరింత తీవ్రమవుతుంది. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత చిన్నాభిన్నమవుతుంది.

**భారతదేశం కీలకంగా వ్యవహరించాలి....**

పశ్చిమ ఆసియాలో జరుగుతున్న ఈ యుద్ధ పోరు రోజురోజుకు మరింత తీవ్రమవుతున్న వేళ ప్రపంచ దేశాల అధ్యక్షుల మధ్య జరుగుతున్న చర్చలు మరింత ఉధృతం చేసే విధంగా భారతదేశం ఎప్పుడు ఒక నిబద్ధతతో నైతికత, శాంతి తో పాటు, దౌత్య పరంగా మంచినిహా కోరే దేశంగా వివిధ దేశాల్లో మంచి పేరుగాంచి ఉన్న ఈ తరుణంలో భారత్ ముందడుగు వేసి ప్రపంచ దేశాల అధ్యక్షులతో ఈ యుద్ధం ఆగేవిధంగా ప్రయత్నాలు చేస్తే మరి ంత సత్ఫలితాలు ఇస్తాయి అన్నది. కొందరి దౌత్య వేత్తల అభిప్రాయం.

## నేడు ఇస్కాన్ జయపతాక స్వామి మహారాజ్ విశాఖ సందర్శన

- బుధవారం ఎంజీఎం పార్కులో మోడ్రన్ భజన కీర్తన కార్యక్రమం



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక గురువు పరమపూజ్య జయపతాక స్వామి మహారాజ్ ఈనెల ఏప్రిల్ 8 బుధవారం విశాఖ నగరానికి విచ్చేస్తున్నారని, రెండు రోజులపాటు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరవుతారని విశాఖలోని ఇస్కాన్ అధ్యక్షులు సాంబ దాస్ ప్రభుజి ఒక ప్రకటనలో తెలిపారు. జయపతాక స్వామి మహారాజ్ ఇస్కాన్ స్థాపకులు శ్రీల ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభు పాదుల ప్రముఖ శిష్యులు. భక్తి యోగం, శ్రీకృష్ణుని తత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తూ లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా దేవాలయాలు, విద్యా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల స్థాపనలో ఆయన విశేష పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన సందర్శన ముఖ్యాంశాలు వివరిస్తూ ఈనెల 8న మహారాజ్ సుమారు 550 మంది సన్యాసులతో కలిసి పవిత్రమైన సింహాచలం దేవస్థానంను సందర్శించనున్నారని తెలిపారు. ప్రపంచ శాంతి కోసం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ర్యాలీలో సుమారు 600 మంది ఇస్కాన్ భక్తులతో కలిసి పాల్గొననున్నారని తెలిపారు. బుధవారం ఈ ర్యాలీ ఆర్.కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుండి పార్క్ హోటల్ వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి విచ్చేసి, ర్యాలీకి జెండా ఊపి ఘనంగా ప్రారంభం చేస్తారన్నారు. అదే రోజు సాయంత్రం బీచ్ రోడ్‌లోని ఎంజీఎం పార్క్‌లో జరిగే భజన, కీర్తన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రెండు రోజుల పాటు విశాఖపట్నంలోని ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణుని లీలలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించ నున్నారని తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమాలలో పాల్గొని పరమపూజ్య మహారాజ్ ఆశీర్వాదాలు పొందాలని భక్తులందరికీ, ప్రజలకు సాంబ దాస్ ప్రభుజి తెలియజేశారు.

## మునగపాక తహసిల్దార్ పివి రత్నం అభినందిస్తున్న జనసేన పార్టీ నాయకులు



**మునగపాక , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** మునగపాక తహసీల్దారిగా నూతనంగా నియమితులైన పివి రత్నం ను మండల జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాము, ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, మూలపేట జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు కాండ్రేగుల గాంధీ, కర్రీ ఉస్తేల్ నాయుడు, అప్పలరాజు, మునగపాక గ్రామ శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి అప్పలనాయుడు, కారుకొండ కాశీ, వెంకటాపురం జన సైనికరాలు సుందరపు ధనలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

## మూలపేటలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తాం

- అనకాపల్లి అవకాలవ చైర్మన్ ఆడారి ఆనంద సన్యాసినాయుడు



**మునగపాక , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** మునగపాక మండలం మూలపేట పంచాయతీలో పబ్లిక్ కొళాయిలు మొత్తం తేపలుపోయాయి. వాటి గురించ్ అనకావల్లి అవకాలవ చైర్మన ఆడారి ఆనంద సన్యాసినాయుడు ( జెకె బ్రదర్స్) పంచాయతీ సెక్రెటరీ కీ తెలియ పరచగా తక్షణమే గ్రామ సెక్రెటరీ పంచాయతీ స్వీపర్ తక్షణమే పోయిన దగ్గర బిగించి ప్రజలకు ఇబ్బందు లేకుండా చేయడం జరిగింది. మంచినీరుకు ఏమి ఇబ్బంది వచ్చినా తక్షణమే తెలియపరచవలసిందిగా కోరుతూ ఆయన మాట్లాడారు. మూలపేట పంచాయతీలో ఏ విధమైన మౌలిక సదుపాయాలు కు ఇబ్బంది కలిగిన ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు స్థానిక నాయకులు ద్వారా తక్షణమే పనులు చేపట్టడం జరుగుతుందని సన్యాసినాయుడు తెలిపారు. రాబోవు వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు.

## విశాఖ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సమస్యలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ కు వినతి

- ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెం రెడ్డి సతీష్ కుమార్ వివరాలు వెల్లడి
- గ్రంథాలయాల భవనాలు, లైబ్రరీస్ సెస్సు, గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఉన్న గ్రంథాలయాల స్థితిగతులు, లైబ్రరీస్ సెస్సు బకాయిలు గ్రంథాలయ అభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాల తగు పరిష్కారం కోసం విశాఖపట్నం జిల్లా దక్షిణ నియోజకవర్గం శాసనసభ సభ్యులు సి. హెచ్. వంశీ కృష్ణ శ్రీనివాస్ కు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెం రెడ్డి సతీష్ కుమార్ మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ సతీష్ కుమార్ ఎమ్మెల్యే వంశీకృష్ణతో మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలోని గ్రంథాలయాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. శాశ్వత భవన నిర్మాణం కోసం వివరిస్తూ ప్రస్తుతం జిల్లా కేంద్ర గ్రంథాలయం (డీసీఎల్), జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయం (జెడ్ జిఎస్) ప్రైవేట్ అద్దె భవనాల్లో ఉన్నాయని, దండు బజార్‌లో ఉన్న సంస్థ సొంత స్థలంలో శాశ్వత భవన నిర్మాణం చేపట్టే వరకు జీవీఎంసీ లేదా వీఎంఆర్డిఏ భవనాలను కేటాయించాలని కోరారు. శిథిలావస్థలో బాలల గ్రంథాలయం కోసం ఎమ్మెల్యేకు వివరిస్తూ దక్షిణ నియోజకవర్గం 36వ వార్డు రంగిరాజు వీధిలోని బాలల గ్రంథాలయం ప్రమాదకర స్థితిలో ఉందని, దీనిని తక్షణమే సమీపంలోని ప్రభుత్వ భవనంలోకి తరలించాలని విజ్ఞప్తి చేశారు. పుస్తక నిక్షేప కేంద్రాలు చెయ్యాలని, మారుమూల ప్రాంతాల విద్యార్థుల కోసం 'బుక్ డిపాజిట్ సెంటర్స్' ఏర్పాటుకు సహకరించాలని కోరారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కోసం నియోజకవర్గంలోని గ్రంథాలయాల్లో ఉచిత వైఫై, కంప్యూటర్లు, సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధికి, పాఠకుల సౌకర్యార్థం తమ వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07 :** అందరూపోషకాహారం తీసుకుంటూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ సెడంటరి లైఫ్ స్టైల్ మార్చుకోవాలని ప్రతి రోజు వ్యాయామం ,సరైన ఆహారం మరియు సరైన నిద్ర తీసుకుంటూ వారి యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. ఎస్. జీవన్ రాణి సూచించారు. "విజ్ఞానానికి అండగా నిలుద్దాం- ఆరోగ్యం కోసం కలిసి పని చేద్దాం"అనే ఉద్దేశ్యంతో ర్యాలినని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి అనారోగ్య సమస్యలు ఒచ్చినా, వెంటనే వైద్యుని దగ్గరకి వెళ్ళడం ఆరోగ్య తనిఖీలు చేయించుకుని ఆరోగ్యంగా జీవించాలని



తెలియజేశారు. ఆరోగ్యమే- మహాభాగ్యం అనే నినాదంతో ప్రజారోగ్య సమస్యలపై అవగాహన కల్పించాడికు ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అందరూ పోషకాహారం తీసుకుంటూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ సెడంటరి లైఫ్ స్టైల్ మార్చుకోవాలని ప్రతి రోజు వ్యాయామం,సరైన ఆహారం సరైన నిద్ర తీసుకుంటూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ కార్యక్రమంలో అడిషనల్ డి. యం. హెచ్ . ఓ డాక్టర్ కె. రాణి, డి .పి. హెచ్. యన్. ఓ వి. శాంతి , డెమో వి.చిన్నతల్లి గారు,ఎస్.ఓ జి.గిరిగణేష్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చీడిపాలెం మాజీ సర్పంచ్ దంపతులకు సన్మానం

**కొయ్యూరు , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం చీడిపాలెం పంచాయతీ సర్పంచ్‌గా తన పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న నత్తూరు సోమన్నదొర, ఆయన భార్య జానకి దంపతులను మంగళవారం పంచాయితీ సెక్రటరీ కవితా రాణి, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ నెల 2వ తేదీతో సర్పంచ్ పదవీ కాలం ముగిసిన సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఈ వీడ్కోలు, సన్మాన కార్యక్రమం జరిగింది. పంచాయతీ సెక్రెటరీ కవితా రాణి, సచివాలయం స్టాఫ్ కలిసి సర్పంచ్ దంపతులకు దుశ్శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. గత ఐదేళ్లుగా గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి



సోమన్నదొర అందించిన సేవలను ఈ సందర్భంగా సిబ్బంది కొనియాడారు. సచివాలయ వ్యవస్థతో సమన్వయం చేసుకుంటూ పంచాయతీని ప్రగతి పథంలో నడిపించారని వారు పేర్కొన్నారు. తన పదవీ కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ సోమన్నదొర ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## డెంకాడలో "పి.ఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన" ప్రారంభం

- ముఖ్య అతిథిగా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

**డెంకాడ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** పేద కుటుంబాల విద్యుత్ కష్టాలను తీర్చి, వారి ఇళ్లలో వెలుగులు నింపే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "పి.ఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన - ఎస్సీ మరియు ఎస్టీ సోలరైజేషన్ (ఖుూూ వోడల్)" కార్యక్రమాన్ని నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి మంగళవారం డెంకాడ గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపిఈపిడిసిఎల్ చైర్మన్ ఌ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మిడి పృథ్వీతేజ్, ఐ ఏ ఎస్ పాల్గొన్నారు. వీరితో పాటు కూటమి పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు బంటుపల్లి వాసుదేవరావు డెంకాడ ఎం పీ పీ, కంది చంద్రశేఖర రావు మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకులు, పాణి రాజు టీడీపీ సీనియర్ నాయకులు, పల్లె భాస్కరరావు టీడీపీ సీనియర్ నాయకులు, కంది సూర్యనారాయణ జనసేన పార్టీ సీనియర్ నాయకులు, సిరికి అప్పారావు డెంకాడ జనసేన సీనియర్ నాయకులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



లోకం నాగ మాధవి మాట్లాడుతూ ప్రతి పేదవాడి ఇంటికి ఉచిత విద్యుత్ అందించాలనే సంకల్పంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉంది. ఈ సోలార్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం పూర్తిగా తగ్గుతుంది," అని ఆమె పేర్కొన్నారు.

ఏ పి ఈ పి డి సి ఎల్ ఎం డి ఇమ్మిడి పృథ్వీతేజ్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు అందే రాయితీలు మరియు సోలార్ ప్యానెల్స్ అమరిక వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ మువ్వల లక్ష్మణరావు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపై సోము వీర్రాజు వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

బహిరంగ క్షమాపణ చెప్పాలి : సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

**కంచరపాలెం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఐదేళ్లుగా ఉద్యమిస్తున్న కార్మికులు, కమ్యూనిస్టుల పట్ల బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన నీతి బాహ్యమైన, అనుచిత విమర్శలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. స్టీల్ ప్లాంట్ ఉద్యమం చేస్తున్నవారికి మేత అందక నిరాహారదీక్షలు చేస్తున్నట్లు మాట్లాడ్డంపై ఆ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ మేరకు మద్దిలపాలెంలోని ఏచూరి భవన్ (సిపిఎం జిల్లా కార్యాలయం)లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం మాట్లాడుతూ కమ్యూనిస్టులు, కార్మికుల సుదీర్ఘ పోరాటంతో స్టీల్ ప్లాంట్లో ఒక్క శాతం కూడా అమ్మలేక పోయామన్న అక్కసు వీర్రాజు మాటల్లో కన్పించిందని ఎద్దేవాచేశారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగిపోయిందని చెబుతున్న ఆయన, ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు మోడీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగిపోతే పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ విభాగాల ఆధునీకరణకు ఎందుకు నిధులు ఇవ్వడంలేదని అన్నారు. స్టీల్ ప్లాంట్ పెట్టని ప్రయివేటు మిట్టల్ స్టీల్ కు గనులు కేటాయించి, ప్రభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్ కు సొంత గనులు ఎందుకు ఇవ్వడం లేదో వీర్రాజు సమాధానం చెప్పాలన్నారు. కార్పొరేట్ సంస్థలు, మిట్టల్ వంటి ప్రయివేటు కంపెనీలు ఇస్తున్న డబ్బులు, కమీషన్లకు కక్కుర్తిపడి, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న



కమ్యూనిస్టులపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా ఏ రోజైనా స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, సొంత గనులు కేటాయింపు, ప్రత్యేక హటరీదా, పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు రాయితీలు, జీతాల్లో కోత వంటి అంశాలపై ఏనాడైనా సోము వీర్రాజు మాట్లాడారా అని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ భూములను అదానీ, అంబానీ, మిట్టల్ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి కమ్యూనిస్టులు అడ్డుపడుతున్నారన్న కసి వీర్రాజు మాటల్లో వ్యక్తమయ్యాయని అన్నారు. వినియోగంలోలేని అదానీ, గూగుల్ కు కేటాయించిన భూములను స్వాధీనం చేసుకోవాలని కమ్యూనిస్టులు పట్టుబట్టడంతో తట్టుకోలేక ఇటువంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పోరాటంతోనే విశాఖ పోర్టు ఆస్పత్రి లీజు ఆపగలిగామని గుర్తు చేశారు. దేశభక్తి ముసుగులో విద్రోహ చర్యలకు పాల్పడ్డం బిజెపికి అలవాటేనని అన్నారు. మూతి తడుపుకొనే అలవాటున్న వీర్రాజుకు డబ్బులు రావడం లేదనే బాధతోనే కమ్యూనిస్టులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ కె ఎస్ వి కుమార్, బి గంగారావు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకం

**చీడికాడ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** గ్రామపంచాయతీలకు సర్పంచులకు పదవి కాలం ఈనెల 2 తో ముగిసింది దీంతో గ్రామ పంచాయతీ లకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు మండల ప్రత్యేక అధికారి మూర్తి తెలిపారు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చీడికాడ, తురువోలు జి కొత్తపల్లి గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాదికారిగా ఎంపీడీవో హేమ సుందర్ అప్పలరాజు పురం ఖండివరం కోణం పంచాయతీల కు ప్రత్యేక అధికారిగా తహసిల్దార్ కిషోర్ లింకన్ చెట్టుపల్లి వీరభద్ర పేట దండిసురవరం గ్రామాలకు ఆర్ డబ్ల్యూఎస్ జెఇ కనకమ్మ అర్జునగిరి సిరిజాం జైతవరం గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ సింహగిరి చీడిపల్లి దిబ్బపాలెం బయలు పూడి జేపీ పురం గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో ఎస్ ప్రసన్న కుమార్ చుక్కపల్లి అడివి అగ్రహారం పెదగోగాడ తుని వలస గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో గుర్రం కోటేశ్వరరావు బి సింగవరం ఎల్బీ పట్నం మంచాల గ్రామాలకు ప్రత్యేక అధికారిగా మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి నియమించినట్లు మండల ప్రత్యేక అధికారి మూర్తి తెలిపారు

## అలరించిన వీణ కచేరి



**విజయనగరం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** విజయనగరం కొత్తగ్రహారంలోని రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుస్తున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ లో మంగళవారం సాయంత్రం హైదరాబాద్ కి చెందిన ప్రఖ్యాత వీణ విద్వాంసులు, కేంద్రం సంగీత నాటక అకాడమీ అవార్డ్ గ్రహీత అయ్యగారి శ్యామ సుందరం వీణ కచేరితో కూడిన సోదాహరణ ప్రసంగం ప్రతిభావంతంగా సాగి అలరించింది. శాస్త్రీయ సంగీతం అన్నిటికి మూలమని అలాగే వీణ, మృదంగం, వేణువు ప్రాచీన వాయిద్యాలని చెబుతూ వీణపై కృతులు వాయించి వాటి విశేషాలను, వాయించే పద్ధతులను శ్యాంసుందరం తెలియజేశారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి మృదంగంపై సహకారం అందించారు. సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ కె. ఎ.పద్మప్రియ నిర్వహణలో వీణ విద్యార్థులు ముందుగా ప్రదర్శనలు ఇచ్చారు.శ్రీధామ మృదంగంపై సహకరించారు. అనంతరం వైణిక దంపతులు శ్యామ సుందరం, జయలక్ష్మిలను అకాడమీ "శ్రీ వీణావాదన వాగర్ధ" అనే బిరుదుతో ఘనంగా సత్కరించింది. డి ఎన్ ఆర్ స్కూల్ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్ రావు, అధ్యాపకులు మోదెలకుర్తి వెంకట కామేశ్వర రావు, సతీష్, మంగతాయారు, శిరీష, మహేశ్వర రావు, శారద, నగరంలోని వివిధ సంగీత పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు, అధ్యాపకులు, స్థానిక కళాకారులతో పాటు అయ్యగారి రాఘవరావు, రోటీరియన్లు హాజరయ్యారు.

## సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి షియాజ్ ఖాన్



**నర్సీపట్నం రూరల్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** నర్సీపట్నం సివిల్ జడ్జి ( సీనియర్ డివిజన్) పి షియాజ్ ఖాన్ మంగళవారం నర్సీపట్నం సబ్ జైలును సందర్శిం చారు. సబ్ జైలులోని ఖైదీలతో ఆయన మాట్లాడి వారి సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు రెగ్యులర్ గా వస్తున్నారా? మంచి భోజనం అందిస్తున్నారా? ఇక్కడ వసతులు ఏ విధంగా ఉంటున్నాయి అనే విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. కేసు వాదించడానికి లాయర్ ను పెట్టుకునే స్తోమత లేని వారు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కి తెలియజేస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందించే ఆహారాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల చరిత్రను నేటి తరానికి తెలియజేయాలి

### - ఏయూ శతాబ్ది సాహితీ మహోత్సవంలో పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్




**కంచరపాలెం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ళ చరిత్రను పుస్తక రూపంలో తీసుకొని వచ్చి, ఏయూకి సంబంధించిన మ్యూజియం ఏర్పాటు చేసి నేటి తరానికి తెలియజేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ సూచించారు. మంగళవారం ఉదయం ఏయూలోని లా కళాశాల ఎదురుగా గల రామనేని కోదండ రామయ్య భవనములో ఏయూ శతాబ్ది సాహితీ మహోత్సవంలో భాగంగా ఏర్పాటుచేసిన కవిసమ్మేళనం అవధానం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహోత్సవాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఏయూ చరిత్ర పుస్తకం, మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రస్తుత విసి రాజశేఖర్ తీసుకుంటే బాగుంటుందన్నారు. ఇప్పటికే తాము తెలుగు సాహిత్యంపై ఓ మ్యూజియంను కైలాసగిరి పై ఏర్పాటు చేశామని, ఔత్సాహికులు సందర్శించ వచ్చని తెలిపారు. ఏ యూ తో తనకు 53 ఏళ్ల ప్రత్యేక అనుబంధం ఉందని, 1972 నుండి నేటి వరకు ప్రయాణం సాగిస్తున్నానన్నారు. ఒకరకంగా తాను ఎంతో అదృష్టవంతుడినని, విద్యార్థిగా, పరిశోధ కుడిగా, అధ్యాపకుడిగా తన ప్రస్థానం ఏయూలో కొనసాగడం గర్వంగా ఉందని చెప్పారు. ఆనాటి కట్టమంచి అడుగుజాడల్లో నేడు ఏయూ సంపూర్ణ విద్యా సంస్థగా రూపుదిద్దుకుంది అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ కులపతిగా ఉన్నప్పుడు ఆర్ట్స్ సైన్స్ కళాశాలలతో పాటు హాస్టల్స్ కు సంపూర్ణ ప్రాధాన్యత లభించిందని గుర్తు చేశారు. ఉత్తమ నవలకు పురస్కారం అందజేయడం అనేది సర్వేపల్లి ప్రారంభించారని తెలిపారు. ఏయూ వేసే ప్రతి అడుగు విద్యార్థికి ఎంతో పవిత్రమైంది అన్నారు. ఏయూలో అభ్యసించడం వలన తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలతో పాటు సంస్కృతం పై కూడా తనకు ప్రావీణ్యం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా సాహితీ మహోత్సవంలో తెలుగు పండితులు, కవులు, రచయితలను సత్కరించడం అభినందనీయం అన్నారు. ఏ యూ వి సి జిపి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా అట్టాడ అప్పలనాయుడు, టీ పతాంజలి శాస్త్రి, గంటేడ గౌరీ నాయుడు, ప్రత్యేక అతిథిగా తెలుగు బోర్డు స్టడీస్ చైర్మన్ నల్ల సత్యనారాయణ, తదితరులు ప్రసంగించారు. అనంతరం తెలుగు సాహిత్య పండితులను అతిథులు ఘనంగా శాలువలతొ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఏయూ తెలుగు శాఖ అధ్యక్షులు జర్రా అప్పారావు, ఆచార్యులు పీ కింగ్, కె రాంబాబు, జాలాది రవి, రచయిత మేడ మస్తాన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ సీకర్స్ నుంచి జాబ్ క్రియేటర్స్ వైపు విద్యార్థులు : ఈ.ఎం.డి.పి కార్యక్రమం



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** విశాఖపట్నం జిల్లా జడ్పీ హై స్కూల్ తోటగరువులో మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ, ఎస్‌సీఈఆర్టీ, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ సంయుక్త ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎంట్రీ ప్రన్యూరియల్ మైండ్సెట్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతితో జిల్లా స్థాయి ప్రోజెక్ట్ ఎక్స్పో విజయవంతంగా నిర్వహించబడింది .ఈ ఎక్స్‌పోలో రాష్ట్ర స్థాయి నుంచి ఎంపికైన 10 ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రదర్శిం చబడ్డాయి. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ఆధారంగా చేసుకుని భవిష్యత్ వ్యాపారవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో ప్రొడక్ట్-బేస్డ్ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, ఉద్యోగాలను సృష్టించే దిశగా ముందుకు సాగాలని విద్యార్థులు తమ నమూనా ప్రాజెక్టుల ద్వారా స్పష్టమైన సందేశాన్ని అందించారు.జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం జెడ్.పి.హెచ్.ఎస్ అగనం పూడి, ద్వితీయ స్థానం జెడ్.పి.హెచ్.ఎస్ వెల్లంకి ప్రాజెక్టులు సాధించాయి. ఈ కార్యక్రమం 9వ తరగతి విద్యార్థులకు ప్రతి శనివారం పాఠశాలలో ఒక పీరియడ్ ద్వారా సెషన్‌ల రూపంలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి సృజనాత్మక పరిష్కారాలను అందించే విధంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ప్రస్తుతం ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం మాత్రమే చదువుతున్న నేపథ్యంలో, దేశానికి అవసరమైన జాబ్ క్రియేటర్స్ ను తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి సి.హెచ్. రవీంద్ర బాబు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లక్ష్మి, జిల్లా సైన్స్ అధికారి రాజారావు, జిల్లా మేనేజర్ కె. నరేష్, స్టేట్ లీడ్ సుశాంత్ పాల్గొన్నారు. జ్యూరీ సభ్యులుగా డైట్ లెక్చరర్ శ్రీధర్, శ్రావణ్, నాగేశ్వరరావు (కృష్ణా కాలేజ్) పాల్గొని ప్రాజెక్టులను పరిశీలించి ప్రథమ, ద్వితీయ స్థానాలను నిర్ణయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన అకాడమిక్ ఆడిట్..చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 'ఏ' గ్రేడ్



**చింతపల్లి , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ (సీసీఈ) మార్గదర్శకాల ప్రకారం నిర్వహించిన అకాడమిక్ ఆడిట్ విజయవంతంగా పూర్తయింది. 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు గాను జరిగిన ఈ తనిఖీలలో కళాశాల అత్యుత్తమ పనితీరు కనబరిచి 'ఏ' గ్రేడ్ కైవసం చేసుకుంది. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ టి.ఎన్. రసూల్, ఇంగ్లీషు లెక్చరర్ పి. కోటేశ్వరరావు ఆడిట్ పర్యవేక్షకులుగా విచ్చేశారు. వారు కళాశాలలోని వివిధ విభాగాలను సందర్శించి, అకడమిక్ రికార్డులు, బోధనా పద్ధతులు మరియు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రికార్డులను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని మరియు నాక్ (ఎన్ఏఏసి) ఫార్మాట్‌లకు అనుగుణంగా విద్యా ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. కళాశాలకు 'ఏ' గ్రేడ్ రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ, దీనికి కృషి చేసిన అధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాస పాత్రుడు, కోఆర్డినేటర్ డాక్టర్ వి. రమణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె. సంతోషి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## స్థానిక 35వ వార్డు, నీలమాంబ ఆలయం వెనక పేరుకుపోయిన డెబ్రిస్..చోద్యం చూస్తున్న శానిటేషన్ సిబ్బంది

**కంచరపాలెం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** స్థానిక 35వ వార్డు, వేలంపేట శ్రీ నీలమాంబ అమ్మవారి గుడి వెనక రహదారి సందులో డెబ్రిస్ పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయం వెనుక మార్గాన్ని మూసివేసి బిల్డింగ్ పనులకు సంబంధించి చెత్తాచెదారం వేసి డ్రైనేజి నీరు బయటికి వెళ్లకుండా రహదారి మొత్తం మూసి వేశారు. దీంతో చెత్తాచెదారం నిండిపోయి దోమలతో పాటు దుర్వాసన వెదజల్లుతుండడంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని వారంతా గగోలు పెడుతున్నారు. స్థానికులు ఎన్నిసార్లు శానిటేషన్ సిబందికి మొరపెట్టుకున్న పట్టించుకోకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అక్కడ ఉన్న బిల్డింగ్ పక్కకు ఒరిగిపోయిన సందర్భంగా రిపేర్లు చేయిస్తున్న వేస్ట్ మెటీరియల్ ను ఈ బిల్డింగ్ వెనక ఉన్న సందులో వేస్తుండడం గమనార్హం. దీంతో ఆ సందులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడం సమస్యగా మారింది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు కలుగచేసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉపాధి హామీ నిధులు విడుదలపై సమగ్ర విచారణ నిర్వహించాలని సీపిఎం పార్టీ డిమాండ్

### - అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం పేరుతో 650 కోట్ల ప్రజాధనం దోపిడీ..అధికారులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కు



**పాడేరు టౌన్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వంతలా దాస్ తో కలసి పాడేరు కార్యాలయం లో పార్టీ జిల్లా కార్యదర్శి పి. అప్పల నరస నిర్వహించిన పత్రికా సమావేశం లో మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు జిల్లా మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యాలు లేకపోవడంతో అంబులెన్స్‌లు కూడా చేరుకోలేని దారుణ స్థితి నెలకొని ఉందని అన్నారు. డోలీ మోతలతో ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు సకాలంలో చేర్చలేక ఆదివాసి రోగులు మృతి చెందుతున్నారు. ఈ ఆక్రందనను దృష్టిలో ఉంచుకుని, గిరిజనులకు రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం (ఎం జి ఎన్ ఆర్ ఇ జి ఎస్ ) కింద సుమారు 650 కోట్ల రూపాయల విలువైన రోడ్ల పనులు మంజూరు చేసిందని అన్నారు. కానీ ఈ నిధులు సరైన విధంగా వినియోగపడకుండా తీవ్ర అక్రమాలు జరిగాయని సీ. పి. ఎం పార్టీ ఆరోపిస్తోందని అన్నారు. జిల్లా అధికారులు కావాల్సిన వారికి మాత్రమే పనులు అప్పగించారు. పనులు ప్రారంభం కాకముందే అడ్వాన్స్ పేరుతో రాత్రికి రాత్రే బిల్లులు చెల్లించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి 'వీబీ జీ రామ్ జీ' (వి బి -జి రామ్ జి ) పథకాన్ని ప్రారంభించడంతో, ఉపాధి హామీ యాప్‌ను క్లోజ్ చేస్తున్నారని పేరుతో పనులు జరగకుండానే బిల్లులు అప్‌లోడ్ చేశారు. రోడ్లు పూర్తి కాకముందే బిల్లులు చెల్లించడం జరిగిందని అన్నారు. ఇటీవలి కాలంలో సుమారు 1000 ఎఫ్ టీ ఓ లు జనరేట్ అయ్యాయని తెలిపారు. ఆర్థిక సంవత్సరం చివరి కావడంతో జిల్లా అధికారులకు అత్యంత సన్నిహితులైన పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులన్నీ మంజూరు చేశారు. గతంలో జనరేట్ చేసిన ఎఫ్ టీ ఓ లను నిధులు లేవని పేరుతో క్యాన్సిల్ చేశారు. ఫలితంగా సుమారు 300 మంది చిన్న చిన్న కాంట్రాక్టర్లు (పది లక్షల వరకు పనులు చేసుకున్నవారు) బిల్లులు అందకుండా రోడ్డు మీద తిరుగుతున్నారు. వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డ్వామా కార్యాలయంలో ఎఫ్ టీ ఓ లు జనరేట్ చేయడానికి కూడా డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని, కమిషన్ కక్కుర్తితో గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, డ్వామా అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని పార్టీ ఆరోపించిందని అన్నారు. ఫలితంగా నాణ్యతలేని రోడ్ల నిర్మాణం జరుగుతున్నాయి. వచ్చే వర్షాకాలంలో ఈ రోడ్లన్నీ మరమ్మత్తుకు గురవుతాయని స్పష్టం. 650 కోట్ల ప్రజాధనాన్ని కొంతమంది కాంట్రాక్టర్లు, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై దోచుకుంటున్నారు. ప్రభుత్వ పెద్దల పేర్లను ఉపయోగించుకుని అక్రమాలు జరుపుతున్నారు. 1. ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు, ఎఫ్ టీ ఓ ల జనరేషన్‌లో జరిగిన అక్రమాలపై వెంటనే సమగ్ర విచారణ జరపాలి. 2. అక్రమాలకు పాల్పడిన జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులను సస్పెండ్ చేయాలి. 3. పనులు చేయకుండా లేదా నాణ్యతలేని రోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేయాలి. 4. చెల్లించిన అన్ని బిల్లుల నగదును రికవరీ చేయాలి. 5. గిరిజన ప్రాంతాల్లో నిజమైన అభివృద్ధి పనులు సకాలంలో, నాణ్యతగా పూర్తి చేయాలి. ఈ దారుణమైన అక్రమాలు కొనసాగితే గిరిజనుల హక్కులు కాలరావడమే కాక, ప్రభుత్వ పథకాలపై ప్రజల విశ్వాసం కోల్పోతారని పార్టీ హెచ్చరించిందని తెలిపారు . ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 కు 75 రోజుల కౌంట్ డౌన్



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026 కు 75 రోజుల కౌంట్‌అడౌన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులమేరకు మంగళవారం విశాఖపట్నం తపాలా డివిజన్, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ కార్యాలయంలో "వై-బ్రిక్ ఏ చర్కప్లీస్" బ్రహ్మకుమారిస్ సంస్థచే యోగా సెషన్ విజయవంతంగా నిర్వహించ బడింది .ఈ కార్యక్రమం ఉద్యోగులలో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, పనితీరు మెరుగుపరచడం లక్ష్యంగా యోగా ప్రాముఖ్యతను తెలియజేయడానికి నిర్వహించబడింది. తపాలా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆఫీస్ వాతావరణంలో సులభంగా చేయగలిగే తక్కువ సమయపు యోగా విధానమైన "వై-బ్రేక్" ప్రోటోకాల్ ఈ సందర్భంగా అభ్యసించారు. ఇది ఉద్యోగులు తమ పనివేళల్లోనే అనుసరించగలిగే విధంగా రూపొందించబడింది. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన పనిసంస్కృతిని పెంపొందించడంలో ఒత్తిడిని తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. విశాఖపట్నం పోస్టల్ డివిజన్, అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 వరకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉందని విశాఖపట్నం తపాలా డివిజన్ పోస్ట్ ఆఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్.వి.ఎస్.ఎన్.రాజు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో ఎన్టీఆర్ ఆరోగ్య సేవకు పెరిగిన రోగుల సంఖ్య

- ప్రైవేట్ ఆస్పత్రులలో బంద్రైన ఎన్టీఆర్ వైద్య సేవ
- ఇక్కట్లకు గురవుతున్న పేద రోగులు
- జిల్లా ఆస్పత్రిలో భారీగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు
- రోగులతో కిటకిటలాడిన అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి



**అనకాపల్లి రూరల్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లాలో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా విస్తృతంగా సస్త్ర చికిత్స వైద్యులు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా ప్రైవేటు ఆసుపత్రులకు ప్రభుత్వం నిధులు విడుదలచేయకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య సేవలను నిలుపుదల చేశాయి. దీంతో శస్త్ర చికిత్సలు అవసరమైన వారు ప్రభుత్వ ఆసుపత్రులకు క్యూ కట్టారు. సుమారు మూడు వేలకు పైగా రోగాలకు ఈ పథకంలో భాగంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో ఉన్న ఎన్టీఆర్ వైద్య సేవకు ప్రత్యేక విభాగం నిరంతరం పనిచేయడం విశేషం. ప్రతి నెల స్థానిక ఆసుపత్రిలో తొమ్మిది వందలు వరకు ఎన్టీఆర్ వైద్య సేవలు ద్వారా చికిత్సలు అందించేవారు. అందులో భాగంగా ఈ నెలలో భారీగా రోగులు ఎన్టీఆర్ వైద్య సేవలు కోసం స్థానిక ఆసుపత్రికి పోటె త్తారు. రోగుల పరిస్థితి లేదా సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా ముఖ్యంగా జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త (డి సి హెచ్ ఎస్) డాక్టర్ సంబాన శ్రీనివాసరావు పర్యవేక్షణలో, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో రోగులకు ఎటు వంటి సమస్యలు తలెత్తకుండా అధికంగా వస్తున్న రోగుల సంఖ్య ను ఆధా రంగా చేసుకొని ముందస్తు చర్యలు తీసు కొని సేవలు నిరంతరం అందించడం పట్ల అన కాపల్లి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. మరిన్ని జబ్బులను ఈ పథకం పరిధిలోకి తీసుకొచ్చి పేద రోగులకు వైద్య సేవలు అందించాలని రోగులు కోరుతు న్నారు. ఈ విషయంపై జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ సంబాన శ్రీనివా సరావును వివరణ కోరగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్,ఎంపీ సీఎం రమేష్, ఎమ్మె ల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి ఎదురైన సమస్యలను, సౌకర్యాలు కోసం తీసుకు వెళ్లగా వారు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడంతో మెరుగైన సేవలు అందించ గలిగాము. ఇందుకోసం టీం వర్క్ చేసాము.



## నేడు విశాఖకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాక

- ఏయూ శతాబ్ది వేడుకల్లో పాల్గొననున్న పవన్ కల్యాణ్



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ బుధవారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. దీనిలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న శతాబ్ది వేడుకల్లో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.15 గంటలకు మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. ?అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 5 గంటలకు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఆంధ్రా యూనివర్సిటీకి చేరుకుంటారు.?ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించే “శతాబ్ది మహోత్సవ్ – ఏయూ మెగా కల్చరల్ ఫెస్ట్ 2026” వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ నుంచి విమానాశ్రయానికి అక్కడ నుంచి విజయవాడ తిరుగు పయనమవుతారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ తగిన ఏర్పాట్లు పూర్తి చేశాయి.

## ఎస్. రాయవరం మండలం లోని 28 పంచాయితీలు కు ప్రత్యేక అధికారులు నియమాకం



**ఎస్. రాయవరం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఎస్. రాయవరం మండలంలో 28 పంచాయితీల పాలకవర్గాల పదవీకాలం ముగియుటంతో ప్రత్యేక అధికారులునునియమిస్తూ జిల్లా కలెక్టరుఆదేశాలు జారీచేసినట్లు ఎంపిడిఓ పి మీనాకుమారి తెలిపారు.ఎస్. రాయవరం, సర్వసిద్ధి, సైతారుపేట, జెవిపాలెం పంచాయతీలకు ప్రత్యేకాధికారిగా ఎంపిడిఓ మీనాకుమారి, రామయ్య పట్నం, పెట్టు గోళ్ళపల్లి, వాకపాడు, ఉప్పరాపల్లి పంచాయితీలకు తహశీల్దారు జె. రమేష్ బాబు ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు.ఇరిగేషన్ ఎ ఇ ఎ ఎ భాను గుర్రాజుపేట, గుడివాడ,పేట సూదీ పురం, పంచాయితీలుకు, ఎంపిడిఓ కార్యాలయ ఎఓ కె.రమేష్ బాబు గెడ్డపాలెం,కోరుప్రోలు, వొమ్మవరం పంచాయతీ లకు,పెద్ద ఉప్పలం, రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం కు డిప్యూటి తహశీల్దారు నీరజ నియమితులయ్యారు.డిప్యూటీ ఎంపిడిఓ సతీష కుమార్ వేమగిరి, ధర్మవరం, పెనుగొల్లు, పెద్దగు మ్మాలూరు పంచాయితీలకు, డిప్యూటీ ఎంపిడిఓ సత్యనారాయణ భీమవరం, తిమ్మాపురం, దార్లపూడి, చిన్నగుమ్మాలూరు పంచాయితీలకు, మండలవ్యవ సాయాదికారి సౌజన్య క్రివానిపాలెం, వెంకటాపురం, లింగరాజుపాలెం పంచాయితీలకు ప్రత్యేక అధికా రులుగా నియమితులైనట్లు ఎంపిడిఓ తెలిపారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఆందినట్లు తెలిపారు.

## రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



**రోలుగుంట , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా రోలుగుంట ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీఎచ్సి)లో మంగళవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి శ్రావణి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఈవెంట్లో “ఆరోగ్యం కోసం కలిసి పనిచేద్దాం విజ్ఞానానికి అండగా నిలుద్దాం” అనే నినాదంతో అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారిణి శ్రావణి మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి పౌష్టికాహారం తీసుకోవాలని, రోజూ వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సలహా ఇచ్చారు. ఆరోగ్య సంబంధిత సమస్యల నివారణకు ఈ ర్యాలీ ద్వారా స్థానికులలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్వోలు గోవింద, కృష్ణ, హెచ్ఎస్ షాజహాన్, హెచ్వి వరహాలమ్మ, ఎంఎలాచ్పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమూహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆరోగ్య అవగాహన పెంపులో ముఖ్య పాత్ర పోషించింది.

## ఐదు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సర్పంచ్లను ఘనంగా సన్మానించిన కరణం ధర్మశ్రీ మరియు బొడ్డేడు ప్రసాద్



**అచ్చుతాపురం, ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అచ్చుతాపురం మండలం వైస్సార్సీపీ మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాలయం లో, లిఐదు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు ఘన సన్మానం – ముఖ్య అతిథిగా కరణం ధర్మశ్రీ,బొడ్డేడ ప్రసాద్ , ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్సీపీ మాజీ ప్రభుత్వ విప్, పిఏసి సభ్యులు, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ,వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ ,హాజరై సర్పంచులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు..బిఈ కార్యక్రమంలో అచ్యుతాపురం ఌ మునగపక మండలా లా మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు , ఆడారి అచ్చింనాయుడు , జడ్పిటిసి సభ్యులు లాలం రాంబాబు ,పెంటకోట సోము సత్యనారాయణ, కో జడ్పిటిసి సభ్యులు నర్మాల కుమార్ , ఎంపీపీ సభ్యులు కోన సంధ్య బుజ్జి , రెండు మండలాలహొహొముఖ్య నాయకులు, రెండు మండలాల సర్పంచ్ సభ్యులు నూతనంగా ఏర్పాటు అయినటువంటి వివిధ విభాగాలు, అనుబంధ విభాగాల సభ్యులు, సోషల్ మీడియా సభ్యులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఈ కార్యక్రమం పాల్గొని గ్రామ సర్పంచ్ లను ఘనంగా సత్కరించడం జరిగింది.

## ఎల్-నినో దృష్ట్యా ముందస్తు సన్నాహాలు చేపట్టాలి : రైతు సాధికార సంస్థ సూచనలు



**పాడేరు , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** రానున్న రోజుల్లో ఎల్-నినో ప్రభావం వల్ల వర్షపాతం లోపం , వాతావరణ మార్పు లు సంభవించే అవకాశాలున్న నేపథ్యంలో, వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం పడకుండా ముందస్తు సన్నాహాలు చేపట్టాలని రైతు సాధికార సంస్థ సూచించింది. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. బాబురావు నాయుడు , జిల్లా ప్రాజెక్టు అధికారి లాలం భాస్కర్ రావు పాల్గొని, ఎల్-నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన పంట విధానాలు మరియు జాగ్రత్తలపై వివరించారు. వారు మాట్లాడుతూ, రైతులు పంటల ఎంపికలో మార్పులు చేసుకొని, తక్కువ నీటితో సాగు చేసే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రకృతి వ్యవసాయం పద్ధతులను విస్తృతంగా అనుసరించాలని సూచించారు. అదేవిధంగా విత్తనాల ముందస్తు నిల్వలు, పీఎండీఎస్ పద్ధతులు పాటించడం ద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొవచ్చని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆరు ఐటిడిఏల డీపిఎంలు , రైతు సాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐదు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న మునగపాక సర్పంచులకు ఘన సన్మానం..ముఖ్య అతిథిగా కరణం ధర్మశ్రీ,బొడ్డేడ ప్రసాద్



**మునగపాక , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** బివైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గంలోని మునగపాక కుచెందిన గ్రామ సర్పంచులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేసి ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందన సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్సీపీ మాజీ ప్రభుత్వ విప్, పిఏసిసభ్యులు, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ హాజరై సర్పంచులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామస్థాయిలో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు అవుతూ,గ్రామాల్లో గ్రామ సచివాలయం వ్యవస్థ,రైతు భరోసా కేంద్రాలు,విలేజ్ హెల్త్ క్లినిక్,రూపురేఖలు మారుతున్నాయని అన్నారు.సర్పంచులు ప్రజలకు చేరువగా ఉండి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు అభినందనలు తెలిపారు. బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నాయకత్వం పార్టీకి బలమైన పునాది అని,సర్పంచులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేసిన తీరు ప్రశంసనీయమని అన్నారు.రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మునగపాక జడ్పిటిసి సభ్యులు పెంటకోట స్వామి సత్యనారాయణ, మునగపాక మండల వైఎస్ఆర్పిపి అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చయ్య నాయుడు, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పల నాయుడు, వెంకటాపురం సర్పంచ్ సుందరపు నీలకంఠ స్వామి, వైసిపి నేతలు దాసరి అప్పారావు, క్రరీ వెంకట సత్యనారాయణ మల్లవరం సర్పంచ్, గణపతి సర్పంచ్ సదరం గణేష్ నాయుడుపాల్గొన్నారు.



## పంచాయతీ కార్యదర్శుల పే స్కేల్ తగ్గింపు పై నిరసన

- ఎంపీడీవో రామకృష్ణ రాజు కు వినతి పత్రం అందజేసిన పిడిఓ లు



**నెల్లిమర్ల , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** పంచాయితీ కార్యదర్శులకు పే స్కేల్ తగ్గించడం అన్యాయమని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 60 ద్వారా పంచాయతీ కార్యదర్శుల పే స్కేల్ను తగ్గించడాన్ని నిరసిస్తూ మండల పంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పే స్కేల్ తగ్గించడం దారుణమన్నారు. ముఖ్యంగా గతంలో జీవో 91 ప్రకారం గ్రేడ్-5 కార్యదర్శుల బేసిక్ పేను 28,280గా నిర్ణయించి, ఇప్పుడు జీవో 60 ద్వారా దానిని 25,220కు తగ్గించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అధిక పనిభారంతో సేవలందిస్తున్న తమపై ఆర్థిక భారం మోపడం సరికాదని, తక్షణమే పాత పే స్కేల్ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని పంచాయతీ అధికారులు కోరారు.వినతి పత్రం అందజేసిన వారిలో పి డి ఓ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎల్. తౌడు,ఎపి ఎన్ జి ఓ అసోసియేషన్ తాలూక జనరల్ సెక్రటరీ మోహన్ రావు, పి డి ఓ లు వెంకటేష్, శ్రీదేవి,వరలక్ష్మి, జాకీర్, సుమ, వెంకటలక్ష్మి,విష్ణు, శ్రీనివాస్ ఉన్నారు.

## చెరువులు పునరుద్ధరణతోనే భూగర్భ జలాల పెంపు సాధ్యం

- నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత” కార్యక్రమం ఘనంగా ప్రారంభం
- రైతులకు దీర్ఘకాలిక సాగునీటి భద్రత లభిస్తుంది.
- టిడిపి నేత కిమిడి నాగార్జున



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07 :** చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాల స్థాయిని గణనీయంగా పెంచవచ్చని, దీని వల్ల రైతులకు స్థిరమైన సాగునీటి వనరులు అందుబాటులోకి వస్తాయని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్, టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున పేర్కొన్నారు.సోమవారం గజపతి నగరం నియోజకవర్గంలోని గంట్యాడ మండలం నరవ గ్రామంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన “నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత” కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు .ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ,ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వనరుల సంరక్షణ అత్యంత అవసరమని, చెరువులు, కాలువలు పునరుద్ధరిం చడం ద్వారా వర్షపు నీటిని నిల్వచేసి భూగర్భ జలాలను పెంపొందించవచ్చని తెలిపారు. రైతులు, సాగునీటి సంఘాలు కలిసి పనిచేస్తే మాత్రమే నీటి సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.అలాగే, ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, ప్రతి గ్రామంలో నీటి నిర్వహణపై అవగాహన పెరగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గంట్యాడ మండల టిడిపి అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, సుంకర సాయి కృష్ణ, తాటిపూడి నీటి సంఘం అధ్యక్షులు జగన్నాధం, నీటి పారుదల శాఖ అధికారులు రామునాయుడు, శంకరరావు, శ్యామ్, విజయ్ కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి జనతా వారధి ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి : కేఎన్ఆర్



**గాజువాక , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** గాజువాక మండలం ఫకీర్తకియా రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 102/1,2 లో పేదలకు 1995 వ సంవత్సరంలో గవర్నమెంట్ ఇల్లు లేని పేదలకు పట్టాలు మంజూరు చేసింది. వారికి ఇచ్చిన స్థలాన్ని సర్వే చేయించి హద్దులు నిర్ణయించి వారి స్థలాన్ని వారికి కేటాయించాలని కోరుతూ బాదితులు వనజా,సింహాచలం తదితరులు బిజేపి జనతా వారధి ద్వారా వినతిపత్రాన్ని మండల అధ్యక్షులు చేబ్రోలు అశోక్ ఆధ్వర్యంలో నియోజకవర్గం కన్వీనర్ రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావుకి (కేఎన్ఆర్) సమర్పించారు. వెంటనే స్పందించిన కేఎన్ఆర్ అశోక్ కలసి వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమస్యను తమ పార్టీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు మరియు రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ దృష్టికి మరియు స్థానిక శాసనసభ్యులు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు దృష్టికి తీసుకు వెల్లి , సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరిస్తామని వారికి బిజేపి తరపున హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాదితులు సింహాచలం ,జయసుధ, రమనమ్మ, రామకృష్ణ ,బానుమతి తదితరులు బిజేపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆంధ్ర-ఒడిస్సా ఎక్సైజ్ పోలీసులు ఆధ్వర్యంలో సరిహద్దు నాటు సారా తయారీ కేంద్రాలపై భారీగా పోలీసులతో దాడులు



**జియ్యమ్మవలన , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** నవోదయం 2.0 కార్యక్రమంలో అమలు లో భాగంగా పార్వతీ పురం మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ బి. శ్రీనాథుడు ఆదేశములు మేరకు ఏ. సంతోష్ ఏ ఇ ఎస్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దులో గల నాటు సారా తయారీ స్థావరాలు కలిగిన సందుబడి గ్రామంలో ఒడిస్సా ఎక్సైజ్ శాఖ తో కలిసి సంయుక్త దాడులు నిర్వహించి నట్లు కురుపాం ప్రొహిబిషన్ ఌ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్,పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 26,000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. అదే విధంగా రవాణా కు సిద్ధంగా ఉంచిన 420 లీటర్ల నాటు సారాను , 50 కేజీలు అమ్మోనియా ను స్వాధీనం చేసుకునీ వాటితో సంబంధం ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి ఒడిస్సా ఎక్సైజ్ అధికారులకు అప్పగించామని తెలిపారు. ఈ దాడుల్లో పార్వతీపురం టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ వి.వి.ఎస్. శేఖర్ బాబు,బోర్డర్ మొబైల్ పార్టీ పాలకొండ, సీతానగరం, రాజాం, చీపురుపల్లి, ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది, విజయనగరం ఎన్ఫోర్స్ మెంట్ సిబ్బంది, కురుపాం స్టేషన్ ఎస్.ఐ , జే. రాజశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారని తెలియజేసారు. నాటు సారా పై సరిహద్దులో నిరంతర నిఘా పెడుతున్నామని , ఈ క్రమంలో ప్రజలు నాటు సారా తయారీ - రవాణా - అమ్మకాలు చేసే వారిపై ఫిర్యాదులు 6302936599 ఫోన్ నెంబర్ కు తెలియజేయాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని,శ్రీనివాసరావు తెలిపారు.

## మెడికల్ ఇన్సురెన్స్ పాత పద్ధతిలోనే కొనసాగించాలి




**గాజువాక , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** 21 వేల మంది స్టీల్ విశ్రాంతి ఉద్యోగులకు మెడికల్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం పాత పద్ధతిలోనే కొనసాగించాలని జిల్లా సిఐటియు నాయకులు ఎన్ రామారావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నేడు ఉక్కు ప్రధాన పరిపాలన భవనం ఎదుట విశ్రాంతి స్టీల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో “మెడికల్ ఇన్స్యూరెన్స్ పెంపును వ్యతిరేకిస్తూ”నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఎన్ రామారావు మాట్లాడుతూ స్టీల్ విశ్రాంతి ఉద్యోగులపై నేడు స్టీలు యాజమాన్యం మెడికల్ ఇన్స్యూరెన్స్ పెంపుతో మరింత ఆర్థిక భారాన్ని వేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ పరిశ్రమ విస్తరణకు, అభివృద్ధికి కీలక భూమిక పోషించిన వారి పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని ఆయన తప్పు పట్టారు. ఈ సమస్యను స్థానిక పార్లమెంటు సభ్యులు స్టీల్ మంత్రి గారి దృష్టికి తీసుకువెల్లిన, స్థానిక శాసనసభ్యులు డైరెక్టర్ (పర్సనల్) వారితో స్వయంగా మాట్లాడిన యాజమాన్యం ఏకపక్షంగా సర్కులర్ విడుదల చేసిందని ఆయన వివరించారు. గతంలో 1300 ఒక్కొక్కరికి చెల్లించేవారు కానీ అది నేడు 8512 గా పెంచారని ఆయన అన్నారు. కనుక ఈ సర్కులర్ ను తక్షణం ఉపసంహరించుకొని పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి డి ఆదినారాయణ, జె అయోధ్య రామ్, సంపూర్ణం మాట్లాడుతూ ఈ ప్రతిపాదనను స్టీల్ బోర్డు వ్యతిరేకించిన, స్థానిక శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు వద్దని వారించిన స్టీల్ యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయించడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. వీరికి పెన్షన్ సుమారు 1000 రూపాయల నుండి 3 వేల రూపాయల వరకు మాత్రమే వస్తోందని ఇంత భారీ ఎత్తున మెడికల్ ఇన్స్యూరెన్స్ కు చెల్లించడం కష్టసాధ్యమని వారు వివరించారు. దేశంలో సీనియర్ సిటిజనులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యం అందించేందుకు అనేక రాయితీలు కల్పిస్తుంటే స్టీల్ యాజమాన్యం వారి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి వారు తప్పు పట్టారు. ఇప్పటికైనా స్టీల్ యాజమాన్యం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ విశ్రాంతి ఉద్యోగులు ఎం కృష్ణారావు, వైటి దాస్, పెద్దిరాజు, విశ్రాంతి అధికారులు శివరాం, టి చిరంజీవి జనసేన రాజు తదితరులతో పాటు అధిక సంఖ్యలో విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు ప్రత్యేక అధికారులు



**కోటవురట్ల , ఏప్రిల్ 07 (మనసులో మాట)** : కోటవురట్ల మండలంలో 25 పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో పంచాయతీలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బీకే పల్లి, రామచంద్రపాలెం, నీలగుంట, జల్లూరు, గ్రామాలకు తనను నియమించినట్లు తెలిపారు. తహసిల్దార్ తిరుమల బాబును లింగాపురం, తంగేడు, కోటవురట్ల గ్రామాలకు ప్రత్యేక అధికారిగా నియమించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఏఈ శ్రీనివాస్ ను పీకే పల్లి,ఎఎస్ పేట, చినబొడ్డేపల్లి పంచాయతీలకు నియమించారన్నారు. మండల పరిషత్ పరిపాలన అధికారి నాగేశ్వరరావును పందూరు, గొట్టివాడ, రామచంద్రపురం పంచాయతీలకు నియమించినట్లు తెలిపారు. డిప్యూటీ తహసిల్దార్ రమేష్ ను పాములవాక బోడుపాలెం రామన్నపాలెం గ్రామాలకు, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావును కొడవటిపూడి, కే వెంకటాపురం టీ జగ్గంపేట పంచాయతీలకు నియమించినట్లు వివరించారు.

## రోలుగుంట మండలంలో 24 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకం



**రోలుగుంట , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం. మండలంలోని వివిధ గ్రామాలకు సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులు నియమించడం జరిగింది. ఈ నియామకంలో భాగంగామండలంలోని ఎం కె పట్నం, బిబి పట్నం, అర్ల గ్రామాలకు వి.ఎస్.నాగేశ్వర రావు (ఎంపీడీఓ), నిడుగొండ, ఎన్.కొత్తూరు, కె. నాయుడుపాలెం గ్రామాలకు కె. చిన్నయ్య పాదల్ (ఆర్ సర్వేయర్ డిప్యూటీ తాసిల్దార్), రత్నంపేట, బుచెంపేట, వడ్డిప గ్రామాలకు ఎం.రమేష్ బాబు (ఏఈఈ, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ డిపార్ట్మెంట్), శరభవరం, కొంతలం, కంచుగుమ్మల గ్రామాలకు ఎస్. లక్ష్మి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఎంపీపీ), జేపీ అగ్రహారం, రొంగలపాలెం, కుషార్లపూడి గ్రామాలకు జె.దుర్గా ప్రసాద్ (డై ఎంపీడీఓ), పాదాలపాలెం, గుండుబాడు, జగ్గంపేట గ్రామాలకు వి.శివ (డై. తాసిల్దార్), జానకిరాంపురం, కొమరవోలు, కొండపాలెం గ్రామాలకు డి. సుబ్బ రావు (డై. ఎంపీడీఓ సజెస్వే), రోలుగుంట, కొవ్వూరు, అడ్డసరం గ్రామాలకు సి. హెచ్. చిరంజీవి (మండల అగ్రికల్చర్ ఆఫీసర్) ప్రత్యేక అధికారులుగా నియమించబడ్డారు. ఈ నియామకాలతో గ్రామీణ పరిపాలనా కార్యకలాపాలు సమర్థవంతంగా జరుగుతాయి.

## మిమ్స్ హోమియో విద్యార్థుల మారథాన్ ర్యాలీ



**నెల్లిమర్ల , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** నెల్లిమర్ల మహారాజు హోమియో వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన విద్యార్థులు మారథాన్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం హోమియో వైద్యంపై అవగాహన కల్పిస్తూ 350మంది విద్యార్థులు మిమ్స్ నుంచి డైట్ కళాశాల వరకు మారథన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల10న హోమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హాని మన్ జయంతి వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా భారతీయ హోమియో సంప్రదాయ జ్ఞానాన్ని శాస్త్రంగా మార్చడం మారథాన్ ముఖ్య ఉద్దేశ్యం మని పేర్కొన్నారు. ఈ ర్యాలీ మిమ్స్ శ్రీరామ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ బి.హెచ్. ప్రవీణ్ వర్మ ఆధ్వర్యంలో మిమ్స్ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ డాక్టర్ డివిఎన్ శ్రీధర్ కార్యనిర్వహణలో హౌస్ సర్జన్లు, అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆక్రమణ చెరలో కొండవాగు

**- పేదోడికి మొండి చేయి.. బడా బాబులకు రెడ్ కార్పెట్!**
**- వాగు భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారికి రెవెన్యూశాఖ ధారదత్తం**
**- సాగునీరందక ఎండుతున్న 4వేల ఎకరాలు**



**నెల్లిమర్ల , ఏప్రిల్ 07 (మనసులో మాట)** : ప్రభుత్వ నిబంధనలు కేవలం సామాన్యులకేనా? పేదవాడు గూడు కోసం అడిగితే 'చెరువులు, వాగులు' కాపాడాలని నీతి పాఠాలు చెప్పే అధికారులు, బడా బాబుల వ్యాపారాలకు మాత్రం రెడ్ కార్పెట్ పరుస్తున్నారా? డెంకాడ మండలం పెదతాడివాడ రెవెన్యూ పరిధిలోని పూడికలపేటలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఇది అక్షర సత్యమనిపిస్తోంది. 60 అడుగుల వెడల్పున్న సహజ సిద్ధమైన గెడ్డను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం మూడు అడుగుల కాలువగా మార్చేసిన వైనం స్థానికంగా కలకలం రేపుతోంది.

**60 అడుగుల గెడ్డ.. 3 అడుగుల దారి!**

అటవీ ప్రాంతంలోని సుమారు 30 వేల ఎకరాల భూమి, కొండలపై నుంచి వచ్చే వర్షపు నీరు ప్రవహించే ఏకైక మార్గం ఈ గెడ్డ. 60 అడుగుల వెడల్పుతో, 30 అడుగుల లోతుతో ఉన్న ఈ సహజ జలవనరు ఇప్పుడు ఆక్రమణ కోరల్లో చిక్కింది. 22 ఎకరాల భారీ రియల్ ఎస్టేట్ లేఅవుట్ కోసం ఈ గెడ్డను ఏకంగా మూడు అడుగులకు కుదించేశారు. కేవలం కల్వర్టు నిర్మిస్తామని అనుమతి పొంది, ఏకంగా గెడ్డను పూడ్చి రోడ్డు వేయడమే కాకుండా చుట్టూ ప్రహరీ గోడను కూడా నిర్మించేశారు.

**ప్రభుత్వ భూమి 'జిరాయితీ'గా ఎలా మారింది?**

ప్రభుత్వ రికార్డుల్లో 'పోరంబోకు'గా ఉన్న ఈ గెడ్డ భూమి, రాత్రికి రాత్రే ప్రైవేటు వ్యక్తుల 'జిరాయితీ' భూమిగా ఎలా మారిందని గ్రామస్థులు మండిపడుతున్నారు.

**ఎండిన చెరువులు:**

గెడ్డ మూసివేతతో పెదతాడివాడ, చిన తాడివాడ గ్రామాల్లోని 6 చెరువులకు నీరు నిలిచిపోయింది. సుమారు 4,000 ఎకరాలకు సాగునీరు అందక రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. గెడ్డ పూడ్చివేతతో భూగర్భ జలాలు అడుగంటిపోయి, గ్రామాల్లో గుక్కెడు మంచినీటి కోసం జనం అల్లాడుతున్నారు.

**పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు ఒక న్యాయమా?**

"మేము ఇల్లు కట్టుకోవడానికి సెంటు భూమి అడిగితే పర్యావరణం దెబ్బతింటుందని చెప్పే రెవెన్యూ అధికారులు, ఒక రియల్ ఎస్టేట్ యజమానికి 6 సెంట్ల గెడ్డ భూమిని ఎలా కట్టబెట్టారు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు జరిగిన, చెక్ డ్యాంలు ఉన్న గెడ్డను ప్రైవేటు వ్యక్తుల పరం చేయడం ఏ చట్టం ప్రకారం సబబని వారు నిలదీస్తున్నారు. గతంలో ప్రజా ధనంతో అభివృద్ధి చేసిన వనరును ధనవంతుల లాభం కోసం ధారాదత్తం చేయడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ముంచుకొస్తున్న ప్రమాదం..!**

30 అడుగుల లోతు ఉన్న గెడ్డను పూడ్చి వేసి అక్కడ నిర్మాణాలు చేపట్టడం భవిష్యత్తులో పెను ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. భారీ



ఫైల్ ఫోటో

వర్షాలు వస్తే కొండల నుంచి వచ్చే నీరు వెళ్లే మార్గం లేక, చుట్టుపక్కల గ్రామాలను ముంచెత్తడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటు కొనుగోలుదారుల పెట్టుబడి, ఇటు గ్రామస్థుల భద్రత రెండూ ఇప్పుడు ప్రశ్నార్థకమయ్యాయి. ?జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఆక్రమణకు గురైన గెడ్డను తవ్వించి పాత స్థితికి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. చట్టాన్ని అతిక్రమించి సహకరించిన అధికారులపై, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు, సామాన్యులకు న్యాయం చేస్తుందో లేదో వేచి చూడాలి.

**గెడ్డవాగు ఆక్రమణలు తొలగించాలి**

రెవెన్యూ శాఖ సర్వే చేసి తక్షణమే గెడ్డవాగు ఆక్రమణలు తొలగించి యధాస్థితి తీసుకురావాలి. పేదవారి ఇంటి నిర్మాణాలకు అడ్డొచ్చిన నిబంధనలు రియల్ ఎస్టేట్ యజమానికి ఏవిధంగా కొండవాగు భూమి ధారాదత్తం చేస్తారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలి.

**తుమ్మి అప్పలరాజుదొర గిరిజన నాయకులు**

వాగు ఆక్రమణ ఎండుతున్న చెరువులు రియల్ ఎస్టేట్ వ్యాపారి కొండవాగుని ఆక్రమించడంతో ఆరు చెరువులకు నీరందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా వందలాది ఎకరాలకు సాగు నీరు అందడం లేదు. ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలి



ప్రస్తుతం

## ప్రజా ప్రభుత్వం - కూటమి ప్రభుత్వం



**యలమంచిలి , ఏప్రిల్ 07 (మనసులో మాట)** : యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్నా క్యాంటీన్ ను రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు పరిశీలించారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరుతో అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి పేద ప్రజలకు 5 రూపాయలతో కడుపు నింపుతున్నారని అన్నారు. అనంతరం అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతూ అన్నా క్యాంటీన్లో భోజనం వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. త్వరలోనే యలమంచిలి నియోజకవర్గంలో మరో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అందించాలన్న ఉద్దేశంతో ఈ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గొర్లి శివన్నారాయణ మూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు కొటారు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇన్చార్జిలు బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, పందూరి శ్రీనివాసరావు, గొర్లి బాబురావు, బొద్దపు నాగేశ్వరావు, దంట్ల వెంకటస్వామి, కర్రేడ్ల మల్లికార్జునరావు, పిల్లా గంగాధర్, కర్రీ వెంకటస్వామి, బొద్ధపు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి రాజధానికి చట్టబద్ధతతో ప్రజల కళ్ళలో ఆనందం

**ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం**
**పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం : మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్**

**అనకాపల్లి ప్రతినిధి , ఏప్రిల్ 07 (మనసులో మాట)** : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కై రాష్ట్రపతి ఆమోదిస్తూ గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినందుకు ప్రధాని నరేంద్ర మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా, భారత రాష్ట్రపతి ముర్మి కు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వర రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్ తదితరులు పాలాభిషేకం చేశారు. ముందుగా బాణాసంచా వెలిగించి కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పే రోజులు వచ్చాయన్నారు. పార్లమెంటులో 50 పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తుంటే వాటిల్లో 49 అమరావతి కి మద్దతు పలికాయన్నారు. అమరావతి అని పలకడం ఇష్టం లేని జగన్ రెడ్డి మావిగన్ అని అంటూ మతిస్థిమితం లేనివిధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అమరావతి ప్రజా రాజధాని పురాణాల్లో అమరావతి ని దేవతల రాజధానిగా పేరొంది ఒదన్నారు. కాగా జగన్ రెడ్డి కోసం మావిగన్ అనే విష ప్రచారం చేస్తున్నారని, వీరికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని నాగ జగదీష్ అన్నారు. శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ



అమరావతి రాజధానిలో 56 వేల కోట్లు నిధులతో పనులు చేపట్టారని వాటికి కాల పరిమితి నిర్ణయిస్తూ 2028 నాటికి పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా అమరావతికి ఖర్చు చేయకుండా, రైతులు ఇచ్చిన భూములు పెట్టుబడిగా అభివృద్ధి చేసి అప్పులకు వడ్డీతో సహా చెల్లిస్తారన్నారు. రాజధాని అమరావతి సెల్ఫ్ సస్టయిన్ రాజధాని, అమరావతికి అసలైన ఆర్థిక ఇంజిన్ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ అని, ఇది భారతదేశంలో అత్యంత వినూతనమైన భూసేకరణ అని ప్రభుత్వం భూములు కొనుగోలు ద్వారా కాకుండా భాగస్వాముగా సేకరించి తర్వాత రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చిన తర్వాత తక్కిన భూమిని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తూ నిధులు సేకరిస్తుందన్నారు. దీనివల్ల రాష్ట్రానికి ఎటువంటి ఆర్థిక ఇబ్బంది ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొడ్డేడ అప్పలనరసయ్య, జనసేన నాయకులు కాండ్రేగుల జగ్గారావు, కాండ్రేగుల ఉమా, తెలుగుదేశం పార్టీ నాయకులు కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, పొలిమేర నాయుడు, సాలాపు నాయుడు, కొరిబిల్లి మహాలక్ష్మినాయుడు, కొమ్మోజు రామకృష్ణ, కాండ్రేగుల వెంకట సూరి, ఎలమంచిలి బంగారురాజు, పెంటకోట వెంకటరమణ, కొణతాల బాబురావు, కొణతాల త్రినాద్, కొణతాల సత్యనారాయణ, కాండ్రేగుల రామ అప్పారావు, బుద్ధ భువనేశ్వరరావు, డివివి అప్పారావు,కొమ్మోజి రామకృష్ణ, కాండ్రేగుల రవీంద్ర, కొణతాల బాబురావు, మత్తుర్తి మహేష్, మల్ల జగన్, పెంటకోట వరప్రసాద్, బుద్ధ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## పెదబయలు ఏకలవ్య పాఠశాలలో మిగులు సీట్ల భర్తీ కి దరఖాస్తులు ఆహ్వానం

**పెదబయలు , ఏప్రిల్ 07 (మనసులో మాట)** : పెదబయలు ఏకలవ్య పాఠశాల లో మిగులు సీట్లు 8వ తరగతి నందు బాలురకు 01, 9వ తరగతి లో బాలురకు 01 సీటు కలదు . కావునా తగిన అర్హత కలిగిన ఎస్ టి విద్యార్దులు పాఠశాల కు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు . అర్హత కలిగిన విద్యార్దులకు తేది :12-04-2026 నాడు ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రవేశం కల్పిస్తామని . దరఖాస్తులు సమర్పించు తేది లు 01-04-2026 నుండి 12-04-2026 వరకు స్థానిక ఏకలవ్య పాఠశాల పెదబయలు నందు సమర్పించవచ్చు అని పాఠశాల




ప్రిన్సిపాల్ అమిత్ కుమార్ ఆనంద్ తెలియజేశారు. సంప్రదించు ఫోన్ నంబరు లు: 7569923289 , 90504 10052 కు సంప్రదించాలని తెలిపారు.

## గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకం

**యలమంచిలి , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** మండలంలోని గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జిల్లా అధికారులు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్టు ఎంపీడీఓ కేఎస్. కొండలరావు తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. కొత్తలి, పీఎంఆర్. పేట, పులపర్తి గ్రామాలకు ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, బయ్యవరం, రేగుపాలెం, జంపపాలెం, ఏటికొప్పాక గ్రామాలకు





తహశీల్దారు కె.వరహాలు, లైనుకొత్తూరు, పురుషోత్తపురం గ్రామాలకు ఏవో, ఎంపీడీఓ కార్యాలయం, పోతిరెడ్డిపాలెం, షేకిళ్లపాలెం, తురంగలపాలెం గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీఓ ఎం. అనంతనాగ్, గూండ్రుబిల్లి, కృష్ణాపురం, లక్కవరం గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీఓ వి.దీపిక, ములకలాపల్లి, రుక్మిణిపురం గ్రామాలకు వ్యవసాయాధికారి మోహనరావులను నియమించినట్టు తెలిపారు.

## నా నిజాయితీని ప్రశ్నించే స్తోమత మీకు లేదు

**- సీనియర్ రాజకీయ నాయకుడు, ప్రముఖ డాక్టర్ రాజశేఖర్ ఆగ్రహం**
**- నర్సీపట్నంలో రకరకాల ఊహాగానాలకు తెరలేపిన సోషల్ మీడియా పోస్ట్ దుమారం**

**నర్సీపట్నం రూరల్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** నా నిజాయితీని ప్రశ్నించే స్తోమత మీకు లేదంటూ, నా నిజాయితీ, నిబద్ధత నాలుగు నియోజకవర్గాల ప్రజలకు తెలుసునని నర్సీపట్నం సీనియర్ రాజకీయ నాయకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ పి ఎస్ వి రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం వైసీపీకి చెందిన ఒక సీనియర్ నేత సోషల్ మీడియాలో తనపై వస్తున్న విమర్శల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నేను మరియు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కలిసి ఒక ప్రైవేటు హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ఇటీవల వెళ్ళామని, అది మా ఇంటికి కేవలం పది అడుగుల దూరంలోనే ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలకు ఊరిలో ఉన్న పెద్ద మనుషులను పిలుస్తారని, అందుకే నన్ను ఆహ్వానిస్తే నేను వెళ్ళానన్నారు. దీనిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఆయన తూర్పారబట్టారు."మా హాస్పిటల్ పేరు వైఎస్సార్ హాస్పిటల్ అని, దానిని స్వయంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు . నా నిజాయితీ గురించి, పార్టీ పట్ల నాకున్న నిబద్ధత గురించి జగన్ కు బాగా తెలుసునని, అందుకే ఆయన నన్ను ఎప్పుడూ ఏమీ అడగలేదన్నారు. నావ్యక్తిత్వంపై విమర్శలు చేసే హక్కు మీకెక్కడిది? అని ప్రశ్నించారు. గతంలో అయ్యన్నపాత్రుడు కాళ్ళ దగ్గర కూర్చుని చిన్న చిన్న



పదవులు పొందిన వారు ఈరోజు నా గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ దుష్ప్రచారం చేస్తున్న వారికి కనీసం బుద్ధి జ్ఞానం ఉందా అని ప్రశ్నించారు. "నేను ఒక డాక్టర్ గా ఏనాడూ ఏ ఇతర డాక్టర్ నూ విమర్శించలేదన్నారు. కానీ, మీ ప్రవర్తన చూస్తుంటే మిమ్మల్ని విమర్శించక తప్పడం లేదన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలపై ఆయన క్లారిటీ ఇస్తూ, తన విధేయత ఎప్పుడూ జగన్ మోహన్ రెడ్డి పట్లే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. విమర్శించే ముందు స్థాయి స్తోమత ఆలోచించుకోవాలని చురకలంటించారు. ఆయన తనయుడు డాక్టర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ, నర్సీపట్నం లో ఉన్న వారికి మరిడమ్మ దేవత ప్రాముఖ్యత ఏంటో తెలుస్తుంది కానీ బయటి నుండి వచ్చి కేవలం పదవులు అనుభవించడానికి రాజకీయాలు చేసుకునే వాళ్లకు మా ఊరి సెంటిమెంట్లు కానీ మా ఊరి అమ్మవారి గొప్పతనం కానీ, ఇక్కడి ఆచారాలు కానీ తెలియవని విమర్శించారు. దేవుడిని దేవతను కూడా రాజకీయాల కోసం వాడుకుంటున్న వారికి, ఇవాళ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారికి నా సమాధానం ఒక్కటే అని ఈ క్షణం నుండే వాళ్ళ రాజకీయ పతనం ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## అకాల వర్షంతో ప్రజలకు ఊరట



**మునగపాక , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** మండల వ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో ఈదురు గాలులతో కూడిన వర్షం భారీగా పడడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ఈ వర్షం మెట్ట ప్రాంత పంటలకు ఎంతగానో దోహదపడుతుందని రైతులు అంటున్నారు. గత 15 రోజులుగా విపరీతమైన ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ అకాల వర్షం ఎంత ఊరట ఇచ్చింది. సుమారు గంట పాటు కురిసిన వర్షంతో లోతట్టి ప్రాంతాలు జలమయమయ్యాయి. అనకాపల్లి పూడిమడక మెయిన్ రోడ్ లో మునగపాక ప్రాంతంలో భారీగా నీరు రోడ్లమీదకు చేరింది. ఈదురుగాలితో కురిసిన వర్షానికి చెట్లు పొడిపోవడంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది కురుస్తున్న వర్షంలోనే పనులు చేపట్టి రాత్రి 7:30 ప్రాంతంలో విద్యుత్తును పునరుద్ధించారు. ఈ వర్షం చెరుకు, పొద్దు తిరుగుడు, నువ్వు పంటకు ఎంతగానో దోహదపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వాహన ద్రవ పత్రాలు పక్కాగా ఉండాలి



**రంవచోడవరం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** పోలవరం జిల్లా దేవిపట్నం మండలం లోని పెనికిలపాడు, రహదారిలో వాహనాలను దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలను తల్లి, దండ్రులు ఇవ్వవద్దని అన్నారు. చట్టాలు కఠిన తరంగా ఉన్నాయని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై చర్యలు ఉంటాయని అన్నారు. వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వాహన ద్రవ పత్రాలు పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ పేద విద్యార్థులకు ఐఐటీ-నీట్

### ఉచిత శిక్షణ: ఫిజిక్స్ వాలాతో ఆన్లైన్, ఆఫ్లైన్ కోచింగ్ ప్రారంభం

**రోలుగుంట , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఐఐటి ,నీట్ పోటీ పరీక్షలకు ఆన్లైన్, ఆఫ్లైన్ ఉచిత శిక్షణ కల్పించే కార్యక్రమాన్ని సమర్పణ సంస్థ, వేద విద్యా సంస్థ కలిసి ఫిజిక్స్ వాలా తో జాతీయ స్థాయిలో ప్రారంభించాయి.సమర్పణ సంస్థ చైర్మన్, ఉత్తర ప్రదేశ్ ఐజీ కిల్లాడ సత్యనారాయణ, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు ఈ వివరాలను విలేకరులకు ఒక ప్రకటనద్వారా తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులకు సరైన కోచింగ్ సదుపాయాలు లేక ఐఐటి,నీట్ వంటి పరీక్షలకు హాజరు కాలేకపోవడం, ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో ప్రతిభ నిరుపయోగం అవుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఇలాంటి వారిని గుర్తించి ఉచిత శిక్షణ కల్పించాలనే ఉద్దేశంతో అనకాపల్లి జిల్లాలోని పలు పాఠశాలల్లో 7, 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారిలో ప్రారంభ దశలో సుమారు 50 మందిని ర్యాంకు ఆధారంగా ఎంపిక చేస్తామని, వారికి సుమారు రూ.3,000 విలువైన బుక్స్ మరియు స్టడీ మెటీరియల్స్ ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా న్యూ ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న, ఐదు కోట్ల మంది విద్యార్థులకు ఐఐటి,జె ఈ ఈ, నీట్ శిక్షణ ఇస్తున్న ప్రముఖ ఎడ్-టెక్ సంస్థ ఫిజిక్స్ వాలా తో కలిసి న్యూ ఢిల్లీలో వారి ఆన్లైన్ శిక్షణ, అనకాపల్లి జిల్లాలోని మాకవరపాలెం, రోలుగుంట, కొత్తకోట ప్రాంతాల్లో ఆఫ్లైన్ శిక్షణ కేంద్రాలు ప్రారంభించి ఉచితంగా కోచింగ్ అందించనున్నట్లు వారు వివరించారు. ఈ నెల 12న మాకవరపాలెం, రోలుగుంట, కొత్తకోటలో శిక్షణా కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందని, ఆ సందర్భంగా ప్రవేశ పరీక్షల ఫలితాలను వెల్లడించి, ఎంపికైన విద్యార్థులకు కోచింగ్ ప్రవేశ పరీక్ష రాసిన ప్రతి ఒక్కరికి ఏ విధంగా అవకాశం కల్పిస్తాం, తదుపరి దిశానిర్దేశం, చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం పాఠకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు 9640121024 నెంబరు సంప్రదించాలని సంస్థ సూచించింది.

## ప్రతి నియోజకవర్గంలో పెండింగ్ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి

**- నియోజకవర్గాల అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సమీక్ష**
**- ప్రజా సమస్యల పరిష్కారంలో శాఖలు సమన్వయం వహించాలి**



**విశాఖ సిటీ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** విశాఖ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల వారీగా ఉన్న సమస్యలు, అభివృద్ధి ప్రతిపాదనలు, తీసుకున్న చర్యలు, పెండింగ్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని సూచించారు. పెండింగ్ పనులను నిర్దిష్ట కాలవట్టికలో పూర్తి చేయాలని, ప్రజలకు తక్షణమే ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భీమిలి నియోజకవర్గంలో చేపట్టిన పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ?ఆర్టీసీ డిపో నిర్మాణం, మధురవాడలో పీహెచ్సీ భవన నిర్మాణం,? భీమిలి బీచ్ రోడ్ సుందరీకరణ, రహదారుల విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. ?సెజ్ ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఆనంద పురంలో కొత్త అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. ?శాటిలైట్ సిటీ పనులు, మధురవాడలో కొత్త సబ్స్టేషన్ నిర్మాణం, మత్స్యకారుల కోసం ల్యాండింగ్ సెంటర్లు, కొత్త కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ?విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల అమలులో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు, ఎస్ఎన్ఎల్ కాలువ పనులు చేయాలన్నారు. ?గోకుల్ పార్క్ అభివృద్ధి, పాత షాపింగ్ కాంప్లెక్స్ తొలగించి సర్వతి పార్క్ నిర్మాణం, టిడ్కో ఇళ్ల నిర్మాణం, కేజీహెచ్ అభివృద్ధి పనులు, ?స్లమ్ పునరావాస కార్యక్రమాల అమలులో నాణ్యతను పాటించాలని సూచించారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలలో కూడా అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ముందడుగు వేయాలని సూచించారు. పెండింగ్ పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, విధాన పరమైన సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు, ఇంచార్జ్ ఆర్డిఓ శేష శైలజ, జీవీఎంసీ ఎడిసి సత్యవేణి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపు కోసం సమిష్టి కృషి అవసరం : కలెక్టర్ కె. దినేష్ కుమార్



**రంవచోడవరం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** రాష్ట్ర ప్రభుత్వం భూగర్భ జలాల స్థాయిని గణనీయంగా పెంచే దిశగా జలధార కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం జలధార కార్యక్రమం అమలుపై సమన్వయ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తో కలిసి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలవరం జిల్లాలో ప్రస్తుతం సగటు 8 మీటర్లలో ఉన్న భూగర్భ జలాల స్థాయిని 3 మీటర్లకు తీసుకురావడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామాల వారీగా చేపడుతున్న పనులు భూగర్భ జలాల మెరుగుదలకు నిదర్శనంగా నిలవాలని సూచించారు.అనంతపురం జిల్లాలో అమలైన సైంటిఫిక్ విధానాలు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, ఫీడర్ ఛానల్స్ మెయింటెనెన్స్, క్యాచ్‌మెంట్ ఏరియా అభివృద్ధి వంటి ఉత్తమ పద్ధతులను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. “నీటి భద్రత -- సాగునీటి సంఘం బాధ్యత” అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 15 నాటికి గ్రామ స్థాయిలో పనులను గుర్తించి, మండల స్థాయిలో ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా ప్రతిపాదనలు పంపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామ స్థాయిలో నీటి సంరక్షణ, వాటర్ బడ్జెటింగ్, చెరువుల పునరుద్ధరణ, కాలువల పూడికతీత, ఫీడర్ ఛానల్స్ శుభ్ర పరచడం, చెరువుల అనుసంధానం (చైన్ లింక్ విధానం) వంటి పనులను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులకు నీరు చేరే మార్గాలను గుర్తించి, సీజన్ వారీగా నీటి లభ్యతపై నివేదికలు సమర్పించాలని తెలిపారు. డ్వామా ద్వారా పనిదినాలు గుర్తించి, వేతనదారుల డేటాను సిద్ధం చేయాలని, వ్యవసాయం, ఉద్యానవనం, చేపల ఉత్పత్తి, గ్రామీణ జల వనరుల శాఖలు సమన్వయంతో యాక్షన్ ప్లాన్లు రూపొందించాలని ఆదేశించారు. వర్షపు నీటి సద్వినియోగం, రేన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో నియమించిన టాస్క్ ఫోర్స్ కమిటీ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, రోజు వారీ యాక్షన్ ప్లాన్‌ను క్షేత్రస్థాయి అధికారులకు అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ఇరిగేషన్ అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని దినేష్ కుమార్ తెలిపారు. పనుల పురోగతిని యాప్‌లో నిరంతరం అప్లోడ్ చేయాలని, ఇందుకు ఇంజనీర్ అసిస్టెంట్లు, ఫీల్డ్ సిబ్బందికి వర్క్‌షాపులు నిర్వహించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అటవీ శాఖ కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సాగు నీటి అందుబాటు 100 శాతం పెంపుతో పాటు భూగర్భ జలాల స్థాయిని 8 మీటర్ల నుండి 3 మీటర్లకు తీసుకురావడం మన ముందున్న ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ దిశగా జిల్లా యంత్రాంగం సంపూర్ణ నిబద్ధతతో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, ఇరిగేషన్ శాఖ అధికారులు, డ్వామా పీడీ, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణ జల సరఫరా, అటవీ శాఖల తదితర సమన్వయ శాఖల అధికారులు, మండల , గ్రామ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు



**పాడేరు రూరల్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరియు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సభ్యుడు వంతల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా నూతన కలెక్టర్ నీశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు, డ్రైనేజీలు, ఆర్‌డబి స్థలాలు తదితరాలు ఆక్రమణలకు గురైన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ శాఖ మెమో నెం. 2760941/సిపిఆర్ ఉ =ఉ/ఉ5/2025, తేదీ 23-03-2025 ప్రకారం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను గుర్తించి, జిల్లా గెజిట్ చేయడానికి వివిధ శాఖలకు చెందిన 9 మంది సభ్యులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, జి.ఓ.ఎంఎస్ నెం.188, తేదీ 21-07-2011 ప్రకారం ప్రభుత్వ ఆస్తులను గుర్తించి, అక్రమణలను తొలగించే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఈ ఆదేశాలపై గతంలో తగిన చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రస్తావిస్తూ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుడబ్ల్యూ పి (పి ఐ ఎల్ నెం.47/2025లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ భూములను గుర్తించేందుకు అడంగల్ రికార్డులు మాత్రమే కాకుండా, రీ-సెటిల్మెంట్ రిజిస్టర్ (ఆర్ ఎస్ ఆర్ )సర్వే ఫెయిర్ అడంగల్ ( ఎస్ ఎఫ్ ఎల్ ఆర్) పాత గ్రామ మ్యాప్‌లు వంటి రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. భూ ఆక్రమణలను గుర్తించి తొలగించడం ద్వారా భూ దందాలను అరికట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన జిల్లా కలెక్టర్ నీశాంతి, వినతిపత్రాన్ని పరిశీలించి తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ అంశంపై ఈఈ (ఈ ఈ)తో విచారణ చేయించి, సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొర్ర మల్లమ్మ, చెండా లోహితసు, జిల్లా కమిటీ సభ్యులు సమరెడ్డి సింహాద్రి (రిటైర్డ్ ఏ పీ ఎఫ్ డి సి ) సోమేల బాలరాజు, సోమేల కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

### ఆరోగ్యమే నిజమైన సంపద : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. అనిత



**శ్రీకాకుళం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** ఆరోగ్యమే నిజమైన సంపదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత తెలిపారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విజ్ఞానానికి అండగా నిలుద్దాం - ఆరోగ్యం కోసం కలిసి పనిచేద్దాం అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి స్థానిక 7రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకొంటే ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతారని, ఆ ఆరోగ్యమే నిజమైన సంపదన్నారు. ప్రతీ ఒక్కరూ క్రమంతప్పకుండా వ్యాయమం చేయాలని, పౌష్టికాహారం తీసుకొని వ్యక్తిగత, పరిశరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యకర జీవన విధానం అలవరుచు కొనుట వలన ఆనందకరమైన జీవనం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.ఓ డా. రామ్ దాస్, డిప్యూటీ డి.ఎమ్.హెచ్.ఓ డా. మేరీ కేథరిన్, ఆర్.బి.ఎస్.కె. ప్రోగ్రామ్ అధికారి డా. శివరంజిని, డిప్యూటీ డెమో కె. యర్రన్న, డిప్యూటీ హెచ్.ఇ.ఓ ఎస్.విజయలక్ష్మి, పి. మోహిని రత్నకుమారి, కార్యాలయ సిబ్బంది, ఎ.ఎన్.ఎమ్, ఆశా వర్కర్లు, కార్యాలయ సిబ్బంది, రెడ్ క్రాస్ సభ్యులు, చైతన్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిఎల్ఏటిఓ డాక్టర్ స్వప్న



**అనకాపల్లి రూరల్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** టీబీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని స్వప్న పిలుపునిచ్చారు. మంగళవారం టీబీ ముక్తభారత్ అభియాన్ లో భాగంగా తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల కోడూరు గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న సిబ్బందికి తగుచూన్లు అందజేశారు. కోడూరు గ్రామంలో 40 మందికి చెస్ట్ ఎక్స్రే స్క్రీనింగ్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూషుగరు, బిపి ,18.5 కేజీలు తక్కువగా ఉన్నవారికి రెండు వారాల నుంచి దగ్గు, రెండు వారాల నుంచి జ్వరం, బరువు తగ్గడం, చాతినొప్పి కఫంలో రక్తం పడటం లక్షణాలు ఉన్న వాళ్ళందరికీ సిబి నాట్ ,ట్రునాట్ మిషన్ ద్వారా టెస్టులు చేయించుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమం లో సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ ఎం పెంటయ్య, రామకృష్ణ డిపిఎస్, రేడియో గ్రాఫర్సత్యనారాయణ, సిహెచ్ఓ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హెల్త్ సెక్రటరీ పై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి ని సస్పెండ్ చేసి అరెస్టు చేయాలి



**అనకాపల్లి ప్రతినిధి , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా లోని దేవరాపల్లి పిహెచ్ సి పరిధిలో గర్సింగి సచివాలయ హెల్త్ సెక్రటరీ గా పనిచేస్తున్న రాజ్యలక్ష్మిని అదే పిహెచ్ సి లో పనిచేస్తున్న మరొక ఉద్యోగి శారీరకంగా, మానసికంగా వేధింపులు గురి చేయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం జరిగింది. ఘటన జరిగి నాలుగు రోజులైనా ఆ వ్యక్తి పై నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆ వ్యక్తిని అరెస్టు చేసి ఉద్యోగం నుంచి తొలగించాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో మంగళవారం గిరిజన సంఘాలు , ఐద్వా మహిళా సంఘం, సిఐటియు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశం అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన సంఘ నాయకులు ఎల్ సుందర్రావు అధ్యక్షతన జరిగింది. రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన మహిళ అయిన రాజ్యలక్ష్మి పై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి ని వెంటనే సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. డబ్బు మదంతో ఉన్న సదరు వ్యక్తి అందరూ నా చేతిలోనే ఉన్నారని బెదిరింపులు చేసి తోటి ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి డి.డి వరలక్ష్మి, గిరిజన సమాఖ్య అల్లూరి సీతారామరాజు జిల్లా నాయకులు రాధాకృష్ణ, శ్రామిక మహిళ నాయకులు నారాయణమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ లు మాట్లాడుతూ గిరిజనురాలైన రాజ్యలక్ష్మీని అదే పిహెచ్ సి లో పనిచేస్తున్న ఉద్యోగి వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజ్యలక్ష్మి పాడేరు ఆసుపత్రిలో చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడు తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, గిరిజనులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్ టి.నిశాంతి



**పాడేరు రూరల్ , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్య సిబ్బంది మరియు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి సూచించారు. మంగళవారం హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అలాగే పాడేరు తలారి సింగ్ జంక్షన్ వద్ద ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మలేరియా నివారణకు ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వర లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా మరణాలను తగ్గించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. కాచిన నీరు త్రాగడం, దోమతెరలు ఉపయోగించడం వంటి చర్యల ద్వారా వ్యాధుల ముప్పు తగ్గించవచ్చని సూచించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలను ఆధునిక సదుపాయాలతో మోడల్ కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులను ముందుగానే నిల్వ ఉంచాలని ఆదేశించారు. రక్త పరీక్షల ఫలితాలను వేగంగా పొందేందుకు డ్రోన్ సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం శుభ్రంగా ఉంచడం, అసంపూర్తి భవనాలను త్వరగా పూర్తి చేయడం, మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు తెలిపారు. అనారోగ్యంతో వచ్చే రోగుల పట్ల సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రం సేవలపై ప్రత్యక్షంగా సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తలారి సింగ్ జంక్షన్ వద్ద ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. మెరుగైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పీవో తిరు మని శ్రీ పూజ, హుకుం పేట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి, సిబ్బంది, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ లో స్టేషనరీ సెంటర్ ప్రారంభం



**శ్రీకాకుళం , ఏప్రిల్ 07 (మనసులో మాట) :** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతికవిశ్వ విద్యాలయం శ్రీకాకుళం ఎచ్చెర్ల లోనూతనంగా స్టేషనరీ, జెరాక్స్ ను డైరెక్టర్ ప్రొఫెసర్ సండ్ర అమరేంద్ర కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఇది విద్యార్థులుకు అదే విధంగా ఇక్కడ ఉన్న స్టాఫ్ కి చాలా ఉపయోగపడుతుంది అని దీని ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు,వెల్ఫేర్ డీన్లు సింహాచలం, యోగేశ్వరి, వివిధ డిపార్ట్మెంట్ విభాగ పతులు, అధ్యాపకులు అధ్యపకేతర సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
|---|---|---|
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |

బుధవారం 8 ఏప్రిల్ 2026






# రాజమండ్రిలో తలపడనున్న ప్రపంచ క్రీడాకారులు

- అంతర్జాతీయ క్రీడా వేదికగా ఆవిష్కృతం కానున్న రాజమహేంద్రవరం
- ఇప్పుడు ప్రపంచం దృష్టి రాజమండ్రి నగరం వైపు
- నగరంలో అంతర్జాతీయ డ్రాగన్ బోట్ లీగ్ -2026
- మే 30 నుంచి జూన్ 1 వరకు పోటీలు
- 25 దేశాల నుంచి 1200 మంది అథ్లెట్ల హాజరు
- ఈ అంతర్జాతీయ క్రీడతో యువతకు కొత్త ఉత్సాహం
- నగరంలో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం
- ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చారిత్రాత్మక అడుగు
- వెల్లడించిన ప్రజా ప్రతినిధులు
- వేడుకగా అంతర్జాతీయ డ్రాగన్ బోట్ లీగ్ - 2026 ఈవెంట్ లాంచ్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వందలాది అథ్లెట్స్ నువ్వా నేనా అని తలపడేటందుకు తూర్పు గోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరం వేదిక కాబోతోంది అని చెప్పుకోవటానికే ఎంతో గర్వంగా ఉంది. వినటానికి ఒకింత ఆశ్చర్యంగా ఉన్నా..ఇది మాత్రం నిజం. ఆ సమయం కోసం నగర వాసులు ఎంత ఉత్కంఠతో నిరీక్షిస్తున్నారో..అంతకు వంద రెట్ల ఉత్కంఠభరితంగా యావత్ ప్రపంచంలోని అన్ని దేశాలు ఇక్కడ జరగబోయే డ్రాగన్ బోట్ లీగ్ వీక్షించేందుకు ఆసక్తితో ఉన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు అథ్లెట్స్ సిద్ధంగా ఉన్నారు. దీంతో రాజమహేంద్రవరం నగరం అంతర్జాతీయ క్రీడా వేదికగా రూపుదిద్దుకోబోతోంది. ప్రపంచమంతా ఇప్పుడు రాజమహేంద్రవరం వైపు చూడబోతోంది... చైనా పురాతన క్రీడ డ్రాగన్ బోట్ పోటీలు త్వరలోనే రాజమహేంద్రవరంలో జరగబోతున్నాయి. భారత దేశంలో తొలి సారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించబడుతున్న ఇంటర్నేషనల్ డ్రాగన్ బోట్ లీగ్-2026 పోటీలు రాజమహేంద్రవరం కేంద్రంగా నిర్వహించనున్నట్లు ప్రజా ప్రతినిధులు, నిర్వాహకులు మంగళవారం సగర్వంగా ప్రకటించారు.

థింక్ అవుట్ సైడ్, ఇండియన్ కయాకింగ్ అండ్ కానోయింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మే 30, 31, జూన్ 1 తేదీల్లో పెద్ద ఎత్తున నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన లోగోను ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, శాప్ చైర్మన్ అనిమీని రవి నాయుడు ఆవిష్కరించగా, జెర్సీని బలరాం నాయుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బొడ్డు వెంకటరమణ చౌదరి ఆవిష్కరించారు. టీజర్‌ను ఎమ్మెల్సీ సోము వీర్రాజు విడుదల చేశారు. అధికారిక బ్యానర్‌ను నాయకులు విడుదల చేశారు. అలాగే థింక్ ఔట్సైడ్ యోగేష్, శిల్ప, బొడ్డు వెంకటరమణ చౌదరి కలిసి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. సోషల్ మీడియా ప్రమోషన్ కార్యక్రమాలను కూడా ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

**చైనా నుంచి ఆవిర్భవించిన డ్రాగన్ బోట్ క్రీడ..**

డ్రాగన్ బోట్ క్రీడకు దాదాపు 2000 సంవత్సరాల చరిత్ర ఉంది. చైనాలో క్వ్ యువాన్ అనే కవి జల సమాధి అయిన తరువాత, ప్రజలు పడవలతో ఆయనను వెతుకుతూ డప్పులు కొడుతూ సాగిన సంప్రదాయం ఈ క్రీడగా రూపాంతరం చెందింది. టీమ్ స్పిరిట్, సమన్వయం, ఏకాగ్రతకు ప్రతీకగా ఈ క్రీడ నిలుస్తుంది.

**ఈవెంట్ లాంచ్ అనంతరం ప్రజా ప్రతినిధుల ప్రసంగాలు..**

**రాజమండ్రి స్పోర్ట్స్ హబ్‌గా మారే దిశగా అడుగులు : ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి**

రాజమండ్రి ఇప్పటి వరకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిందని, ఇప్పుడు స్పోర్ట్స్ హబ్‌గా మారబోతోందని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. ఈ క్రీడ యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యవంతమైన జీవన శైలికి దారితీస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. మల్టీ పర్పస్ స్టేడియంను మూడు దశల్లో నిర్మిస్తున్నామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ క్రీడలు, క్రీడాకారుల పట్ల చూపిస్తున్న శ్రద్ధను ఈ సందర్భంగా ఎంపీ పురంధరేశ్వరి వివరించారు. మన దేశం నుంచి ఎక్కడకు క్రీడాకారులు వెళుతున్నా వారికి అభినందనలు తెలియజేయడం, గెలుపోటములేమైనా వారిని మనస్ఫూర్తిగా అభినందించడం ప్రధాని మోదీకి అలవాటన్నారు. అదొక చక్కని సంస్కారమని కొనియాడారు. క్రీడాకారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎంపీ పురంధరేశ్వరి తెలిపారు. డ్రాగన్ బోట్ క్రీడ ఆవిష్కరణ గురించి ఆమె వివరించారు.

**క్రీడా రాజధానిగా రాజమండ్రి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

రాజమండ్రిని క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక నారాయణపురంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభించామని, గోదావరి రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రయత్నంలో భాగంగానే రాజమహేంద్రవరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రక్రియ వేగంగా సాగుతోందన్నారు. క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు నాందిగా ఈ అంతర్జాతీయ డ్రాగన్ బోట్ లీగ్ సంబరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ దేశాలకు చెందిన వందలాది మంది క్రీడాకారులు వస్తున్న తరుణంలో నగర ప్రజలు అపూర్వ రీతిలో స్వాగతం పలికేందుకు సిద్ధం కావాలని ఆయన కోరారు. మొత్తంగా ఇంటర్నేషనల్ డ్రాగన్ బోట్ లీగ్ -2026 రాజమండ్రి నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే మహత్తర అవకాశమన్నారు. ప్రజల సహకారం ఉంటే భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ క్రీడలను నిర్వహించే సామర్థ్యం రాజమండ్రికి ఉందన్నారు.

**వాటర్ గేమ్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం : రవి నాయుడు..**

రాజమండ్రిని వాటర్ గేమ్స్ హబ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని శాప్ చైర్మన్ అనిమీని రవి నాయుడు చెప్పారు. ఈ ఈవెంట్‌లో 25 దేశాల అథ్లెట్లు పాల్గొనడం గర్వకారణమని, రూ.53 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. క్రీడల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని చెప్పారు.

**కేంద్రం నుంచి భారీ నిధులు : సోము వీర్రాజు..**

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి క్రీడా రంగంలో పూర్తి మద్దతు ఇస్తోందని అన్నారు. ఎంపీ పురంధరేశ్వరి కృషితో మల్టీ పర్పస్ స్టేడియంకు రూ.54 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రాజమండ్రి క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ముందుకు సాగడం ఆనందకరమన్నారు.

**పర్యాటక రంగానికి ఊతం : బొడ్డు వెంకట రమణ చౌదరి..**

రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ ఈవెంట్ ద్వారా రాజమండ్రి పర్యాటక, క్రీడా రంగాల్లో కొత్త అవకాశాలు వస్తాయని చెప్పారు. పెద్ద సంఖ్యలో పెట్టుబడులు రానున్నాయని, స్థానిక మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, పిక్కి నాగేంద్ర, అత్తి సత్యనారాయణ, వై శ్రీను, ఉప్పులూరి జానకీ రామయ్య, అధిక సంఖ్యలో సోషల్ మీడియా ఇన్ఫులెన్సర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవడమే

# జలధార

## రాజవోలులో జలధార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవడమే జలధార యొక్క ముఖ్య ఉద్దేశమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం రూరల్ రాజవోలు గ్రామంలో జలధార కార్యక్రమంలో భాగంగా చెరువు వద్ద చేయవలసిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత అని, కూటమి ప్రభుత్వం ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకూ వంద రోజులపాటు జలధార కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో గల సాగునీటి చెరువుల మరమ్మత్తులు చేయడం, నీటి సామర్థ్యం పెంచేందుకు పూడిక తీయడం, చెరువుల ద్వారా వెళ్లే కాలువలు శుభ్రం చేయడం, వర్షపు నీరు వృధా కాకుండా చెరువులోకి మళ్లించడం వంటి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అలాగే చెరువుగట్టుపై మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తామని, వీటన్నిటి ద్వారా భూగర్భ జలాలు సామర్థ్యాన్ని పెంపుదల చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, నిమ్మలపూడి రామకృష్ణ, వల్లూరి చెంచురాజు, కురుకూరి కిషోర్, మామిడిశెట్టి సువర్ణ కుమారి, ఏపీవో అన్నపూర్ణ, వల్లూరి శ్రీరామ్ చౌదరి, గాలి వెంకటేశ్వరరావు, ముత్యాల రామారావు తదితరులు పాల్గొన్నారు.



## విషం చిమ్ముతున్న వైసీపీ

- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి అమానుషం
- ఈ చర్య పత్రికా స్వేచ్ఛకు భంగం
- సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై జరిగిన దాడి పత్రికా స్వేచ్ఛను హరించడమేనని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తీవ్రంగా ఖండించారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర రాజధాని అమరావతికి కూటమి ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడాన్ని జీర్ణించుకోలేక వైసీపీ కుట్రలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైసీపీ చర్యలను బహిర్గతం చేస్తూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రచురిస్తున్న కథనాలు, వీకెండ్ కామెంట్స్‌ను తట్టుకోలేక ఆ కార్యాలయంపై దాడి జరిపించడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. గతంలో వైసీపీ ప్రభుత్వ కాలంలో జరిగిన అరాచకాలు, అకృత్యాలను వెలుగులోకి తీసుకురావడంలో, అలాగే మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన అన్యాయాలను ప్రజలకు తెలియజేయడంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముఖ్య పాత్ర పోషించిందని ఆయన అన్నారు. అమరావతి అంశంలో ప్రజలను గందరగోళానికి గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని బట్టబయలు చేస్తూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజల తిరస్కరణకు గురైన మాజీ ప్రజా ప్రతినిధులు వారి ఉనికిని కాపాడుకోవడం కోసం హైదరాబాద్‌లో ఏబీఎన్ కార్యాలయం వద్ద ప్రగల్భాలు పలకడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రజలు గుణపాఠం చెప్పినా మార్పు రాకపోవడం బాధాకరమని అన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడిని కూటమి ప్రభుత్వం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు.

అనాథ బాలలను అక్కున చేర్చుకుని

## నూతన జీవితాన్ని అందించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు, ఏప్రిల్, 7 (మనసులో మాట)..** కన్నతల్లి చనిపోయి అనాథలైన ముగ్గురు పిల్లలను గాలికి వదిలేసి ఎటో వెళ్లిపోయిన తండ్రి, ఈ కారణంగా అనాథలైన ముగ్గురు చిన్నారులను అక్కున చేర్చుకుని వారికి నూతన జీవితాన్ని జిల్లా కలెక్టర్ శ్రీమతి వెట్రీ సెల్వీ అందించారు.ఏలూరు జిల్లా కుక్కునూరు చెందిన ముగ్గురు చిన్నారులు ఏడు సంవత్సరాలు, ఆరు సంవత్సరాలు, నాలుగు సంవత్సరాలు వయసు కలిగిన బాలికల తల్లి ఇటీవల మరణించింది. తండ్రి పిల్లలను వదిలేసి ఏటో వెళ్లిపోయారు. తల్లిదండ్రులు లేక బాల్యాన్ని భారంగా దీనస్థితిలో ఉన్న వారి పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సదరు పిల్లల పరిస్థితిని పరిశీలించి తీసుకురావలసిందిగా ఐసిడిఎస్ పీడీ శారద మరియు జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్ సూర్య చక్రవేణి ని ఆదేశించారు.కలెక్టరేట్ లో సదరు బాలికలతో కలెక్టర్ కొంతసేపు మాట్లాడి వారి వివరాలు, పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.వారికి కొత్త బట్టలు, చెప్పులు, బిస్కెట్లు, డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ పెన్సిల్‌లు నోట్ బుక్స్ ఇచ్చి, తదుపరి చర్యల తీసుకోవలసిందిగా జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సూర్య చక్రవేణికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఆదరణ కరువై, సంరక్షణ అవసరమైన పిల్లలకు సంరక్షించేందుకు బాలల సంక్షేమ సమితి ఏలూరు సిబ్బంది దెందులూరు బాలసదనం నందు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు సదరు బాలికలను జాయిన్ చేసి, వారికి భోజన, వసతి సదుపాయాలతో పాటు విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఈ సందర్భంగా బాలికలు కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలియజేసారు.



## రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి...

- కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ ను సందర్శించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్...
- అమృత్ భారత్' పనులు పరిశీలన...



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 7..** రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ ను, రైల్వే అధికారులు, జనసేన పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. రైల్వే స్టేషన్లో అమృత్ భారత్ పథకం కింద రూ 31.37 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఎసి వెయిటింగ్ హాల్, ఫీడింగ్ రూమ్, త్రాగునీరు సౌకర్యం, మహిళలు వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ రైల్వే స్టేషన్ కు అమృత్ భారత్ పథకం రెండేళ్ల క్రితం మంజూరైన పనులు నత్త నడకన సాగడంతో, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను ప్రత్యేకంగా కలిసి పనులు వేగవంతం అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు పూర్తవడంతో త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అలాగే కాకినాడ రైల్వే స్టేషన్ నుండి హైదరాబాద్, మైసూర్, హిస్సర్ ప్రాంతాలకు నడుస్తున్న ప్రత్యేక రైళ్లను రెగ్యులర్ ట్రైన్స్ గా మార్చడం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అమలుతో పాటు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ శ్రీనివాస్ రైల్వే స్టేషన్ లో ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు, అనంతరం శేషాద్రి ట్రైన్ ఎక్కి ప్రయాణికులతో ముచ్చటించి గతానికి ఇప్పటికీ రైల్వే సౌకర్యాల్లో వచ్చిన మార్పులను అడిగి తెలుసుకోగా, ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, జనసేన నాయకులు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కే జగన్నాథపురం లో ఉద్రిక్తత

## భారీ పోలీసు బందోబస్తుతో అక్రమ కట్టడాలను కూల్చివేతకు సిద్ధపడిన పోలీసులు

### అడ్డుకున్న వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ అరెస్ట్





**అయినవిల్లి( మనసులో మాట) ఏప్రిల్ 7 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం కే జగన్నాథపురం లో మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ ఇంటి వద్ద గ్రామ కంఠం భూమి సర్వే నెంబరు 73 /4లో సుమారు 0.17 సెంట్లు భూమిని మేడిశెట్టి శ్రీనివాస్ ఆయన సోదరుడు మేడిశెట్టి రామాంజనేయులు ఆక్రమించి రేకుషెడ్ నిర్మించారు. దీనిపై రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని నిర్ధారించడంతో వారిపై అయిన విల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం కే జగన్నాథపురం లో అక్రమ కట్టడాలను కూల్చడానికి పి గన్నవరం సిఐ భీమరాజు ఆధ్వర్యంలో సుమారు వందమంది పోలీసులు భారీ బందోబస్తు అక్కడికి చేరుకున్నారు. అయినవిల్లి ఎంపీడీవో సరోవర్ తహసిల్దార్ విద్యాపతి ఎస్సై జ్యోతి సమక్షంలో అక్రమ కట్టడాలను కూల్చడానికి జెసిపి తో సిద్ధపడగా పి గన్నవరం నియోజవర్గ వైఎస్ఆర్సిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ తో పాటు 50 మంది వైఎస్ఆర్ సీపీ నాయకులు అడ్డుకోడానికి ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు గన్నవరపు శ్రీనివాస్ తో పాటు మరో పదిమంది వైఎస్ఆర్ సీపీ నాయకులను అరెస్ట్ చేసి ప్రత్యేక వాహనంలో అంబాజీపేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపేట, రాజోలు, పి గన్నవరం సిఐలతో పాటు పదిమంది ఎస్ఐలు ఐదుగురు ఏ ఎస్సైలు 50 మంది పోలీసులు పహారా కాసారు. ఇదిలా ఉండగా ఈ అక్రమభూమికి సంబంధించి మేడిశెట్టి శ్రీను రామాంజనేయులు పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న ధృవపత్రంలో 2024 సంవత్సరంలో మండల తాహసిల్దార్ పేరున పొందిన ధ్రువీకరణ పత్రం నకిలీదని రెవెన్యూ అధికారులు తేల్చారు. దీంతో తహసిల్దార్ సంతకం ఫోర్జరీ చేసినట్లు గుర్తించి మేడిశెట్టి శ్రీను మేడిశెట్టి రామాంజనేయులు స్థానిక విఆర్‌ఓ లపై అయినవిల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఇప్పటికే దర్యాప్తు పూర్తి చేశారు. ఏ క్షణంలోనైనా వారిని పోలీసులు అరెస్టు చేసయడానికి రంగం సిద్ధం చేసారు.

## లొల్లలో ఎన్‌టిఆర్ విగ్రహ ఆవిష్కరణ చేసిన ఎంపీ దగ్గుబాటి, ఎమ్మెల్యేలు వేగుళ్ళ, నల్లమిల్లి



**అనపర్తి (మనసులో మాట)ఏప్రిల్ 7:** మండపేట నియోజకవర్గం లొల్లలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహ ఆవిష్కరణ చేసిన రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మండపేట శాసనసభ్యులు, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వివివి చౌదరి, బిజెపి సీనియర్ నాయకులు కంటిపూడి సర్వారాయుడు, కూటమి నాయకులు. ఈ కార్యక్రమంలో అనపర్తి, మండపేట నియోజకవర్గాల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇది ముమ్మాటికీ వైసీపీ విష వ్యూహం

**- ఏబీఎన్- ఆంధ్రజ్యోతిపై దాడి ప్రయత్నాన్ని ఖండించిన గన్ని కృష్ణ**
**- వార్తా కథనాలు అభ్యంతరకరంగా ఉంటే న్యాయపరంగా పోరాడాలని సూచన**
**- ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వం మెతకగా వ్యవహరించడం సరికాదు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** ఒక పత్రికా అధినేతగా రాజకీయాలలో జరిగే అంశాలను విశ్లేషించినప్పుడు అది అభ్యంతరకరంగా ఉంటే దానిపై న్యాయ బద్ధంగా పోరాటం చేయాలి గాని పత్రికా కార్యాలయాలపై దాడులకు దిగటం సరికాదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. హైదరాబాదులో ఏబీఎన్- ఆంధ్రజ్యోతి కార్యాలయం పై వైసీపీ నాయకులు చేస్తున్న నిరసనను, దాడి ప్రయత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ వైసీపీ విష వ్యూహమని ఆయన ధ్వజమెత్తారు. ఆందోళన ముసుగులో ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి పై దాడికి పాల్పడే ప్రయత్నానికి వైసీపీ నేతలు దిగారని, దీనిపై ప్రభుత్వాలు సీరియస్ గా స్పందించాలన్నారు. జగన్మోహన్ రెడ్డి రాజధానిపై చేసిన పిచ్చి వ్యాఖ్యలపై ఏబీఎన్ రాధాకృష్ణ ఒక విశ్లేషణ చేశారని.. దానిని జీర్ణించుకోలేక వైసీపీ నేతలు దాడులకు ప్రయత్నించడం వారి మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ఏకంగా పార్టీ నాయకులను హైదరాబాద్ తరలించి మూకుమ్మడి దాడికి వెళ్లడం ప్రజాస్వామ్యంలో పత్రిక స్వేచ్ఛను హరించడమేనని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి విషయంలో గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన ఆనందాన్ని ముక్కలు చేయాలన్న విష వ్యూహంతో వైసీపీ డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. వైసీపీ చేసిన మూడు రాజధానుల ప్రయత్నం చెల్లలేదని, జగన్ తెరపైకి తెచ్చిన మావిగన్ అనే నినాదాన్ని ప్రజలు ఛీకొట్టారని గన్ని అన్నారు. జగన్ మావిగన్ ప్రకటనపై ఆ పార్టీ నేతలే పరోక్షంగా విమర్శలు కూడా చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అధికార మదంతో వైసీపీ నేతలు వంశీ, జోగి రమేష్, అంబటి రాంబాబు, కొడాలి నాని వంటి నాయకులు భువనేశ్వరి పై చేసిన వ్యాఖ్యలు క్షమించరానివన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఒక మహిళను కించపరిచి అగౌరవంగా మాట్లాడిన ఈ నేతలకు ప్రజలు చెప్పుతో కొట్టినట్టు సమాధానం చెప్పారని మండిపడ్డారు. తప్పుడు రాతల మీద దాడులు చేయాలి అంటే జగన్మోహన్ రెడ్డి పత్రిక పై ఈ పాటికి ఎన్నిసార్లు దాడులు చేయాలో చెప్పలేమన్నారు. అలాంటి విష సంస్కృతి సరికాదని.. ఏదైనా వార్తా కథనం అభ్యంతరంగా ఉంటే దానిపై న్యాయపరంగా పోరాటం చేయాలని ఈ సందర్భంగా గన్ని సూచించారు. ఈ విషయాలపై ప్రభుత్వం మెతకగా వ్యవహరించటం సరికాదని, విష వ్యూహాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గన్ని కృష్ణ డిమాండు చేశారు.

# ఎప్పుడు.. ఏది అవ్వాలో!

**- మొత్తానికి చైతన్య నగర్-2లో సీసీ రోడ్డు..**
**- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** ప్రజలు ఎంత నెత్తీ నోరూ బాదుకున్నా..అధికారులు చుట్టూ తిరిగినా..పీజీఆర్ఎస్ లో మొరపెట్టుకున్నా.. స్పందించని అధికారులు.. వారికి బుద్ధిపుట్టి..మొత్తానికి రోడ్డు వేయటం ప్రారంభించారు. ఎప్పటికి ఏది అవ్వాలో..ఎప్పటికి పూర్తి చేయాలో..అప్పటికే అవుతుంది తప్పిస్తే..ప్రజల ఇబ్బందులు గ్రహించి మాత్రం అధికార యంత్రాంగం స్పందించదనేది మాత్రం వాస్తవం. ఏదేమైతేనేమి..రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేట గ్రామ పంచాయతీ చైతన్య నగర్-2లో ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉంచిన సగం సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభించారు. ఇప్పుడు కూడా వరుసగా మూడు రోజులు వాయిదా పడుతూ.. మంగళవారం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రహదారి నిర్మాణ పనులు చకచకా ప్రారంభించారు. మొన్న పర్యవేక్షణ అధికారులు రాలేదని, నిన్న సోమవారం పనులు ప్రారంభించే ముందు వర్షం కురవటంతో పనులు ముందుకు సాగలేదు. అంతకు ముందు నాలుగైదు రోజులు క్రిందటే మెటీరియల్ రోడ్డుకు అడ్డంగా వేయటంతో స్థానికులు కాస్త ఇబ్బందులు పడ్డా, రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టేశారని కొందరు కోపతాపాలు ప్రదర్శించినా..పడక తప్పలేదు. ఎవరి ఆవేదన వారిది. పడ్డవాడు చెడ్డవాడు కాదని నిగ్రహించుకుని..మొత్తానికి అందరూ సంయమనం పాటించి..తమ వీధులో సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉంచేసిన సీసీ రోడ్డు నిర్మాణం పూర్తవుతున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకూ అధికారుల అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు..పాపం వారు మాత్రం ఏం చేస్తారు.. ఎప్పటికి ఏది ఎలా అవ్వాలో.. అప్పటికి అది అలానే పూర్తవుతుందని అనుకోవడం కొస మెరుపు.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - 46వ డివిజన్‌లో ఆకస్మిక పర్యటన**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులు, సిబ్బందికి రాజమహేంద్రరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. స్థానిక 46వ డివిజన్‌లోని రామదాసుపేట, వెంకటాపురం, చిట్టి సంజీవనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేయడం లేదని ఫిర్యాదులు రావడంతో ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక నాయకులు, నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులతో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. అధికారులతో కలసి పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ "మన నగరం... మన ప్రాంతాన్ని శుభ్రంగా, అందంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు ఒక రోజు లేదా ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా, సరైన ప్లానింగ్‌తో అన్ని కాలనీల్లో రోటేషన్ విధానంలో నిర్వహించాలని, ప్రతి వారానికి ఒక రోజు ప్రత్యేకంగా గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేసి, చిట్టి సంజీవనగర్, రామదాసు కాలనీ, వెంకటాపురం వంటి ప్రాంతాల్లో క్రమంగా శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఎక్కువగా రాకపోకలు చేసే ప్రదేశాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కళాకారులు, యువతను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి, వారానికి ఒకసారి అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తే ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి వారం అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించాలన్నారు. మంచి పని చేసిన వారిని ప్రోత్సహించి, అవార్డులు ఇవ్వడం ద్వారా పారిశుద్ధ్య సిబ్బంది మరింత ఉత్సాహంగా పని చేస్తారన్నారు. స్థానిక నాయకులు, అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుని, ప్రజల సహకారంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూడాలని, అవసరమైతే కమిషనర్ తో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను చర్చించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక నాయకులు, అధికారులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

# కెరియర్ పట్ల అవగాహనతో కోర్సులు ఎంపిక

**- 'గోదావరి బాలోత్సవం' ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాజీ ఎంఎల్సీ కేఎస్ లక్ష్మణరావు**
**- సివిల్ సర్వీసెస్- ప్రాథమిక వివరాలు పుస్తక ఆవిష్కరణ**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** విద్యార్థులు కెరియర్ పట్ల అవగాహనతో కోర్సులు ఎంపిక చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంఎల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. నగరంలోని సంహిత కన్వెన్షన్ హాల్లో 'గోదావరి బాలోత్సవం' ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. గోదావరి బాలోత్సవ్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి తులసి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సివిల్ సర్వీసెస్- ప్రాథమిక వివరాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచి, సామర్థ్యం, అవకాశాలు దృష్టిలో ఉంచుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అనేక కొత్త కోర్సులు వస్తున్నాయని, విద్యార్థులు వాటి గురించి కూడా తెలుసుకుని విజ్ఞానం పెంచుకుంటూ ఉపాధి పొందే విధంగా జీవిత మార్గాలను ఎంచుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక మూస పద్ధతిలో ఇంటర్ పూర్తయిన విద్యార్థులంతా ఇటు ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సుల కోసమని ఇబ్బడి ముబ్బడిగా బైపీసీ, ఎంపీసీ కోర్సులను ఎంచుకుంటున్నారని అన్నారు. సత్వర ఉపాధి కల్పించే ఐటీఐ, పాలిటెక్నికల్, టీటీసీ, నర్సింగ్, ప్లంబింగ్, ల్యాబ్ టెక్నీషియన్ వంటి ఎన్నో కోర్సులు ఉన్నాయని అవి కూడా భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అదే విధంగా అత్యధిక మంది సాఫ్ట్ వేర్ అంటూ కంప్యూటర్ రంగం వైపు వెళుతున్నారని, అయితే కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరం గాని, కంప్యూటర్ కోర్సు ఒకటి మాత్రమే చేస్తే ఎప్పటికైనా ఇబ్బందేనని అన్నారు. ఇటీవల కాలంలో ఒరాకిల్ సంస్థ 30 వేల ఉద్యోగాలు ఒక్కసారిగా తొలగించిందని, ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్వేర్ రంగానికి గడ్డుకాలం నడుస్తోందని అన్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలు మంచి ఫాకల్టీ ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇంజినీరింగ్ చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. చార్టెడ్ అకౌంట్, బిజినెస్ మేనేజ్‌మెంట్, హెటల్ మేనేజ్‌మెంట్, ఎయిర్ హోస్టెస్ కోర్సులకు కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. విద్యార్థులు ఏ కోర్సు చదివినిప్పటికీ అందులో నైపుణ్యం, విషయ పరిజ్ఞానం సంపాదించినపుడు మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని ఎప్పటికపుడు మారుతున్న పరిజ్ఞానాన్ని, సామాజిక పరిస్థితులను ఆకళింపు చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సవివరంగా నివృత్తి చేశారు.

# ఐసోలేషన్ వార్డులో ఉపకరణాలు బహుకరించిన స్వర్ణాంధ్ర



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** అనాథ వృద్ధులైన రోగులకు ప్రత్యేక సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ కెనడి, స్వర్ణాంధ్ర నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబులు అభినందించారు. మంగళవారం ఉదయం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అనాథ వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులో అవసరమైన ఉపకరణాలను స్వర్ణాంధ్ర సేవా సంస్థ అందించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆసుపత్రి సలహా మండలి సభ్యుడు అనూప్ కుమార్ జైను మాట్లాడుతూ ఎక్కడ సహాయం అవసరమో అక్కడ స్వర్ణాంధ్ర అండగా ఉండి సేవలందిస్తోందని ప్రశంసించారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ సమకూర్చిన స్ట్రక్చర్, దుస్తులు, డైపర్లు , సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు, అక్కడ పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది సేవలు అమూల్యమైనవని అన్నారు. ఆ వార్డులో ఇంకా కావలసిన కప్ బోర్డు త్వరలోనే స్వర్ణాంధ్ర సమకూరుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ముందు జరుగుతున్న నిత్యాన్నదాన్న సేవల్లో అనూప్ జైన్ పాల్గొని ఇంతటి గ్యాస్ కష్టాల్లో కూడా స్వర్ణాంధ్ర నిత్యాన్నదాన సేవలను అభినందించారు. స్వర్ణాంధ్ర నిత్యాన్నదానం నేటికి 2004 వ రోజుకి చేరుకుందని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ అయ్యర్, డాక్టర్ అశోక్, మురళి, మేరా కుమారి, దివ్య, సింధు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా శోభిత్ వర్మ ఛారిటబుల్ ట్రస్టు ప్రథమ వార్షికోత్సవం

**- ఆకట్టుకున్న జాతీయ స్థాయి ఏకపాత్రాభినయం, కవి సమ్మేళనం, జానపద కళారూపాల ప్రదర్శనలు**
**- మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** శోభిత్ వర్మ ఛారిటబుల్ ట్రస్టు ప్రథమ వార్షికోత్సవం ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. శోభిత్ వర్మ జయంతిని పురస్కరించుకుని ఏకధాటిగా 12 గంటల పాటు జాతీయ స్థాయిలో ఏకపాత్రాభినయం, కవి సమ్మేళనం, విభిన్న జానపద కళారూపాలు, తోలు బొమ్మలాట, ఇంద్రజాల ప్రదర్శనలు, రక్తదానం తదితర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచి శోభిత్ వర్మ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, బహుముఖ కళా ప్రపూర్ణ, ప్రముఖ ఇంద్రజాలికుడు డాక్టర్ చల్లగాలి శ్రీనివాస్ వర్మ కృష్ణమాచారి, ట్రస్టు సభ్యులు జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్థానిక లాలా చెరువు సాయి మాధవి నృత్య కళాశాల విద్యార్థులు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించగా, తొమ్మిది గంటల నుంచి జాతీయ స్థాయి ఏకపాత్రాభినయం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి గోరంట్ల గంగాధర్ హిరణ్య కశ్యపుడు (పల్నాడు జిల్లా) ప్రథమ బహుమతి రూ.4000లు, షీల్డ్, ప్రశంసా పత్రము, గోల్డ్ మెడల్ అందజేశారు. ద్వితీయ బహుమతి ఎం అర్జున్ రావు మహారాజ కర్ణ (తెలంగాణ) రూ. 3000లు నగదు బహుమతి, జ్ఞాపిక, శాలువా, సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రము అందజేశారు. తృతీయ బహుమతి మహతి రమణి ఏకపాత్రాభినయం రాధ (తణుకు) రూ. 2000లు నగదు బహుమతి, జ్ఞాపిక, శాలువా, మెడలు, సన్మాన పత్రంతో సత్కరించారు. కన్సోలేషన్ బహుమతులు పిన్నం ప్రేమ్ కుమార్ వారణాసి కాటి సీను (పెద్దాపురం) రూ. 500లు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసా పత్రం, రెండో కన్సోలేషన్ ఏ ప్రసాద్ శర్మ (విజయనగరం) రూ.500లు నగదు బహుమతి, దుశ్శాలువా, జ్ఞాపిక, సన్మాన పత్రము, జూరియా అవార్డు చింతాడ గోవిందమ్మ, పిడకల శీను రూ.500లు దుశ్శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్, రెండో జ్యూరీ బీ దుర్గా కళ్యాణి (శ్రీకాకుళం) రూ.500లు నగదు బహుమతి, శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్ లతో రాష్ట్ర సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందజేశారు. తదనంతరం ప్రతి నెల యథావిధిగా ముగ్గురు కళాకారులకు, ముగ్గురు సంఘ సేవకులకు సన్మానం చేస్తున్న క్రమంలో డాక్టర్ బోస్ కు మూన్ స్టార్ బిరుదును ప్రదానం చేశారు. డాక్టర్ బీఎల్ అండ్ రాజ్ కు ప్రత్యేక సన్మానము, ఆకుల విజయభారతికి సేవా రంగంలో సన్మానించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ దర్శకుడు కురసాల కళ్యాణకృష్ణకు మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఘన సన్మానం చేశారు. అలాగే మరో ముఖ్య అతిథి కే సత్యరాజు చేతుల మీదుగా కళాకారులు, కవులు, హరికథా భాగవతార్లకు, రక్తదానం చేసిన వారందరికీ దాదాపుగా 250 మంది కళాకారులకు సంఘ సేవకులకు, ఆదిత్య కాలేజీ విద్యార్థినీ విద్యార్థులకు, రక్తదానం శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రముఖుల చేతుల మీదుగా సన్మాన పత్రం, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కందుల దుర్గేష్, సినీ దర్శకుడు కళ్యాణ కృష్ణ, సత్య రాజు, ప్రముఖ సినీ డైరెక్టర్ సామ్రాట్ శ్రీనివాసరావు, తోట సుబ్బారావు, తోట కనకయ్యలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.




# దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు ఇచ్చే వరకు పోరాడతాం

**- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన హక్కులను కాలరాసేలా దేశంలో పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పలు రాజకీయ పార్టీలు, క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు, ప్రజా సంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అధ్యక్షతన స్థానిక ఏపీ పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో మంగళవారం అఖిల పక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాజమండ్రి పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు , సీపీఎం జిల్లా కార్యదర్శి టీ అరుణ్, చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, కేకే సంజీవరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపకుడు దేశిరెడ్డి బలరామ నాయుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తాళ్లూరి విజయకుమార్, సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు హాజరయ్యారు.

ముందుగా తాటిపాక మధు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునర్ సమీక్ష చేసేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండు చేశారు. దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎవరూ ఏ మతాన్నైనా అనుసరించే హక్కు ఉందని, మతం ప్రకారం రిజర్వేషన్లు వర్తించవని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం దారుణమని తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్‌లో దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించేలా చర్చించి రాజ్యాంగాన్ని సవరణ చేపట్టాలని డిమాండు చేశారు. దేశ వ్యాప్తంగా దీనిపై పోరాటం చేయడానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేందుకు ఎవరికి అవకాశం ఉండకూడదన్నారు. మతం మారితే రిజర్వేషన్లు కోల్పోవాలనే నిర్ణయం తీసుకోవటాన్ని పెద్ద కుట్రగా అభివర్ణించారు. దీనిపై తక్షణం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి అసెంబ్లీలో తీర్మానం చేయించాలని డిమాండు చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు పునరుద్ధరించే వరకు అఖిల పక్ష కమిటీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కూడా సమావేశంలో తీర్మానం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార్టిన్ లూథర్, డాక్టర్ వడయార్, బెజవాడ రంగారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు వివిధ పక్షాల పవన్, కొండలరావు, పూర్ణిమారాజ్, సింధియా రాణి, శ్రీనివాస్, యాళ్ల వీరభద్రరావు, నిల్లా వీర్రాజు, తాడి సూరిబాబు, బర్రే సుబ్రహ్మణ్యం, నల్లా రామారావు తదితరులు పాల్గొన్నారు.

# చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు డ్రోన్లతో బ్రేక్

**- పోలీసు యంత్రాంగం ప్రత్యేక నిఘా**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** తూర్పు గోదావరి జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగం రాత్రంతా డ్రోన్ లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తోంది. రాత్రి సమయంలో జిల్లాలో అసాంఘిక శక్తులను, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేయాలని లక్ష్యంగా డ్రోన్ కెమెరాలతో క్షేత్ర స్థాయిలో జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా అంతటా ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నిర్మానుష్యమైన ప్రదేశాలలో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి సేవించడం, పేకాట, ఈవిటీజింగ్, చైన్ స్నాచింగ్, జూదం తదితర నేరాలపై ప్రతి రోజూ రాత్రి సమయాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా పాడుపడిపోయిన ఇళ్ళు, అపార్ట్మెంట్ల మీద, నివాస గృహాల పై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించడం జరుగుతోంది.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ డే



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పు గోదావరి జిల్లా చైర్మన్ డాక్టర్ జీ తరుణ్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ గైట్ కాలేజీ మెకానికల్ బ్రాంచ్ నందు బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీ శ్రీనివాసరావు బేసిక్ లైఫ్ సపోర్ట్ లో ఎవరికైనా ఇబ్బంది వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా ఇవ్వాలో శిక్షణను ఇచ్చారు. అలాగే కుక్క కాటుకి, పాము కాటుకి అందించే ప్రథమ చికిత్స గురించి తెలిపారు. డాక్టర్ వసంత, డాక్టర్ పూజారావు శిక్షణకు సహకరించారు. రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ జీ మహాలక్ష్మి రెడ్ క్రాస్ విధివిధానాలు గురించి, అందిస్తున్న సేవల గురించి వివరించారు. ప్రతి విద్యార్థి యూత్ రెడ్ క్రాస్ లో సభ్యులు గా జాయిన్ అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ గోపీకృష్ణ, కే శివ, మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



# జగన్ ప్రణాళిక అద్భుతం

## 'మావిగన్'..కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి సంజీవని

**- రాజకీయ దృక్పథంతో కాకుండా, రాష్ట్ర అభివృద్ధి కోణంలో చూడండి**
**- వైసీపీ సీనియర్ నేత గిరజాల బాబు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచించిన 'మావిగన్' రాజధాని ప్రణాళిక అద్భుతమైనదని, కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి సంజీవిని లాంటిదని, రాజమహేంద్రవరం రూరల్ మాజీ కోఆర్డినేటర్ గిరజాల బాబు అన్నారు. మంగళవారం ఆయన కడియంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మాదిరిగా ప్రజలను మభ్యపెట్టకుండా జగన్ ఉన్నది ఉన్నట్టు మాట్లాడే నిజాయితీ ఉన్న నాయకుడు అన్నారు. ఆయన మాటలని చాలా మంది, వెటకారం చేసి, వక్రీకరించినా భవిష్యత్తులో అవే వాస్తవాలుగా తేలిన సంఘటనలు చాలా ఉన్నాయన్నారు. కరోనా సమయంలో నాటి ముఖ్యమంత్రి జగన్ డోలో, పారాసెట్మాల్, టాబ్లెట్స్, శానిటైజ్ చేసుకుంటూ సామాజిక దూరం పాటించి, కరోనాతో సహజీవనం చేయడం తప్పదని చెప్తే అందరూ ఎద్దేవా చేశారన్నారు. కరోనా ముదిరిన తర్వాత చివరికి జగన్ ఏదైతే చెప్పారో అదే పాటించాల్సి వచ్చిందని ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. జగన్మోహన్ రెడ్డి గొప్ప విజనరీ గల నాయకుడని కొనియాడారు. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ, విలేజ్ క్లినిక్కులు తదితర వాటి ద్వారా ప్రజలు ఇల్లు కదలకుండా జగన్ ఎలాంటి సేవలు అందించారో మనం కళ్లారా చూశామన్నారు. ఏ ముఖ్యమంత్రీ ఆలోచించని విధంగా..నాడు- నేడు ద్వారా విద్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, నాలుగు పోర్టులు నిర్మించటం ద్వారా ఆయనకు ఎంత దూరదృష్టి ఉందో తెలిసిందన్నారు. ఇప్పుడు జగన్ మావిగన్ అంటే చాలామంది అపహాస్యం చేస్తున్నారు కానీ అది బృహత్తర ప్రణాళికగా గిరజాల బాబు అభివర్ణించారు. మచిలీపట్నం పోర్టును, రెండు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లను, జాతీయ రహదారిని కలుపుకుంటూ సకల సదుపాయాలతో వర్ధిల్లే రాజధాని ఇదని, కేవలం 20 వేల కోట్లతో చాలా తక్కువ సమయంలో దీన్ని నిర్మించగలం అన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వటం ఈ రాష్ట్రానికి దురదృష్టకరమైన చారిత్రాత్మక తప్పిదం అయినది అన్నారు. 2014లో జగనన్న గెలిచి ఉంటే మన రాష్ట్రంలో ఇప్పటికే మంచి రాజధాని ఏర్పడి ఉండేదన్నారు. ఆనాడు కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణ కమిటీ, మేధావుల సలహాలు పక్కన పెట్టి, రాష్ట్రంలోనే అద్భుతమైన పంట భూములను నాశనం చేసి, నిర్మాణాలకు అణువు గాని అమరావతిని స్వార్థ ప్రయోజనాల కోసం రాజధానిగా ఎంపిక చేసి రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారన్నారు. ఇప్పటికైనా ఆలోచన చేసి భేషజాలకు పోకుండా తప్పును సరిదిద్దుకుని, ఇప్పటికే అన్ని సదుపాయాలు ఉండి తక్కువ ఖర్చుతో, సామాన్యుడు కూడా నివసించగలిగే జగన్ ఆలోచన ప్రకారం.. 'మావిగన్' ఈ పేరు ఇష్టం లేకపోయినా ఇంకొక పేరుతోనైనా ఈ ప్రదేశాన్ని రాజధాని చేయాలని గిరజాల బాబు కోరారు.

# పెంటపల్లిలో గడ్డి వాము దగ్ధం



**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 7 :** గోకవరం మండలం పెంటపల్లిలో గ్రామానికి చెందిన రైతు రేలంగి రమణకు చెందిన సుమారు నాలుగు ఎకరముల గడ్డివాము మంగళవారం అగ్నికి ఆహుతి అయినట్లు తెలిపారు. గడ్డివాము దగ్ధం అవడం వల్ల తన పశువులకు పశుగ్రాసం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు

## రూ.2.85 కోట్లతో చేపట్టిన

# విద్యుత్ ఆధునీకరణ పనులు

**- ఆత్రేయపురం మండల ప్రజల దీర్ఘకాలిక విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం**
**- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**కొత్తపేట మనసులో మాట ఏప్రిల్ 7..** ఆత్రేయపురం మండల విద్యుత్ సమస్యలకు నేటితో పరిష్కారం లభించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆత్రేయపురం మండలంలో పలు విద్యుత్ ఆధునీకరణ పనులను ప్రారంభించారు. మొదటగా బొమ్మూరు 220 కెవి సబ్ స్టేషన్ నుండి ఆత్రేయపురం మండలానికి గోదావరి నది మీదుగా వచ్చే పాత టవర్ లైన్స్ స్థానంలో రూ.50లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కొత్త పాంథర్ కండక్టర్ ను జిల్లా ఈపీడీసీఎల్ సూపరిండెంట్ రాజేశ్వరి దేవి, కన్స్ట్రక్షన్ డీఈ విజయానంద్, అమలాపురం డిఈ రాంబాబు లతో ప్రారంభించారు. అనంతరం పులిదిండి, వద్దిపర్రు, వెలిచేరు గ్రామాలకు 24 గంటలు 3 ఫేజ్ విద్యుత్ సరఫరా చేయుటకు రూ.2.35కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 11కె.వి లైన్, ట్రాన్స్ఫార్మర్లు,11కె.వి బ్రేకర్ ను ప్రారంభించారు. నియోజకవర్గంలో ఆర్డీఎస్ఎస్ పనులు చేపట్టి, పూర్తి చేసుకుంటున్నామన్నారు. బొమ్మూరు నుంచి వచ్చే వైరు పురాతనమైనది కావడంతో తెగిపోవడం జరిగేదన్నారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం వెంటనే స్పందించి గోదావరి మీదుగా ఉన్న పాత వైరు తొలగించి, దాని స్థానంలో శక్తివంతమైన పాంథర్ కండక్టర్ను అమర్చిందన్నారు. ఆత్రేయపురం మండలానికి కొత్తపేట సబ్ స్టేషన్ నుంచి లైన్ రావడం చాలా దూరం అవుతుందని, అందుకే బొమ్మూరు నుంచి వచ్చే లైన్ ను ఆధునీకరించడంతో ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రజల యొక్క మేలే తమకు ముఖ్యమనుకుని, ప్రజలకు 24 గంటలు సరఫరా ఇవ్వాలనే లక్ష్యంతో రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆర్డీఎస్ఎస్ అనే పథకంలో ప్రతి గ్రామంలో త్రీఫేస్, సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్లు,కొత్తగా లైన్లు వేయడం, పాత కరెంటు స్తంభాలు తీసి కొత్తవి వేయడం చేస్తుందన్నారు. అన్ని సరిదిద్దుకుంటూ రాబోయే నాలుగైదు ఏళ్లకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చేయాలని ఆలోచనతో పెద్ద ఎత్తున ఆర్డీఎస్ఎస్ పనులు చేసుకుంటున్నామన్నార.ఎక్కడ లో వోల్టేజ్ ఉన్న ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసే సరిదిద్దుదామని ఎస్ ఈ చెప్పారని అన్నారు. ఆత్రేయపురం మండలంలో నేడు ప్రారంభించుకున్న పనులతో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. త్రీఫేస్ సరఫరా ఇక నిరంతరంగా వస్తుందన్నారు. ఎవరైనా చిన్న చిన్న పరిశ్రమలు పెట్టుకున్న ఇబ్బందులు ఉండవన్నారు. లో వోల్టేజ్ సమస్య కూడా తీరిపోతుందని. వరదల సమయంలో కూడా విద్యుత్ సరఫరా అంతరాయం నిరంతర నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంటుందన్నారు.కోనసీమ ప్రాంతంలో కరెంట్ లైన్లు ఎక్కువగా చెట్ల మధ్య నుంచి వెళ్తున్నాయని దీని వలన చెట్టు కొమ్మలు, ఆకులు లైన్లపై పడటం వల్ల తరచుగా విద్యుత్ అంతరాయం వస్తుందని. ఈ సమస్యను పరిష్కరించడానికి సుమారు రూ.3.60 కోట్లతో ప్రస్తుతం 33/11కెవి బిళ్లకుర్రు సబ్ స్టేషన్ కు వెళ్లే సుమారు 8 కిలో మీటర్లు 33 కెవి మెయిన్ లైన్ను ప్లాస్టిక్ కోటింగ్ ఉన్న కవర్డ్ కండక్టర్ తో మార్చడం.ఈ కవర్డ్ కండక్టర్ వలన గాలి వీచినా, వర్షం పడినా, చెట్టు ఆకులు లేదా కొమ్మలు లైన్లపై పడినా కరెంట్ నిలిచిపోవడం దాదాపుగా ఉండదన్నారు. అలాగే ఎస్సీ, బీసీ,ఓసి వర్గాలన్నీ సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# వాకర్స్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం




**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 7..** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని జగ్గంపేట వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జగ్గంపేట లో గల స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీ ని ఉద్దేశించి వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.సిరి సంపదలు ఎన్ని ఉన్నా ఆరోగ్యం లేకుంటే వారి జీవితం శూన్యమని అందుచేతనే మన పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారని ప్రతి ఒక్కరూ తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తను నడుస్తూ తోటి వారిని నడిపించాలని , అలాగే యోగ, ధ్యానం, సైక్లింగ్ ,జిమ్ మొదలైన వ్యాయామాలు చేయాలని కోరారు.వాకర్స్ క్లబ్ జగ్గంపేట అధ్యక్షుడు పొట్టి రాజేష్ నాయకత్వంలో ప్రజలలో చైతన్యం కొరకు పలు స్లోగన్ తో ర్యాలీని కాకినాడ రోడ్ లో గల పంచాయతీ ఆఫీసు,నేతాజీ వీధి,కొంగల రావి చెట్టు , బ్రహ్మంగుడి ,మర్రి మొక్క వీధి దుర్గమ్మ గుడి , జె వి ఆర్ సెంటర్ , నేషనల్ హైవే , గుర్ర ప్పాలెం రోడ్డు ,శ్రీరామ్ నగర్ నుండి గోకవరం రోడ్డు మీదుగా తిరిగి పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఆర్ టి సి సెంటర్ నందు మానవహారం ఏర్పాటు చేశారు. మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్త కొండబాబు ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు రోగులకు పండ్లు , రొట్టెలు పంచడం జరిగింది.తదుపరి ప్రభుత్వ ఆసుపత్రి నందు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ ,డాక్టర్ నీలిమ , హెడ్ నర్సు లక్ష్మీ ,ల్యాబ్ టెక్నీషియన్ మాధురీ ల సమక్షంలో ఆసుపత్రి నందు గల రోగులు అందరికి రొట్టెలు ,పళ్ళు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ డిస్టిక్ హెల్త్ అడ్వైజర్ డాక్టర్ ఎం ఎస్ బాలగంగాధర్ , క్యాబినెట్ సెక్రటరీ మంచాల మల్లేశ్వరరావు , కోశాధికారి వెత్సా నాగ సత్య , బుల్ టెన్ ఎడిటర్ ముమ్మిడివరపు సూర్యనారాయణమూర్తి , పి.ఆర్.ఓ. ఇల్ల బుద్దా జీ , క్లబ్ కార్యదర్శి మానేపల్లి సతీష్ , కోశాధికారి నిట్టల శ్రీనివాస్ , సీనియర్ వాకర్స్ చంద్రమౌళి వెంకట శాస్త్రి ,బొట్టా అప్పలరాజు, కర్రి సత్తిబాబు , తమిళం తంబి శర్వానంద్, వెంకట్ , వల్లూరి వెంకట గంగాధర్ , పొట్టి పెద్ద వీర్రాజు , మాతంశెట్టి శ్రీనివాస్ , కొత్త నాగ పండు పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

# జగ్గంపేట నియోజకవర్గంలో 2026-27 బడ్జెట్ అవుట్‌రీచ్ పై సమావేశం




**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 7..** స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో జగ్గంపేట నియోజకవర్గంలో 202627 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై అవుట్‌రీచ్ కార్యక్రమం మంగళవారం విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎన్ వివి సత్యనారాయణ అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు.
ఈసందర్భంగానియోజకవర్గంలోని అన్ని మండలాల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన వార్షిక బడ్జెట్‌పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న "సూపర్ సిక్స్" పథకాల కింద
తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ,ఎన్టీఆర్ భరోసా,దీపం 2.0,స్త్రీ శక్తి, ఆటో డ్రైవర్ సేవ,పథకాలకు సంబంధించిన నిధుల కేటాయింపు మరియు అమలు విధానాలపై వివరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గానికి వివిధ ప్రభుత్వ శాఖల వారీగా మొత్తం రూ. 468 కోట్లు కేటాయించబడినట్లు తెలిపారు. ఇందులో పంచాయతీరాజ్, వైద్య, విద్య, శిశు సంక్షేమ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, వ్యవసాయ శాఖలు తదితర విభాగాలు ఉన్నాయి.రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంగా కొనసాగిస్తోందని పేర్కొన్నారు.అదేవిధంగా రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు, నేషనల్ హైవే విస్తరణ పనులు, మల్లిశాలలో ఇండస్ట్రియల్ పార్క్ కార్యక్రమాలను ముఖ్యమంత్రి కి తెలియజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎన్.వి.వి. సత్యనారాయణ, పోలవరం, పుష్కర, ఏలేరు ఈఈలు పి. రాజేశ్వరరావు, డి. శ్రీనివాసరావులు, శేషగిరిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడప భరత్, నాలుగు మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు మరియు సీపీఏపీ బృందం పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానం డైరెక్టర్ గా యరగతపు బాబ్జి

**- నిబద్ధత కు గుర్తింపు.. - టీడీపీ కోసం సుదీర్ఘ సేవలు..**



**మండపేట (మనసులో మాట), ఏప్రిల్ 7:** మండపేట మండలం ద్వారపూడి కి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు యరగతపు బాబ్జి రాష్ట్రంలోని ప్రసిద్ధ దేవాలయం శ్రీ అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి పాలక వర్గ డైరెక్టర్ గా నియమితులయ్యారు. యరగతపు టీడీపీలో సుదీర్ఘకాలంగా సేవలు అందించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేశారు. ఈయన పెదనాన్న దివంగత యరగతపు బాబూరావు మండపేట ఎంపీపీ గా పనిచేశారు. 1989 నుండి బాబ్జీ టీడీపీ జెండా పట్టుకున్నారు. అనంతరం 1994 ఎన్నికల్లో దివంగత వీఎస్ చౌదరి కి మద్దతుగా నిలిచారు. అపుడు తొలుత మండపేట మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా, కొద్ది కాలానికే తెలుగు యువత అధ్యక్షునిగా ఎంపికయ్యారు. సుదీర్ఘకాలం ఆ పదవిలో ఉన్నారు. 2004 నుండి ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు అత్యంత సన్నిహితులుగా మెలిగారు. ద్వారపూడి మాజీ సర్పంచ్ దివంగత పంతంగి వెంకన్న అనుచరులుగా ద్వారపూడి లో టీడీపీ హవా చాటారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఈయన, కాపు సామాజిక వర్గానికి చెందిన అడబాల బాబ్జీ ఇద్దరూ ప్రాణ మిత్రులు. ఇద్దరు టీడీపీ లో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేశారు. టీడీపీకి ద్వారపూడి తిరుగులేని శక్తి గా రూపొందించారు. ఇద్దరి మధ్య విభేదాలతో అడబాల బాబ్జి వైసీపీలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన వైసీపీ మండల కన్వీనర్ గా పనిచేస్తున్నారు. కాగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆశీస్సులతో
యరగతపు బాబ్జి ఇరవై ఏళ్ల పాటు మండపేట మండల టీడీపీ అధ్యక్షుడిగా సేవలు అందించారు. 2014 లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత యరగతపు బాబ్జి కి మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తానని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆఫర్ చేశారు. తనకు వద్దని చేకూరి రమేష్ రాజుకు ఈ పదవి ఇప్పించారని టీడీపీ కార్యకర్తలు ఇప్పటికీ చెబుతూనే ఉంటారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలను నిబద్ధతతో నిర్వహిస్తూ వేగుళ్ళకు వీర విధేయులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణకు అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో అన్నవరం దేవస్థానం బోర్డు లో డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు గుర్తింపు ఇచ్చిన పార్టీ కి రుణపడి ఉంటానన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, మంత్రి నారా లోకేష్, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.




# ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ..

**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 07:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇందిరానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బత్తుల జయరామ్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ.. శాస్త్రీయ వైద్య విజ్ఞానాన్ని నమ్మాలని, మూఢనమ్మకాలను వీడాలని కోరారు. ముఖ్యంగా 9-14 ఏళ్ల బాలికలకు హెచ్ పి వి టీకా వేయించడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చని సూచించారు. "విజ్ఞానంతో అడుగులు - ఆరోగ్యంతో ఎదుగుదల" అనే నినాదంతో సాగిన ఈ ర్యాలీలో ఏ ఎన్ ఏం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. పోషకాహారం, వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్లకార్డుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లను తినవద్దని, స్వచ్ఛమైన ఆహారం, నీరు తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో ర్యాలీ




**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 7..** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అధ్వర్యంలో కార్యాలయ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు.
జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.జె. నరశింహా నాయక్ మాట్లాడుతూ విజ్ఞానానికి అండగా నిలుద్దాం, ఆరోగ్యం కోసం కలిసి పనిచేద్దాం అని స్లోగన్ ఇవ్వడం జరిగినదని సిబ్బందికి తెలియజేసారు. విజ్ఞానశాస్త్రంపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం, వాతావరణ మార్పు వంటి ఆరోగ్య ముప్పులను ఎదుర్కోవడం మరియు సాక్ష్యాధారిత ఆరోగ్య విధానాలను బలోపేతం చేయడంపై నొక్కి చెబుతుంది అని, మానవ ఆరోగ్యం జంతువులు, మొక్కలు మరియు పర్యావరణ ఆరోగ్యంతో ముడిపడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో డీఎల్డీవో డా.యస్. చలమయ్య, డిఐఓ డా.కె.వి.సుబ్బరాజు, డి.ఎం.ఒ ఐ/సి డా.ఐ.ప్రభాకర్, ప్రోగ్రాం ఆఫీసర్స్ డా. అరుణ, డా జి. లక్ష్మి,ఫైలేరియా మెడికల్ ఆఫీసర్ డా. ఎం. రవి, డిప్యూటీ డెమో కె. సూర్య చంద్ర రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 7..** జిల్లాకు నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్‌ను కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని కోరుతూ తమ సంపూర్ణ మద్దతును వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, మాజీ కార్పొరేటర్ పాలిక ఉషారాణి, క్లస్టర్ ఇన్‌చార్జీలు మిరపాల ప్రకాశ్, హరి, నరసింగరావు, సీనియర్ నాయకులు కాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సమస్యల తక్షణమే పరిష్కరించాలి

**- ఏ. ఐ. టీ యు. సి పిలుపు...**



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 7..** ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యలపై ఎనిమిదో తేదీ నుండి జరిగే నిరసనలు కాకినాడ జిల్లాలో ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య ఆస్పత్రులలో వద్ద చేయాలని పిలుపు. ఈ పిలుపులో భాగంగా సామర్లకోటలో ఆస్పత్రి సూపర్డెంట్ కి వినతిపత్రం ఇస్తున్న మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు. ఏప్రిల్ 11న జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయండి.



# అన్నవరం దేవస్థానం ట్రస్టీగా చిరంజీవి

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 7..** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన ట్రస్ట్ బోర్డును మంగళవారం నియమించింది . దీనిలో 17 మంది సభ్యులతో కలిపి చైర్మన్ తో మొత్తం 18 మంది ఉన్నారు. చైర్మన్ గా వంశపారం పర్య ధర్మకర్త ఐ. వి రోహిత్ వ్యవహరిస్తారు.

ఈ 17 మందిలో అన్నవరానికి చెందిన బిజెపి సీనియర్ నేత చిరంజీవి కామర్స్ ను నియమించారు. ఆయన కుటుంబం పార్టీ ఆవిర్భావం నుంచి బిజెపి లోనే ఉన్నారు. ఆయన సొంత సోదరుడు బాలసుబ్రమణ్యం ఢిల్లీలో బిజెపి కేంద్ర కార్యాలయం ఇన్చార్జిగా ఉన్నారు. చిరంజీవి ఏనాడు పదవులను ఆశించలేదు. పార్టీ అభివృద్ధికి పనిచేశారు. 2014 లో టిడిపి,బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన జాతీయ స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ గా లేదా అన్నవరం దేవస్థానం ట్రస్టీగా నియమితులు అవుతారని ప్రచారం జరిగినా ఆయనకు నిరాశ ఎదురయింది. అయినా పార్టీ పై ఎలాంటి అసంతృప్తి వ్యక్తం చేయకుండా పార్టీలో కొనసాగుతున్నారు. పార్టీ కోసం పనిచేసి ఎన్నో కేసులు ఎదుర్కొన్నారు. నీతి నిజాయితీ గల సీనియర్ కమల నాథునికి ఇంత కాలానికి పదవి వచ్చిందని బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు సాంబశివరావు ,వడ్డాది గోపికృష్ణ ,విలపర్తి శ్రీనివాస్ ,ఖండవల్లి హనుమంతరావు, వెంకటాచార్యులు, జొన్నలగడ్డ కామేష్, కనక మహాలక్ష్మి తదితరులు ఆయనను అభినందించారు.

# తమిళ నాడు, పుదిచేరి కేంద్ర పాలిత ప్రాంతాలలో ఓటర్లులు

**- తూర్పు గోదావరి జిల్లా లో పని చేయుచున్న కార్మికులు ఎవరైన వేతనముతో కూడిన సెలవులు**
**- రాజమహేంద్రవరం సహాయ కార్మిక కమిషనర్ ఆలమూర్తి విజయ ప్రకాష్**



**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 7 :** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కార్మిక శాఖ కమిషనర్ ఉత్తరువులు మేరకు ఆంధ్ర ప్రదేశ్ దుకాణములు, సంస్థల చట్టము ప్రకారం ఈనెల 9, 23 తేదీలలో పుదిచేరి (9-4-26), తమిళనాడు (23-4-26) శాసన సభలకు జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటు వినియోగించుకొనుటకు తమిళ నాడు, పుదిచేరి కేంద్ర పాలిత ప్రాంతాలలో ఓటర్లుగా ఉండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లా లో పని చేయుచున్న కార్మికులు ఎవరైనా ఉన్న వారికి వేతనముతో కూడిన సెలవును మంజూరు చేయవలసినదిగా దుకాణముల, సంస్థల యజమానులకు ఆదేశించాడం జరిగిందని, దీనిని అతిక్రమించినట్లు అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజమహేంద్రవరం సహాయ కార్మిక కమిషనర్ ఆలమూర్తి విజయ ప్రకాష్ తెలిపారు

అడ్డతీగల వారపు సంతలో

# దొంగ తూకాలతో గిరిజనులను నిలువుగా దోచేస్తున్న వ్యాపారస్తులు



**రంపచోడవరం మనసులో మాట ఏప్రిల్ 7..** అడ్డతీగల మండల కేంద్రమైన అడ్డతీగలలో నిర్వహించే వారపు సంతలో కొలతలు, తూనికల విషయంలో నిబంధనలు గాలికి వదిలేశారు. సంతకు వచ్చే వ్యాపారులు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలు మరియు సాధారణ త్రాసులకు ఎటువంటి అధికారిక ముద్రలు (సీల్) లేకపోవడం గమనార్హం. సాధారణంగా తూనికల మరియు కొలతల శాఖ నుంచి ఏటా తనిఖీలు చేయించుకుని, ధ్రువీకరణ ముద్ర వేయించుకోవాల్సి ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం అవేమీ పట్టనట్లుగా వ్యాపారాలు సాగిస్తున్నారు. అడ్డతీగల ఏజెన్సీ ప్రాంతం కావడంతో, స్థానిక గిరిజన ప్రజలకు ఈ సాంకేతిక అంశాలపై సరైన అవగాహన లేకపోవడాన్ని వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

ప్రశ్నించే వారు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా తూకాలు వేస్తూ వినియోగదారులను నిలువునా ముంచుతున్నారు. సీల్ లేని రాళ్లను వాడటం వంటి చర్యల వల్ల కొనుగోలుదారులు చెల్లించిన ధరకు తక్కువ వస్తువును పొందుతున్నారు. ఏజెన్సీ ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సాగుతున్న ఈ దోపిడీపై సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి, సంతలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సరైన ధ్రువీకరణ లేని కాటాలను స్వాధీనం చేసుకుని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**-తొర్రేడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మంగళవారం తొర్రేడు గ్రామంలో సచివాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ యుద్ధం ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు ఆగిపోయాయని, అయినప్పటికీ కూడా రైతులను ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వ కృషితో కేంద్రం నిర్ణయించిన మంచి మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రైతులను నట్టేట ముంచేసిందని, రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించకుండా మిల్లులకు తోలిన ధాన్యానికి సొమ్ములు చెల్లించకుండా నెలల తరబడి కాలయాపన చేసి రైతులను దగా చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు బడ్జెట్ కేటాయింపులో కూడా పెద్దపీట వేసిందని, రైతు వద్ద నుండి ధాన్యాన్ని మిల్లుకు చేర్చిన 48 గంటల లోపు సొమ్ములు రైతులు ఖాతాలోకి చేరుతున్నాయని తెలిపారు. రైతులందరూ వరి పంట మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై కూడా అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందించే విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ముళ్లపూడి వెంకట రమణ, వ్యవసాయ సహాయ సంచాలకులు కే సూర్య రమేష్, తహసీల్దారు శ్రీనివాస్, కురుకూరి కిషోర్, కొత్తపల్లి సత్యనారాయణ, దండమూడి బాపినీడు, సొసైటీ సీఈఓ కొడవలి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగిన జాహ్నవి, మద్దుకూరి లక్ష్మణ్, సుంకవల్లి చిన్నారి, మద్దూకూరి నరసింహ రావు, దండమూడి రఘుబాబు, పోలిన సూరిబాబు, గెడ సత్యనారాయణ, దాసరి గురుప్రసాద్, మొగలపు శ్రీనివాస్, పాలడుగుల గాంధీ, యువగళం టీం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కాకినాడ జిల్లా లో జలధార జల హారతి కార్యక్రమాన్ని..**

# ప్రతిష్టాత్మకంగా కార్యాచరణ సిద్ధం చేయండి

**- కలెక్టర్ ఎన్. ఎం. హరేందిర ప్రసాద్**





**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 7..** జలధార-జలహారతి కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మద్యాహ్నం కలెక్టరేట్ కోర్టుహాలులో జిల్లా కలెక్టర్ డ్వామా, ఇరిగేషన్, డ్రైన్స్, ఫారెస్ట్, గ్రౌండ్ వాటర్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి జలధార జలహారతి కార్యక్రమ ప్రణాళిక పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జిల్లాలో భూగర్భ, ఉపరితల జలవనరులను పెంపొందించి, గరిష్ఠ స్థాయిలో సద్వినియోగం చేసుకునేందు అవసరమైన పనులను గుర్తించి వంద రోజుల కార్యాచరణలో పొందుపరచాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని మెట్ట ప్రాంత మండలాల్లో జల సంరక్షణ పనులకు, డెల్టా మండలాల్లో వీడ్ క్లియరెన్స్, డిసిల్టింగ్, ముంపు నివారణ తదితర పనులకు ప్రణాళికలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలో పనిచేయని బోర్ వెల్స్ అన్నిటి పునరుద్దరణ చేపట్టాలని, మైనర్ ఇరిగేషన్ చెరువుల స్టోరేజి సామర్థ్యాన్ని పెంచే పనులు ప్రతిపాదించాలని ఆదేశించారు. జలధార జలహారతి కార్యక్రమం క్రింద పంచాయితీ, మండల స్థాయిల్లో సూక్ష్మ ప్రణాళికలు రూపొందించి వాటన్నిటిని జిల్లా ప్రణాళికలో సమన్వయం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమం అమలులో ఎంపిడిఓలు, డ్వామా ఏపిఓలు, మండల ఇజనీరులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు క్రియాశీలంగా పనిచేసేలా అవగాహన, శిక్షణ కల్పించాలని, ఇందుకు బుధవారం వారందరికి కార్యక్రమ అంశాలపై వర్క్ షాప్ నిర్వహించాలని తెలిపారు.

ఈ సమావేశం లో డ్వామా పిడి ఎస్. మధుసూధన్, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, జడ్ పి సి ఈ ఓ వివివి ఎస్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

# నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి

**- పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి - కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా.. కాలువల పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగర పాలక సంస్థ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్క ఉద్యోగి విధిగా రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలని.. రోజు వారీ కార్యకలాపాలను అందులో నమోదు చేయవలసిందిగా సూచించారు. పలుచోట్ల చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదని.. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి అందించేలా ఆయా ఇంటి యజమానులకు అవగాహన కల్పించవలసిందిగా సచివాలయ సిబ్బందికి సూచించారు. అలాగే డీసిల్టేషన్ పనులకు ఏప్రిల్, మే నెలలు ఎంతో కీలకమని.. వేసవి ముగిసేకల్లా మేజర్, మైనర్ డ్రెయిన్లలో పూర్తిగా పూడికను తొలగించాలని ఆదేశించారు. ప్రధానంగా చోక్ పాయింట్లు, కల్వర్టులు, మ్యాన్ హోల్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలు కురిసే సమయంలో ప్రధాన కాలువల్లో వర్షపు నీరు సజావుగా ప్రవహించే విధంగా ఉండాలని.. అందుకు తగ్గ ఏర్పాట్లను ఇప్పటి నుంచే పూర్తి చేయవలసిందిగా సూచించారు. ఇదే సమయంలో దోమలు వ్యాప్తిచెందకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ ప్రతిరోజు జరగాలన్నారు. ప్రధాన రహదారుల వెంబడి ఎక్కడా చెత్త కనిపించకూడదని ఈ సందర్భంగా సూచించారు. నిర్మాణాలు జరుగుతున్న చోట కచ్చితంగా గ్రీన్ మ్యాట్ లు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. పబ్లిక్ టాయిలెట్ల క్లీనింగ్ రోజూ జరగాలని.. ప్రతిఒక్క టాయిలెట్ వద్ద సైన్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే సిబ్బంది విధిగా అప్రాన్ లు ధరించాలని ఆదేశించారు. ఏమైనా ఇంజనీరింగ్ పనులు చేపట్టవలసిన ఆవశ్యకత ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. 2024-25 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో రాజమహేంద్రవరం అత్యుత్తమ పనితీరు కనబరిచిందని.. ఈ సారి మరింత మెరుగైన ర్యాంకు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అందరి ప్రార్ధనలతో ఏ. పి రాజధాని అమరావతి

**- క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అబ్రహం**



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 7..** రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలపడం ఆంధ్రులంతా గర్వించదగ్గ విషయమని క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు మోసా అబ్రహాం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉభయ సభలు చట్టబద్ధత కల్పిస్తూ తీర్మానించడం ప్రతి ఒక్క ఆంధ్రుడు గర్వించ దగ్గ విషయమని పేర్కొన్నారు. అయిదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ విజయంగా ఆయన అభివర్ణించారు. అయిదేళ్ల పోరాటానికి, వేలాది రైతుల మొక్కవోని దీక్షకు , పాస్టర్ల ప్రార్ధన ఫలితం దక్కిందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్ కృషి రాజ్యసభ సభ్యులు సాన సతీష్, ఉభయ సభలు సహాకారం వలన ఇది సాధ్యమైందన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు ఇదో కీలక మలుపని, అభివృద్ధికి సంకేతమని వారు పేర్కొన్నారు.

200 మంది దైవసేవకులు పాల్గొని ప్రే ఫర్ ఆంధ్ర ప్రదేశ్ అనే నినాదంతో రాష్ట్ర రాజధాని అమరావతి రాజధానిగా త్వరగా పూర్తి కావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిషప్ యెల్ఛూరి విద్యాసాగర్ దైవ సందేశం అందించారు కౌన్సిలర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె మెజేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రానికి ఇప్పటివరకు రాజధాని లేకపోవడం చాలా బాధాకరమని అయితే ఇప్పుడు ఆమోదం పొందడంతో రాష్ట్ర ప్రజలకు యువతకు భరోసా వచ్చిందన్నారు. అనంతరం స్టేట్ సెక్రటరీ ఎస్ ప్రభాకర్ ప్రార్ధనతో కార్యక్రమాన్ని ముగించుకుని శాంతిరాలిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర జిల్లాల నాయకులు పి. రత్నబాబు ,పి సాల్మన్ రాజు, ఎబినేజర్ ప్రసాద్, సురేష్ జాన్సన్ ,బి యెసుదాసు,కే చార్జి బాబు ఆకాను యేసుదాసు, హెలిన్ ప్రభాకర్ , జి ప్రేమనందం తదితరులు పాల్గొన్నారు.



# గౌతమి ఘాట్లో 200 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గౌతమి వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్, గౌతమి ఘాట్ మహిళా వర్కర్స్ అండ్ యోగా క్లబ్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా 200 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ -103 డిప్యూటీ గవర్నర్ కీర్తి అచ్చిరాజు (బాబ్జి) ఉమెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కంబాల రుద్రమదేవి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్ నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ కోడూరి రంగారావు హాజరయ్యారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జాబిల్లి హాస్పిటల్ వైద్యురాలు భారతి, డాక్టర్ సతీష్ హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపై అవగాహన కలిగించే విషయాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కీర్తి బాబ్జి, వైస్ ప్రెసిడెంట్ తొశీటెపు వెంకన్న బాబు, సెక్రటరీ జీ విజయకిరణ్, ట్రెజరర్ టీ బాబురావు, జాయింట్ సెక్రటరీ ఈ రామకృష్ణ, బీ భాస్కర్ గుప్తా, సీహెచ్ వీరభద్రరావు, జాలి వాకర్ బీవీ గోపాలకృష్ణ, మహిళా క్లబ్ ప్రెసిడెంట్ కంబాల రుద్రమదేవి, బీ కనకదుర్గ, ట్రెజరర్ సుగ్గు కమల, ఎన్ సత్యవతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ప్రజలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంలో**

# పీఎంపీలు పాత్ర కీలకం

**- పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రాథమికంగా చికిత్సలందించే పీఎంపీలు.. ఈ ఏడాది వరల్డ్ హెల్త్ డే నినాదం "ఆరోగ్యం కోసం ఏకమవుదాం విజ్ఞాన శాస్త్రానికి మద్దతుగా నిలుద్దాం" ప్రకారం ప్రజలందరి ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం, శాస్త్రీయంగా ఆలోచిద్దామని పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్ లో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్) రాజమండ్రి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వీబీటీ రాజు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి వైద్య విజ్ఞాన అవగాహన ఎంతో అవసరమని, సురక్షితమైన శాస్త్రీయమైన వైద్య విధానాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. నేటి జీవనశైలిలో మార్పులు వలన అనారోగ్యం బారిన పడడం జరుగుతోందని, ప్రకృతిని పరిరక్షించుకుంటూ, పర్యావరణాన్ని కాపాడుకుంటూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని కోరారు. సత్య కిడ్నీ అండ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణుడు సత్య ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ జీవనశైలిలో వచ్చిన మార్పుల వలన మూత్రపిండాలకు వచ్చే వ్యాధుల గురించి, మూత్రపిండాలకు, మూత్రనాళాలకు, కిడ్నీలో రాళ్ళకు చేసే శస్త్ర చికిత్స గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం, జిల్లా కోశాధికారి పీ చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, మండల కోశాధికారి యు ప్రసాద్ బాబు, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, ఏ సురేష్ బాబు, సుంకర శ్రీనివాస్, హాస్పిటల్ మేనేజర్ మూర్తి లతో పాటు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ సత్య ప్రసాద్ ను సభ్యులు ఘనంగా సత్కరించారు.

# భారతదేశానికి ధన్యవాదాలు తెలుపుతూ ఏపీ పోస్టర్ ను ప్రదర్శించిన ఎంపీడీవో



**కోటనందూరు (మనసులో మాట) ఫిబ్రవరి 7..** కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో భారతదేశానికి ధన్యవాదాలు తెలిపిన ఏపీ పోస్టర్ ను ఎంపీడీవో పి వెంకటనారాయణ ప్రదర్శించారు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం, 2026 ప్రకారం, 2014 నాటి ప్రధాన చట్టంలోని సెక్షన్ 5ను సవరిస్తూ అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధానిగా అధికారికంగా ఖరారు చేశారు. ఈ సవరణ చట్టం జూన్ 2, 2024 నుండి అమలులోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుంది మరియు ఇందులో 'అమరావతి' అంటే ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఆ్రాజ=ణూ) చట్టం, 2014 కింద నోటిఫై చేయబడిన రాజధాని నగర ప్రాంతాలని స్పష్టం చేశారు. భారత రాష్ట్రపతి ఏప్రిల్ 6, 2026న ఈ చట్టానికి ఆమోదం తెలపగా, భారత ప్రభుత్వ గెజిట్ ద్వారా దీనిని ప్రచురించారు.ఈ సందర్భంగా ప్రజా రాజధాని అమరావతి కి అండగా నిలిచిన భారతదేశానికి ఆంధ్ర ప్రదేశ్ కృతజ్ఞతలు తెలుపుతూ ఏపీ ట్యాంక్స్ ఇండియా ప్లెక్సు ను మండల ప్రజా పరిషత్ కార్యాలయము కోటనందూరు నందు కార్యాలయ సిబ్బంది తో కలసి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.వెంకట నారాయణ ప్రదర్శించటం జరిగినది.ఈ సందర్భంగా గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా గౌరవ డిప్యూటి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.జయరాం సిబ్బంది కి మిఠాయిలు పంచిపెట్టడం జరిగినది.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక




# యానాంలో ముగిసిన ఎన్నికల ప్రచారం

- మూగబోయిన మైక్ లు
- చివరిరోజు హోరెత్తిన ప్రచారం
- ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు
- గొల్లపల్లి, మల్లాడి మధ్యే ప్రధాన పోటీ
- ఈ నెల 9న పోలింగ్,
- మే 4న కౌంటింగ్
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం

**యానాం (మనసులో మాట) ఏప్రిల్ 7:** కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. దీంతో గత కొన్నిరోజులుగా హోరెత్తిన మైక్ లన్నీ సాయంత్రానికి మూగ బోయాయి. ఈ సారి ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధానంగా ఇండియా కూటమి. ఎన్డీఏ కూటమిల మధ్యే ప్రధాన పోరు సాగింది. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్, ఎన్డీఏ కూటమి నుంచి ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లాడి కృష్ణారావు పోటీపడుతున్నారు. వీరిద్దరూ హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. 30 ఏళ్లకుపైగా రాజకీయ అనుభవం కలిగిన మల్లాడితో రాజకీయ ఓనమాలు తెలియని 28 ఏళ్ల గొల్లపల్లి పోటీపడుతున్నారు. అయితే 2021లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి అభ్యర్ధి రంగసామిపైనే విజయం సాధించడంతో అందరిచూపు గొల్లపల్లిపై పడింది. ముఖ్యంగా పుదుచ్చేరిలోని రాజకీయ పార్టీల నేతల దృష్టి గొల్లపల్లిపై పడి యానాంకు భవిష్యత్ నేతగా ఆయనను గుర్తించి మద్దతు ఇస్తున్నారు. ఎన్డీఏ కూటమిలో ఉంటూ బిజెపి మద్ధతుదారునిగా ఉన్న గొల్లపల్లికి, మల్లాడి, రంగసామి ఆడిన రాజకీయ క్రీడలో గొల్లపల్లికి ఎన్డీఏ పార్టీనుంచి టిక్కెట్ దక్కకుండా చేయగలిగారు. అయితే పుదుచ్చేరిలో తలలు పండిన నేతల దృష్టిలో ఉన్న గొల్లపల్లికి ఇండియా కూటమి ప్రతినిధులు పిలిచి మరీ కాంగ్రెస్ టికెట్ కేటాయించడం గమనార్హం. దీంతో అప్పటివరకు అంతంతా మాత్రంగా ఉన్న గొల్లపల్లి విజయావకాశాలు కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మరింత పెరిగాయి. కాంగ్రెస్ కు ప్రధాన ఓటు బ్యాంకు గా వున్న బడుగు, బలహీన వర్గాలతో పాటు మైనారిటీ వర్గాల మద్దతు ఉండడంతో గొల్లపల్లి గెలుపు అంచున నిలబడ్డారు. ఇలా ఉండగా ప్రముఖ తమిళ నటుడు విజయ్ నూతనంగా స్థాపించిన టీవీకే పార్టీనుంచి ప్రముఖ వ్యాపారి తోట రాజు బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాగా ఈ నెల 9వ తేదీన ఎన్నికల పోలింగ్ 1 జరుగనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. మే 4వ తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు. యానాం ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ఆంధ్రా ప్రాంతంలో సైతం సందడి నెలకొంది.

# అన్నవరం ట్రస్ట్ బోర్డు లో బీజేపీ సభ్యులకు అవకాశం కల్పించినందుకు వర్షం వ్యక్తం చేసిన చిత్ర పాపారావు



**రౌతులపూడి, ( మనసులో మాట) ఏప్రియల్ 7 :** అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవస్థాన ట్రస్ట్ సభ్యుడిగా బిజెపి నేత చిరంజీవికి అవకాశం కల్పించడంతో కాకినాడ జిల్లామాజీ యువ మోర్చా అధ్యక్షుడు చిత్ర పాపారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిట్రా పాపారావు మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటాదని ఆ విషయం మరోసారి రుజువైందని ట్రస్ట్ బోర్డ్ మెంబర్ గా ఎన్నికైన చిరంజీవికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని చిట్రా పాపారావు తెలిపారు.

# అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యుడిగా పాలచర్ల నాగేంద్ర చౌదరి

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆశీస్సులు తీసుకున్న నాగేంద్ర చౌదరి - పలువురు అభినంధనలు

## - అన్నవరం దేవస్థానం పవిత్రతను కాపాడుతూ అభివృద్ధికి కృషి చేస్తా - నాగేంద్ర చౌదరి





**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 7..** జగ్గంపేట నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలోనే పాలచర్ల నాగేంద్రచౌదరి పేరు తెలియనివారుండరు. కుడి చేత్తో చేసిన సాయం ఎడమ చేతికి కూడా తెలియని కలియుగ దానకర్ణుడు నాగేంద్రచౌదరి. గతంలో నుంచి కూడా నాగేంద్రచౌదరి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తో అత్యంత సన్నిహితంగా ఉంటున్నారు. రాజకీయపరంగా పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. అలాగే ఆయన చేస్తున్న సేవలు చిరస్మరణీయంగా నిలుస్తున్నాయి. నాగేంద్రచౌదరి చేస్తున్న విశేష సేవలను గుర్తించిన గత కలెక్టర్ షాన్మోహన్ ఆయన్ను ఘనంగా సత్కరించారు. తాను చదువుకున్న హైస్కూల్లో విద్యార్థులను ప్రోత్సహించడం కోసం పూర్వవిద్యార్థులతో కలిసి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. అన్నాక్యాంటీన్లో అన్నదానానికి నాగేంద్రచౌదరి తన వంతు కృషిచేస్తున్నారు. ముఖ్యంగా నాగేంద్రచౌదరి పేరు చెప్పగానే ఆకలి తీర్చే గొప్పవ్యక్తి. పేదలకు అన్నదానం చేయాలన్న, కొద్దిమొత్తంలో పంచిపెట్టాలన్నా నాగేంద్రచౌదరిని సంప్రదిస్తే అతితక్కువ ధరకు అన్నదానానికి కావాల్సిన ఫుడ్ అందిస్తున్నారు. పేదలకు ఆర్థిక సాయం, ఆలయాలకు విరాళాలు ఇవ్వడం, ఎవరైనా అనాథలు చనిపోతే దహనసంస్కారాలకు ఆర్థిక సహాయం ఇలా ఒకటా రెండా ఆయన చేస్తున్న సేవలు ఎన్నో.. నాగేంద్రచౌదరి సేవలకు శ్రీ శివానంద చారిటబుల్ ట్రస్టు విష్ణుదేవానంద స్వామీజీ ఆధ్వర్యంలో సేవారత్న బిరుదు అందించారు. భారతీయ ధర్మపరిషత్ జిల్లా అధ్యక్ష పదవి నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితు లయ్యారు. గో సంరక్షణ కోసం నిత్యం పాటుపడుతూ గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. భోగిపండుగ సమయంలో వందలాది అడుగుల భోగిదండలు తయారుచేసి హిందూ ధర్మాన్ని ప్రజలకు చాటిచెపుతారు. కాలినడకన తీర్థయాత్రకు వెళ్లే భక్తులకు 365 రోజులు ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నారు. ముఖ్యంగా భవానీ, అయ్యప్ప, శివమాలదారులు జాతీయరహదారిపై మీదుగా కాలినడకన వెళ్తుంటే జగ్గంపేటలో నాగేంద్రచౌదరి వారికి ఆతిథ్యమిస్తారు. అదేవిధంగా ఆర్మీ అధికారులు, సైనికులకు జగ్గంపేటలో నాగేంద్రచౌదరి బస ఏర్పాటు చేశారు. అలాగే రాజపూడి లోని సత్యనారాయణస్వామి, వెంకటేశ్వరస్వామి, సీతారాముల ఆలయాలకు రూ.50వేలు, సీతానగరంలో నిర్మించిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి రూ.20,011 విరాళం అందించారు. జగ్గంపేట కొంగలరావిచెట్టు వద్ద సుందరంగా తీర్చిదిద్ది స్టేజీ నిర్మాణం చేశారు. ఇలా ఎన్నో సేవలు చేస్తూ ముందుకెళ్తున్నారు. సేవారత్న బిరుదుపొందడం, ఆలయాలకు విరాళాలు ఇవ్వడం, గోసంరక్షణకు పాటుపడుతుండడం, హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్న నాగేంద్రచౌదరికి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని హిందూ కార్యకర్తలు ఆకాంక్షించారు. అయితే జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నాగేంద్ర చౌదరిని అన్నవరం ట్రస్టుబోర్డు మెంబర్ గా నియమించేందుకు సిపార్సు చేశారు. ఈసందర్భంగా మంగళవారం విడుదలైన జీవోలో నాగేంద్రచౌదరిని బోర్డుమెంబర్ గా నియమించడంతో హిందూ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. జగ్గంపేట నియోజకవర్గ నాయకులు, ప్రజలు, సన్నిహితులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ అన్నవరం బోర్డు సభ్యునిగా సిఫార్సు చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అన్నవరం దేవస్థానం పవిత్రతను కాపాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ మొబి ట్రాక్ తో భారీగా సెల్ఫోన్ల రికవరీ...

## 650 మొబైల్స్ బాధితులకు అందజేత - కాకినాడ జిల్లా ఎస్ పి జి. బిందు మాధవ్



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 7..** కాకినాడ జిల్లా పోలీసులు చేపట్టిన "ఆపరేషన్ మొబి ట్రాక్"లో భాగంగా భారీ స్థాయిలో మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేశారు. మంగళవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 1 కోటీ 10లక్షల 50 వేల విలువైన 650 మొబైల్ ఫోన్లను యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్‌వర్క్ నిఘా, డేటా విశ్లేషణ పద్ధతులను వినియోగించి ఈ విజయాన్ని సాధించామని తెలిపారు. సి ఈ ఐ ఆర్ (సెంట్రల్ ఈక్వయిప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ) పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ మొబైల్ ఫోన్లు ట్రేస్ చేసి రికవరీ చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు నిర్వహించిన 11 విడతల్లో మొత్తం 6 కోట్ల 48 లక్షల 27 వేల విలువైన 4,001 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ ఆపరేషన్ విజయానికి డిజిటల్ ఫోరెన్సిక్స్, జిపిఎస్ ట్రాకింగ్, ఐ ఎం ఈ ఐ ట్రేసింగ్, సైబర్ నిఘా టూల్స్ ముఖ్య కారణమని పేర్కొన్నారు. జిల్లాలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల ఫోన్లను త్వరితగతిన గుర్తించి తిరిగి అందజేయ గలిగామని తెలిపారు. మొబైల్ రికవరీ విషయంలో రాష్ట్ర స్థాయిలో కాకినాడ జిల్లా మంచి ప్రగతి సాధించిందని అన్నారు.

**సైబర్ మోసాలపై పోలీసుల సూచనలు...**

సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం అపరిచిత వీడియో కాల్స్, ఫిషింగ్ కాల్స్ లేదా అనుమానాస్పద ఇమెయిల్స్‌కు స్పందించవద్దని సూచించారు. మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, లేకపోతే ఒఒవతీ-ఎతీఱఎవ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని 3ఎస్పీ సూచించారు.

**మొబైల్ పోయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...**

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బ్యాంకు ఖాతాలను సురక్షితంగా ఉంచడం, సిమ్‌ను డిసేబుల్ చేయించడం, పాస్‌వర్డ్ మార్చడం, ఫైండ్ మై డివైస్ లేదా ఫైండ్ మై ఐఫోన్ వంటి సేవల ద్వారా ఫోన్‌ను ట్రాక్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

**సెకండ్ హ్యాండ్ ఫోన్ల కొనుగోలులో జాగ్రత్తలు**

ఫోన్ బిల్లు, బాక్స్ మరియు విక్రేత వివరాలు పరిశీలించకుండా కొనుగోలు చేయకూడదని, అపరిచితుల నుండి కొనుగోలు చేయడం వల్ల సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఎస్పీ బిందు మాధవ్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ శ్రీనివాస్, కాకినాడ ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కెవి సత్యనారాయణ, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ డి దుర్గా శేఖర్ రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వి శ్రీనివాస్, జిల్లా పీఆర్వో ఆర్ రవి కుమార్ పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహించే డీలర్లను తొలగిస్తాం: జెసి





**ఏలూరు, ఏప్రిల్, 7 (మనసులో మాట)..** రేషన్ పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహించే డీలర్లను తొలగిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ హెచ్చరించారు. ఇటీవల ×ఎ=ూ ఫీడ్‌బ్యాక్ మరియు రేషన్ పంపిణీ తదితర విషయాలలో తక్కువ పనితీరు కనబరిచిన 45 మంది చౌకధరల దుకాణాల డీలర్లతో మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో డీలర్ల పనితీరును జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రజల సంతృప్తి స్థాయికి ఐవిఆర్ ఎస్ విధానం ద్వారా ప్రభుత్వం తెలుసుకుంటున్నదన్నారు. ప్రజలకు రేషన్ పంపిణీ ని సక్రమంగా చేయాలనీ, రేషన్ కోసం వచ్చే వారితో మర్యాదగా మాట్లాడి, ప్రవర్తించాలన్నారు. రేషన్ దుకాణాల ద్వారా డీలర్ల సేవలపై ఞ= కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను తెలియజేస్తారన్నారు. జిలాల్లోని 45 రేషన్ డీలర్లు సేవలలో ×ఎ=ూ ఫీడ్‌బ్యాక్‌లో వెనుకబడి ఉన్నారని, సదరు డీలర్లు వారి పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. నాణ్యమైన నిల్వ మరియు పరిశుభ్రత, సరుకులు పాడవకుండా నాణ్యమైన నిల్వ సౌకర్యాలతో, మంచి గోడౌన్లను ఏర్పాటు చేసుకోవాలని, రేషన్ షాపు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రేషన్ పంపిణీ సమయంలో లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రవర్తనా లోపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వకూడదన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసి, ×ఎ=ూ ఫీడ్‌బ్యాక్‌లో మెరుగుదల సాధించేందుకు జాయింట్ కలెక్టర్ గారు డీలర్లకు పలు కఠిన సూచనలు జారీ చేశారు. తక్కువ పనితీరు కనబరిచిన 45 రేషన్ దుకాణాలను సీఎస్‌డీటీలు వెంటనే వ్యక్తిగతంగా సందర్శించి, పైన తెలిపిన ఆదేశాలన్నీ సక్రమంగా అమలవుతున్నాయో లేదో క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# ఆర్టీసి పార్శిల్ సెంటర్ ను డాగ్ స్క్వాడ్ తో తనిఖీ చేసిన పోలీసులు



**అమలాపురం(మనసులో మాట) ఏప్రిల్7:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ రాహుల్ మీనా ఆదేశాల మేరకు ప్రయాణికుల భద్రత కొరకు మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న బస్సులను, పార్సిల్ కౌంటర్ నందు అన్ని రకాల పార్సిలను జిల్లా బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ తో పరిశీలించారు. అలాగే శిక్షణ పొందిన డాగ్స్ తో క్షుణ్ణంగా తనిఖీ చేసారు . ఈ సందర్భంగా పార్శిల్ కౌంటర్ సిబ్బందితో మాట్లాడుతూ అనుమానస్పదమైన ఏదైన పార్శిల్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు. ఈతనిఖీలలో అమలాపురం పట్టణ సిఐ పి వీరబాబు ,ఎస్ఐ కే ఎం జోషి జిల్లా బీడిఎం టీం సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సదస్సు

**కపిలేశ్వరపురం (మనసులో మాట )ఏప్రిల్ 7..** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కాపిలేశ్వరపురం మండల అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జె అనూజ ప్రియాంక ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు,ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనూజ ప్రియాంక మాట్లాడుతూ ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయని అంటూ ఈ సంవత్సర' 'థీమ్ విజ్ఞానానికి అండగా నిలుద్దాము – ఆరోగ్యం కోసం కలిసి పని చేద్దాం" అంటూ వివరించారు. ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యం. అందుకే ప్రపంచ దేశాలు ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తాయనీ, మంచి ఆహారం, వ్యాయామం,నిద్ర తో దీర్ఘకాలిక అనారోగ్యాలు తగ్గుతాయని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.హెచ్.ఇ.ఒ. జె.మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్.బి రామారావు, హెల్త్ విజిటర్.టి.మేరీ మణి, హెల్త్ సూపర్వైజర్ ఎం నాని బాబు, ఎం.ఎల్.హెచ్.పి. ఆరోగ్య కార్యకర్తలు వెన్నేటి వెంకటేశ్వర్లు,ఆశా కార్యకర్తలు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# దోమల నివారణకు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి




**కొత్తపేట(మనసులో మాట) ఏప్రిల్ 7..** ప్రపంచ, ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆత్రేయపురం ప్రభుత్వ ఆసుపత్రి లో ఆసా డే కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నక్క వెంకటేశ్వర్ రావు పాల్గొని మాట్లాడారు, దోమల వల్ల వచ్చే వ్యాధులు దోమల పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటర్ బోర్న్ డిసీజెస్ పరిసరాల పరిశుభ్రత గురించి ఆశలకు, హెల్త్ స్టాప్ అందరికీ హెల్త్ ఇవేర్నెస్ ప్రోగ్రాం కండక్ట్ చేసి. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా విజ్ఞానానికి అండగా నిలుద్దాం, ఆరోగ్యం కోసం కలిసి పని చేద్దాం. అనే నినాదంతో పి హెచ్ సి నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణులు డాక్టర్ పి సౌమ్య డాక్టర్ హైమశ్రీ రావులపాలెం మలేరియా సబ్ యూనిట్ అధికారి చిటికెన వెంకటేశ్వరరావు గారు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి అరుణ్ కుమారి, ఆరోగ్య సహాయకులు ఎం టి వి ఎన్ మూర్తి,వైద్య సిబ్బంది ఆశలు పాల్గొన్నారు.

# ఏడు శనివారాల వెంకన్న ఆలయ అన్నదాన పథకానికి రూ లక్ష విరాళం



**కొత్తపేట (మనసులో మాట) ఏప్రిల్ 7..** కోనసీమ తిరుమల గా పేరుపొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి రావులపాలెం చెందిన పడాల సత్యనారాయణ రెడ్డి, రేవతి దంపతులు రూ, లక్ష విరాళాన్ని, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు అందజేశారు. అర్చకులు దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి ఆలయ విశిష్టత తెలిపి, స్వామివారి చిత్రపటం అందజేశారు. దాతలు మాట్లాడుతూ ఏడు శనివారాల వెంకన్నగా పేరుపొందిన వాడపల్లి ఆలయంలో వచ్చే భక్తులకు చేస్తున్న ఏర్పాటు, అన్నదాన పథకానికి తమ విరాళం అందించినట్లు తెలిపారు.

# ఉచిత సీట్ల పేరుతో వసూళ్లు కోరుతున్న ప్రైవేట్ విద్యా సంస్థలు

## - చర్యలు తీసుకోవాలని అధికారులను కలసి విన్నవించిన ఉచిత విద్యార్థుల సంఘం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** పేదలకు ఉచిత విద్య అందించాలనే ప్రభుత్వ లక్ష్యం, ప్రైవేట్ పాఠశాలల దుర్వినియోగంతో దెబ్బతింటోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఈ సమస్య మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం కేటాయించిన ఉచిత సీట్లకు కూడా ప్రైవేట్ పాఠశాలలు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "డొనేషన్ లేకుండా సీటు లేదు" అంటూ తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఈ అక్రమాలపై విద్యా శాఖ అధికారులను కలసిన ఉచిత విద్యార్థుల సంఘం సభ్యులు ప్రభుత్వం కేటాయించిన సీట్లు అమ్మకుంటున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. విద్యా శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే ఈ సమస్య మరింత పెరిగితే ఉచిత విద్యా బాధితులుగా ఉచిత విద్యా తల్లిదండ్రుల సంఘంతో రోడ్ల పైకి వచ్చి ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు.



## నేటి నుంచి వైభవంగా కనకదుర్గ జాతర మహోత్సవాలు

**అన్నవరం (మనసులో మాట) ఏప్రిల్ 7:** కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి క్షేత్రంలో శ్రీ సత్యదేవుని ఉపాలయంగా, కొండ దిగువన వెలసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవాలు నేటి (బుధవారం) నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 8 నుండి 17వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అందుకు తగ్గ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతర ప్రారంభం రోజైన బుధవారం ఉదయం 8 గంటలకు రత్నగిరిపై ఉన్న ప్రధాన ఆలయం నుండి శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి "సారే" తీసుకువెళ్లే కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మంగళ వాయిద్యాల నడుమ చీర, పసుపు, కుంకుమ, పూలు తదితర మంగళ ద్రవ్యాలను అధికారులు, అర్చకులు ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. ఈ జాతర మహోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని దేవస్థానం అధికారులు కోరుతున్నారు.

## అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యుడు గా పర్వత సురేష్



**అన్నవరం (మనసులో మాట) ఏప్రిల్ 7..** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం గ్రామానికి చెందిన పర్వత సురేష్ సేవా తత్పరులు ప్రజాక్షేమమే ధ్యేయంగా పనిచేసే పార్టీ పట్ల అంకిత భావానికి దక్కిన గౌరవం గా పర్వత సురేష్ కి కల్గిందని పలువురు వ్యాకనించారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా ఆశీస్సులతో అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన పర్వత సురేష్ కి టీ డి పి పార్టీ శ్రేణులు అయన కి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా పర్వత సురేష్ మాట్లాడుతూ తనకి ఈ పదవి ని కల్పించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా కి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా వారి మార్గ దర్శకత్వం లో దైవ సేవలో భాగ స్వామ్యం తో రత్నగిరి సత్యదేవ క్షేత్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పర్వత సురేష్ హామీ ఇచ్చారు .

ఈ సందర్భంగా పర్వత సురేష్ కి కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు శు భాకాంక్షలు తెలియ చేసారు.

## అంబేద్కర్ జయంతి పురస్కారాల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై పోలీస్ రెవెన్యూ అవగాహన సదస్సు



**కొత్తపేట( మనసులో మాట) ఏప్రిల్ 7..** అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఉత్తర్వుల మేరకు, కొత్తపేట డి.ఎస్.పి సుంకర మురళి మోహన్ ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ. సిహెచ్.విద్యాసాగర్ , ఆత్రేయపురం ఎస్సై. ఎస్ రాము ఆత్రేయపురం ఎమ్మార్వో ఆర్డి.రామచంద్ర మూర్తి , మండల ఎంపీడీవో వికాస్ రామన్ , ఇతర పోలీస్, రెవెన్యూ సిబ్బంది కలిసి ఈ నెల ఏప్రియల్ 14 వ తేదీన జరగబోవు బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బొబ్బర్లంక, పేరవరం గ్రామ ఎస్సీ నాయకులు, గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి తగు సూచనలు చేశారు. ఫ్లెక్సీ ల ఏర్పాటు కు, డీజే లకు అనుమతులు లేవని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నరు. ఆత్రేయపురం పోలీసులు పేరవరం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంను నిర్వహించరు.

# పిఠాపురంలో మళ్లీ 'బొండు ఇసుక' మాఫియా పంజా!

### - ట్రాక్టర్ రూ. 2500 వరకు విక్రయం - అనుమతులు లేకుండానే యథేచ్ఛగా తవ్వకాలు



**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 07:** పిఠాపురం నియోజకవర్గంలో అక్రమ బొండు ఇసుక మాఫియా మళ్లీ పడగ విప్పింది. గతంలో యు. కొత్తపల్లి మండలంలో ఈ దందాకు మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ అడ్డుకట్ట వేసినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ ఆ పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. తాజాగా యు.కొత్తపల్లి మండలంలోని రమణక్కపేట గ్రామ శివారులో ఎటువంటి అనుమతులు లేకుండానే జెసిబిలతో భూగర్భాన్ని తవ్వేస్తూ, ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ. 2000 నుండి రూ. 2500 వరకు విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

**పట్టించుకోని అధికార యంత్రాంగం**

మైనింగ్ శాఖ నుండి ఎటువంటి అనుమతులు లేకపోయినా, అధికారుల కళ్లెదుటే వందలాది ట్రిప్పులు తరలిపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టపగలే యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ రవాణా వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం భూగర్భ సంపదను దోచుకుంటున్నారని, దీనివల్ల సాగునీటి వనరులు దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత ఏడాది వర్మ పోరాటం**

గత ఏడాది ఇదే తరహాలో అక్రమ తవ్వకాలు జరిగినప్పుడు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ క్షేత్రస్థాయిలో వాటిని అడ్డుకుని, తవ్వకాలు జరుగుతున్న ప్రాంగణంలోనే ప్రెస్ మీట్ నిర్వహించి మాఫియా ఆగడాలను ఎండగట్టారు. ఇప్పుడు మళ్లీ అదే తరహాలో అక్రమాలు తెరపైకి రావడంతో ఈ అంశం పెను వివాదంగా మారింది. తక్షణమే ఈ తవ్వకాలను అడ్డుకుని, బాధ్యులపై కఠినమైన కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకుంటే

# అనేక వ్యాధులకు దూరంగా..

### ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు ...




**ఏలూరు, ఏప్రియల్ 07(మనసులో మాట)..** రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు, మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఏలూరు పరిధిలోని ఆర్ఎంపి మరియు పిఎంపి డాక్టర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు మాట్లాడుతూ గ్రామ పరిధిలో మరియు పేదవారికి అందుబాటులో ఉండి ప్రథమ చికిత్స నిర్వహించడంలో పి.ఎం.పి మరియు ఆర్ఎంపీ డాక్టర్లు అందుబాటులో వైద్య సహాయం అందిస్తున్నారని, అయితే వారి యొక్క పరిధికి లోబడి సేవలందించాలని అన్నారు. ప్రజలను ప్రాథమికంగా ఆరోగ్య సూచనలను చేస్తూ ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండటానికి తగు కృషిచెయ్యాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లాలోని ప్రతి ఒక్కరికి న్యాయ సేవలుపై అవగాహన కలిగించే ఉద్దేశంతో ఇటువంటి న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను అందుకోవాలని అన్నారు. పథకాలు అందుకోవడంలో ఉన్న ఇబ్బందులను తొలగించుకోవడానికి న్యాయ సమస్యలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని అన్నారు. అలాగే అత్యవసర వేళలో 15100 ద్వారా న్యాయసహాయాన్ని పొందవచ్చునని సూచించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం డెమో నాగరత్న మాట్లాడుతూ ఆర్ఎంపి మరియు డాక్టర్లు ప్రాథమిక చికిత్స అందించే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత వేసవిలో డీహైడ్రేషన్ కాకుండా సహజమైన పానీయాలు స్వీకరించే విధముగా మీ వద్దకు వచ్చే రోగులకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే ఎర్లీ ప్రెగ్నెన్సీ నివారించడానికి మీ పరిధిలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను పంపించాలని తెలియజేశారు.

# గొల్లప్రోలుకు 'గ్రేడ్-3 మున్సిపాలిటీ' హోదా..

### - నిధులున్నా వెక్కిరిస్తున్న స్థల కొరత!




**గొల్లప్రోలు, (మనసులో మాట) ఏప్రిల్ 07 :** గొల్లప్రోలు నగర పంచాయతీ స్థాయిని పెంచుతూ, 'మూడవ గ్రేడ్ మున్సిపాలిటీ'గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ పరిపాలన,పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ సంతకంతో విడుదలైన ఈ ఆదేశాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో పట్టణాభివృద్ధి పనులకు మరింత ఊతం లభించనుంది.

**పాత భవనంలోనే కొట్టుమిట్టాడుతున్న కార్యాలయం**

మున్సిపాలిటీగా హోదా పెరిగినప్పటికీ, కార్యాలయ భవన సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితమే నూతన పురపాలక సంఘ భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధులు మంజూరైనప్పటికీ, స్థలం దొరకకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా, ప్రస్తుతం పాత భవనంలోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇది అటు సిబ్బందికి, ఇటు పనుల కోసం వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.

**తక్షణమే నూతన భవనం నిర్మించాలని డిమాండ్:**

హోదా పెరిగిన నేపథ్యంలో, పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణమే స్థల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఆధునిక హంగులతో కూడిన నూతన భవనం నిర్మిస్తేనే, మున్సిపాలిటీగా పట్టణానికి లభించిన ఈ హోదాకు పూర్తి సార్థకత చేకూరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మెరుగైన రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి వసతులతో పాటు, పాలనా భవనాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఈనెల 11న ముఖ్యమంత్రితో కాకినాడ జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధుల సమావేశం

### - నియోజవర్గ అభివృద్ధికి కార్యాచరణ వివరిస్తాం - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 7..** స్థానిక రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఏప్రిల్ 11వ తేదీ అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కాకినాడ జిల్లాలోని ఎంపీ, రాజ్యసభ సభ్యుడు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సమావేశంలో జగ్గంపేట నియోజక వర్గంలో చేపట్టవలసిన పలు కార్యక్రమాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని అందులో ముఖ్యంగా పేదలకు ఇళ్ల స్థలాలు, మల్లి సాలలో ఇండస్ట్రియల్ పార్క్, 16 వ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి జగ్గంపేట నియోజకవర్గంలో బైపాస్ లేకుండా ఎలివేటెడ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, ఏలేరు ఆయకట్టు 53,000 ఎకరాలకు సాగునీరు అందించాలని, ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం తో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా వంద పలకల ఆసుపత్రి నిర్మాణం కొరకు, కిర్లంపూడి డిగ్రీ కాలేజ్ రీ శాంక్షన్, ఇర్రిపాక ప్రభుత్వ ఆసుపత్రి రియాక్షన్, గోకవరంలో అగ్నిమాపక కేంద్రం తదితర 11 అంశాలను ముఖ్యమంత్రికి వివరించి ఆమోదించుకోవడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాంద్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, ముండ్రు ఎర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## 'నీటి భద్రత' నీటి సంఘాల బాధ్యతపై ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం



**రంపచోడవరం మనసులో మాట ఏప్రియల్ 7:** అడ్డతీగల మండలంలో నీటి సంరక్షణకు కీలక అడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అడ్డతీగల ఎంపీడీవో కుమార్ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు 100 రోజులపాటు "నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత" కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు.

అస్తవ్యస్త వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో నీటి వనరుల గుర్తింపు, మైక్రో ఇరిగేషన్ ప్రోత్సాహం, చెక్‌డ్యామ్‌లుఫార్మ్‌పాండ్ల నిర్మాణం వంటి చర్యలు చేపట్టనున్నారు. ప్రజల భాగస్వామ్యంతో వర్షపు నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల పెంపు, చెరువుల అనుసంధానం, పచ్చదనం విస్తరణతో పాటు పంటల ఉత్పత్తి పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాలు చురుకుగా పాల్గొనాలని ఎంపిడిఓ కుమార్ సూచించారు.



# మన రాజధాని అమరావతి

### - సైకత శిల్పి దీవెన శ్రీనివాస్

**అనపర్తి (మనసులో మాట) ఏప్రియల్ 7:** ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ, పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రంగంపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకతశిల్పి దేవిన శ్రీనివాస్, తన కుమార్తెలు సోహిత, ధన్యత కలిసి సోమవారం, మన రాజధాని అమరావతి అనే థీమ్‌తో ఆకర్షణీయమైన సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పం అమరావతి రాజధానిపై ప్రజల్లో ఉన్న గౌరవం, అభిమానం ప్రతిబింబించింది. ఈ సందర్భంగా సైకత శిల్పి శ్రీనివాస్‌ను, సోహిత, ధన్యతలను స్థానిక కూటమి నాయకులు అభినందించి సత్కరించారు.

## జనార్ధన స్వామి ఆలయానికి రూ.20వేల విలువైన స్పీకర్ల బహుకరణ



**కొత్తపేట( మనసులో మాట) ఏప్రిల్ 7..** ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయానికి, కృష్ణ పరివార్ సేవా సంఘం, కాకినాడ రూ.20 వేల విలువైన స్పీకర్ లు బహుకరించారు. స్పీకర్లను మంగళవారం ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఈవో నరేంద్రకుమార్ లకు అందజేశారు.కార్యక్రమంలో శ్రీ కృష్ణ పరివార్ సేవా సంఘం అధ్యక్షుడు పల్లం రాజు, పల్లా రావు, పురుషోత్తం , రామకృష్ణ, శ్రీ కృష్ణ పరివార్ సేవా సంఘం ఫౌండర్ సుధా మాధురి పాల్గొన్నారు. దాతలను ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు చిన్నం సుబ్బలక్ష్మి, సబ్బవరపు రామాయమ్మ, దారా దుర్గాభవాని అభినందించారు.

## వారపు సంతలో చలివేంద్రం ప్రారంభించిన అడ్డతీగల ఎంపీడీవో కుమార్..



**రంపచోడవరం మనసులో మాట ఏప్రియల్ 7:** మండల కేంద్రమైన అడ్డతీగల లో మంగళవారం వారపు సంత కావడంతో ,వేసవి కాలం నీ దృష్టిలో పెట్టుకుని స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ప్రతి గ్రామ పంచాయతీల ప్రధాన కూడలి లో చలి వెంద్రములు ఏర్పాటు చేయవలసిందిగా పంచాయతీ అభివృద్ధి అధికారుల కు ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగముగా మంగళవారం వారపు సంతలో చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని ఎంపీడీవో కుమార్ తెలిపారు. మిగతా ప్రాంతాల లో రానున్న రెండు రోజులలో చలివేంద్రము లు ఏర్పాటు చేయడమగు తుందని అడ్డతీగల ఎంపీడీవో కుమార్ తెలిపారు.

## అంబేద్కర్ జయంతిని 'మద్యం నిషేధ దినం'గా ప్రకటించాలి



**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 07 :** గాంధీ జయంతి మాదిరిగానే ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని కూడా 'మద్యం నిషేధ దినం' (డ్రై డే)గా ప్రకటించాలని అంబేద్కరిస్టులు, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం పిఠాపురం తహశీల్దార్, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదాయ వనరుగా చూడకుండా, యువత జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్న మద్యం, గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో గుబ్బల రాజు, మాజీ కౌన్సిలర్ పెదపాటి రాజేష్, గొడుగు సత్యనారాయణ, రాజాల నాగేశ్వరరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఆశీస్సులతో... అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యుడు గా... ధనికుల సూర్య భాస్కరం వీరభద్రరావు.



**ఏలేశ్వరం (మనసులో మాట) ఏప్రిల్ 7..** ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు దనేకుల సూర్య భాస్కరరావు వీరభద్ర రావుకి అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా పదవి వరించింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీస్సులతో అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా నియమితులైన దనేక సూర్య భాస్కరం వీరభద్రరావుకి టిడిపి నాయకులు కార్యకర్తలు అలాగే బిజెపి నాయకులు కార్యకర్తలు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో బి జె పి సీనియర్ నాయకుడు కొల్లా శ్రీనివాస్, బేరి ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు. కాగా తనకు అన్నవరం దేవస్థానం పాలకమండలి లో స్థానం కల్పించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభకు దనేకుల సూర్య భాస్కరం వీరభద్రరావు కృతజ్ఞతలు తెలిపారు. అన్నవరం దేవస్థానం అభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# జలధార కార్యక్రమం సత్ఫలితాలకు శాఖల సమన్వయం కీలకం

- నిర్దిష్ట సమయంలోగా పనులు పూర్తి చేయాలి
- టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కీర్తి చేకూరి దిశా నిర్దేశం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 7:** జలధార కార్యక్రమం సత్ఫలితాలు సాధించడంలో ఇరిగేషన్‌తో పాటు ఇతర కోర్ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మండలాల వారీగా ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు చొరవ తీసుకోవాలని, గ్రామ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు సమన్వయంతో ముందుకు సాగితేనే భూగర్భ జలాల మెరుగుదల సాధ్యమవుతుందని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం జలధార కార్యక్రమంపై క్షేత్ర స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో జలధారజలహారతి కార్యక్రమాలు భూగర్భ జలాల పెంపులో దిశానిర్దేశంగా నిలుస్తున్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. జిల్లాలో ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు 20 మీటర్ల లోతులో ఉండగా, ఆయా మండలాల్లో కనీసం 5 మీటర్ల స్థాయికి పైకి తీసుకురావాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో, క్షేత్ర స్థాయిలో వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఏపీఓలు, ఏఈలు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని చెప్పారు. గోపాలపురం, కోరుకొండ, అనపర్తి, రాజానగరం, నల్లజర్ల తదితర మండలాల్లో భూగర్భ జలాల స్థాయి తక్కువగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల వారీగా భూగర్భ జలాలు స్థాయి ఆయా మండల అధికారులకి పంపడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో ఉన్న చెరువులకు నీరు వచ్చే ఫీడర్ చానెల్స్, సబ్ చానెల్స్‌ను గుర్తించి ఉపాధి హామీ పథకం కింద పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని, చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలధార పనుల్లో 99 శాతం వరకు ఉపాధి హామీ పథకం కింద వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో బృందాల పాత్ర కీలకమని, చెరువుల యథార్థ స్థితి, గత అనుభవాల ఆధారంగా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అవసరమైతే ఇంటర్‌లింక్ పనులపై కూడా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ అమలు చేయడం తప్పనిసరి అని, ప్రతి అపార్ట్‌మెంట్‌లో ఈ విధానం అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ, వినియోగంపై సమర్ధవంతమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కాల్వల ఆక్రమణలను గుర్తించి యాక్షన్ ప్లాన్‌లో చేర్చాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల కింద ప్రతి మండలానికి 65 వేల పని దినాలు లక్ష్యంగా నిర్ణయించి, రోజువారీ ప్రగతిని సమీక్షిస్తామని తెలిపారు. చెరువుల పూడిక తీత, బండబలం పెంపు, జంగిల్ క్లియరెన్స్ పనులు వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

భూగర్భ జలాల స్థాయిని సంప్రదాయ పద్ధతుల్లో కూడా అంచనా వేయాలని, చెరువుల సమీప బోర్ల స్థాయిని నమోదు చేసి, పనుల అనంతరం మార్పులను విశ్లేషించాలని సూచించారు. గ్రామాల వారీగా ప్రీ, ఆఫ్టర్ ఫోటోలు సేకరించి యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

జలధార మార్గదర్శకాలు ప్రజలకు వివరించి, గ్రామాల వారీగా ప్రతిపాదిత పనులను తక్షణం ప్రారంభించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధి (డ్వామా), పంచాయతీ రాజ్, వ్యవసాయ, భూగర్భ జలాలు, రెవెన్యూ, డీపీఓ తదితర శాఖల అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏపీఓలు, ఏఈలు సమన్వయంతో పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామ స్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయ సహాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కలసి చెరువుల పూడిక తీత, ఫీడర్ ఛానెల్‌ల శుద్ధి, వర్షపు నీటి సంరక్షణ పనులను అమలు చేస్తున్నారు. ఈ విధంగా జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయడం ద్వారా జలధార కార్యక్రమం లక్ష్యాలు సాధ్యమవు తాయన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్ లో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి



**తణుకు (మనసులో మాట), ఏప్రిల్ 8:** ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు తణుకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను స్థానిక శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ వాటర్ ప్లాంట్‌ను స్వర్ణ లయన్స్ క్లబ్ వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజానికి మేలు చేసే సేవా కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన పి4 కార్యక్రమం స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

అలాగే, సామాజిక సేవా స్ఫూర్తితో ఈ పి4 కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. ప్రయాణికులు ఈ ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారానికి దశల వారీగా నిరసన

- మెడికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్



**అనపర్తి (మనసులో మాట ) ఏప్రియల్ 7:** ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు, రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ విభాగంలో బుధవారం నుండి నాలుగు రోజులు దశల వారిగా పోరాటం చేయడానికి ప్రభుత్వానికి అందజేసిన నోటీసు కాపీని, మంగళవారం డాక్టర్ టి. రామ గురెడ్డి, టి. రామగుర్రెడ్డి మెడికల్ సూపరింటెండెంట్ , ఏరియా ఆసుపత్రి అనపర్తి కి అందజేయడమైనది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ విభాగంలో సమస్యల పరిష్కారానికి ఈ దశల వారి నిరసన కార్యక్రమం అని వార్యమైనదని, ఈ కార్యక్రమానికి సహకరించగలరని కోరడమైనది. ప్రధానంగా దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ సమస్యలు పరిష్కారం కొరకు, దశల వారి పోరాట కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా జరుపుటకు రాష్ట్ర సంఘం నిర్ణయించిన కారణంగా, ప్రతి చోటా ఈ కార్యక్రమం జరపాలని పిలుపునిస్తున్నాము. ప్రధానంగా పి ఆర్ సి, ఐ ఆర్, పెండింగ్ డిఏలు, సిబ్బంది కొరత తో బాటు ఇంకా అనేక విషయములు పరిష్కారం కొరకు, ఈ నిరసన కార్యక్రమం చేయ తలపెట్టామని, అనపర్తి లో జరిగిన ఈ కార్యక్రమంలో పి రవికుమార్, చైర్మన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, శ్రీమతి తిరుమల దేవి, హెడ్ నర్స్, శ్రీమతి కరుణశ్రీ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 2, శ్రీమతి నీలిమ, జూనియర్ ఎనలిస్ట్ పాల్గొని పి రవికుమార్, చైర్మన్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ( ప్రభుత్వం చే గుర్తింపు పడిన సంఘం ), ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా.

# జిల్లాలో వినియోగదారులు, వ్యాపార సంస్థలు ఎల్‌పీజీ నుంచి పీఎన్‌జీ వైపు మారాలి..

- పీఎన్జీ గ్యాస్ కలెక్షన్లు విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి..
- జిల్లా స్థాయిలో యుటిలిటీస్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వెల్లడి..



**కాకినాడ (మనసులో మాట )ఏప్రిల్ 7..** జిల్లాలో వినియోగదారులు, వ్యాపార సంస్థలు ఎల్‌పిజి గ్యాస్ వినియోగానికి బదులుగా పైపుల ద్వారా సరఫరా అయ్యే సహజ వాయువు పీఎన్‌జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) వినియోగించేలా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా స్థాయిలో యుటిలిటీస్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జేసీ అపూర్వ భరత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో ప్రస్తుతం ఉన్న పీఎన్జీ గ్యాస్ కనెక్షన్లు, ఎల్పీజీ వినియోగదారు లను పీఎన్జీ గ్యాస్ వైపు మళ్ళించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అన్ని మున్సిపాలిటిల కమిషనర్లు, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ప్రతినిధులతో ఈ సందర్భంగా ఆయన చర్చించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. జిల్లాలో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆరు మండలాల్లో దాదాపు పైప్‌లైన్‌లు పూర్తి చేసిందన్నారు. జిల్లాలో ఇప్పటికే మొత్తం 35,042 కనెక్షన్లు ఉన్నాయని ఆయన తెలిపారు. పిఠాపురం, పెద్దాపూరం, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో కొన్ని పైప్‌లైన్‌లకు అనుమతులు పూర్తవుతున్నాయని, మరిన్ని మండలాల్లో పీఎన్జీ గ్యాస్ కనెక్షన్ల విస్తరణకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జేసి అధికారులకు స్పష్టం చేశారు. పీఎన్జీ వినియోగం చాలా సురక్షితమైనది, తక్కువ ధరలో లభిస్తుందని, బుకింగ్ లేకుండా వాడుకోవచ్చని వినియోగదారులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు, ఆర్ అండ్ బీ ఎస్ఈ జీ కాంతు, డ్వామా పీడీ ఎన్.మధుసుధన్, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గుప్తా..పెద్ద మోసగాడు

- చిట్టిల్లో రూ.8 కోట్లు దిగమింగాడు - శ్రీవారి ఆలయ ఛైర్మన్ పదవికి అనర్హుడు...
- ప్రజలకు కుచ్చు టోపీ పెట్టిన నేరస్థుడు.. భగవంతునికి సేవా చేస్తాడా...
- గుప్తాను వెంటనే ఛైర్మన్ పదవి నుండి తొలగించాలి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ను విమర్శించే స్థాయి గుప్తాకు లేదు - గుప్తా చిట్ ఫండ్ బాధితులు నిరసన



**మండపేట (మనసులో మాట), ఏప్రిల్ 7:** మండపేటలో చిట్టీల పేరుతో మధ్య తరగతి ప్రజలకు రూ.8 కోట్లు ఎగ్గొట్టిన ఘనుడు.. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వాకచర్ల గుప్తా అని చిట్ ఫండ్ బాధితులు గ్రంధి సూరి పండు, బోడ నారాయణరావు, చెక్కా సురేష్, పసుమర్తి సూర్యనారాయణ, మద్దుల ఆనంద్ లు విమర్శించారు. మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మండపేటలో భక్తులు ఎంతో పవిత్రంగా భావించే శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం ఛైర్మెన్ పదవికి వాకచర్ల గుప్తా అనర్హుడని దుయ్యబట్టారు. ప్రజలకు కుచ్చు టోపీ పెట్టిన ఘనుడు భగవంతునికి సేవ చేసే అర్హత లేదన్నారు. పేదల కడుపు కొట్టిన మోసగాడు గుప్తాను తక్షణమే ఛైర్మెన్ పదవి నుండి తొలగించాలని డిమాండు చేశారు. నిరంతరం బడుగు వర్గాల సంక్షేమం కోసం కృషిచేసే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ను విమర్శించే స్థాయి గుప్తా కు లేదన్నారు. ఆర్థిక నేరగాడు అయిన ఇతనికి ఛైర్మన్ పదవి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. గుప్త చిట్స్ అండ్ ఫైనాన్స్ పేరుతో ఆర్థిక నేరాలకు పాల్పడి దాదాపు 80 మంది బాధితులను మోసం చేశారన్నారు. రూ.8 కోట్లు దిగమింగిన వాకచర్ల వీరవెంకట సత్యనారాయణ (గుప్తా) కు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును విమర్శించే హక్కు లేదని బాధితులు తీవ్రంగా ఖండించారు. తోట పై కేసు ఉన్నాయని విమర్శించారని, ఆ కేసులు తరవాత జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారన్నారు. ఆయనకు ప్రజల్లో ఉన్న మంచి పేరును ఓర్వలేకే ఇటువంటి విమర్శలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడిపై 23 స్టే ఆర్డర్లు ఉన్న విషయాన్ని గుర్తెరిగి మాట్లాడాలన్నారు. సొంత బావమరిది ద్వారా ఖాతాదారులకు నోటీసులు ఇప్పించి, చిట్స్ పేరుతో సున్నం కొట్టించి, బావ మరిదిని పోరంకిలో దాచిన ఘనత గుప్తాదే అన్నారు. తాము అతనిని వెతికి పట్టుకుని పెనమలూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు. తర్వాత ఇప్పనపాడు రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని వెల్లడించారు. మండపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్‌గా ప్రమాణం చేయక ముందే గుప్తా పై ఎఫ్ఐఆర్ నమోదు అయిందన్నారు. కేసులో నిందితుడిని ప్రమాణ స్వీకారం ఎలా చేయించారో చెప్పాలన్నారు. దేవదాయ ధర్మదాయ చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ ఉన్న వ్యక్తికి పోలీసులు ఎలా క్లియరెన్స్ ఇచ్చారో చెప్పాలన్నారు. ఎండోమెంట్స్ ఉన్నతాధికారులు ఎలా నియమించారని ప్రశ్నించారు. ఆర్థిక లావాదేవీలపై ఉన్నత న్యాయస్థానంలో ఇప్పటికీ కేసు నడుస్తోందన్నారు. 80 మంది బాధితులు మోసం చేసి కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన ఆర్థిక నేరస్తుడు స్థాయి మరచిపోయి ఇతరులను విమర్శించడం చూస్తే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేవదాయ ధర్మదాయ చట్టం ప్రకారం నిష్కళంకులు మాత్రమే ధర్మకర్తలుగా అర్హులని అన్నారు. చిన్న మచ్చ ఉన్నా వారు అనర్హులని చెప్పారు. నీతి-నిజాయితీ ఉంటే వెంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్‌గా తక్షణం రాజీనామా చేయాలని బాధితులు డిమాండు చేశారు. పట్టణ ప్రజలు, కలియుగ వెంకటేశ్వర స్వామిని ఆరాధించే భక్తులు, ఎండోమెంట్స్ అధికారులు హుండీ లెక్కింపు సమయంలో ఇటువంటి వ్యక్తి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. దేవుడి సొమ్ములు కూడా కొట్టేస్తారని ధ్వజమెత్తారు. దేవాలయ ప్రతిష్ఠను కాపాడాలని కోరారు. గుప్తా నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని, పంది పురాణాలు చదివినట్టు ఉందన్నారు. దేవదాయ ధర్మదాయకు సంబంధించిన కనీస పరిజ్ఞానం లేకుండా ఆలయ చైర్మన్‌గా నియమించడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్, పోలీసు డిపార్ట్‌మెంట్ ఎలా క్లియరెన్స్ ఇచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని బాధితులు డిమాండు చేశారు. సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

# వైకాపా కమిటీలలో ఉన్న ప్రతి సభ్యునికి గుర్తింపు కార్డు ఇవ్వడమే పార్టీ లక్ష్యం



**అనపర్తి( మనసులో మాట) ఏప్రిల్ 7:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే ఉద్దేశంతో పార్టీ కమిటీలను నియమిస్తున్నామని, ఇందులో మెయిన్ కమిటీతో పాటు 22 అనుబంధ విభాగాల కమిటీలను నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలోనూ, ఏర్పాటు చేయడం ధ్యేయంగా పెట్టుకున్నామని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కమిటీల్లో స్థానం పొందిన ప్రతి సభ్యునికి పార్టీ గుర్తింపు కార్డును జారీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని కోసం నాయకులు మరియు కార్యకర్తలకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని (క్యాడర్ వివరాలను) అందించాలని, అలా చేస్తే కంప్యూటరీకరణ చేయడం సులభం అవుతుందని ఆయన తెలియజేశారు. అలాగే అనపర్తి నియోజకవర్గం లో పార్టీ డివిజన్ స్థాయి ఇంచార్జ్ లు గా ఉన్నవారు ఇప్పటికే అప్రూవ్ అయిన గుర్తింపు కార్డుల డేటాను ఒకసారి మీ గ్రామాలలో చెక్ చేసి వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగించా లని, ప్రతి గ్రామంలో సూపోలింగ్ బూత్ కమిటీలకు సంబంధించి కన్వీనర్లను కూడా వెంటనే నియమించాలని సూచించారు. పార్టీ భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలకు, నాయకులకు సముచిత గుర్తింపునిచ్చే పరిపాలన జరుగుతుందని సూర్యనారాయణ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల డివిజన్ అబ్జర్వర్లు ఇన్చార్జిలు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.



# పవన్ కళ్యాణ్ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం

**పిఠాపురం,( మనసులో మాట) ఏప్రిల్ 07 :** కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పిఠాపురం రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు 37 కోట్ల రూపాయల భారీ నిధులు మంజూరు చేయడంపై నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతోనే ఈ నిధులు మంజూరయ్యాయని కొనియాడుతూ మంగళవారం సాయంత్రం పిఠాపురం రైల్వే స్టేషన్ వద్ద జనసేన శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి. కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైవ్ మాన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్, పట్టణ అధ్యక్షురాలు డాక్టర్ చిక్కాల వరలక్ష్మి, వీర మహిళా బుర్ర దివ్యరాజ్, వివిధ మండల అధ్యక్షులు వెన్న జగదీష్, రావు అక్షయ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, కరణం సూరిబాబు, బొజ్జా కుమార్ బాబు, పెంకె జగదీష్, వాకపల్లి సూర్య ప్రకాష్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని నియోజకవర్గ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ నిధులతో పిఠాపురం రైల్వే స్టేషన్ లో ప్రయాణికులకు అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు నాయకులు ఈ సందర్భంగా వెల్లడించారు.

# అడ్డతీగల ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటోల హల్‌చల్

- ఆర్ టీ సి బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం



**రంపచోడవరం (మనసులో మాట) ఏప్రిల్ 7..** అడ్డతీగల మండల కకేంద్రం లో ఉన్నా ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటో డ్రైవర్ల ఆగడాలు రోజు రోజుకి మితిమీరి పోతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆటో డ్రైవర్లు తమ ఆటోలను బస్టాండ్ లోపలికి తీసుకువస్తూ, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. సాధారణంగా బస్టాండ్ బయట ప్రయాణికుల కోసం వేచి ఉండాల్సిన ఆటోలు, ఏకంగా బస్సుల ప్లాట్‌ఫారమ్ వరకు వెళ్తుండటంతో అటు డ్రైవర్లకు, ఇటు ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు . ముఖ్యంగా ఆర్టీసీ బస్సు మాదిరిగానే ఆటో డ్రైవర్లు బస్టాండ్ లోపల తిరుగుతూ గట్టిగా కేకలు వేస్తూ ప్రయాణికులను పిలుస్తుండటం గమనార్హం. ఈ క్రమం లో బస్సులు లోపలికి రావడానికి, వెనక్కి వెళ్లడానికి సరైన దారి లేక డ్రైవర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఆటో డ్రైవర్లు బస్టాండ్‌ను ఆటో స్టాండ్‌గా మార్చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, ప్రయాణికుల భద్రతను సైతం విస్మరిస్తున్న ఈ తీరుపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, బస్టాండ్ ఆవరణలో ఆటోల ప్రవేశాన్ని అరికట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్



**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 07:** మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మ, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం తక్షణమే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం పిఠాపురంలోని స్థానిక పార్కు వద్ద గల మస్తర్ల కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు బంగారు కన్నా అధ్యక్షతన పారిశుధ్య కార్మికుల సమస్యలపై అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 11, 12 తేదీల్లో కాకినాడలో జరగనున్న ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభల (కరపత్రం) ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో శ్రమిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, కార్మికుల హక్కుల సాధన కోసం జరిగే ఈ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాధాకృష్ణ వెంటనే క్షమాపణ చెప్పాలి

- వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు



**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 7 :** మీడియా ముసుగులో చంద్రబాబుకు మొదటి నుంచి బ్రోకరిజం చేస్తున్న ఏబీఎన్ రాధాకృష్ణ అని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు అన్నారు. మంగళవారం గోకవరం మండలంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలను కించపరిచేలా రాధాకృష్ణ వ్యక్తిగత దూషణలకు దిగటం తీవ్ర ఆక్షేపణీయమని మండిపడ్డారు. రాధాకృష్ణ బ్రోకర్ పనులు చేసి ఎదిగారని గుర్తు చేశారు. పత్రికను అడ్డుపెట్టుకుని బ్రోకరిజం చేసేవారని ఏడుకొండలు అన్నారు. అలాంటి నీచ చరిత్ర ఉన్న రాధాకృష్ణ మహిళల గురించి, వైఎస్ఆర్సిపి గురించి నీచంగా మాట్లాడుతున్నారన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో కొత్త పలుకు పేరుతో రాధాకృష్ణ చెత్త పలుకులు పలికారని భార్యలు మహిళలు గురించి ఇలాంటి నీచమైన రాతలు రాయడం మహిళా లోకాన్ని మరింత అవమానం చేయడం నీకు తగునా అని నిలదీశారు. ఏబీఎన్ రాధాకృష్ణ ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని మహిళలపై తప్పుడు రాతలు రాసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం | చిత్తూరు | కడప
బుధవారం 8 ఏప్రిల్ 2026



### కాకాణి రమణారెడ్డి స్టేడియం అభివృద్ధికి

# సోమిరెడ్డి సన్నాహాలు

- మెగా మినరల్ ప్లాంటు పునరుద్ధరణకూ చర్యలు
- రెండు నెలల్లో వాటర్ ప్లాంటును వినియోగంలోకి తెచ్చేలా కార్యాచరణ
- కాకాణి రమణారెడ్డి స్టేడియంలో వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచన






**సర్వేపల్లి/ పొదలకూరు ఏప్రిల్ 7 (మనసులో మాట)..** సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలం తోడేరులోని కాకాణి రమణారెడ్డి స్టేడియం అభివృద్ధికి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సన్నాహేలు చేపట్టారు. లిఅదానీ కృష్ణపట్నం పోర్టు సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్, బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ మురళీధర్ తో కలిసి పొదలకూరు చిట్టేపల్లి తిప్పపై ఉన్న వాటర్ ప్లాంటుతో పాటు తోడేరులోని స్టేడియంను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం విషయంలో అడిగిన వెంటనే సహకారం అందించేందుకు పోర్టు ప్రతినిధులు స్పందించారు .గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పొదలకూరు మండల వాసులకు మినరల్ వాటర్ అందించేందుకు రూ.4.59 కోట్లతో మెగా ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. రూ.2 కే 20 లీటర్ల నీళ్లు అందించే లా ఊరూరా వాటర్ డిస్పెన్సరీలు నిర్మించామని తెలిపారు.2019లో వైసీపీ అధికారంలోకి రాగానే మెగా వాటర్ ప్లాంటుపై కక్షకట్టి మూలనపెట్టేశారు. తోడేరు పరిధిలోని కాకాణి రమణారెడ్డి స్టేడియంలో ఒక బిల్డింగ్ కట్టి వదిలేశారు.. మైదానమం తా కర్రతుమ్మ చెట్లేనని తెలిపారు.మెగా వాటర్ ప్లాంటుతో పాటు స్టేడియం ను వినియోగంలోకి తేవడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వాటర్ ప్లాంటు మరమ్మతులకు రూ.1.35 కోట్లు అవసరమవుతాయని ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు అంచనా వేశారు. కరెంటు బిల్లు కూడా రూ.కోటికి పైగా పెండింగ్ ఉందని తెలిపారు.వాటర్ ప్లాంటులో పోర్టు టెక్నిషీయన్లను ఈ రోజే రంగంలోకి దించారు.సంప్ లో నీళ్లు వదిలి ప్లాంటు పనితీరుపై అంచనా వేసే పనులను చేపడుతున్నారు స్టేడియం అభివృద్ధికి అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు సూచించామని తెలిపారు.మొదటగా స్టేడియంకు వచ్చే మార్గంతో పాటు మైదానమంతా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతారు. కాకాణి మాదిరిగా మేం కక్షసాధి ంపు చర్యలు చేపట్టబోం.. కాకాణి రమణారెడ్డి పేరుతో ఉన్న స్టేడియంను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసి సొంతూరులో ముళ్ల పొదలతో నిండిన స్టేడియం ఇచ్చాడు పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ ఎత్తేశాడు .కాకాణిలా పేదలు మినరల్ వాటర్ తాగకూడదు...బావుల్లో చేదుకుని మాత్రమే తాగాలని మేం చెప్ప లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అర్థంతరంగా ఆపేసిన సోమశిల దక్షిణ కాలువ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజలకు ఎంత మేర ఉపయోగపడుతా మనే అంశాన్ని చూస్తాం. అదానీ కృష్ణపట్నం పోర్టు వారు మేజర్ పంచాయతీలు అయిన ముత్తుకూరు, కృష్ణపట్నం అభివృద్ధి బాధ్యతలు చేపట్టారనీ తెలిపారు. కృష్ణపట్నంలోని తుఫాన్ షెల్టర్ లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభి ంచారు.. మహిళ లకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇచ్చి, మిషన్లు కూడా అందిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు
ముత్తుకూరులో స్టేడియం నిర్మించడంతో పాటు కంపోస్ట్ యార్డ్ ఏర్పాటు చేస్తున్నారు.అదానీ స్కూలు ద్వారా పేద విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. అదానీ కృష్ణపట్నం పోర్టుతో పాటు, ఎస్ ఈ ఐ ఎల్, 11 పామాయిల్ కంపెనీలు, బీపీసీఎల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కిసాన్ క్రాఫ్ట్ తదితర అనేక సంస్థలు అభివృద్ధికి సహకరిస్తున్నాయన్నారు. పొదలకూరు మండల ప్రజలు నాకు మెజార్టీ ఇవ్వలేదని అభివృద్ధిలో నిర్లక్ష్యం చేసే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## హజ్ కమిటీలో చోటు కల్పించడంపై

# మైనారిటీ సోదరుల హర్షం

**పలమనేరు ఏప్రిల్ 7 (మనసులో మాట):** ఏపీ హజ్ కమిటీలో పలమనేరుకు చెందిన మౌలానా అబ్దుల్ అలీమ్ జూనెద్ కు అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తూ పలమనేరు మైనారిటీ సోదరులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని నాగమంగళమునకు చెందిన మౌలానా అబ్దుల్ అలీమ్ జూనెద్ ను రాయలసీమ కేటగిరీలో సబ్ క్లాస్ - 3 కింద హజ్ కమిటీ సభ్యులుగా ప్రకటిస్తూ మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సెక్రటరీ సి.శ్రీధర్ నుంచి గత నెల 29న జీవో వెలువడింది. ఇందుకు తన పేరును సిఫారసు చేసిన ఎమ్మెల్యేను పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మైనారిటీ సోదరులతో కలసి ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. హజ్ కమిటీలో పలమనేరువాసికి చోటు కల్పించడం చాలా గొప్ప విషయమని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజా పీర్, ఖాజీ అబ్దుల్లా, మదీనా మస్జిద్ ఇమామ్ అబ్దుల్ ఖదీర్, హజరత్ రహంతుల్లా లతో పాటు మార్కెట్ కమిటీ సభ్యులు నదీమ్ తదితరులు పాల్గొన్నారు.



### ఇందుకూరుపేట మండలంలో

# 'నిఘా' పటిష్టం

- 23 సీసీ కెమెరాల ఏర్పాటు
- నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలంలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు
- మండలంలోని 9 గ్రామాల్లో 23 సీసీ కెమెరాల ఏర్పాటు.
- 17 కీలక ప్రాంతాల్లో నిఘా నేత్రాలను ప్రారంభించిన ఎస్ఐ నాగార్జున రెడ్డి
- గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకే ఈ నిర్ణయం ఎస్ఐ నాగార్జున రెడ్డి
- సీసీ కెమెరాల నిఘా వల్ల నేరస్తులను త్వరగా పట్టుకునే అవకాశం

**కోవూరు, ఇందుకూరుపేట, ఏప్రిల్ 7(మనసులో మాట):** ప్రతి ఒక్కరూ భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులకు సహకరించాలని ఎస్ఐ నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలంలో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్ఐ నాగార్జున రెడ్డి ప్రారంభించారు.మండలంలోని 9 గ్రామాల్లో మొత్తం 23 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 17 కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను ఎస్ఐ నాగార్జున రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టడం మరియు దొంగతనాలను అరికట్టడం. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడటంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నేరస్తులను త్వరగా గుర్తించడానికి మరియు నేరాలు జరగకుండా నిరోధించడానికి ఈ నిఘా నేత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో భద్రతా చర్యలు తీసుకుంటూ పోలీసులకు సహకరించాలి.అన్నారు నిరంతర నిఘా వల్ల అసాంఘిక శక్తుల కదలికలు తగ్గుతాయి. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు రికార్డింగ్ ఆధారంగా నిందితులను వెంటనే పట్టుకోవచ్చు. గ్రామస్తులలో భద్రతా భావం పెరుగుతుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఎస్ఐ కోరారు.

# ఆలయ పనుల పురోగతిపై సమీక్షించిన ఎమ్మెల్యే

### త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



**పలమనేరు ఏప్రిల్ 7( మనసులో మాట):** పలమనేరు శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయ పునరుద్ధరణ పనుల పురోగతిపై ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మంగళవారం అధికారులు, అర్చకులతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ గోపుర పనులు ఎంతవరకు వచ్చాయని ఈవో రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతమున్న శివాలయ గర్భగుడి పునర్నిర్మాణానికి చేపడుతున్న చర్యలపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అందిన నిధులను త్వరగా వినియోగించుకుని ఆలయ నిర్మాణ పనులు పూర్తిచేయాలని సూచించారు.అయితే ప్రధాన ఆలయంతో పాటు ఇతర ఆలయాల నిర్మాణానికి సరిపడా నిధులు లేవని ఇందుకు దాతల సహకారం అవసరం ఉంటుందని ఎమ్మెల్యే వారు వివరించారు. అయితే ప్రస్తుతానికి ప్రధాన ఆలయ పనులు పూర్తి చేయాలని భవిష్యత్తులో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇతర నిర్మాణాలను చేపడతామని ఆయన వారికి తెలియజేశారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడడమే గాక భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ పునర్ నిర్మాణం, నూతన ధ్వజ స్తంభము, నంది మండపము, సుబ్రహ్మణ్య, కాలభైరవ,అయ్యప్ప ఆలయాల నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వారికి ఆయన సూచించారు. వాటితో పాటు స్వామి వారి నివేదనకు పోటు, అలంకార మండపం కోనేరు అనుసంధానంతో నూతన వాహనాల మండపం,భక్తుల సౌకర్యర్థం సేద తీరడానికి, ప్రసాద వినియోగానికి షెడ్డు నిర్మాణం, ఈశన్య భాగంలో ఆర్చి ఉండేలా చూసుకోవాలన్నారు.వీలైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని వారిని ఆదేశించారు. 12 ఏళ్లకో సారి జరగాల్సిన కుంభాభిషేకం 2003తో ఆగిందని ఇప్పటిదాకా ఆ కార్యక్రమం జరగలేదంటు అర్చకులు ఎమ్మెల్యేకు తెలుపగా ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది 2027 కు కుంభాభిషేకం జరిగేలా చూడాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రమణా రెడ్డి, గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్, అర్చకులు కుమార్ గురుకుల్, రాఘవేంద్ర, చంద్ర మౌళిలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు మురళీ కృష్ణ, బాబు, రెడ్డెప్ప, వీరప్ప, మంజునాథ్, ఆది,టీడీపీ పట్టణ అధ్యక్షులు ఆర్బీసీ కుట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ పాకాటి గౌతమ్ రాజ్, డాక్టర్ శ్రీపతి బాబు లకు

# ఘన సన్మానం



**నాయుడుపేట, మనసులో మాట (ఏప్రిల్ 7):** రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ పాకాటి గౌతమ్ రాజ్,డాక్టర్ శ్రీపతి బాబు లను జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి,నాయుడుపేట ఏ ఎం సి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ పాకాటి గౌతమ్ రాజ్,శ్రీపతి బాబు లకు ఉయ్యాల ప్రవీణ్ శాలువాలు కప్పి,పుష్పగుచ్చాలు అందజేసి,సన్మానించి,ఘన స్వాగతం పలికారు.వారి వెంట సీనియర్ జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు, బాలుశెట్టి తదితరులు ఉన్నారు.

# డ్రగ్స్,గంజాయి మూకలను అరికట్టాలి - ప్రజలకు రక్షణ కల్పించాలి

- డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాల వాడుకల పై పోలీసులు ఉక్కుపాదం మోపాలి
- డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్




జిల్లా లో డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పద్ధతులను అరికట్టాలని,వాటిని వాడే వారిపైన ఖటిని చర్యలు చేపట్టాలని,గంజాయి మూకల నుండి ప్రజలకు రక్షణ కల్పించి పోలీసులు నిరంతర పర్యవేక్షణ చేయాలని డి.వై.ఎఫ్.ఐజిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు.మంగళవారం నాడు జమ్మలమడుగు లో స్థానిక ఎన్జీవో కార్యాలయం నందు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో,జిల్లా లో రోజు రోజుకు గంజాయి మూకల దాడులు,హత్యలు పెట్రేగి పోతున్నాయని అన్నారు.ఒకవైపు ప్రభుత్వం,పోలీసు యంత్రాంగం గంజాయి,డ్రగ్స్ పదార్థాలను వాడే వారిపై కటినంగా ఉంటామని వాటిని కూకటివేళ్లతో తీసివేస్తామని మాటల వరకే పరిమితం అవుతున్నారు తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు.నెల్లూరు లో పెంచలయ్య హత్య సంచలనం మరువక ముందే ఉప్పు ఎదేచ్చన ఆసుపత్రి ఆవరణలోనే సోమవారం నాడు కడప లో గంజాయి బ్యాచ్ హత్య చేశారంటే ఏ స్థాయిలో ఉన్నారో అర్థం అవుతున్నది అన్నారు.ముఖ్యంగా జిల్లా లో విపరీతంగా గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువ అయ్యాయన్నారు.వీటి నియంత్రణ చాలా అవసరం అన్నారు.ప్రజలు గంజాయి మూకల వలన భయభ్రాంతులకు గురవుతున్నారు అన్నారు.జిల్లా లో గంజాయి వాడకాల పై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని గంజాయి బ్యాచ్ లపై కటిన చర్యలు చేపట్టాలని రాజకీయ పార్టీల నేతల అండ చూసుకుని గంజాయి బ్యాచ్ పెట్రేగి పోతున్నారాణి అటువంటి వారిని ఆయా రాజకీయ పార్టీల నుండి నేతలను బహిష్కరించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో పట్టణ కార్యదర్శి తులసిశ్వర్,నాయకులు, మహేష్,రాము పాల్గొన్నారు.

## త్రాగునీరు సాగునీటి సాధన పై

# భవిష్యత్ కార్యాచరణ




**పలమనేరు ఏప్రిల్ 7 (మనసులో మాట):** తిరుపతిలోని డి పి ఆర్ కళ్యాణమండపంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ తాగునీరు, సాగునీటి సాధన, భవిష్యత్తు కార్యచరణ"పై నిర్వహించిన కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేవెంకటేగౌడ పాల్గొని మాట్లాడుతూ.... ఈ కార్యక్రమం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రి సాకె శైలజానాథ్ గారి నాయకత్వంలో జరిగింది. రాయలసీమలో ఎత్తిపోతల పథకాల ద్వారా తాగునీటి సమస్యను పరిష్కారం చేయడం, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సీపీ నియోజకవర్గం సమన్వయకర్తలు, మాజీ మంత్రులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, ఇతర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

### ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా

# ప్రజలకు ఆరోగ్య అవగాహన డాక్టర్ యుగంధర్



**పలమనేరు ఏప్రిల్ 7 ( మనసులో మాట):** పలమనేరు పట్టణంలోని సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ( ఐఎంఏ) పలమనేరు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా హాస్పిటల్‌కు చెందిన ఈఎన్‌టీ నిపుణుడు డాక్టర్ యుగంధర్, హాస్పిటల్‌కు వచ్చిన పేషెంట్స్, స్థానిక ప్రజలకు ఆరోగ్యంపై పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ప్రస్తుతం ఆధునిక జీవనశైలిలో మార్పుల కారణంగా మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు వంటి అనేక వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, శారీరక వ్యాయామం చేయకపోవడం,అధిక ఒత్తిడి, పొగతాగడం, మద్యపానం వంటి అలవాట్లు మన ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు.ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవడం, పచ్చి కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం, తక్కువ నూనె, ఉప్పు ఉన్న ఆహారం తీసుకోవడం, రోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయడం, శుభ్రమైన నీరు త్రాగడం, సరిపడ నిద్ర తీసుకోవడం వంటి మంచి అలవాట్లు పాటించాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒకసారి పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. చిన్న ఆరోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి ప్రతి వ్యక్తి తన ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని డాక్టర్ యుగంధర్ పిలుపునిచ్చారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



## కడప డిఎస్పీవెంకటేశ్వర్లు పై బదిలీ వేటు...

**కడప, ఏప్రిల్ 7 ( మనసులో మాట) :** కడప డిఎస్పీవెంకటేశ్వర్లు పై బదిలీ వేటు. నిన్న జరిగిన గంజాయి బ్యాచ్ ను నియంత్రణ చేయడం లో వైఫల్యం చెందినట్లు అభియోగం. డీజీపీ కార్యాలయం లో రిపోర్ట్ చేయాలని ఉన్నత అధికారుల ఆదేశాలు.

## కొమ్మమూరు కాలువలోకి దూసుకెళ్లిన ఇసుక టిప్పర్

**- నియంత్రణ కోల్పోయి వంతెనపై నుంచి బోల్తా - డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**



**చేబ్రోలు ఏప్రిల్ 7 ( మనసులో మాట) :** గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామ శివారులో ఘోర ప్రమాదం తప్పింది. వేగంగా వెళ్తున్న ఓ ఇసుక టిప్పర్ నియంత్రణ కోల్పోయి కొమ్మమూరు కాలువ వంతెన పైనుంచి కాలువలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక సమాచారం ప్రకారం.. ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ చేబ్రోలు శివారులోని కొమ్మమూరు కెనాల్ వంతెనపైకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పింది. వంతెన రక్షణ గోడను బలంగా ఢీకొట్టి, నేరుగా కాలువలోకి పడిపోయింది. ప్రమాద ధాటికి వాహనం ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను గమనించిన అటుగా వెళు న్న వాహనదారులు, స్థానికులు వెంటనే స్పందించి బయటకు తీశారు.

అపస్మారక స్థితిలో ఉన్న డ్రైవర్‌ను 108 అంబులెన్స్ ద్వారా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

సమాచారం అందుకున్న చేబ్రోలు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాలువలో పడిపోయిన టిప్పర్‌ను వెలికితీసేందుకు చర్యలు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కుక్కల దాడిలో చిరుత పిల్ల మృతి

**- చిన్న బాకరాపురంలో ఉత్కంఠ**



**కడప, ఏప్రిల్ 7 ( మనసులో మాట) :** కడప జిల్లా దువ్వూరు మండలం పరిధిలోని చిన్న బాకరాపురం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలో సంచరిస్తున్న ఒక చిరుత పులి పిల్లపై వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో, ఆ దాడిలో గాయపడిన చిరుత పిల్ల అక్కడికక్కడే మృతి చెందింది. స్థానిక గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆహారం లేదా నీటి కోసం అటవీ ప్రాంతం నుండి జనావాసాల్లోకి వచ్చిన చిరుత పిల్లను చూసిన కుక్కలు ఒక్కసారిగా దానిపై విరుచుకుపడ్డాయి. చిరుత పిల్ల చిన్నది కావడంతో కుక్కల దాడిని తట్టుకోలేక ప్రాణాలు వదిలింది. ఉదయాన్నే పొలాలకు వెళ్లే రైతులు మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు మరియు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చిరుత మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. "పిల్ల చిరుత ఇక్కడికి వచ్చిందంటే, దాని తల్లి చిరుత కూడా సమీపంలోనే ఉండే అవకాశం ఉంది" అని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



**పలమనేరు ఏప్రిల్ 7 ( మనసులో మాట) :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకుప్రపంచ ఆరోగ్య దినోత్సవంక్రిష్ణమ్మ గారి జీవనధారఫౌండేషన్ ద్వారా పలమనేరు.పట్టణంలో ఎన్జీవో కార్యాలయం దగ్గర నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు అవయవదాన అవగాహనర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం సమాజానికి ప్రపంచ ఆరోగ్య దినోత్సవపై క్రిష్ణమ్మ గారి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు క్రిష్ణమ్మ గారి జనార్ధన్ మాట్లాడుతూ.... సమాజంలో ఆరోగ్యం మహాభాగ్యం అని ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఇప్పుడు మానసికంగా శారీరకంగా ఎన్నో రకాలైనటువంటి దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయి. వాటిని ముందుగా గుర్తించి జబ్బులు రాకుండా ముందుగానే ఆ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని అలాగే మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవయవదానం చాలా గొప్పదానంగా భావించాలని మనం ఉన్నంతవరకు ఆరోగ్యంగా జీవించాలన్నారు. అనంతరం కూడా మన అవయవాలు మరొక ప్రాణికి ఉపయోగపడేలా ఉండాలని మనం చేసే అవయవదానం ఎదుటి వ్యక్తికి దానం చేసి గొప్పతనాన్ని సేవా భవాని చాటుకోవడం చాలా మంచిది అని తెలియజేశారు. ఈ విషయాన్ని సమాజంలోకి తీసుకెళ్లడం ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ అవయవ దాన అవగాహన ర్యాలీకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్థోపెటిక్ డాక్టర్ నాగరాజు వచ్చి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అలాగే డాక్టర్ అనీష్, ఎండి జనరల్ మెడిసిన్, డాక్టర్ జానకిరామ్, చిన్నపిల్లల వైద్యనిపుణులు మాట్లాడుతూ... సమాజంలో ఉన్నటువంటి జబ్బులను ముందుగా పసిగట్టి వాటిపై అవగాహన పెంచుకొని జీవించాలని తెలియజేశారు. అలాగే ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కృష్ణమ్మ గారి జీవధార ఫౌండేషన్ చేపట్టిన సేవా కార్యక్రమాలు గురించి చేపట్టిన అవయవ దాన అవగాహన ర్యాలీ నిర్వహించడం పట్ల జనార్ధన్ ను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఫౌండేషన్ సభ్యులు రమేష్ బాబు, అనిల్, మురళి, మరియు పలమనేరు పి ఎం పి డివిజన్ కన్వీనర్ ఎస్ డి మనోహర్,కో కన్వీనర్ అరుణ, సభ్యులు ప్రసన్న,రహీన బి,లక్ష్మీ, హేమగిరి, చరణ్, యువరాజు,రాణా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

### కడప జిల్లా ఇంటర్ ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలకు తొత్తుగా ఉన్న

# ఆర్ఐఓ ను సస్పెండ్ చేయాలి

- జిల్లాలోని నారాయణ, చైతన్య, బీరం శ్రీధర్ రెడ్డి వంటి ఇంటర్ కళాశాల్లో అక్రమంగా హాస్టల్ నిర్వహణ పై చర్యలేవి...
- ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్...
- ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కడపలోని ఆర్ఐఓ కార్యాలయం వద్ద ఆందోళన
- ఆర్ఐఓ అవినీతి నశించాలి, ఇంటర్ విద్యను కాపాడుకుంటామని విద్యార్థుల నినాదాలు...



**కడప, ఏప్రిల్ 7 ( మనసులో మాట) :** కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో జరుగుతున్న అక్రమాలపై ఏమాత్రం పట్టించుకోకుండా, వారికి వత్తాసు పలుకుతు అవినీతికి పాల్పడుతున్న ఆర్ఐఓ పైన వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయం (ఆర్ఐఓ)వద్ద ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీగా ఆందోళన నిర్వహించారు. ఆర్ఐఓ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్ఐఓ అవినీతి నశించాలి, ఆర్ఐఓ పై చర్యలు తీసుకోవాలని నినదించారు. డి.యం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని నారాయణ, చైతన్య, బీరం శ్రీధర్ రెడ్డి ఇలా కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్స్ నిర్వహిస్తున్న ఆర్ఐఓ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికే నారాయణ ఇంటర్ కళాశాల హాస్టల్ 6 మంది విద్యార్థులు ఉరి వేసుకోని చనిపోయారని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ప్రయివేట్ ఇంటర్ కళాశాల్లో అర్హత గల అధ్యాపకులు లేకున్నా, తరగతి గదులు ల్యాబులు లైబ్రరీ, ఆట స్థలం లేకున్నా ఇష్టానుసారంగా ప్రయివేట్ కార్పొరేట్ ఇంటర్ కళాశాలలకే మద్దతుగా ఆర్ఐఓ ఉన్నారన్నారు. కడప లోని ఎన్ఆర్ఐ కార్పొరేట్ ఇంటర్ కళాశాల పర్మిషన్ లేకున్నా అడ్మిషన్స్ చేస్తున్న మీరెందుకు పట్టించు కోవడం లేదని ప్రశ్నించారు. ఇందు లో అవినీతి జరగలేదని అంటారా ఆర్ఐఓ అని ప్రశ్నించారు, ఆర్ఎస్ ఎఫ్ నాయకులు. అదేవిదంగా ఆర్ఐఓ కార్యాలయానికి దగ్గరలో ఉన్న ఆకాష్ లో ఇంటర్ కళాశాల పేరుతో నీట్ క్లాస్లు నిర్వహిస్తున్న ఆర్ఐఓ ఎందుకు మౌనగా ఉన్నారని ప్రశ్నించారు. ఆఖరికి మొన్న జరిగిన ఇంటర్ ప్రాక్టికల్స్ లోను లక్షలాది రూపాయలు చేతులు మారలేదా అని ప్రశ్నించారు. ఆర్ఐఓ పైన జిల్లా కలెక్టర్ గారు చొరవ తీసుకొని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వంశీ, రెడ్డి సాయి, నగర అధ్యక్ష,కార్యదర్శులు బాలు, ప్రకాష్ నాయకులు నిఖిల్, బాబు, రెహమాన్,ఉదయ్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## అధ్యక్షులు నాగభూషణం ఆధ్వర్యంలో పెన్షనర్ల సమావేశం



**పలమనేరు ఏప్రిల్ 7 ( మనసులో మాట) :** స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సహ అధ్యక్షులు నాగభూషణం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... చాలా కాలంగా మన సంఘానికి పలమనేరు జేఏసీ నుండి ఆహ్వానం అందడం లేదని సభ్యులు వాట్సాప్ గ్రూపులో అనవసరమైన పోస్టులు పెడుతున్నారని నియంత్రించాలని ఒకే గ్రూపు గా ఉండాలని కోరారు. అనంతరం కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు 2026 ను ఉపసంహరించుకోవాలని ఇది పెన్షనర్లకు తీవ్రమైన నష్టం అలాగే సిపి ఎస్ పేరుతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే 7000 కోట్లు బకాయిలు చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పి ఆర్ సి కాలం మూడు సంవత్సరాలు కావస్తున్న ఇంకా జాప్యం చేయకుండా త్వరగా పిఆర్సి, అయ్యార్ ప్రకటించాలని కోరారు. మొదట సభ్యులందరూ ఈ మధ్యకాలంలో మరణించిన రవి వర్మ రెడ్డి, అనసూయమ్మ వారి మృతికి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో దవనముని, సుబ్రహ్మణ్యం, శ్యామరాజు, వెంకటేశ్వర్లు, వెంకటేష్, సూర్యనారాయణ రెడ్డి, రాజన్న, పోన్ముడి, విజయ్ కుమార్, జగదీశ్వరన్, ఉమాపతి, రమణ, వెంకటరమణ, శ్రీనివాసులు, సోమ సుందరం రెడ్డి, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### తమిళనాడు హై స్పీడ్ బోట్ల అక్రమ వేటకు

# నెల్లూరు పోలీసులు అడ్డుకట్ట




**కోవూరు, ఏప్రిల్ 6(మనసులో మాట):** కడలూరు, పుదుచ్చేరి హైస్పీడ్ బోట్ల అక్రమ వేటకు అడ్డుకట్ట పుదుచ్చేరి మరియు తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కడలూరు ఫిషింగ్ బోట్ల అక్రమ ప్రవేశాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. కోస్టల్ పోలీస్ వింగ్ స్టేట్ ఇంచార్జ్ మరియు విశాఖ మెరైన్ ఐజీ శ్రీ గోపీనాథ్ జెట్టి ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ శ్రీ మధుసూధన్ రావు గారి ఆధ్వర్యంలో సముద్రంలో గస్తీ చర్యలు ప్రారంభమయ్యాయి. నేటి నుంచి మూడు హైస్పీడ్ గస్తీ బోట్లతో సముద్రంపై నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారు. నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాల సముద్ర జలాల్లో అక్రమంగా చేపల వేటకు ఇతర రాష్ట్రాల బోట్ల ప్రవేశాన్ని నిరోధించేందుకు ఈ గస్తీ నిర్వహిస్తున్నారు. అడిషనల్ ఎస్పీ శ్రీ మధుసూధన్ రావు గారి స్వీయ పర్యవేక్షణలో గస్తీ బోట్లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయబడింది. మెరైన్ పోలీస్, మత్స్యశాఖ మరియు అటవీశాఖ అధికారులతో సమన్వయంతో సంయుక్త బృందంగా గస్తీ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీ బాలిరెడ్డి, సీఐ శ్రీ వెంకటేశ్వర రెడ్డి, ఇందుకూరుపేట ఎస్ఐ నాగార్జున రెడ్డి, ఫిషరీస్ డిపార్టుమెంటు ఖీణా లు శ్రీనివాసరావు (చిల్లకూరు), సందీప్ (గూడూరు )తదితర అధికారులు పాల్గొన్నారు. ఇటువంటి గస్తీ నిర్వహించడం ద్వారా సముద్రంలో అక్రమ ప్రవేశాలు మరియు అక్రమ వేట కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయగలమని అడిషనల్ ఎస్పీ శ్రీ మధుసూధన్ రావు తెలిపారు.




## ఈనెల 12 వ తేదీన బండ్ల పల్లిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి

**- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.హెచ్.ప్రభాకర్**

**గూడూరు, మనసులో మాట (ఏప్రిల్ 7):** ఈనెల 12 వ తేదీన అనంతపురం జిల్లా బండ్ల పల్లి లో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. హెచ్.ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తో ఇప్పటికే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నారు అన్నారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు నే కొనసాగించాలన్నారు. జి రామ్.జి .చట్టాన్ని రద్దు చేయాలన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు కేటాయిస్తుండగా, 10 శాతం నిధులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించేదన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరించాల్సి ఉన్నందున, అనేక రాష్ట్రప్రభుత్వాలు చేతులెత్తేసే ప్రమాదమున్నది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఈనెల 10 వ తేదీనుండి 12 వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు జరిగే పాదయాత్రలో , బహిరంగ సభలో ప్రతి ఒక్కరు పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, అరుణతేజ, శేషాద్రి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

### పూల వ్యాపారస్తులకు

# 11 గదుల కేటాయింపు



**పలమనేరు ఏప్రిల్ 7( మనసులో మాట) :** పలమనేరు రైతు బజార్ కేంద్రం వద్ద మంగళవారం పూల వ్యాపారస్తులకు 11 గదుల స్థలాలను కేటాయించారు. చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎం. పరమేశ్వరన్, సహాయ మార్కెటింగ్ సంచాలకులు (చిత్తూరు), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (చిత్తూరు) వారి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ కార్యాలయంలో డిప్ విధానంలో గదుల స్థలాలను కేటాయించారు. ప్రతి గది స్థలం: 10ఐ15 అడుగుల విస్తీర్ణంతో ఉండగా వాటికి నెలకు రూ. 2,403/- చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంపై పూల వ్యాపారస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం రైతుల వినియోగార్థం ఉన్న స్టాళ్లను ఉచితంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పించబడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ యార్డు చైర్మన్ కే. రాజన్న, శంకరప్ప, సెక్రటరీ వి. సంజీవ్ కుమార్, కె. జ్ఞానంబ, ఇ. లీలా,పి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుండుగల్లు శివశంకర్ టిడిపిలో చేరిక



**పలమనేరు ఏప్రిల్ 7 ( మనసులో మాట):** గంగవరం మండలంలోని గుండుగల్లు పంచాయతీకి చెందిన పంచాయితీ టిడిపి అధ్యక్షులు జయంత్ అన్న, జయసింహా, వీరి ఆధ్వర్యంలో గంగవరం మండల అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ సహకారంతో మంగళవారం టిడిపిలో చేరడం జరిగింది. అనంతరం వారికి శివశంకర్ పూల బుకే అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ విలేకరులతో మాట్లాడుతూ... తాను టిడిపి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## గంగమ్మ గుడి వద్ద అన్నదాన కార్యక్రమం



**పలమనేరు ఏప్రిల్ 7 ( మనసులో మాట) :**గంటవూరు బీసీ కాలనీలో ఉన్న శ్రీ తిరుపతి గంగమ్మ గుడి దేవస్థానం నందు మంగళవారం శ్రీ తిరుపతి గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ దంపతులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

| | | | | |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

బుధవారం 08 ఏప్రిల్ 2026


# మీడియాపై వైసీపీ దాడులు దారుణం!

### దాడిని ఖండించిన రామచందర్ రావు



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):**
ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలపై వైసీపీ నేతలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా మీద ఇలాంటి దాడులు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కేసీఆర్ హయాంలో కూడా ఇదే తరహా దాడులు జరిగేవని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజకీయాల్లో ఏవైనా విమర్శలు ఉంటే వాటిని రాజకీయంగానే ఎదుర్కోవాలి. అంతే తప్ప ఇలా బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. బాధ్యతాయుతమైన ఒక మీడియా సంస్థపై వైసీపీ నేతలు భౌతిక దాడులకు దిగడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రామచందర్ రావు వెల్లడించారు.

# దేశానికే దిక్సూచి తెలంగాణ ఆడిట్ మోడల్!



- ఆడిటింగ్‌లో హ్యాట్రిక్ సాధించడం గర్వకారణం: డిప్యూటీ సీఎం భట్టి
- సచివాలయంలో కలిసిన గుజరాత్ ఆడిట్ బృందం
- రాష్ట్ర పారదర్శక పాలనపై అధికారుల ప్రశంసలు
- అధ్యయనం చేస్తున్న ఇతర రాష్ట్రాల ప్రతినిధులు
- పక్కాగా ఆన్లైన్ ఆడిటింగ్ వ్యవస్థ నిర్వహణ

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలవడం రాష్ట్రానికే గర్వకారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆన్లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ వరుసగా మూడుసార్లు జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం ప్రభుత్వ పారదర్శకతకు, సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో భట్టి విక్రమార్కను గుజరాత్ రాష్ట్ర ఆడిట్ శాఖ ఉన్నతాధికారుల బృందం కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న ఆడిటింగ్ విధానాలను ఆయన వారికి వివరించారు.

### గుజరాత్ అధికారుల ప్రశంసలు

తెలంగాణ ఆడిటింగ్ విధానాలను, ఇక్కడి ఆన్లైన్ వ్యవస్థను అధ్యయనం చేసేందుకు వచ్చిన గుజరాత్ బృందం రాష్ట్ర ప్రగతిని అభినందించింది. మన రాష్ట్రంలోని ఉత్తమ విధానాలు దేశానికే ఆదర్శంగా నిలవడం శుభపరిణామమని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ మోడల్ పాలనను పరిశీలించేందుకు వచ్చే ఇతర రాష్ట్రాల బృందాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఇక్కడి సాంకేతిక పరిజ్ఞానం, ఆడిటింగ్ ప్రక్రియలో పాటిస్తున్న వేగం తమకు ఎంతో నచ్చిందని గుజరాత్ ప్రతినిధులు పేర్కొన్నారు.

### పారదర్శకతే పరమావధి

సాంకేతికతను జోడించి ఆడిటింగ్ ప్రక్రియలో జవాబుదారీతనం పెంచడం వల్లే ఈ అరుదైన విజయాలు సాధ్యమవుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నిధుల వినియోగంలో పక్కాగా ఆడిటింగ్ నిర్వహించడం ద్వారా ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న ఈ విధానాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, పారదర్శకతలో రాష్ట్రం అగ్రస్థానంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# విజయన్, మోడీ మంచి మిత్రులు!



- కేరళ ప్రజలను పినరయి మోసం చేస్తున్నారు
- కేసుల నుంచి విజయన్‌ను రక్షిస్తున్న మోడీ
- యువత కష్టానికి పినరయి పాలన శాపం
- యూడీఎఫ్ విజయంతోనే కేరళ అభివృద్ధి
- కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని సీఎం రేవంత్ పిలుపు

**తిరువనంతపురం, ఏప్రిల్ 7 (మనసులో మాట):** కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రసంగిస్తూ.. పినరయి విజయన్, ప్రధాని మోడీ ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఆరోపించారు. విజయన్ మోడీ నుంచి సూచనలు తీసుకుంటున్నారని, కేసుల నుంచి మోడీ ఆయనను రక్షిస్తున్నారని ధ్వజమెత్తారు. వీరిద్దరి మధ్య ఉన్న ఒప్పందమే కేరళ అభివృద్ధికి అడ్డంకిగా మారిందని మండిపడ్డారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

### విజయన్, కేసీఆర్ స్నేహం

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పినరయి విజయన్ మంచి మిత్రులని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. 2023కు ముందు తెలంగాణలో కేసీఆర్ తనను మించిన నేత లేరని అనుకున్నారని, కానీ ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారని గుర్తు చేశారు. కేరళలో కూడా యూడీఎఫ్ అధికారంలోకి వచ్చి పినరయి కోటను బద్దలు కొడుతుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ ఎన్డీఏ తరపున కేరళలో పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు.

### యువత కష్టజీవులు

కేరళ యువత ఎంతో కష్టపడే తత్వం కలవారని రేవంత్ కొనియాడారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో వారి పాత్ర కీలకమన్నారు. అయితే పినరయి ప్రభుత్వం యువతను వంచిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా వామపక్షాల్లో మరో నేత ఎదగకుండా విజయన్ అడ్డుకుంటున్నారని విమర్శించారు. జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీల వంటి మహోన్నత నేతల ఆశయాలను విజయన్ విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళలో ప్రతి సమస్యకు పినరయి విజయన్ కారణమని స్పష్టం చేశారు.

### యూడీఎఫ్ తోనే మార్పు

ఊమెన్ చాండీ, కరుణాకరన్ ల హయాంలో కేరళ ఎంతో అభివృద్ధి చెందిందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మళ్ళీ అలాంటి ప్రగతి రావాలంటే యూడీఎఫ్ ప్రభుత్వం రావాలని పిలుపునిచ్చారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్ లాంటి వారని, ఒకరు కేరళలో మరొకరు ఢిల్లీలో ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. కేరళకు పినరయి విజయన్, మోడీల అవసరం లేదని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు.

# రేవంత్‌తో నాకేం పని?

- తెలంగాణ నేతలే సమాధానం చెప్తారు
- పినరయి ఘాటు వ్యాఖ్యలు!



**తిరువనంతపురం, ఏప్రిల్ 7 (మనసులో మాట):** తనతో చర్చకు రావాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. రేవంత్‌తో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఆయనతో చర్చించడానికి తెలంగాణలో తమ పార్టీ నేతలు ఉన్నారని, రేవంత్ ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు అక్కడ రేవంత్ వ్యవహారంపై మాట్లాడతారని ఎద్దేవా చేశారు.

### ముదిరిన క్రెడిట్ వార్

నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో కేరళ తొలి స్థానంలో నిలవడంపై ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాల కృషి అని, అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ వాటా కూడా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అందరి కష్టాన్ని తన ఖాతాలో వేసుకోవడం సరికాదని విజయన్‌కు హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు.

### ఎక్స్ వేదికగా రేవంత్ కౌంటర్

తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ పినరయి విజయన్ రాసిన లేఖపై రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. తాను గౌరవప్రదంగా విమర్శలు చేస్తే, విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను వాడుతున్నారని మండిపడ్డారు. "మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా" అని పేర్కొన్నారు. విజయన్ చూపిస్తున్న నీతి ఆయోగ్ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుందని ఎద్దేవా చేశారు.

### గణాంకాలతో దీటైన జవాబు

తమ ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుందని, ప్రస్తుత అభివృద్ధిని చూడాలని రేవంత్ సూచించారు. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ 16.12 లక్షల కోట్లుగా ఉండి, 10.7 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువని గుర్తు చేశారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని స్పష్టం చేశారు. తన హయాంలో కేరళకు ఏం జరిగిందో ప్రజలకు చూపించాలని పినరయి విజయన్‌ను రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య సాగుతున్న ఈ చర్చ ఇప్పుడు రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# ఆటో గ్యాస్ కష్టాలకు చెక్!

### కొరత లేకుండా చూడాలి
### కంపెనీలకు కమిషనర్ ఆదేశం
### 17 బంకులు మళ్ళీ షురూ
### పనితీరుపై స్టీఫెన్ సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ఆటో ఎల్పీజీని నిరంతరాయంగా తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడాలని కంపెనీలకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచాయని కొనియాడారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు. ఈ క్రమంలోనే మూతపడిన 17 బంకులను మళ్ళీ తెరిపించినట్లు పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి మూతపడిన బంకులను పునఃప్రారంభించడంలో సూపర్ గ్యాస్, గో గ్యాస్, టోటల్ ఎనర్జీస్, ప్రైమ్ ఫ్యూయల్ కంపెనీలు చేసిన కృషిని కమిషనర్ అభినందించారు.

అయితే పనితీరు ఏమాత్రం మెరుగుపరుచుకోని పలు కంపెనీల పట్ల స్టీఫెన్ రవీంద్ర తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి అన్ని బంకుల్లో సరఫరా చేయాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే గ్యాస్ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టామని వెల్లడించారు. బంకులకు వస్తున్న గ్యాస్ లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతిరోజు పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ నంబర్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

# తెలంగాణలో ముగిసిన మావోయిస్టుల శకం!

- అడవుల్లో వినిపిస్తున్న శాంతి గీతం
- కర్రెగుట్టల్లో అభివృద్ధి పరుగులు
- డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి
- తుపాకీ గొట్టం కాదు.. అభివృద్ధే ముఖ్యం
- మారుమూల ప్రాంతాలకు బీటీ రోడ్లు



**ములుగు, ఏప్రిల్ 7 (మనసులో మాట):** తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. ఒకప్పుడు తుపాకుల మోతతో అశాంతిగా ఉన్న అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి నెలకొందని తెలిపారు. దశాబ్దాలుగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న చోట అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడం, కీలక నాయకత్వం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని చెప్పారు.

### అభివృద్ధి బాటలో ఆదివాసీ గ్రామాలు

గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి కారణమని గుర్తించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టింది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లడానికి వీలుగా గ్రామస్తులకు ఆటో, టూ వీలర్ ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన అవస్థలు ఇప్పుడు తప్పాయి.

### చీకట్లను తొలగిస్తున్న సోలార్ వెలుగులు

విద్యుత్ సౌకర్యం లేని ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేసి ప్రభుత్వం వెలుగులు నింపుతోంది. ఆధార్ కార్డు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు లేని ఆదివాసీలకు ప్రభుత్వ ఫలాలు అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోందని శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు.. ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలని పేర్కొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు షురూ!

**జీర్ల చెరువులో కేంద్రం ప్రారంభం**

**ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామ్ రెడ్డి చొరవ**

**ప్రతి గింజా కొనుగోలు చేస్తాం.. ఉప కేంద్రాల ఏర్పాటుకు ఆదేశం**

**రైతులకు అండగా ప్రభుత్వం**

**ఖమ్మం, ఏప్రిల్ 7 (మనసులో మాట):** కూసుమంచి మండలంలోని జీర్ల చెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామ్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పండించిన ప్రతి గింజను ప్రభుత్వం సేకరిస్తుందని హామీ ఇచ్చారు. చేగుమ్మ సహకార సంఘం పరిధిలోని పలు గ్రామాల్లో ఉప కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోళ్లను ముమ్మరం చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సంపూర్ణ పారదర్శకతతో సేకరణ ప్రక్రియ సాగాలని ఎంపీ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# బీసీ సబ్ కోటా లేకుంటే మహిళా బిల్లు వద్దు!

**కేంద్రానికి అఖిలపక్షం, బీసీ సంఘాల హెచ్చరిక**

**ఏప్రిల్ 16న పార్లమెంట్ ముట్టడికి పిలుపు**

**కులగణన తర్వాతే మహిళా రిజర్వేషన్లు**

**సబ్ కోటా లేకుంటే అగ్రవర్ణాలకే ప్రయోజనం**

**జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కీలక భేటీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కల్పించకుండా మహిళా బిల్లును అమలు చేయవద్దని అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ విషయంలో కేంద్రం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరాయి. డిమాండ్లు నెరవేరకపోతే ఈ నెల 16న ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి చేపడతామని హెచ్చరించాయి. కాచిగూడలోని అభినంద్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు.

**కులగణన అవసరం**

బీసీ కులగణన పూర్తి చేయకుండా నియోజకవర్గాల పునర్విభజన గానీ, మహిళా బిల్లు అమలు గానీ చేయడం సరైన పద్ధతి కాదని జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీసీల జనాభా వాటా తేలిన తర్వాతే రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సబ్ కోటా లేకపోతే చట్టసభల్లో అగ్రవర్ణాలకు చెందిన కుటుంబాలే రాజకీయంగా లాభపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీలో 119 స్థానాలకు గాను కేవలం ఒకే ఒక బీసీ మహిళ ఉండటం, 17 మంది ఎంపీల్లో ఒక్కరు కూడా బీసీ మహిళ లేకపోవడం సామాజిక అన్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**పార్లమెంట్ ముట్టడికి సిద్ధం**

సబ్ కోటా సాధన కోసం ఈ నెల 16న ఢిల్లీలో పోరాట దీక్షలు చేపట్టి, 17న పార్లమెంట్ ముట్టడి నిర్వహిస్తామని నేతలు ప్రకటించారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ కేంద్రం కులగణన హామీని తుంగలో తొక్కి బీసీలను మోసం చేసిందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ కూడా రిజర్వేషన్ల అమలులో కేంద్ర వైఫల్యాన్ని ఎండగట్టారు. బీసీ మహిళా సాధికారత కోసం దేశవ్యాప్తంగా పార్టీలను ఏకం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తో పాటు పలువురు నేతలు, మహిళా నాయకులు పాల్గొన్నారు. కేంద్రం తన వైఖరి మార్చుకోకపోతే చరిత్రలో బీసీ వ్యతిరేక పార్టీగా మిగిలిపోతుందని హెచ్చరించారు.

# రవాణా శాఖ లక్ష్యం ఆదాయం.. సేవలు!

**17 జిల్లాల్లో కార్యాలయాలకు స్థల సేకరణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం చేసి ఆదాయాన్ని పెంచాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 6,910.90 కోట్ల ఆదాయం రాగా.. 2025-26లో అది రూ. 7,097.38 కోట్లకు చేరిందని వెల్లడించారు. ఆదాయ లక్ష్యాలను అందుకున్న అధికారులను అభినందించిన మంత్రి.. పనితీరు మందగించిన వారిని తీవ్రంగా హెచ్చరించారు. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని, ఇతర రాష్ట్రాల వాహనాల పన్ను చెల్లింపులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సాంకేతికతతో పారదర్శక సేవలు**

సారథి వ్యవస్థ అమలులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వాహన్ పోర్టల్ డేటాను పూర్తి చేసి సాంకేతిక అడ్డంకులు తొలగించాలని ఆదేశించారు. ఆర్టీవో కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న లైసెన్సులు, ఆర్సీ కార్డుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మంజూరైన 37 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లలో మొదటి దానిని జూన్ 1 నాటికి ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. 17 జిల్లాల్లో రవాణా శాఖ స్వంత కార్యాలయాల కోసం స్థలాలను వెంటనే గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**రోడ్డు భద్రతకు పెద్దపీట**

ప్రమాదాల నివారణ కోసం ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. రహవీర్ స్కీమ్ కింద రోడ్డు ప్రమాద బాధితులను కాపాడే వారికి రూ. 25 వేల నగదు బహుమతి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. పీఎం రహత్ కింద బాధితులకు అందే రూ. 1.5 లక్షల ఉచిత చికిత్స వివరాలను ప్రజలకు వెల్లడించాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

# గ్యారెంటీలు ఏవీ? రేవంత్ పై హరీష్ ఫైర్!

- పరిగిలో భూముల దోపిడీపై ధ్వజం
- అప్పా జంక్షన్ వద్ద బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- తమ్ముడి కోసం రైతుల భూములా?
- రేవంత్ ఓ రావణాసురుడు: హరీష్ రావు
- కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. తొమ్మిది వందల రోజులైనా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో భూములు కోల్పోతున్న రైతులను పలకరించేందుకు వెళ్తున్న హరీష్ రావును పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. రేవంత్ సర్కార్ తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పేద రైతుల భూములపై కన్ను**

పరిగిలో ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కొని సీఎం తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ పాలనను రాక్షస పాలన, గడీల పాలనగా అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టాలి కానీ రైతుల పొట్ట కొట్టడం ఏంటని నిలదీశారు. ప్రభుత్వం చేసేది అంతా బోగస్ పాలన అని ఎద్దేవా చేశారు.

**అరెస్టులతో అణచలేరు**

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న రైతులను పలకరించేందుకు కూడా అనుమతించకపోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్ కే పరిమితం అవుతుందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో మళ్ళీ కేసీఆర్ నాయకత్వంలో రామరాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత**

పరిగికి వెళ్తున్న హరీష్ రావు కాన్వాయ్ ను అప్పా జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. లారీలను అడ్డంగా పెట్టి నేతలను నిలువరించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావును అరెస్ట్ చేసి శంషాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసు నిర్బంధాల మధ్యే రైతులకు అండగా పోరాటం కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు.

# ప్రశ్నించే గొంతులను నొక్కడం దుర్మార్గం

- ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూముల కబ్జా
- బీఆర్ఎస్ నేతల అరెస్ట్ పిరికిపంద చర్య
- హామీలు పక్కనపెట్టి పేదల భూములపై కన్నేస్తారా?
- భూ దందాపై కేటీఆర్ ఫైర్!
- నిర్బంధాలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ప్రశ్నించే గొంతులను పోలీసు బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి, పేదల భూములపై పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అరెస్టులు పిరికిపంద చర్య**

బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న నేతలను అక్రమంగా నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు.

**దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నారు**

కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడరని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుపేద రైతుల ఆస్తులను కాపాడే వరకు తమ పోరాటం విశ్రమించదని కేటీఆర్ తేల్చి చెప్పారు.

# రైతుల పక్షాన పోరాడితే అడ్డుకుంటారా?

**హరీష్ రావు అరెస్టుపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**

**భూసేకరణ పేరుతో రైతులపై వేధింపులు**

**అక్రమ నిర్బంధం అప్రజాస్వామికం: నిరంజన్ రెడ్డి**

**కాంగ్రెస్ నేతలు ఊళ్లు పంచుకుంటున్న దొంగలు**

**భయపడేది లేదు.. పోరాటం ఆగదు**



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** పరిగి పర్యటనకు వెళ్లకుండా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావును అడ్డుకోవడాన్ని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హరీష్ రావు గృహ నిర్బంధం అక్రమమని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని తెలిపారు. తప్పు చేయకుంటే ఈ సర్కార్ కు భయమెందుకు అని ప్రశ్నించారు. రైతుల పక్షాన పోరాడితే అడ్డుకుంటారా అని నిలదీశారు. అధికారం చేతిలో ఉందని ఈ ప్రభుత్వం అక్రమంగా రైతుల భూముల్లో చెరబడుతున్నదని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. రెండున్నరేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ వచ్చింది లేదు.. ఒక్క ఇటుక పేర్చింది లేదని విమర్శించారు. భూసేకరణ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుందని మండిపడ్డారు. తమ భూముల కోసం పోరాడుతున్న రైతులకు భరోసా ఇవ్వడం ప్రతిపక్షంగా బీఆర్ఎస్ బాధ్యత అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ నిర్బంధం సిగ్గు చేటు అని విమర్శించారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు కాంగ్రెస్ నేతలు భూములను దోచుకుంటున్నారని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ఎంత అణచివేసినా ప్రజల, రైతుల తరపున ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ కు వెన్నులో వణుకు**

బాధిత రైతులను కలిసేందుకు వెళ్లకుండా హరీష్ రావు సహా బీఆర్ఎస్ నేతలపై ఆంక్షలు, హౌస్ అరెస్టులపై మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత భయం అని ప్రశ్నించారు. అక్రమంగా పేదల భూములను గుంజుకుంటున్న ప్రభుత్వం బాధితులను కలవడానికి వెళ్తుంటే ఇన్ని నిర్బంధాలా అని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుడుతుందని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. రైతుల పక్షాన పోరాటం చేస్తే అక్రమ అరెస్టులా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలకు, చేతలకు పొంతన లేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న హరీష్ రావు అంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన కాదు, ప్రజల పాలిట శాపంగా మారుతున్న పాలన అని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా అవినీతిని బయటపెడుతూనే ఉంటామని హెచ్చరించారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# రైల్వే పనులు వేగవంతం!

**పెండింగ్ అంశాలపై సీఎస్ సమీక్ష**

**సమన్వయంతో పనులు సాగాలి**

**అధికారులకు కీలక ఆదేశాలు**

**సంయుక్త తనిఖీలు చేపట్టాలి**

**సచివాలయంలో ఉన్నత స్థాయి భేటీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణా రావు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో రైల్వే అండర్ బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ వంటి 21 అపరిష్కృత అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రజా రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడంపై ప్రత్యేకంగా దిశానిర్దేశం చేశారు.

మున్సిపల్, జలమండలి, రెవిన్యూ, విద్యుత్, రోడ్లు భవనాల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని సీఎస్ సూచించారు. త్వరలోనే రైల్వే ఉన్నతాధికారులతో కీలక సమావేశం జరగనున్న నేపథ్యంలో ప్రతి పెండింగ్ అంశంపై పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, నవీన్ మిట్టల్ పాల్గొన్నారు. వీరితో పాటు టీజీఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ. కర్ణన్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, కలెక్టర్ మను చౌదరి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. పనుల్లో జాప్యం లేకుండా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# “కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి“

- బీఆర్ఎస్, బీజేపీలకు అధికారం కల్ల
- నాగర్ కర్నూల్ సభలో టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చాం
- బీఆర్ఎస్ చేసిన రూ. 8 లక్షల కోట్ల అప్పులు తీరుస్తున్నాం
- బావా బామ్మర్దుల కొట్లాటతో బీఆర్ఎస్ ఖాళీ



**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావడం అసాధ్యమని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం బావా బామ్మర్దులు హరీష్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ నేతల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## గ్రామాలే పార్టీకి గుండెకాయ

కాంగ్రెస్ పార్టీకి గ్రామాలే బలమని, అక్కడికి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని మహేష్ కుమార్ గౌడ్ కేడర్‌కు సూచించారు. ప్రధాని మోదీ పేదలకు చేసిందేమీ లేదని, అలాంటి బీజేపీకి తెలంగాణలో తావులేదని మండిపడ్డారు. కులమతాలకు అతీతంగా పనిచేసే కాంగ్రెస్‌లో కష్టపడే ప్రతి ఒక్కరికీ అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

## హామీల అమలులో వెనకడుగు లేదు

రాహుల్ గాంధీ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకున్నారని, అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేసిందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం వంటి పథకాలు కాంగ్రెస్ ఘనతేనని పేర్కొన్నారు. సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు.

## బీఆర్ఎస్ అప్పుల భారం

నీళ్లు, నిధులు, నియామకాల కోసం వచ్చిన తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిందేమీ లేదని మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిందని, ఆ భారాన్ని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తోందని వెల్లడించారు. ఎన్ని కష్టాలున్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ నేతలు సావర్కర్, వంశీచంద్ రెడ్డి పాల్గొన్నారు.

# నిమ్స్‌లో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స ప్రారంభం!

- లినాక్ సేవలు అందుబాటులోకి
- క్యాన్సర్ ‘నోటిఫైబుల్‘ వ్యాధిగా ప్రకటన
- బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకాలు
- మారుమూల ప్రాంతాల్లోనూ కీమోథెరపీ
- తెలంగాణ క్యాన్సర్ రిజిస్ట్రీ ఏర్పాటు



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక లినాక్ (లీనియర్ యాక్సిలరేటర్) సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సరికొత్త సాంకేతికతతో క్యాన్సర్ రోగులకు అత్యంత ఖచ్చితత్వంతో కూడిన రేడియేషన్ చికిత్స అందుబాటులోకి వచ్చింది. ట్రూబీమ్ సిస్టమ్ ద్వారా ఆరోగ్యకరమైన కణజాలానికి నష్టం కలగకుండా కేవలం ట్యూమర్‌పై మాత్రమే ప్రభావం చూపేలా చికిత్స అందించనున్నారు. తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుంది.

## క్యాన్సర్ కేసుల నమోదు తప్పనిసరి

రాష్ట్రంలో ఏటా 55 వేల నుంచి 60 వేల వరకు కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతుండటం ఆందోళనకరమని ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో క్యాన్సర్‌ను ‘నోటిఫైబుల్‘ వ్యాధిగా ప్రకటిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీనివల్ల ప్రతి కేసును నమోదు చేసే అవకాశం కలుగుతుంది. క్యాన్సర్ రిజిస్ట్రీ ద్వారా ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి, వ్యాధి నియంత్రణకు పటిష్టమైన ప్రణాళికలు రూపొందించనున్నారు. అలాగే నిమ్స్‌లో మహిళల కోసం ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును కూడా ప్రారంభించారు.

## మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత

గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. 14 నుంచి 15 ఏళ్ల బాలికలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా హెచ్‌పీవీ టీకాలు అందించాలని నిర్ణయించింది. అలాగే 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా ముందస్తుగా వ్యాధిని గుర్తించనున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

## గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు

క్యాన్సర్ చికిత్సను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికే కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాలియేటివ్ కేర్ సేవలు లభిస్తాయని వెల్లడించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.

# తెలంగాణ లక్ష్యం 3 ట్రిలియన్ డాలర్లు!

- యూఎస్ఐఎస్పీఎఫ్ బృందంతో సీఎస్ భేటీ
- పెట్టుబడులకు రాష్ట్రం స్వర్గధామం
- 2047 నాటికి భారీ ఆర్థిక లక్ష్యం
- హైదరాబాద్ ఔషధ, ఐటీ రాజధాని
- ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం




**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్ (యూఎస్ఐఎస్పీఎఫ్) నుంచి వచ్చిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావుతో సమావేశమైంది. ఈ బృందంలో బీమా, ఆర్థిక సేవలు, వ్యవసాయం, సాంకేతిక రంగాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం వివిధ రంగాల్లో సాధించిన అద్భుత ప్రగతిని సీఎస్ వారికి వివరించారు.

## వేగంగా పెరుగుతున్న జీఎస్డీపీ

2014లో దేశంలోనే అత్యంత పిన్న రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ.. గత దశాబ్ద కాలంలో విశేష పురోగతి సాధించిందని సీఎస్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల నుంచి వచ్చిన భారీ పెట్టుబడుల వల్ల రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) గణనీయంగా పెరిగిందని చెప్పారు. దేశంలోనే వేగంగా నగరీకరణ జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో దాదాపు మూడో వంతు హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని ఆయన వివరించారు.

## గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

హైదరాబాద్‌ను దేశంలోనే ఔషధ రాజధానిగా, సమాచార సాంకేతిక రంగంలో అగ్రగామిగా సీఎస్ అభివర్ణించారు. రక్షణ రంగ స్టార్టప్‌ల అభివృద్ధికి ప్రభుత్వ రంగ సంస్థలు ఎంతో దోహదపడ్డాయని చెప్పారు. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) కూడా హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులు పెట్టాయన్నారు. ప్రపంచ స్థాయి ఆరోగ్య సౌకర్యాలు, బలమైన ఫిన్‌టెక్ వ్యవస్థ ఇక్కడ ఉండటం గర్వకారణమని తెలిపారు.

## భారీ ఆర్థిక లక్ష్యం

పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, గొప్ప సాంస్కృతిక వారసత్వం తెలంగాణ సొంతమని సీఎస్ పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. గ్లోబల్ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను మార్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ప్రతినిధులు మలాచీ బ్రియాన్ నుగెంట్, ఆర్ దీపక్ జోషి, దివదృష్ట్ సింగ్ పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణం.. ప్రాణాలకు రక్ష

**హెల్మెట్ లేకపోవడం వల్లే 75 శాతం ప్రమాదాలు**

**డీజీపీ శివధర్ రెడ్డి**



**ములుగు, ఏప్రిల్ 7:** అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులతో రహదారి భద్రత నిబంధనల పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడటం ప్రాణాంతకమని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారిలో 75 శాతం మంది హెల్మెట్ లేని వారేనని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 18 నుంచి 40 ఏళ్ల లోపు యువత ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. సురక్షిత డ్రైవింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

## అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్ ప్రారంభం

అంతకుముందు ములుగు జిల్లా వెంకటాపురం మండలం పామునూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కో ఆర్డినేషన్ సెంటర్ ను డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ఈ కేంద్రం ఎంతో దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. కర్రెగుట్టల్లో రోడ్లు నిర్మించడం శుభపరిణామమని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని చెప్పారు. గతంలో కొన్ని కారణాల వల్ల ఇక్కడ అభివృద్ధి నిలిచిపోయిందని, అటువంటి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో వేగంగా రోడ్లు వేయడం అభినందనీయమని కొనియాడారు. మెరుగైన రోడ్ల ద్వారానే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన వల్ల గిరిజన ప్రాంతాల్లో మార్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఐపీఎల్ బెట్టింగ్ ఉచ్చులో పడొద్దు

**క్రికెట్ ప్రిడిక్షన్ పేరుతో కేటుగాళ్ల దోపిడీ**

**సీపీ సజ్జనార్ హెచ్చరిక**



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగిపోతున్నాయని, ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ ద్వారా సాగుతున్న దందాను వివరించారు. టాస్, మ్యాచ్ ఫలితాలను ముందే చెబుతామని నమ్మించి అమాయకులను బెట్టింగ్ కూపంలోకి లాగుతున్నారని పేర్కొన్నారు. ఈ అసత్య ప్రచారాల్లో ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా పాల్గొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటుగాళ్లు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఆ తర్వాత బెట్టింగ్ యాప్ లింకులను పంపి దోచుకుంటున్నారని తెలిపారు. కష్టపడి సంపాదించిన సొమ్మును పందాల పేరుతో పోగొట్టుకోవద్దని సూచించారు. ఇలాంటి ఫేక్ ప్రిడిక్షన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ విభాగం వీటిపై కఠిన చర్యలు తీసుకుంటోందని, ఇప్పటి వరకు 494 పెయిడ్ యాడ్స్ ను పోలీసులు బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలోని 129 ఫేక్ ప్రొఫైళ్లను సైతం తొలగించామని చెప్పారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని, మోసపూరిత ప్రకటనలు కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని కోరారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ లో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ సూచించారు. ఉత్సాహంలో చేసే పొరపాట్లు జీవితాంతం ఇబ్బంది పెడతాయని, సాంకేతికతను జాగ్రత్తగా వాడుకోవాలని హితవు పలికారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి సైబర్ నేరగాళ్ల ఆట కట్టించవచ్చని స్పష్టం చేశారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొన్న లారీ!

**పదిమంది విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం**

**ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంలో ఘటన**

**లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక నిర్ధారణ**




**ఖమ్మం, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో పెను ప్రమాదం తప్పింది. ఒక ప్రైవేటు పాఠశాల బస్సును వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 20 మంది విద్యార్థులు ఉండగా వారిలో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో తల్లిదండ్రులు సహా పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వేగంగా స్పందించారు. గాయపడిన విద్యార్థులను బస్సు నుంచి సురక్షితంగా బయటకు తీశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు వెల్లడించారు. ఖమ్మం రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. పాఠశాల వాహనాల డ్రైవర్లు రద్దీ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ఏమరపాటుగా ఉండటం వల్ల చిన్నారుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వాహనాల డ్రైవర్లు నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# కాకతీయ వర్సిటీ ఓఎస్డీగా వెంకట్రామ్ రెడ్డి

**ఏడాది పాటు పదవిలో కొనసాగింపు**

**వీసీ ప్రతాప్ రెడ్డి కీలక నిర్ణయం**

**టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్‌గానూ బాధ్యతలు**

**ప్రొఫెసర్ నియామకంపై హర్షాతిరేకాలు**

**వరంగల్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** కాకతీయ విశ్వవిద్యాలయ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా భౌతికశాస్త్ర విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ బీ.వెంకట్రామ్ రెడ్డి నియమితులయ్యారు. ఒక సంవత్సర కాలానికి ఆయనను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వెంకట్రామ్ రెడ్డి నియామకం పట్ల విశ్వవిద్యాలయంలో సంతోషం వ్యక్తమవుతోంది. పలువురు బోధనా, బోధనేతర సిబ్బందితో పాటు పరిశోధకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం వెంకట్రామ్ రెడ్డి టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. విద్యా రంగంలో ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుభవం వర్సిటీ పరిపాలనలో కీలక మార్పులకు, అభివృద్ధికి దోహదపడుతుందని తోటి ప్రొఫెసర్లు అభిప్రాయపడ్డారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వర్సిటీ ప్రతిష్టను మరింత పెంచుతారని సహచరులు ఆకాంక్షించారు.

# ఏసీబీ వలలో అగ్రి వర్సిటీ డీన్!

**లక్ష లంచం తీసుకుంటూ పట్టివేత.. విత్తన కంపెనీ నుంచి డిమాండ్**

**రాజేంద్రనగర్ వర్సిటీలో కలకలం.. ఇల్లు, ఆఫీసులో అధికారుల సోదాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ఎన్ని దాడులు జరుగుతున్నా లంచగొండుల తీరు మారడం లేదు. నిత్యం ఎక్కడో ఒకచోట అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కుతూనే ఉన్నారు. తాజాగా ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఒక విత్తన కంపెనీ నుంచి లక్ష రూపాయల లంచం తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గోవర్ధన్ పట్టుబడటంతో రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ కళాశాలలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన కార్యాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్నారు. దీనితో పాటు ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ నివాసంలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన వర్సిటీ వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం సృష్టించింది. పట్టుబడిన లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ.. కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తోంది.

# పంటలకు సాగునీటి విడుదల!

**ఈ నెల చివరి వరకు నీళ్లివ్వాలని ఆదేశం**

**సెక్రటరీ శ్రీధర్ ఐఏఎస్ కీలక నిర్ణయం**

**గౌడ విద్యార్థి సంఘం వినతితో స్పందన**

**ఎండిపోతున్న పొలాలకు ఊరట**

**ఎస్ఆర్ఎస్పీ రెండో దశకు నీటి గండం తొలగింపు**



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** శ్రీరామ్ సాగర్ రెండవ దశ ఆయకట్టు ప్రాంతాలకు ఈ నెల చివరి వరకు నీళ్లు అందించాలని తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (నీటి పారుదల) శ్రీధర్ ఐఏఎస్ ను కోరారు. మంగళవారం సచివాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చిత్తలూరి కృష్ణమూర్తి గౌడ్ ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, పొలాలు ఎండిపోతున్నాయని నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శ్రీధర్ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. పంటలు ఎండిపోకుండా తక్షణమే నీటిని విడుదల చేయాలని సూచించారు. సకాలంలో స్పందించినందుకు గౌడ విద్యార్థి సంఘం నేతలు సెక్రటరీకి కృతజ్ఞతలు తెలిపారు.

# తమిళనాడు ఎన్నికల్లో తెలంగాణ త్రయం!

**స్టార్ కంపెయినర్లుగా రేవంత్, భట్టి, ఉత్తమ్**

**ఉత్తమ్‌కు అదనంగా సీనియర్ అబ్జర్వర్ బాధ్యత**

**12 నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి**

**డీఎంకేతో కలిసి కాంగ్రెస్ సమరశంఖం**

**ఈ నెల 23న తమిళనాట పోలింగ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోరులో తెలంగాణ కాంగ్రెస్ అగ్ర నేతలు తమ సత్తా చాటనున్నారు. ఏఐసీసీ అధిష్టానం సోమవారం విడుదల చేసిన స్టార్ కంపెయినర్ల జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు స్థానం కల్పించింది. పొరుగు రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి వీరు ప్రచార సారథులుగా వ్యవహరించనున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అధిష్టానం మరిన్ని కీలక బాధ్యతలను అప్పగించింది. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 స్థానాలకు ఆయనను సీనియర్ అబ్జర్వర్‌గా నియమించింది. క్షేత్రస్థాయిలో ప్రచార వ్యూహాలను పర్యవేక్షించడంతో పాటు అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించాలని సూచించింది. ఆయన తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో తమిళనాట కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. తమిళనాడులో డీఎంకేతో కలిసి కాంగ్రెస్ పొత్తులో పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణలో కాంగ్రెస్ సాధించిన విజయాన్ని, అక్కడ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమిళనాడు ప్రజలకు వివరించేందుకు ఈ నేతలు సిద్ధమవుతున్నారు. ఈ నెల 23న జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ బృందం తమిళనాట రంగంలోకి దిగనుంది. ప్రచారంలో రేవంత్ రెడ్డి మార్కు ప్రసంగాలు, భట్టి విక్రమార్క హుందాతనం పార్టీకి కలిసొస్తాయని శ్రేణులు భావిస్తున్నాయి.

# రూ. 1200 కోట్ల భూమి స్వాధీనం!

- ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్
- ఖానామెట్‌లో ఏవీ రంగనాథ్ టీమ్ మెరుపు దాడి
- బౌన్సర్ల పహారా ఉన్నా వెనక్కి తగ్గని అధికారులు
- కబ్జాదారులు స్వయంగా తొలగించుకున్న అక్రమ కట్టడాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** హైదరాబాద్ ఐటీ హబ్ సమీపంలో హైడ్రా మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. బడా నిర్మాణ సంస్థలు, వ్యక్తుల కబ్జాలో ఉన్న సుమారు 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్ 55లో ఈ ఆపరేషన్ నిర్వహించారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి ధర సుమారు రూ. 1200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆక్రమణలను తొలగించిన అనంతరం ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, ఇది ప్రభుత్వ భూమి అని తెలిపే బోర్డులను హైడ్రా ఏర్పాటు చేసింది.

ఖానామెట్ లోని సర్వే నంబర్ 55 లో ఉన్న ఈ భూమిని రంగారెడ్డి కలెక్టర్ ఇప్పటికే నిషేధిత జాబితాలో చేర్చారు. దీని ప్రకారం అది ప్రభుత్వ భూమి అని స్పష్టమవుతోంది. అయినప్పటికీ మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ ఈ భూమిని తమదిగా పేర్కొంటూ వస్తోంది. వాసవి నిర్మాణ సంస్థ అక్కడ ఆర్‌సీసీ ప్లాంట్ తో పాటు భవన నిర్మాణ కార్మికుల కోసం తాత్కాలిక షెడ్డులను నిర్మించింది. హైడ్రా రంగంలోకి దిగడంతో వాసవి సంస్థ తన ఆర్‌సీసీ ప్లాంట్ ను స్వయంగా తొలగించుకుంది. మిగిలిన షెడ్డులను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. సుమారు 4.20 ఎకరాల భూమిని ఈ సంస్థల నుంచి అధికారులు విడిపించారు.

అదేవిధంగా ఇదే సర్వే నంబర్ లోని మరో 4 ఎకరాల భూమిని కొలను మాధవరెడ్డి కుమార్తె కొలను సబిత తనదిగా చెప్పుకుంటూ బౌన్సర్లతో కాపలా ఉంచారు. దీనిపై ఫిర్యాదు అందడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. అది ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నాక మంగళవారం భారీ బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగించారు. గతంలోనూ ఇదే సర్వే నంబర్ లో 11 ఎకరాల భూమిని, మొండికుంటలోని ఆక్రమణలను హైడ్రా స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని హైడ్రా అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# గిరిజన వైద్యానికి అవార్డుల పంట!

- కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రుల జోరు
- మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు
- రాష్ట్ర స్థాయిలో జిల్లాకు గుర్తింపు
- ఉత్తమ సేవలకు దక్కిన ఫలితం



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గాను జిల్లా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు అత్యధిక అవార్డులను సాధించాయి. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు పరిధిలోని వైద్యులు, సిబ్బంది తమ ప్రతిభతో జిల్లా ప్రతిష్టను చాటారు.

పురస్కారాలు అందుకున్న వారిలో సీహెచ్‌సీ పాల్వంచకు చెందిన డాక్టర్ శైలేష్ కుమార్, డాక్టర్ రామ్ ప్రసాద్ ఉన్నారు. అదేవిధంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రి నుంచి డాక్టర్ క్రపా విజయ్, నర్సింగ్ ఆఫీసర్ కృష్ణవేణి, ఏబీఏఎస్ సేవల విభాగంలో వెంకట రావు, ల్యాబ్ సేవల విభాగంలో డాక్టర్ రామకృష్ణ అవార్డులు స్వీకరించారు. మనుగూరు ఏరియా ఆసుపత్రి నుంచి నర్సింగ్ ఆఫీసర్ మానస, సీఎంఎస్ ఇంచార్జ్ ఫార్మాసిస్ట్ శారధలకు కూడా పురస్కారాలు దక్కాయి. భద్రాచలం, మనుగూరు, చర్ల వంటి మారుమూల గిరిజన ప్రాంతాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డాక్టర్ రవి బాబు మూడు అవార్డులను ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో కలిసి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ తోపాటు పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని రోగులకు సమయోచితంగా, మెరుగైన వైద్యం అందిస్తున్నందుకు జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. ఈ అవార్డులు తమ బాధ్యతను మరింత పెంచాయని, భవిష్యత్తులోనూ ప్రజలకు అండగా ఉంటామని వైద్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# వరంగల్ ప్రగతికి జర్మనీ బాసట!

- కేఎఫ్‌డబ్ల్యూ బృందంతో మేయర్ సుధారాణి భేటీ
- యూజీడీ ప్రాజెక్టుపై అంతర్జాతీయ సహకారం
- నగర అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు
- త్వరలోనే డ్రైనేజీ పనుల ప్రారంభం
- పర్యావరణ హితమే లక్ష్యం: కలెక్టర్



**గ్రేటర్ వరంగల్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యం అత్యంత కీలకమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. జర్మనీ దేశానికి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులతో మంగళవారం వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో ఆమె ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ఇన్ ఛార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. నగరంలోని అండర్ గ్రౌండ్



డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికను (డీపీఆర్) అధికారులు ప్రతినిధులకు వివరించారు. వరంగల్ నగరం చారిత్రక ప్రాధాన్యత కలిగిన నగరమని, హైదరాబాద్ తర్వాత తెలంగాణలో రెండో అతిపెద్ద నగరంగా వేగంగా ఎదుగుతోందని మేయర్ పేర్కొన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక వసతులపై దృష్టి పెట్టామన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధి కోసం సుమారు 5,725.40 కోట్ల రూపాయల భారీ నిధులు కేటాయించారని మేయర్ తెలిపారు. ఈ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు మొదలు కానున్నాయని వివరించారు. కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ సాంకేతిక పరిజ్ఞానం నగరానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ప్రాజెక్టు అమలులో శాఖల మధ్య సమన్వయం అవసరమని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులు పరిమల్, రుచి, నితిన్ మాట్లాడుతూ ప్రాజెక్టు వివరాలను పరిశీలించామని, భవిష్యత్తులో మరిన్ని సాంకేతిక సూచనలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విదేశీ ప్రతినిధులకు కాకతీయ కళాతోరణం ప్రతిమలను బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ ఎస్ ఈ శ్రీనివాస్ రావు, సీ ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, సీ హెచ్ ఓ రమేష్ పాల్గొన్నారు. సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, బిర్రు శ్రీనివాస్ కూడా ఈ భేటీలో భాగస్వాములయ్యారు.





# రహదారి కష్టాలకు చెక్

- ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి సీపీఆర్ఐ రోడ్డు వరకు పర్యవేక్షణ
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన
- ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి చొరవ
- గుంతల రోడ్లకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- త్వరలోనే పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన

**మేడ్చల్, మార్చి 7 (మనసులో మాట):** మేడిపల్లి 9వ డివిజన్ పరిధిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి పర్వతపూర్ సీపీఆర్ఐ రోడ్డులోని సాయి ఐశ్వర్య కాలనీ వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తు   తుర్తి రవి స్పందించారు. మున్సిపల్ అధికారులు, కాలనీ వాసులతో కలిసి రోడ్డును పర్యవేక్షించారు.

### సమస్యల మూలాల గుర్తింపు

ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఎన్నిసార్లు రోడ్డు వేసినా డ్రైనేజీ, వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడం వల్ల తరచూ గుంతలు పడుతున్నాయని పేర్కొన్నారు. నీరు నిలవకుండా ఉండేందుకు రోడ్డును తగినంత ఎత్తుకు పెంచాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని కోరారు.

### త్వరితగతిన పనులు ప్రారంభించాలి

నీరు సాఫీగా వెళ్లేందుకు కొత్తగా మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో గుంతలు పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులతో మాట్లాడారు. పనులను త్వరితగతిన ప్రారంభించి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే కాలనీల అభివృద్ధి

- డిఫెన్స్ కాలనీ సంక్షేమ భవనం ప్రారంభం
- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నవజీవన్ రెడ్డి
- సామాజిక కార్యక్రమాలకు వేదికగా నూతన భవనం
- అభివృద్ధికి అండగా ఉంటామని నేతల హామీ



**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ప్రజల సహకారం, ఐక్యత ఉంటేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్ లో నూతనంగా నిర్మించిన డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. డిఫెన్స్ కాలనీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ భవనం అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కాలనీ ప్రజలకు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఇది ఒక మంచి వేదిక అవుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

### అందరి సహకారంతోనే ప్రగతి

కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సహకారం, ఐక్యత ఉంటేనే ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. అందరూ కలిసికట్టుగా కాలనీ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాలనీ వాసుల చిరకాల కోరిక అయిన సంఘ భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే భాస్కర సాగర్, మల్లేష్, దీపావళి శ్రవణ్, కాలనీ అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు నరసింహ, జనరల్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




# యుద్ధం వద్దు.. శాంతి ముద్దు!

### అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి
### ఎల్బీనగర్‌లో పెన్షనర్ల భారీ నిరసన
### ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం: నర్సిరెడ్డి

**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు తక్షణమే యుద్ధ విరమణ చేయాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. 'యుద్ధం వద్దు.. ప్రపంచ శాంతి ముద్దు' అనే నినాదంతో పెన్షన్ సంఘాల ఆధ్వర్యంలో పనామా నుంచి రెడ్ ట్యాంకు వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమాసియా దేశాల్లో సాగుతున్న యుద్ధం వల్ల వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద ధోరణి వీడి తక్షణమే శాంతిని నెలకొల్పాలని కోరారు. ఈ యుద్ధ ప్రభావం వల్ల మన దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని నర్సిరెడ్డి పేర్కొన్నారు. దీనివల్ల భారతదేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రపంచ దేశాలు ఏకమై యుద్ధాన్ని నివారించకపోతే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలంతా విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

### వ్యాపారాలు దివాలా

యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరా నిలిచిపోయి సామాన్య ప్రజలు, హోటల్ వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నర్సిరెడ్డి తెలిపారు. ఇంధన కొరత వల్ల అనేక వ్యాపారాలు దివాలా తీస్తున్నాయని ఆవేదన చెందారు. ఇరాన్ అణు ఆయుధాలు తయారు చేస్తోందనే తప్పుడు ప్రచారంతోనే యుద్ధాన్ని ప్రేరేపిస్తూ ప్రపంచ శాంతిని విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ అసోసియేషన్ జిల్లా నాయకులు కృష్ణారావు, నోముల సుదర్శన్ రెడ్డి, బ్రహ్మాచారి, అనసూయ, బీజేఎం రెడ్డి పాల్గొన్నారు. కీసరి నర్సిరెడ్డి, ముషం నరహరి తదితరులు ర్యాలీలో పాల్గొని నిరసన తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.




# కార్పొరేట్ విద్యకు సీఎం ఊతం

### ఏవీఎన్ స్కూల్ ప్రారంభంపై టీఆర్పీ ఆగ్రహం
### ఫీజుల దోపిడీకి ప్రభుత్వమే వత్తాసు?
### ఎల్ కేజీకి ఐదు లక్షల ఫీజు వసూలా?
### విద్యాశాఖను నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ రెడ్డి
### గ్లోబల్ స్కూల్స్ పేరిట సామాన్యుల దోపిడీ
### ఎల్బీనగర్ ఇంచార్జ్ బొంగు వెంకటేష్ గౌడ్

**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** ఉచిత విద్యను అందించాల్సిన ప్రభుత్వాలే కార్పొరేట్ సంస్థలకు ఊతమిస్తున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జ్ బొంగు వెంకటేష్ గౌడ్ విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్ ఫీల్డ్ అనే కార్పొరేట్ గ్లోబల్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి వెళ్లడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. విద్యను వ్యాపారం చేస్తూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న దోపిడీకి ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. మంగళవారం ఎల్బీనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



### ఫీజుల దోపిడీపై నిలదీత

ఇంటర్నేషనల్, గ్లోబల్, ఎక్సెల్ ప్రీమియం వంటి పేర్లతో కొత్త రకం దోపిడీకి తెరలేపారని వెంకటేష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవీఎన్ లేక్ ఫీల్డ్ వంటి సంస్థలు ఎల్ కేజీ సీటుకే ఐదు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నా అరికట్టలేని చేతగాని ప్రభుత్వం, స్వయంగా సీఎం హోదాలో ఆ స్కూల్ ప్రారంభోత్సవానికి వెళ్లడం ప్రజలకు, విద్యార్థులకు ఏం సంకేతం ఇస్తుందని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖను తన గుప్పెట్లో పెట్టుకుని వ్యాపారమయం చేస్తోందని ఎద్దేవా చేశారు.

### రాజకీయ బంధుత్వం.. విద్యా వ్యాపారం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వియ్యంకుడు, బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి సంబంధించిన ఈ విద్యాసంస్థను సీఎం ప్రోత్సహించడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. ప్రజాపాలన పేరుతో నీతులు చెబుతూ, మరోవైపు కార్పొరేట్ విద్యను భుజాన వేసుకోవడం దారుణమన్నారు. విద్యాశాఖను రెండేళ్లుగా తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి, ఒక్కసారి కూడా సమీక్ష చేయకుండా కార్పొరేట్ స్కూళ్లకు బ్రాండ్ అంబాసిడర్‌లా మారుతున్నారని దుయ్యబట్టారు.

### ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

డీపీఎస్ వంటి సంస్థల పేరుతో ఇప్పటికే లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న వ్యక్తులకే మళ్లీ గ్లోబల్ స్కూళ్ల పేరుతో దోపిడీ చేసే అవకాశం కల్పిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్పొరేట్ విద్యా దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయకుండా ఇలాంటి విద్యా వ్యాపారులను వెనకేసుకురావడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వెంకటేష్ గౌడ్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోరాటాల సీపీఐకి చేయూతనివ్వండి

### భగత్ సింగ్ నగర్ లో 'ఇంటింటికి సీపీఐ'
### బస్తీల్లో ప్రజా సమస్యల గుర్తింపు
### దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి
### ముమ్మరంగా సాగుతున్న పార్టీ ప్రచారం
### ప్రభుత్వానికి బాతరాజు నరసింహ డిమాండ్



**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 (మనసులో మాట):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సరూర్ నగర్ మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో 'ఇంటింటికి సీపీఐ' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఏప్రిల్ 1 నుంచి 10 వరకు రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా భగత్ సింగ్ నగర్ లో నేతలు పర్యటించారు. సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బస్తీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు.

### బస్తీల్లో దోమల రాజ్యమా?

పర్యటనలో భాగంగా బస్తీవాసులు తమ గోడును నేతల ముందు వెళ్లగక్కారు. కాలనీలో దోమల బెడద విపరీతంగా ఉందని, డ్రైనేజీ సమస్యలతో నరకం చూస్తున్నామని వాపోయారు. ఈ సందర్భంగా బాతరాజు నరసింహ మాట్లాడుతూ.. దోమల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు డెంగ్యూ, మలేరియా, విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే బస్తీల్లో దోమల మందు కొట్టాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ ఇబ్బందులను వెంటనే పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

### కార్యకర్తల ఉత్సాహం

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు గ్యార క్రాంతి కుమార్, రామావత్ సక్రు నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు భగత్ సింగ్ నగర్ శాఖ కార్యదర్శి ఉష, ఎన్టీఆర్ నగర్ శాఖ కార్యదర్శి ఎండీ ఇస్మైల్, సీనియర్ నాయకులు వర్రే ఇస్తారి, జిల్లా నాయకులు కరుణాచారి, ఇన్సాఫ్, సరూర్ నగర్ మండల కార్యదర్శి జాహెద్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల పక్షాన పోరాడే సీపీఐకి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని ఈ సందర్భంగా నేతలు కోరారు.



# తెల్లదొరల గుండెల్లో బాంబుల మోత

1929 ఏప్రిల్ 8 తేదీన ప్రజారక్షణ, వ్యాపార వివాదల చట్టాల ఆమోదానికి నిరసనగా భగత్ సింగ్, బతుకేస్వర్ దత్ తో కలిసి కేంద్రీయ విధాన సభ లోకి బాంబులు విసిరారు. భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28 ఉ 1931 మార్చి 23) భారత స్వాతంత్ర్య సమర యోధుడు, కరుడుకట్టిన ఉద్యమ కారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమము లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆ కారణంగానే షహీద్ భగత్ సింగ్ గా నేటికీ కొనియాడ బడుతున్నాడు.

భగత్ సింగ్ పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్ , విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకకెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికి దిగిన భగత్ సింగ్ ఆ మట్టిలో ఆడుకుంటూనే చిన్న చిన్న గడ్డిపరక లను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ " తుపాకులు నాటుతున్నా" అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితుడ య్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు.

లాలా లజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928 లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసింది. భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనం గా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమి స్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెం డెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చని పోయారు.

ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. అయితే పొరపాటు గుర్తింపు కారణంగా డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొర పాటుగా స్కాట్ అనుకుని, జైగో పాల్ ఆయన్ను కాల్చుమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. దాంతో పోలీసుల కంటపడకుండా ఉండటానికి భగత్ లాహోర్ పారిపోయాడు. గుర్తు పట్టకుండా ఉండటానికి గడ్డాన్ని గీసుకోవడం, వెండ్రుకలు కత్తిరించుకోవడం ద్వారా సిక్కు మత విశ్వాసాల ఉల్లంఘనకు సింగ్ పాల్పడ్డాడు.

భగత్ సింగ్ వంటి విప్లవకారులను అణచివేయడం కోసం భారత రక్షణ చట్టమును తీసుకు రావడం ద్వారా పోలీసులకు బ్రిటీష్ ప్రభుత్వం మరింత అధికారం కల్పించింది. ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అది ఆమోదితం కానున్న కేంద్ర శాసనసభపై బాంబు పేలుడుకు హిందూస్తాన్ సామ్యవాద గణతంత్ర సంఘం వ్యూహరచన చేసింది. బాంబు పేలుడుకు భగత్ సింగ్ ప్రయత్నించకుండా మరో ప్రముఖ విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ అడ్డుకున్నాడు. అయితే సింగ్ ఆశయాలను అంగీకరించే విధంగా మిగిలిన పార్టీ సభ్యులు ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చారు. శాసనసభ వసారాపై భగత్ సింగ్‌తో పాటు మరో విప్లవకారుడు 8 ఏప్రిల్ 1929న సింగ్, దత్‌లు బాంబు విసిరి, "ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తు పలు కరపత్రాలను వెదజల్లారు. కేంద్ర అసెంబ్లీ ఆవరణలో కరపత్రం విసిరివేత, బాంబు దాడి వల్ల ఏ ఒక్కరూ మరణించడం గానీ గాయపడటం గానీ జరగలేదు. తమ వ్యూహంలో భాగంగా ఉద్దేశ్యపూర్వకంగానే జాగ్రత్తలతో దాడి చేసినట్లు సింగ్, దత్ అంగీకరించారు. బాంబు గాయపరిచేటంత శక్తివంతమైంది కాదని బ్రిటీష్ ఫోరెన్సిక్స్ విచారణాధికారులు కూడా తేల్చిచెప్పారు. వాస్తవానికి బాంబు జనాలకు దూర బాంబు దాడి తర్వాత సింగ్, దత్ ఇద్దరూ లొంగిపోయారు. సింగ్ అరెస్టు అనంతరం శాసనసభ పేలుడుపై విచారణ నేపథ్యంలో జే. పీ. సాండర్స్ హత్య వెనుక ఆయన హస్తంపై బ్రిటీష్ ప్రభుత్వం ఆరా తీసింది. హత్యకు సంబంధించి భగత్ సింగ్, రాజ్‌గురు , సుఖ్‌దేవ్‌లపై అభియోగాలు మోపారు. భారత స్వాతంత్ర్యానికి తన గళాన్ని వినిపించుకునేందుకు న్యాయస్థానాన్నే ఒక ప్రచార వేదికగా మలుచుకోవాలని భగత్ సింగ్ నిర్ణయించుకున్నాడు. హత్యా నేరాన్ని అంగీకరించిన ఆయన విచారణ సమయంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చి నందుకుగాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# స్వతంత్ర భావుకుడు శంకరంబాడి

## ఏప్రిల్ 8..శంకరంబాడి సుందరాచారి వర్ధంతి



శంకరంబాడి సుందరాచారి (ఆగష్టు 10, 1914 – ఏప్రిల్ 8, 1977) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతమైన మా తెలుగు తల్లికి మల్లె పూదండ రచయిత. శంకరంబాడి సుందరాచారిని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము ప్రసన్న కవి అని గౌరవించింది. ఆయనను సుందరకవి, భావకవి అనీ, అహంభావకవి అనీ కూడా అనేవారు. సుందరాచారి, 1914 ఆగష్టు 10 న తిరుపతిలో జన్మించాడు. అతని మాతృభాష తమిళం. మదనపల్లెలో బిసెంట్ థియొసాఫికల్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివాడు. చిన్నతనం నుండే ఆయన స్వతంత్ర భావాలు కలిగి ఉండేవాడు. సనాతన సంప్రదాయాలను వ్యతిరేకించే వాడు.కన్న తండ్రి మందలిస్తే, కోపం తెచ్చుకుని, పంతానికి పోయి, ఇంటి నుండి బయటికి వెళ్ళి పోయాడు.

భుక్తి కొరకు ఎన్నో పనులు చేసాడు. తిరుపతిలో హోటలు సర్వరుగా పనిచేసాడు. రైల్వే స్టేషనులో కూలీగా కూడా పనిచేసాడు. ఆంధ్ర పత్రికలో అచ్చుదోషాలు దిద్దేవాడిగా, ఉపాధ్యాయుడిగా, పాఠశాల పర్యవేక్షకుడిగా ఎన్నో వైవిధ్య భరితమైన పనులు చేసాడాయన. అమితమైన ఆత్మవిశ్వాసం ఆయన సొంతం. ఒకసారి ఏదైనా పని వెతుక్కుందామని మద్రాసు వెళ్ళాడు. ఆంధ్ర పత్రిక ఆఫీసుకు వెళ్ళి పని కావాలని అడిగాడు. దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వర రావు పంతులు "నీకు తెలుగు వచ్చా" అని అడిగాడు. దానికి సమాధానంగా "మీకు తెలుగు రాదా" అని అడిగాడు. నివ్వెర పోయిన పంతులుతో నేనిప్పటి వరకు తెలుగు లోనే కదా మాట్లాడాను, అందుకే మీ ప్రశ్నకు సమాధానం ఎలా ఇవ్వాలో తెలియ లేదు అని అన్నాడు. ఆంధ్ర పత్రికలో ఉద్యోగం చేస్తుండగా, ఒక ప్రముఖునిపై పద్యం వ్రాయవలసి వచ్చింది. నేను వ్యక్తులపై పద్యాలు వ్రాయను అని భీష్మించుకుని, దాని కోసం ఆ ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాడు సుందరాచారి. తరువాత విద్యాశాఖలో పాఠశాల పర్యవేక్షకుడిగా పనిచేసాడు. నందనూరులో ఉండగా ఒకసారి పాఠశాల సంచాలకుడు వచ్చాడు. ఆ సంచాలకుడు సుందరాచారిని బంట్రోతుగాను, బంట్రోతును సుందరాచారిగాను పొరబడ్డాడు. దానికి కోపగించి, సుందరాచారి ఆ ఉద్యోగానికి తక్షణమే రాజీనామా చేసాడు.

ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్య వేదమ్మాళ్ మనో వ్యాధిగ్రస్తురాలైన కారణంగా ఆయన వేదన చెంది, జీవిత చరమాంకంలో ఒక రకమైన నిర్లిప్త జీవితం గడిపాడు. తాగుడుకు అలవాటు పడ్డాడు. సుందరాచారి 1977 ఏప్రిల్ 8 న తిరుపతి, గంగుండ్ర మండపం వీధిలో నివాస ముంటున్న ఇంట్లో మరణించాడు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుపతి పట్టణం తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణేశ్వరి సర్కిల్‌లో సుందరాచారి జ్ఞాపకార్థం, ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆయన పట్ల కృతజ్ఞతాసూచకంగా విగ్రహం దగ్గర ధ్వనివర్ధకం ద్వారా నిరంతరం మా తెలుగు తల్లికీ పాట నిరంతరంగా ధ్వనించే ఏర్పాటు చేసింది.

మహాత్మా గాంధీ హత్య జరిగినపుడు ఆవేదన చెంది, బలిదానం అనే కావ్యం వ్రాసాడు. ఆ పద్యాలను పాఠశాలలో పిల్లలకు ఆయనే చదివి వినిపించాడట. సుందర రామాయణం అనే పేరుతో రామాయణం రచించాడు. అలాగే సుందర భారతం కూడా వ్రాసాడు. తిరుపతి వేంకటేశ్వర స్వామి పేరు మకుటంగా శ్రీనివాస శతకం రచించాడు. ఇవే కాక జపమాల, బుద్ధగీతి అనే పేరుతో బుద్ధ చరిత్ర కూడా రాసాడు. రవీంద్రుని గీతాంజలిని అనువదించాడు. మూలంలోని భావాన్ని మాత్రమే తీసుకుని, భావం చెడకుండా, తెలుగు నుడికారం పోకుండా చేసిన ఆ స్వతంత్ర అనువాదం బహు ప్రశంసలు పొందింది. ఏకలవ్యుడు అనే ఖండకావ్యం, కెరటాలు అనే గ్రంథం కూడా రచించాడు. సుందర సుధా బిందువులు అనే పేరుతో భావ గీతాలు వ్రాసాడు. జానపద గీతాలు వ్రాసాడు, స్థల పురాణ రచనలు చేసాడు. ఇవే కాక అపవాదు, పేదకవి, నాస్వామి, నేటి కవిత్వము, బలిదానము, కార్వేటి నగరరాజ నీరాజనము మొదలైనవి వీరి ఇతర రచనలు. మహాత్మాగాంధీ, బిల్హణీయం, దీనబంధు అనే సినిమాలకు పాటలు కూడా వ్రాసాడు. దీనబంధు సినిమాలో నటించాడు కూడా. సుందరాచారి "మా తెలుగు తల్లికి" గీతాన్ని 1942లో దీనబంధు సినిమా కోసం రచించాడు. కానీ ఆ చిత్ర నిర్మాతకు యుగళ గీతంగా వాడడానికి నచ్చక పోవటం వల్ల ఆ సినిమాలో చేర్చలేదు. టంగుటూరి సూర్యకుమారి గ్రామఫోన్ రికార్డు కోసం ఆ పాటను మధురంగా పాడిన తరువాతనే ఆ గీతానికి గుర్తింపు లభించింది.

ఒకసారి ఢిల్లీ వెళ్ళి అక్కడ నెహ్రూను కలిసాడు. తాను రచించిన బుద్ధ చరిత్ర లోని ఒక పద్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ఆయనకు వినిపించాడు. నెహ్రూ ముగ్ధుడై ఆయనను మెచ్చుకుని 500 రూపాయలు బహూకరించాడు. సుందరాచారి గురించి పలువురి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ... మృదువైన పదములు, మధురమైన శైలి, మంచి కల్పన కలిగి వీరి కవిత్వము అనందము నాపాదించకలిగి ఉంది. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ... తెలుగు పలుకు, కవితాశక్తి, సౌకుమార్యము, ఈమూడు గుణములు మూటకట్టి వీరు పొత్తములను రచించు చున్నట్లున్నది. ఈ యుగములో వీరిదొక ప్రత్యేక వాఙ్మయముగా ఏర్పాటు కాబోవు చున్నట్లున్నది. వీరిశైలి సంస్కృత సమాసముల నుండియు, మారుమూల పదముల నుండియు విడివడి సరళమైనది.

**గడియారం వేంకటశేష శాస్త్రి:** ఈతని శైలి మిక్కిలి సరళమైనది. భాష సుగమనమైనది. ధార సహజమైనది. పోకడలు, ఎత్తుగడలు, అలంకారములు చమత్కారములు, మున్నగు ప్రసాధనము లన్నియు సుమచిత సన్నివేశములే భావ శ్రుతిలో మేళవించినవి.

**శ్రీరాయప్రోలు సుబ్బారావు:** సుందరాచారి గారి సూక్తి ఎంత తేటగా సూటిగా వినబడుతుందో అంత స్ఫురితంగా సుదూరంగా ధ్వనిస్తుంది. ఇది ఈ కవి రచనలలోని అనన్య విశిష్టత.

**శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ:** తేటగీతుల తెలుగు తీదీపిరుచుల యూట....కొంకుల కొసరుల కాటుపడక సారతరమిది సుందరాచారి కవిత.

శంకరంబాడి సుందరాచారి గొప్ప కవి. పద్య కవిత్వం ఆయనకు ప్రీతిపాత్రమైన కవితా ప్రక్రియ. పద్యాలలోనూ తేటగీతి ఆయన ఎంతో ఇష్టపడ్డ ఛందస్సు. తేటగీతిలో ఎన్నో పద్యాలు వ్రాసాడు. "నా పేరు కూడా (శంకరంబాడి సుందరాచారి) తేటగీతిలో ఇమిడింది, అందుకనే నాకది బాగా ఇష్టం" అనేవాడు ఆయన. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గీతమైన తేటగీతులలోనే రాసిన మా తెలుగు తల్లికి.. ఆయన రచనలలో మణిపూస వంటిది. రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని రమ్యంగా వర్ణించిన నాలుగు పద్యాలు అవి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించి గౌరవించింది.

మా తెలుగు తల్లికి మల్లె పూదండ,
మా కన్న తల్లికి మంగళారతులు.
కడుపులో బంగారు కనుచూపులో కరుణ, చిరునవ్వు లో
సిరులు దొరలించు మా తల్లి.
గల గలా గోదారి కదలి పోతుంటేను, బిర బిరా కృష్ణమ్మ
పరుగులిడు తుంటేను, బంగారు పంటలే పండుతాయి,
మురిపాల ముత్యాలు దొరలుతాయి.
అమరావతీ నగర అపురూప శిల్పాలు, త్యాగయ్య గొంతులో
తారాడు నాదాలు, తిక్కయ్య కలములో తీయందనాలు,
నిత్యమై నిఖిలమై నిలచి ఉండేదాక;
రుద్రమ్మ భుజ శక్తి మల్లమ్మ పతి భక్తీ, తిమ్మరుసు ధీయుక్తి కృష్ణ
రాయని కీర్తి, మా చెవులు రింగుమని మారు మ్రోగేదాక, నీ
పాటలే పాడుతాం నీ ఆటలే ఆడుతాం;
జై తెలుగు తల్లీ, జై తెలుగు తల్లీ,జై తెలుగు తల్లీ.

రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# సాహితీవేత్తలకు మార్గదర్శకుడు బంకించంద్రుడు

బంకిం చంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందే మాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు.

బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసు కోలేదనేది వాస్తవం.

బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని. ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్‌లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే 'లలిత ఓ మానస్' అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు.



> భారత స్వాతంత్ర్య సమరంలో 'వందేమాతరం' నినాదం వింటేనే తెలియని ఉత్తేజం కలుగుతుంది. ఆ అమర గీతాన్ని అందించిన మహనీయుడు బంకించంద్ర ఛటోపాధ్యాయ. ఆయన కేవలం రచయిత, కవి మాత్రమే కాదు.. భారతీయుల గుండెల్లో దేశభక్తి సెగలు పుట్టించిన విప్లవ జ్వాల. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఆ సాహితీ మూర్తిని యావత్ భారతం స్మరించుకుంటోంది. బంకించంద్ర ఛటర్జీ తన రచనలతో బెంగాలీ సమాజాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ప్రభావితం చేశారు. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఆయన సృష్టించిన సాహిత్యం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వెన్నెముకగా నిలిచింది. ఒక కవి రాసిన దేశభక్తి గీతం ఒక జాతిని మేల్కొలిపి ఉద్యమ బాట పట్టించిన సంఘటన ప్రపంచ చరిత్రలో బంకించంద్రుడి విషయంలోనే సాధ్యమైంది. అక్షరాన్ని ఆయుధంగా మార్చి బ్రిటీష్ పాలనపై సమర శంఖం పూరించిన ధీశాలి ఆయన.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 – 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్ మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది.

దేశాన్ని మాతృమూర్తిగా సంబో ధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన ర తర్వాత దానిని 'ఆనంద్‌మఠ్' నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.



భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంతమవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహు ముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం.

మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని అయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటో పాధ్యాయను ప్రసంసించారు.



# అర్ష్‌దీప్ సింగ్ 'ప్రేమ' జపం..

## మైదానంలో మెరిసిన సవ్రీన్ కౌర్!

## ఐపీఎల్ వేళ నెట్టింట వైరల్ అవుతున్న ఫోటోలు

**ముంబై:** మైదానంలో తన పదునైన యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్ల వికెట్లను కూల్చే ఆ 'యార్కర్ కింగ్'.. ఇప్పుడు తనే ఒక అందగత్తె విసిరిన ప్రేమ వలలో చిక్కుకున్నాడా? టీమ్ ఇండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ గురి ఇప్పుడు వికెట్ల మీద కంటే.. ఒక పంజాబీ ముద్దుగుమ్మ మీదనే ఎక్కువగా ఉందా? ప్రస్తుతం సోషల్ మీడియాలో వినిపిస్తున్న గుసగుసలు వింటే ఇది నిజమేననిపిస్తోంది. ఐపీఎల్ హడావిడిలో ఉన్న ఈ స్టార్ క్రికెటర్, ఒక పంజాబీ నటితో పీకల్లోతు ప్రేమలో మునిగితేలుతున్నాడనే వార్త ఇప్పుడు క్రీడా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

### ఎవరీ సవ్రీన్ కౌర్?:

అర్ష్‌దీప్ మనసు గెలుచుకున్న ఆ అందగత్తె పేరు సవ్రీన్ కౌర్. పంజాబీ చిత్ర పరిశ్రమలో వర్ధమాన నటిగా రాణిస్తున్న సవ్రీన్.. తన నటనతోనే కాకుండా సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫోటోలతోనూ భారీగా ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. సంగీత వీడియోల్లో మెరుస్తూ కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తున్న ఈ భామ, ఇప్పుడు అర్ష్‌దీప్ సింగ్ 'లేడీ లక్' గా మారిందని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు.

### ప్రేమాయాణం బయటపడిందిలా..:

వీరిద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ నడుస్తోందని అనుమానాలు రావడానికి ప్రధాన కారణం.. అర్ష్‌దీప్ ఇటీవల సోషల్ మీడియాలో పంచుకున్న ఒక ఫోటో. సవ్రీన్ చేతిలో చేయి వేసి ఉన్న ఫోటోను ఆయన పోస్ట్ చేయడంతో అభిమానుల కళ్లు బైర్లు కమ్మాయి. దానికి తోడు, పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు సవ్రీన్ గ్యాలరీలో ప్రత్యక్షం కావడం, పంజాబ్ జెర్సీ ధరించి అర్ష్‌దీప్‌ను ఉత్సాహపరచడం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది.

### మౌనమే సమాధానమా?

అటు అర్ష్‌దీప్ కానీ, ఇటు సవ్రీన్ కానీ తమ రిలేషన్‌షిప్ గురించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. వీరిద్దరూ కేవలం డేటింగ్‌లో ఉన్నారా లేక సీరియస్ ప్రేమలో ఉన్నారా అనేది ప్రస్తుతానికి సస్పెన్సే! ఏదేమైనా, సినిమా తారలు – క్రికెటర్ల మధ్య ప్రేమాయాణాలు కొత్తేమీ కాకపోయినా.. ఈ పంజాబీ జోడీ కెమిస్ట్రీ మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మరి ఈ 'యార్కర్ కింగ్' తన ప్రేమ విషయాన్ని ఎప్పుడు క్లీన్ బౌల్డ్ చేస్తాడో వేచి చూడాల్సిందే!







# విజృంభించిన రాజస్థాన్!

## ముంబైపై విజయం

## 11 ఓవర్లలో పరుగుల వరద

**చెలరేగి ఆడిన యశస్వి జైస్వాల్ ● లక్ష్య ఛేదనలో చతికిలబడ్డ ముంబై ● సత్తా చాటిన బౌలర్లు**

**గువహటీ:** ఐపీఎల్ తాజా సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తన జోరును ఏమాత్రం తగ్గించకుండా కొనసాగిస్తోంది. గువహటీలోని బర్సపరా స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ముంబై ఇండియన్స్ ను చిత్తు చేసి అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. వర్షం కారణంగా ఇరు జట్లకు 11 ఓవర్ల చొప్పున కుదించిన ఈ మ్యాచ్‌లో అభిమానులకు అసలు సిసలైన పరుగుల పండగ దొరికింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ విధ్వంసకర ఇన్నింగ్స్‌కు తోడు బౌలర్లు సైతం కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపీఎల్ లీగ్ దశలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో బంతితో సమిష్టిగా సత్తా చాటిన రాజస్థాన్ సొంత మైదానంలో దుమ్మురేపింది.

### వీరబాదుడు బాదారు

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం వల్ల ఓవర్లు తగ్గడంతో రాజస్థాన్ బ్యాటర్లు మొదటి బంతి నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్లు క్రీజులో అడుగుపెట్టినప్పటి నుంచే బౌండరీల వర్షం కురిపించారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్ ముంబై బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడు కేవలం 32 బంతుల్లోనే అజేయంగా 77 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. అతనికి జతగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు చేసి ఎడాపెడా షాట్లతో అలరించాడు. చివర్లో రియాన్ పరాగ్ సైతం 10 బంతుల్లో 20 పరుగులు చేయడంతో రాజస్థాన్ నిర్ణీత 11 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 150 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ముంబై బౌలర్లలో అల్లా ఘజన్ఫర్ 2 ఓవర్లలో 21 పరుగులు



ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. శార్దూల్ ఠాకూర్ భారీగా పరుగులు సమర్పించుకున్నాడు.

### లక్ష్య ఛేదనలో చతికిల

రాజస్థాన్ నిర్దేశించిన 151 పరుగుల కఠినమైన లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ప్రత్యర్థి బౌలర్లు ఆదిలోనే భారీ షాక్ ఇచ్చారు. లక్ష్య ఛేదనలో కావాల్సిన రన్ రేట్ చాలా ఎక్కువగా ఉండటంతో ముంబై బ్యాటర్లు తీవ్ర ఒత్తిడికి గురై వరుసగా వికెట్లు పారేసుకున్నారు. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ కేవలం 8 బంతుల్లో 25 పరుగులు చేసి కాసేపు ఆశలు రేపినా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. నమన్ ధీర్ 13 బంతుల్లో 25 పరుగులు, తెలుగోడు తిలక్ వర్మ 10 బంతుల్లో 14 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరారు. మిగతా బ్యాటర్లు ఎవరూ క్రీజులో కనీసం నిలదొక్కుకోలేకపోవడంతో ముంబై నిర్ణీత 11 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. కట్టుదిట్టమైన బౌలింగ్ రాజస్థాన్ బౌలర్లు అత్యద్భుతమైన ప్రణాళికతో బౌలింగ్ చేసి ముంబై బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. నాంద్రే బర్గర్ 2 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. స్పిన్నర్ రవి బిష్ణోయ్ సైతం 2 ఓవర్లలో 25 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు సాధించాడు. అనుభవజ్ఞుడైన పేసర్ సందీప్ శర్మ 3 ఓవర్లలో 26 పరుగులిచ్చి రెండు వికెట్లతో ముంబై పతనాన్ని శాసించాడు. బౌలర్లందరూ సమిష్టిగా రాణించడంతో రాజస్థాన్ రాయల్స్ మరో అద్భుత విజయాన్ని అందుకుని పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.

# సిడ్నీ వీధుల్లో 'వార్నర్' స్కిడ్..

- మద్యం మత్తులో చిక్కిన క్రికెట్ దిగ్గజం!
- రెండింతలు దాటిన ఆల్కహాల్ రీడింగ్
- పోలీసులను చూసి కారు పార్క్ చేసినా దొరికిపోయిన డేవిడ్ భాయ్
- పీఎస్ఎల్ ఆడే అవకాశంపై నీలినీడలు

**సిడ్నీ:** మైదానంలో బౌలర్ల గుండెల్లో వణుకు పుట్టించే ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్, 'డేవిడ్ భాయ్'గా పిలుచుకునే డేవిడ్ వార్నర్ ఇప్పుడు పోలీసులకు చిక్కారు. అది కూడా మద్యం మత్తులో కారు నడుపుతూ అడ్డంగా దొరికిపోయారు. సిడ్నీలోని మరౌబ్రాలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ సర్కిల్స్‌లో సంచలనంగా మారింది. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల నుండి తప్పించుకోవాలని వార్నర్ వేసిన 'మాస్టర్ ప్లాన్' రివర్స్ కావడంతో ఆయన కటకటాల వెనక్కి వెళ్లాల్సి వచ్చింది.

### అసలేం జరిగిందంటే?

సిడ్నీలోని మరౌబ్రా ప్రాంతంలో న్యూ సౌత్ వేల్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం సాధారణ తనిఖీలు చేపట్టారు. అయితే, పోలీసుల తనిఖీ కేంద్రాన్ని దూరం నుండే గమనించిన వార్నర్, పట్టుబడకుండా ఉండేందుకు తన కారును కొంచెం దూరంలోనే నిలిపివేసి పార్క్ చేశాడు. వార్నర్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే కారు వద్దకు వెళ్లి ఆయనకు శ్వాస పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఆయన మద్యం సేవించినట్లు తేలడంతో పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు.



### రెండింతలు దాటిన రీడింగ్

మరౌబ్రా పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన రెండో పరీక్షలో వార్నర్ రక్తంలో ఆల్కహాల్ శాతం 0.104 గా నమోదైంది. ఆస్ట్రేలియా చట్టాల ప్రకారం ఉండాల్సిన పరిమితి కంటే ఇది రెండింతలు ఎక్కువ. దీంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలైనప్పటికీ, వచ్చే మే 7వ తేదీన ఆయన సిడ్నీలోని డౌనింగ్ సెంటర్ లోకల్ కోర్టులో హాజరుకావాల్సి ఉంది.

### పీఎస్ఎల్ ఆడేనా?:

ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్ 2026)లో కరాచీ కింగ్స్ జట్టుకు సారథ్యం వహిస్తున్న వార్నర్, ఈస్టర్ సెలవుల నిమిత్తం స్వదేశానికి వచ్చారు. గురువారం పెషావర్ జల్మీతో జరగనున్న మ్యాచ్ కోసం ఆయన తిరిగి పాకిస్థాన్ వెళ్లాల్సి ఉంది. అయితే ఈ కేసుకు సంబంధించి కోర్టు విచారణలు ఉండటంతో ఆయన పీఎస్ఎల్ లీగ్‌లో తిరిగి ఆడతారా? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. కరాచీ కింగ్స్ కెప్టెన్ ఇలా వివాదంలో చిక్కుకోవడంతో ఆ జట్టు యాజమాన్యం కూడా పునరాలోచనలో పడింది.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక





# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ

'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామి సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# అవును పెళ్లయ్యింది.. నలుగురు పిల్లలు

## విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై

కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.




# అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861